

క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్
విపుల
విశ్వకథా వేదిక
ఫిబ్రవరి 2010
రూ. 10/-
mohan
PUBLICATIONS
Mohanpublication.com
మోహన్ పబ్లికేషన్స్
రాజమహేంద్రవరం - 533101.
grantha nidhi
THE TREASURE OF PAGES
Granthanidhi.blogspot.in
జన్మదిన
ప్రత్యేక
సంచిక
వందేళ్ళ తెలుగు కథ
భవిష్యత్ చిత్రపటం 5లో

కథ అమ్మలాంటిది...



కాలానికి అనుగుణంగా పరిస్థితులు మారుతూంటాయి. ఆ పరిస్థితులను తనకనుగుణంగా మార్చుకోవడం, పరిస్థితులకు అనుకూలంగా తాను మారడం ఈ రెండూ తెలుగు కథకు తెలుసు.

ఏడెనిమిది దశాబ్దాల కిందటిలాగ ఇప్పటి చిన్నకథ లేదు కదా? సమాజాన్ని సంచలింపజేసే పరిస్థితుల ప్రభావాలు చిన్నకథ మీద తప్పకుండా ఉంటాయి.

చిన్నకథ... ఓ మంచి అమ్మలాంటిది. తల్లి బిడ్డ కోసం మారినట్లే చిన్నకథా పాఠకుల కోసం తన్ను మార్చుకుంటుంది.

జీవితం.. నాగరికత.. సాహిత్యం.. నిరంతరం మారుతూంటాయి. కథానిక కూడా తన్ను తాను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ, పఠితలకు దగ్గరవుతూ వస్తోంది. 'ఆ కథ అలా ఉండి ఉంటే..., ఈ కథ ఇలా ఉండి ఉంటే...' అనే అభిప్రాయాలు వందేళ్ల కిందటా ఉన్నాయి. ఇప్పుడూ ఉన్నాయి. ఎప్పుడూ ఉంటాయి. వాస్తవానికి ఇప్పటి కథ పఠితల అభిరుచులకు అనుగుణంగా వస్తోంది. మానవ జీవితంలో ఉండే వైవిధ్యాలను అక్షరబద్ధం చేస్తోంది.

భాష విషయంలో ఆందోళనా సరికాదు. 'దరఖాస్తు చేశావా?' అని అడగటంలో 'దరఖాస్తు' తెలుగా? 'పో బే!' అని అంటంలో 'బే' తెలుగా? ప్రతిభాషా ఇతర దేశాల, ప్రాంతాల, మతాల, పదాలను సంలీనం చేసుకుంటుంది. అప్పటి సమాజానికి అనుగుణంగా సరికొత్త రూపాన్ని సంతరించుకుంటుంది. మానవుడు ఉన్నంత కాలం, మనసులో భావజాలం ఉద్భవిస్తున్నంత కాలం.. అది బహిర్గతం కాకమానదు. అందుకు భాష తప్ప మరో వాహిక లేదు. కాబట్టి భాషకు ప్రమాదమేమీ ఉండదు. భాష ఉన్నంత కాలం కథ జీవించే ఉంటుంది.

–రావూరి భరద్వాజ

కథ చిరంజీవి

మన గురించి, సమాజం గురించి నిజాయితీగా రాస్తున్నామా? అని రచయితలు అనుక్షణం తమను తాము ప్రశ్నించుకుంటూంటారు. నిజాయితీగా రాయటమే నిజమైన కళ. ఎంత అందంగా కనిపించినా అబద్ధం, మొహానికి రంగు పూసుకున్న కురూపి అని వాళ్లకు తెలుసు. 'నిజాలు రాసినా... రాయకపోయినా, అబద్ధాలు రాయకపోతే అదే పదివేలు' అన్నాడు రష్యన్ రచయిత టాల్‌స్టాయ్. ఒకప్పటిలా కాక తెలుగుకథ ఇప్పుడు స్పృశించని సామాజికాంశం లేదు. విప్లవ పోరాటాల నుండి, ప్రపంచీకరణ దాకా అందరూ రాస్తున్నారు. రాయని వాళ్లు, రాయలేనివాళ్లు ఎందుకు రాయలేకపోతున్నామా? అని మథనపడుతున్నారు. రచనా దృక్పథం వరకూ ఇదో గొప్ప విప్లవాత్మకమైన పరిణామమే.



రచనకు నిబద్ధత కావాలి. సమాజంలోని దోపిడీ, తిరుగుబాట్లు వంటివాటి గురించి రాయాలనుకోని వారుండరు. కాని వాళ్ల జీవనసరళి మనకు తెలుసా? తెలియని విషయాల గురించి రాయటం నిజాయితీ అనిపించుకోదు. మరి మనకే సందేహాలున్నప్పుడు ఎవరి మెప్పుకోసం రాయాలి? కృతకత్వం రచనలో అతి సులభంగా తెలిసిపోతుంది. రాయాల్సింది సమస్యల గురించి కాదు, సమస్యలను ఎదుర్కొంటున్న వ్యక్తుల గురించి.

రాసేటప్పుడు మన నమ్మకాలు, నైతికతలు మార్గదర్శకంగా కరదీపికలుగా ఉంటాయి. ఆ విలువలు వెలుగుగా పనికొస్తాయి. ఆ వెలుగు సాయంతో లోకాన్ని చూడాలి.

ఈనాటి తెలుగు రచయిత అవగాహనా శక్తి అపారం. చక్కని కథలనేకం వస్తున్నాయి. అయితే, ఇవి ప్రపంచస్థాయి కథలో? కాదో? తెలుసుకోవాలంటే, ఆంగ్లంలోకి అనువదించి ప్రపంచదేశాల కథలతో తులనాత్మక అధ్యయనం చేసినప్పుడు మాత్రమే అవగతమవుతుంది.

– ముక్తవరం పార్థసారథి

100 తెలుగు కథ భవిష్యత్ చిత్రపటం

గతము గతంబె ఎన్నటికిన్ కన్నులగట్టదు
సంశయాంధ సంవృతము భవిష్యదర్థము
ఒక్క వర్తమానమే
సతతమవశ్య భోగ్యమగు సంపద

ఈ మాటలు ఉమర్‌ఖయ్యాం ఫిలాసఫీకి సరిపోతాయేమో కానీ సాహిత్యాన్ని, దాన్ని నడిపించే సామాజిక చలన సూత్రాలను అంచనా వేయడానికి మాత్రం పనికిరావు. గతాన్ని వర్తమానంతో అను సంధానించి తదనుగుణంగా చర్చించుకొని భవిష్యత్తును నిర్దేశించుకుంటాం. సమస్త సామాజిక సత్యాలకు ఈ పద్ధతి సరిపోయినట్లే సాహిత్యానికీ.. కథకూ కూడా ఇది వర్తిస్తుంది.



శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

తెలుగు కథ భవిష్యత్తును సమీక్షించే ముందు వివిధ సామాజిక సందర్భాల్లో అది నిర్వహించిన పాత్రను పరిశీలించాలి. ఒక సాహితీ రూపంగా అది ఎదిగిన తీరునూ విశ్లేషించుకోవాలి.

తెలుగు కథ చేసుకున్న అదృష్టమేమంటే అది సామాజిక పునాది మీద నిర్మించిన ఉపరితలంలో భాగంగా విలసిల్లింది. తెలుగు కథ ఎప్పుడు పుట్టింది? మొదటి కథ ఎవరు రాశారు? వంటి చారిత్రక, పండిత చర్చలను కాస్సేపు పక్కనబెట్టి తొలినాటి తెలుగు కథల స్వరూప స్వభావాలను అర్థం చేసుకోవడం అవసరం. మొదటి కథ భండారు అచ్చమాంబ రాసినా, మాడపాటివారు రాశారని కాసేపు అనుకున్నా, నిన్నటిదాకా భావించిన గురజాడ దిద్దుబాటు మొదటి కథ అనుకున్నా ఈ అన్నికథలూ సామాజిక పునాదిపై, పురోగామి దిశగా సమాజాన్ని ఒక అడుగు ముందుకు నడిపించే లక్ష్యంతో రాసిన కథలే. ఈ ముగ్గురు రాసినవీ (స్త్రీ విద్య, హృదయశల్యము, దిద్దుబాటు- తొలి తెలుగు కథ - ఏడు అభిప్రాయాలు, కథానిలయం ప్రచురణ) కాస్త అటూ ఇటూగా స్త్రీవిద్య గురించి లేదా స్త్రీలు చూపాల్సిన చొరవ గురించీ రాసిన కథలే ఈమూడూ.

ఒక్కమాట మాత్రం నిజం. 1910 తర్వాతే తెలుగు కథలకు ఒక రూపం ఏర్పడింది. గురజాడ అప్పారావు రాసిన ఐదు కథలూ అనంతర కాలంలో ఐదు పాయలుగా - స్త్రీ విద్య, కుల మత వివక్ష, స్త్రీ స్వేచ్ఛ, మూఢాచారాలు, సంఘ సంస్కరణ - తెలుగు కథాసాహిత్యంలో బలపడిన వైనాన్ని మనం చూడొచ్చు. ఇంతకీ చెప్పొచ్చేదేమంటే ఆనాటి సామాజిక ఆవశ్యకతను తెలుగు కథ భుజానికెత్తుకుంది. అనంతర కాలంలో తెలుగు కథ ఎన్ని

ఆటుపోట్లకు గురయినా తన ప్రధాన లక్షణం సామాజిక ఆవశ్యకతను మాత్రం తన భుజస్కంధాల మీద మోస్తూనే ఉంది నేటి వరకూ.

సామాజిక పరిణామానికి నిలకడ స్వభావం వుండదు. చలనశీలత దాని లక్షణం. ఒక్కోసారి చాలాకాలంపాటు సమాజం ఒకే పద్ధతిలో నడిచినట్లు కనిపించినా చిన్నపాటి మార్పులు, కుదుపులు సహజంగా ఉంటాయి. మరోసారి మార్పులు ఊహించలేనంత వేగంగా జరిగిపోతుంటాయి. ఏం జరుగుతోందో అర్థమయ్యేలోపే మరో పెనుమార్పు ముంచుకొచ్చేస్తుంది.

వందేళ్ల తెలుగు కథ 100

గురజాడ, చింతా దీక్షితులకు కొనసాగింపుగా కథారంగంపైకి వచ్చిన చలం రచనలు నాటి సమాజంలో ఏదో ఒక పక్కన సన్నగా ప్రారంభమయిన పెను తుపానుకు సంకేతాలే. వాటిని నిలకడగా అర్థం చేసుకుని ఆ భావాలను జీర్ణించుకునేలోపే రెండో ప్రపంచయుద్ధం ముంచుకొచ్చింది. భారతీయ సమాజం యావత్తూ అతలాకుతలమయిపోయింది. మానవ సంబంధాల్లో ఒక్కసారిగా పెనుమార్పులు సంభవించాయి. జీవితంపట్ల కొత్త చూపు, కొత్త ఆలోచనలు మొదలయ్యాయి. ఆ మార్పులన్నీ మనం కొడవటిగంటి కుటుంబరావు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి కథల్లో చూడవచ్చు. లేకుంటే ఆ కాలంలోనే శ్రీపాద 'మార్గదర్శి, కొత్తచూపు, కలుపుమొక్కలు' వంటి కథలను, కుటుంబరావు 'నువ్వులు-తెలగపిండి, అద్దెకొంప' వంటి కథలనూ ఊహించగలమా? !

ఆ తర్వాత దేశానికి స్వాతంత్ర్యం రావడం, చాలాకాలం సమాజం నిలకడగా ఉన్నట్లు కనిపించినా చిన్నపాటి మార్పులు, కుదుపులు కొనసాగుతూనే వున్నాయి. ఈ కాలంలోనే (1950-65 మధ్య) కథలన్నీ కొత్తగా ఏర్పడిన మధ్యతరగతి భావజాలం చుట్టూ తిరగడమే కాక వారికి కాలక్షేపంగా కూడా కథల రాకడ ప్రారంభమయింది. కాలక్షేప సాహిత్యానికి ఈ కాలం సంపద్వంతమయినది.

1960 తర్వాత భారత ప్రజల్లో తమ జీవన స్థితిగతుల పట్ల అనుమానాలు మొదలయ్యాయి. భ్రమలు తొలగిపోసాగాయి. పంచవర్ష ప్రణాళికలు ఒక్కొక్కటిగా విఫలమవుతూ వచ్చాయి. నిరుద్యోగం, ఆకలి సామాన్యుల జీవితాలను అతలాకుతలం చేశాయి. సరిగ్గా ఈ కాలంలోనే రావిశాస్త్రి సారా కథలు, పెద్దిభొట్ల సుబ్బరామయ్య, బలివాడ కాంతారావు, తిలక్, ఎన్.ఎస్. ప్రకాశరావు, రంగనాయకమ్మ, కాళీపట్నం రామారావు, మధురాంతకం రాజారాంల కథలు మళ్లీ మనుషుల్ని నేలమీద నిలబెట్టాయి.

ఈ అశాంతి ఇలా కొనసాగుతున్న క్రమంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో అలజడులు, ఉద్యమాలు తలెత్తాయి. అటు నక్సల్బరీలోను, ఇటు శ్రీకాకుళంలోను సాయుధ పోరాటాలు మొదలయ్యాయి. ఈ పోరాటాలు కమ్యూనిస్టు భావజాలం వున్న రచయితలను ఎంతగానో ఆకర్షించాయి. విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. శ్రీశ్రీతో పాటు కొడవటిగంటి కుటుంబరావు వంటి ప్రముఖ రచయితలు ఈ ఉద్యమాల్లో ముఖ్యభూమిక పోషించారు. ఈ క్రమంలోనే గిరిజన జీవితాలు కథల్లోకి వచ్చి చేరాయి. భూషణం 'అడివంటుకుంది' కథ తెలుగు కథాసాహిత్యంలో ఒక మలుపు. భూషణం నుండి సాహూ వరకు అనేకమంది కథకులు గిరిజన జీవితాలను, పోరాటాలను చిత్రిస్తూ కథలు రాశారు.

కారణాలు భిన్నమైనప్పటికీ ఆనాటి నుండి నేటివరకూ ఈ కల్లోల పరిస్థితి కొనసాగుతూనే ఉంది. 1990లలో ఆర్థిక రంగంలో చోటు చేసుకున్న మార్పులు, సామాజిక రంగంలో వచ్చిన అస్తిత్వవాద స్పృహ సాహితీ రంగంలో ప్రస్ఫుటంగా వ్యక్తమయ్యాయి. స్త్రీవాద, దళితవాద కథలూ, గ్లోబలైజేషన్‌కి వ్యతిరేకంగా కథలూ విస్తృతంగా వచ్చాయి, వస్తున్నాయి.


బుచ్చిబాబు

శతాబ్ద కాలంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఇరవై ఏళ్లలో అనూహ్యంగానూ అత్యంత వేగంగానూ మార్పులు జరిగాయి. వీటిని అర్థం చేసుకుని, విశ్లేషించి మారిన పరిస్థితులకనుగుణంగా వస్తువును, రూపాన్ని నిర్ణయించుకోవటానికి రచయితలు ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నమాట వాస్తవం. అందుకే ఈమధ్య వస్తున్న కథల్లో కొంత అస్పష్టత, మరికొంత సంక్లిష్టత చోటు చేసుకుంటోంది. మొన్నటి డా.వి.చంద్రశేఖరరావు నుంచి నేటి బి.అజయ్‌ప్రసాద్ కథల వరకు ఈ ధోరణి మనకు కనబడుతుంది. రచయితలు పడుతున్న తపనని, ఏగోనీ (agony) ని కొంత సానుభూతితో అర్థం చేసుకోవాలి.

ప్రస్తుత సమాజంలో జరుగుతున్న మార్పులు స్పష్టంగా కనిపించవు. మన వ్యక్తిత్వం సమూలంగా మారిపోయాక కానీ మనం కళ్లు తెరవలేని స్థితి. ఎవరికి వారు తమకు తెలియకుండా ఒక కొత్త లోకంలోకి నెట్టివేయబడుతున్నారు. విభ్రమ గొలిపే ఈ లోకం మనల్ని ఊపిరి తీసుకోనీయదు. ఆలోచింపనీయదు. అసలు మనం ఎక్కడ నిలబడి వున్నామో కూడా అర్థం కానీయదు. మనది కాని, మనకి అవసరం లేని ఒక సంస్కృతి మనమీద రుద్దబడుతోందని మనకు తెలిసేలోపే మనం దానిలో భాగమయిపోయి, దాన్ని కీర్తిస్తూ వుంటాం. మనం మన సమాజం నుండి, చివరకు మననుండి మనమే దూరమైపోతున్న ఒక కొత్తస్థితి. ఈ స్థితిని అర్థం చేసుకుని, కథలుగా మలిచి పాఠకులకు అందించడానికి రచయితలు ప్రయత్నం చేస్తున్నారు. ఎంతో వైవిధ్యభరితమైన వస్తువుతో కథలు వెలువడుతున్నాయి. వృద్ధాప్యం, స్త్రీవాదం, దళితుల ఆర్తనాదాలు, కూలిపోతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ- చేతివృత్తులు, ఆత్మహత్యలు- ఒక్కమాటలో చెప్పాలంటే గ్లోబలైజేషన్ ప్రక్రియలో నలిగిపోతున్న ప్రతి సామాజిక వర్గపు సమస్యను మన తెలుగు కథకులు స్పృశించగలిగారు. కానీ, సమస్య లోతుల్లోకి వెళ్లలేకపోతున్నారు. వాటిని కథలుగా మలచడంలోనూ నైపుణ్యం చూపలేకపోతున్నారు. అందుకే అవి మన పాఠకులకు ఎంతవరకు అందాయన్నది ప్రశ్నగానే మిగిలిపోతోంది. ఇప్పుడొస్తున్నవి రచయితల కథలే కానీ, పాఠకుల కథలు కావని సామాన్య పాఠకుల ఆరోపణ. ఈ ఆరోపణలో కొంతవరకు నిజం లేకపోలేదు. ఈ సంక్లిష్ట సామాజిక స్థితిని పాఠకులకు అర్థమయ్యేట్లు, ఆమోదయోగ్యంగా చెప్పటంలో కథకులు వస్తువును ఎన్నుకున్నంత సులభంగా, రూపాన్ని ఎంచుకోలేకపోతున్నారు. అందుకే చాలా కథలు సగం చెక్కిన శిల్పాలుగా, గొప్ప కథలు కావలసిన ఎన్నోకథలు కేవలం మంచి కథలుగానే మిగిలిపోతున్నాయి. అయిదారేళ్లుగా

వచ్చిన కథల్లో ఇటువంటివి ఎన్నయినా ఉదాహరణలుగా చూపించవచ్చును.

గ్లోబలైజేషన్ ప్రక్రియ అటు సమాజంలోను, ఇటు సాహిత్యంలోను కొరకరాని కొయ్య అయి కూర్చుంది. దీనికి వ్యతిరేకంగా భారతదేశంలో ఏ రాష్ట్రంలోనూ జరగనంత చర్చ, ఉద్యమాలు మన రాష్ట్రంలో జరిగాయి. అయినా గ్లోబలైజేషన్ ప్రక్రియ ఆగలేదు. కానీ, దాని ఫలితాల పట్ల ఒక అవగాహనని ఈ ఉద్యమాలు ఇవ్వగలిగాయి. దాని పరిణామాలు తీవ్రరూపం దాల్చాక అది మానవ సంబంధాలను, విలువలను తీవ్రంగా ప్రభావితం చేసే స్థాయికి వెళ్లాక కూడా మన కథకులు మాత్రం ఇంకా సమస్యను పైపైనే పరిశీలిస్తున్నారు. గ్లోబలైజేషన్ మన అంతరంగంలో భాగమైపోయింది. మన భావోద్వేగాలను అది ప్రభావితం చేస్తోంది. మన సంస్కృతినీ శాసిస్తోంది. దీనికి ఉదాహరణగా ఒక్క విషయాన్ని ప్రస్తావిస్తాను.



కొడవటిగంటి

ఇటీవల కాలంలో భూమి ధరల్లో అనూహ్యమైన పెరుగుదల వచ్చింది. త్వరితగతిన అనేక చేతులుమారి మల్టీ నేషనల్ కంపెనీలు, కార్పొరేట్ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోతోంది. ఈ స్థితి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కాదు, చిన్నచిన్న పట్టణాల్లోనూ నెలకొని వుంది. భూమి విలువల్లో వచ్చిన ఈ మార్పును మన సమాజపు మానవ సంబంధాలు తట్టుకోగలవా? భూమి ఇకమీదట పంటలు పండించే క్షేత్రమే కాదు. కోట్లు కుమ్మరించగలిగే సాధనం కూడా. ఈ సంపద ఫలితాలు అందరికీ అందుతున్నాయా? లేదనే చెప్పుకోవాలి. ఒకవేళ అంది, ఆ సంపద సామాన్యుల చేతికి వచ్చినా, దాన్ని వెన్నంటి వచ్చే వికృత విలువలు, విశృంఖల భావాలు, అనుమానాలు, ఆరాటాలు, హత్యలు, ఆత్మహత్యలు- ఇలా విస్తరించి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తుంది. ఈ మాయను సామాన్య పాఠకులు అర్థం చేసుకునే స్థాయిలో కథలు రాయగలుగుతున్నారా? అనుమానమే! ఒకటి రెండు కథలు వచ్చినా కృతకమైన ముగింపులతో పేలవంగా తేలిపోయాయి.

ఒక భూమి విషయమే కాదు, మార్కెట్ మాయాజాలం, చేతివృత్తులు, పంటల ధరలు, స్త్రీ-పురుష సంబంధాలు- ఇలా ఎన్నో విషయాలు మారిన నేపథ్యం నుండి ఇంకా కథల్లోకి రావలసి ఉంది.

ఇక్కడ నిలబడి మనం ఇప్పుడు తెలుగు కథ భవిష్యత్తును చర్చించుకుందాం.

వర్తమాన కథాసాహిత్యం నడుస్తున్న తీరు అంత ఆశాజనకంగా లేకపోవటం వల్ల తెలుగు కథ భవిష్యత్తు గురించి ఆలోచించాల్సిన పరిస్థితి వచ్చింది. దీనికితోడు మరికొన్ని సమస్యలూ వున్నాయి. వీటిల్లో కొన్ని అపోహలున్నాయి. కొన్ని వాస్తవాలున్నాయి. మరికొన్ని అర్ధసత్యాలూ ఉన్నాయి.

రానురాను తెలుగుభాషకు ఆదరణ తగ్గిపోతోందన్న భావన వ్యాప్తి చెందటం వల్ల తెలుగు సాహిత్యానికి, దానిలో భాగంగా కథాసాహిత్యానికి భవిష్యత్తు లేదనే ఒక వాదన వుంది. నిజమే, చిన్న పట్టణాల నుండి నగరాల వరకు ఇంగ్లీషు మీడియం స్కూళ్లు పెట్టి తెలుగును తక్కువ చేసి చూడడం వల్ల కొత్తతరం వారికి తెలుగు భాష అలవడడం లేదని, దీనివల్ల సాహిత్యం సంగతటుంచి భాషకే భవిష్యత్తు లేదనే భయం ఒకటుంది. సాధారణ ప్రజల్లో రచయితలు ఎప్పుడూ అతికొద్దిమంది మాత్రమే వుంటారు. వీరిలో సమాజాన్ని, రచనను సీరియస్‌గా తీసుకుని రచనలు చేసేవాళ్లు మరీ తక్కువగా వుంటారు. అయినా వీరి ప్రభావం పాఠకుల్లోను, సమాజంపైన ఎక్కువగానే వుంటుంది. అలాంటి రచయితలకు భాష అనేది ప్రతిబంధకం కాదు. వాళ్లలో రచనాశక్తి, తపన వుంటే ఎంత ఇంగ్లీషు మీడియంలో చదివినవారైనా తెలుగులో రచనలు చేయడానికి, కథలు రాయడానికి ఇబ్బంది పడరు. అయినా అవి చదివేందుకు భవిష్యత్తులో పాఠకులుంటారా? అనేది మరో భయం. ఇది అర్థం లేని అపోహ. అలాంటి పరిస్థితే ఉత్పన్నమయితే భాషకు సంబంధించిన అన్ని మాధ్యమాలు మూసుకుపోతాయి, వార్తాపత్రికలతో సహా. ఇది మరీ నిరాశాపూరితమైన వాదన. ఏది ఏమైనప్పటికీ మాతృభాషను రక్షించుకోవడానికి పౌర సమాజం, ప్రజలు కొంత ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం వుంది. ఇప్పట్లో దీనివల్ల తెలుగుకథ భవిష్యత్తుకు వచ్చిన ప్రమాదమేమీ లేదు.



రావిశాస్త్రి

మారిన సామాజిక పరిస్థితుల్లో యువకులు తమ కేరీర్‌పై పెట్టినంత దృష్టి ఇతర విషయాల మీద (సాహిత్యంతో సహా) వుంచడం లేదు. దీనివల్ల భవిష్యత్తులో కథలు రాయాల్సిన రచయితలు కరువవుతారనేది మరో అపోహ. యువకులు తమ కేరీర్‌పై దృష్టి పెట్టడం అనేది తాత్కాలికమైన విషయం. ఈ దశాబ్దంలో వచ్చిన వేగవంతమయిన మార్పులు ఇందుకు కారణం. మారిన వేగాన్ని అవకాశంగా అంది పుచ్చుకుని త్వరగా ముందుకు దూసుకుపోవాలనేది యువతలో సహజంగా ఉండే లక్షణం. పరిస్థితి కాస్త నిలకడగా మారాక వారూ తమ అభిరుచులు, ఆసక్తుల మీద దృష్టి పెట్టక తప్పదు. అందులో సాహిత్యమూ భాగమే. పాశ్చాత్య దేశాల్లోనూ జరిగిన మార్పే ఇక్కడా వచ్చింది. మధ్యలో కొంత విరామం వచ్చినా అక్కడ సాహితీసృజన కొనసాగుతోంది. సీరియస్ సాహిత్యానికి అత్యంత విలువా వుంది. నిజానికి తెలుగు కథలకు ఈ మార్పు ఒక అదనపు కూర్పు అవుతుందే కాని అవరోధం కాదు.

ఇటీవల కాలంలో సమాజం మీద దృశ్య మాధ్యమాల ప్రభావం ఎక్కువగా వుంది. దీనివల్ల తెలుగు కథాసాహిత్యానికి పాఠకుల ఆదరణ తగ్గుతోందనేది ఒక వాదన. దీనిలో కొంత నిజం లేకపోలేదు. అయితే దీనివల్ల నష్టపోయేది ప్రధానంగా కాలక్షేప సాహిత్యం. ఒకప్పుడు అచ్చయిన ఆరు నెలల్లోనే లక్షల కాపీలమ్మిన రచయితల రచనలు, పుంఖానుపుంఖాలుగా పత్రికల్లో వెలువడిన ఉత్కంఠతో నిండిన సీరియల్సు.. ఆ స్థాయిలో నేడు లేకపోవడానికి అదే కారణం. దృశ్య మాధ్యమాల వల్ల పాఠకుల సంఖ్య బాగా తగ్గింది. ఇంకా తగ్గనూవచ్చు. అయితే సీరియస్ సాహిత్యానికి మాత్రం ఆదరణ తగ్గే అవకాశం లేదు. అలాంటి పాఠకుల మేధస్సును మన దృశ్య మాధ్యమాలు ఎంత మాత్రమూ సంతృప్తి పరచలేవు. అందుకే గతంతో పోలిస్తే సీరియస్ రచనలు, ముఖ్యంగా కథా సంకలనాలు ఇప్పుడు ఎక్కువగా వస్తున్నాయి, అమ్ముడుపోతున్నాయి. పాఠకులు చదువుతూనే వున్నారు, ఉంటారు కూడా.

తెలుగు కథా వ్యాప్తికి ఆటంకంగా మారిన మరో ముఖ్య సమస్య, తెలుగు పత్రికల వ్యాపార స్వభావం. ఒకప్పటి

పత్రికల యజమానులు తమ మంచి అభిరుచిని పాఠకులకు అందజేసి వ్యాపారం చేసుకునేవారు. ఆనాటి పత్రికల యాజమాన్యాల ఆరోగ్యకరమైన అభిరుచి కథారచనకు, కథావ్యాప్తికి దోహదం చేసింది. దీపావళి, ఉగాది, సంక్రాంతి ప్రత్యేక సంచికలు, కథల పోటీలు అందులో భాగమే. నేడు ఆ వాతావరణం లేదు. వ్యాపారమయమైన కొన్ని పత్రికలు ఆరోగ్యకరమైన అభిరుచిని మార్కెట్ చేయడానికి బదులు, 'పాఠకుల అభిరుచి' మేరకు సర్క్యులేషన్ పెంచుకొనే ప్రయత్నం చేయడంతో మంచి కథలకు గండిపడింది. ఇలాంటి చాలా పత్రికలు మొక్కుబడిగా కథలు ప్రచురిస్తున్నాయి. లేదా కథల నిడివిపై పరిమితిని ఖచ్చితంగా పాటిస్తున్నాయి. దీంతో సీరియస్‌గా కథలు రాసే రచయితలు తమ కథలను ఎక్కడ ప్రచురించుకోవాలో అర్థంకాని అయోమయ స్థితి నెలకొంది. అడపాదడపా వచ్చే మంచి కథలు, ఆయా పత్రికల సంపాదకులకున్న అభిరుచి మేరకు వస్తున్నవేనని చెప్పాలి. కథాసాహితి ప్రచురించే వార్షిక సంకలనాల కోసం కథల ఎంపిక ఒకప్పుడు ఎంతో కష్టమయ్యేది. నేడు ఆ పరిస్థితి లేదు. కథలను వెతుక్కోవలసి వస్తోంది. కథకులు మంచి కథలు రాయడం లేదని సంపాదకులు, రాసినా పెద్దవయ్యాయనో, అర్థం కావడంలేదనో ప్రచురించడం లేదని కథకులు పరస్పరారోపణల మధ్య కథాసాహిత్యం నలిగిపోతుంది. దీనికి పరిష్కారం ఏమిటి? సాహిత్య పత్రికలు ఈ వాతావరణాన్ని కొంత మార్చగలవు. ప్రస్తుతం సాహితీ, సాంస్కృతిక సంస్థలు మాత్రమే ప్రచురించే సాహితీ పత్రికలను వ్యక్తులు, గ్రూపులు అన్ని ప్రాంతాల నుంచి ప్రారంభించి కథాసాహిత్యాన్ని ప్రచురించడం మొదలుపెడితే కొంత మార్పు వస్తుంది. main stream కు చెందిన పత్రికలు సీరియస్ కథలను కూడా వ్యాపార వస్తువుగా అంగీకరించే స్థితి రావాలి.




గోపీచంద్

అంతపెద్దగా సాహిత్య పరిచయంలేని ఓ మిత్రుడు ఇప్పుడు మంచి కథలు రాస్తున్న రచయితలు ఎవరు? అని అడిగాడు. ఒకప్పుడు కథకులుగా గుర్తింపు పొందిన కొడవటిగంటి కటుంబరావు, బుచ్చిబాబు, చలం, గోపీచంద్, రంగనాయకమ్మ, రాచకొండ విశ్వనాథశాస్త్రి, మధురాంతకం రాజారాం, కాళీపట్నం రామారావుల్లాగా ఇప్పుడు రాస్తున్న రచయితలు ఎవరు అనేది ఆయన ఉద్దేశం. ఈ ప్రశ్నకి సమాధానం చెప్పడానికి నేను కొంత తడబడ్డమాట వాస్తవం. ఒకప్పుడు పత్రికలు చదివేవాళ్లకు ఈ పేర్లు సుపరిచితాలు. నేటి పత్రికలు చదివేవారికి అంతగా సుపరిచితమైన పేర్లు చెప్పడం కొంచెం కష్టమే అవుతుంది. దీనికి కొంత కారణం తగ్గిన పాఠకుల సంఖ్య. అల్లం రాజయ్య, కేతు విశ్వనాథరెడ్డి, అబ్బూరి ఛాయాదేవి వంటి సీనియర్ కథకులు రాయడం దాదాపు మానేశారు (కాళీపట్నం రామారావుగారు ఎప్పుడో మానేశారు). ఆ తర్వాతి తరంలో క్రమం తప్పకుండా రాస్తున్న వాళ్లలో ఓల్గా, డా. చంద్రశేఖరరావు, స్వామి, కాట్రగడ్డ దయానంద్, కుప్పిలి పద్మ, పాపినేని శివశంకర్, మధురాంతకం నరేంద్ర, బి.ఎస్.రాములు, వివినమూర్తి, ఆడెపు లక్ష్మీపతి, అంపశయ్య నవీన్, విహారి, ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్యులు. పదేళ్ల క్రితం కథలు రాయడం ప్రారంభించిన తరంలో చంద్రలత, ఖదీర్

బాబు, ప్రతిమ, సుంకోజి దేవేంద్రాచారి, పెద్దింటి అశోక్‌కుమార్, కె.ఎన్.మల్లీశ్వరి, ముదిగంటి సుజాతారెడ్డి, మంచికంటి, అజయ్‌ప్రసాద్, జాజుల గౌరి వంటివారు ముఖ్యులు. వీరుకాక మరో ముప్పైమంది అడపాదడపా రాస్తున్న వాళ్లున్నారు.

ఇంతమంది కథలు రాస్తున్నా ఏ పేరూ ప్రముఖంగా ఎందుకు వినబడ్డం లేదు? అన్నది ప్రశ్న. ఒకప్పుడు కొత్తగా కథలు రాసే రచయితలు తాము రావిశాస్త్రిలాగా రాయాలని, చలంలా లేదా బీనాదేవిలా రాయాలని, కాళీపట్నం పద్ధతిలో ప్రయత్నం చేద్దామని ఆలోచించే ధోరణి ఇప్పుడు లేదు. అంటే ఇప్పుడు కథారంగంలో దీపధారులు (టార్చిబేరర్స్) లేరు. ఆ మాటకొస్తే, అన్ని ప్రక్రియల్లోనూ ఇదే స్థితి. అందుకే గతంలో ఎన్నడూ లేనంతమంది కథకులు కథలు రాస్తున్నా నాలుగు పేర్లు చెప్పాలంటే తడుముకోవలసే వస్తుంది. దీపధారులు లేరు కానీ సామాజిక స్థితిగతులే మార్గదర్శకంగా కథలు రాస్తున్న వాళ్లే పైన పేర్కొన్న కథకులందరూ. ఒక్కొక్కరిదీ ఒక్కోమార్గం. దీపధారులు లేనందువల్ల కథాభవిష్యత్తుకు ఆటంకం ఏర్పడుతుందా? అని ప్రశ్నిస్తే ఎంతమాత్రమూ కాదనే సమాధానం. అయితే ఒకప్పుడు కొద్దిమందే రచయితలు ఉండడం వల్ల వారి పేర్లు ప్రచలితమైనంతగా నేటి రచయితల పేర్లు సాధారణ పాఠకుల దృష్టికి వెళ్లడం లేదు. నేటి పాఠకులకు రచయిత ముఖ్యం కాదు, కథ ముఖ్యం. ఇది ఒక రకంగా ఆరోగ్యకరమైన పరిణామం మాత్రమే కాదు, భవిష్యత్తుకు శుభసూచకం కూడా.



బాలగంగాధర్ తిలక్

అయినప్పుడు కథ భవిష్యత్తు పట్ల ఎందుకు ఆందోళన ఉండాలి? అని ప్రశ్నించుకుంటే, ముందే చెప్పుకున్నట్లు నేడొస్తున్న కథలు రచయితల కథలే కాని పాఠకుల కథలు కావనే అభిప్రాయం కొంత బలంగా ఏర్పడడం. దీనికి ముఖ్యంగా రెండు కారణాలున్నాయి. కథల్లో సామాజిక స్పృహ గోల ఎందుకు? అనేవాళ్ల సంఖ్య పెరగడం, అలాంటి వాతావరణం సమాజంలో నెలకొని ఉండడం, రచయితలు తమ ఇతివృత్తాలు ఎంచుకోవడంలోనూ, వాటిని కథలుగా మలచడంలో మూసధోరణి అవలంబిస్తుండడం మరో కారణం. మొదటి కారణాన్ని పెద్దగా పట్టించుకోనవసరం లేదు. రెండో కారణం పట్ల జాగరూకత అవసరం. సమాజంలో ప్రేమలున్నాయి. సమాజం కల్పించిన అంతరాల మధ్య భావోద్వేగాలున్నాయి. అనురాగాలు, ఆప్యాయతలు ఉన్నాయి. హాస్యం, చతురత, వ్యంగ్యం ఉన్నాయి. సామాజిక స్పృహలో భాగంగా నేడున్న గ్లోబలైజేషన్ నేపథ్యంలో వీటిని స్పృశిస్తూ ఎందుకు కథలు రాయలేకపోతున్నామన్నది రచయితలు ఆత్మపరిశీలన చేసుకోవాలి.

ఇక్కడ రెండు కథల గురించి చెప్పాలి.

ఒక పెద్దమనిషి ఒక వేశ్య ఇంటికి వెళ్లి, నేను ఆరునెలల పాటు దేశాటన చేయాలనుకుంటున్నాను. డబ్బుకు బాదరబందీ లేదు. నువ్వు నాతో వస్తానంటే నెలకింతని ముట్టచెబుతాను. కానీ ఒక్క షరతు. నువ్వు మాత్రం నన్ను ఆకర్షించే ప్రయత్నం చెయ్యటానికి వీల్లేదు- అని అడిగితే, అందుకు ఆమె ఒప్పుకుంటుంది. ప్రయాణం మొదలవుతుంది. ప్రయాణం సాగినంతసేపూ ఎంత ఆకర్షణ, ఎంత

చర్చ, ఎంత భావోద్వేగాల ప్రదర్శన కథలో నిండి ఉంటాయో చెప్పలేము. ఈ కథ ద్వారా మానవ మస్తిష్కం మొత్తం పొరకులకు ఆవిష్కారమవుతుంది. దాదాపు ముప్పై పేజీల్లో విస్తరించిన కథ ఇది. చదువుతున్నంత సేపూ మన మనసుల్లో ఉన్న అనేక భయాలు, ఆందోళనలు, సందేహాలు ఒక్కటొక్కటిగా విడిపోతాయి. ఆ వేశ్య పేరు కస్తూరి, కథ పేరు, 'నీకేం కావాలి?' రచయిత కొడవగంటి కుటుంబ రావు. ఈకథ రాసింది 1945లో.

1995లో వెలువడిన మరో కథ 'చీకటి'. కథ రాసింది అల్లం శేషగిరిరావు. సంచార తెగకు సంబంధించిన ఒక వేటగాడి జీవితాన్ని చిత్రించిన కథ ఇది. ఈ కథలో ఆకలి, ఆక్రందన, కట్టలు తెంచుకునే ఆవేశం, ప్రేమ, అభిమానం, నిస్సహాయత, సెక్స్- అన్ని భావాలను కలగలిపి అద్భుతమైన డిబిరిగాడి ఆకృతిని కళ్లముందు కట్టించడంలో రచయిత ప్రదర్శించిన నేర్పు కథకులందరికీ ఆదర్శం కావాలి.



అల్లం శేషగిరిరావు

ఈమధ్య కాలంలో మన కథకులెవరైనా ఇటువంటి వస్తువులను తీసుకుని ధైర్యంగా కథలు రాయడానికి ముందుకొస్తున్నారా? అనేది ప్రశ్నించుకోవాలి. ఇటువంటి కథలు రాయడానికి కథకునికి ఎంతో అవగాహన ఉండాలి. అన్నిటికన్నా ముఖ్యంగా తన మీద తనకి నమ్మకం ఉండాలి. నిజానికి నేటి సామాజిక నేపథ్యంలో మానవ మస్తిష్కంలో సుడులు తిరిగే రకరకాల ఆలోచనాధోరణులను కథలుగా మార్చుకోవడానికి అవకాశమున్నా, కథకులెవరూ ఆ ప్రయత్నం చేస్తున్నట్లు కనబడదు. పోనీ ఈ విషయాలను చర్చిద్దామంటే, లేదా వస్తున్న కథలలోని డొల్లతనాన్ని విమర్శిద్దామంటే రచయితలెవరూ విమర్శను ఏమాత్రం సహించలేని స్థితికి మెల్లగా జారిపోతున్నారు. ఉంటే పొగడ్తలు, లేదా తిట్లు. ఇందుకు భిన్నంగా, సాగాల్సిన నిర్మాణాత్మక విమర్శ దాదాపు లేకుండా పోయింది. సాహిత్యానికి విమర్శ ప్రాణం. అటువంటి విమర్శ తెలుగులో దాదాపు మృగ్యమైపోయింది. ఇందుకు విమర్శకుల కొదవ, రచయితల అసహనమూ కారణం. ఈస్థితి తెలుగు కథావికాసానికి ఆరోగ్యకరం కాదు. తెలుగు కథాభవిష్యత్తుని అయోమయంలో పడవేసే ధోరణి ఇది.

ఇప్పటివరకు మనం చూసిన సమాజం వేరు, భవిష్యత్తులో చూడబోయే సమాజం వేరు. భవిష్యత్తు చిత్రపటాన్ని సమాజం ముందు ఆవిష్కరించాల్సిన బాధ్యత రచయితలదీ, కథకులదే. అందుకోసం వారు తమను తాము అనుక్షణం పరీక్షకు పెట్టుకోవాలి. తపన చెందాలి. వేదన పడాలి. శోధించాలి. ఆ శోధన నుండే నూతన కథావస్తువు ఆవిష్కృతమవుతుంది. దాన్ని కళాత్మకంగా తీర్చిదిద్దాలి. దీనికి సాధన అవసరం. ఆ సాధనలో తెలుగు కథా రచయితలు నిమగ్నమైతే, తెలుగు కథ భవిష్యత్తు ఏమిటి? అని చర్చించుకునే అవసరమే ఉండదు.

(ఈ వ్యాసంలో సందర్భవశాత్తు కొందరు కథకుల పేర్లను ఉదహరించడం జరిగింది. అలా పేర్లను ఉదహరించడం వ్యాసం ప్రధానోద్దేశం కాదు.)



-వాసిరెడ్డి నవీన్

వ్యాసరచయిత

ఇట్లు

★ జనవరి సంచికలోని 'ఇప్పుడిలాగే వుంది మరి' కథ మమ్మల్ని ఆనందింపచేసింది. కథలో రాసినట్లు 'జగడాల జోగమ్మ'లు ఇక్కడ చాలాచోట్ల కన్పిస్తుంటారు. వాస్తవికత చాటిన రచయిత కాశీ విశ్వనాథ్0గారికి అభినందనలు.

– వానపల్లి గంగరాజు, *విశాఖపట్నం*

★ ఆరు తెలుగు కథలతో నిండిన కొత్త సంవత్సర ప్రారంభ సంచిక మాకు 'అరిటాకు వేసి వడ్డించిన విందు'లా ఉంది. 'వందేళ్ల తెలుగు కథ'లో ప్రపంచీకరణ ప్రభావాన్ని బాగా వివరించారు. విశేష వ్యాసం అందించిన మధురాంతకం నరేంద్రగారు అభినందనీయులు. విశ్వకథా ముత్యంలో భాగంగా 'మజిలీ గుమాస్తా'ను నాగభూషణాచార్యులు గారు చక్కగా ఆవిష్కరించారు. ముక్తవరం పార్థసారథిగారి అనువాద కథ 'ఖరీదైన ఖైదీ' కూడా చాలా బావుంది.

–పి.సూర్యనారాయణరాజు, *హైదరాబాద్*

★ గరిమెళ్ల నరసింహశర్మగారి తెలుగు కథ 'ఎండమావులు' ఈ కాలపు పెద్దల, బిడ్డల సంబంధాలకు అద్దం పట్టేలా ఉంది. దాంపత్య బంధం, తల్లిదండ్రుల ఉదాత్తతను రచయిత చాటిచెప్పినట్లయింది.

–నల్లమోతు సుబ్బారావు, *గుంటూరు*

★ 'నేను మళ్లీ జీవిస్తాను' హిందీ అనువాద కథ బాగా నచ్చింది. స్త్రీ తనను తాను ఉద్ధరించుకోగలదని చక్కగా తెలియజేసిన కథ ఇది. శైలజ పాత్రతో భావాల్ని వ్యక్తపరచిన తీరు అద్భుతంగా ఉంది. అలాగే 'పాతివ్రత్యం' కథ అర్థవంతంగా ఉంది.

– ఎస్. శేషగిరి, *సికిందరాబాద్*

★ ఇలియానా ముఖచిత్రంతో వెలువడిన విపుల సంచిక కనువిందు చేసింది. 'వందేళ్ల తెలుగుకథ' విశ్లేషణాత్మకంగా సాగుతోంది. గాంధీజీ సూక్తులు ఎంతో నచ్చాయి. కథల్లో సువర్ణగారి 'వెంటాడిన నీడ'కు మంచి మార్కులు పడతాయి. శ్రీధర్‌గారితో పాటు రవి, సముద్రాల, శ్రీచంద్ర, శ్రీనివాస్ బొమ్మలు బాగున్నాయి.

– సుభాష్ చంద్రబోస్, *శ్రీకాకుళం*

★ కార్డు కథలతో పాటు సినారె 'ముషాయిరా', 'మిస్టర్ మిరియం' రమ్యంగా ఉండి ఇంటిల్లిపాదినీ అలరించాయి. 'వందేళ్ల తెలుగు కథ'లో ఐతా చంద్రయ్యగారి 'ఆప్తవాక్యం' సరికొత్త ఆలోచనలు రేకెత్తించింది. తెలుగు కథల్లో 'బలగం', 'బంద్', 'ఇప్పుడిలాగే వుంది మరి' ఎంతగానో చదివించాయి. భారతీయ భాషల కథలు మూడూ (బొంత, నేను మళ్లీ జీవిస్తాను, పతిదేవుడు) ఆసక్తికరంగా సాగాయి. 'తెలుగు కథలు వేటికీ తీసిపోవు' అని యండమూరి అనడం అక్షర సత్యం. 'మాండలిక కథలు ఇంకా రావాల్సి ఉంద'న్న పాయసం సుబ్రహ్మణ్య మహర్షి మాటలు స్మరణీయాలు.

–లక్ష్మీ విశ్వనాథ్, *ఖమ్మం*

★ కథలతో పాటు కార్డు కథలూ చాలా బాగున్నాయి.

– వేణుగోపాలరావు, *హైదరాబాద్*

★ ఎప్పటిమాదిరే ఈసారి కూడా 'మిస్టర్ మిరియం' మనసారా నవ్వించింది. మిరియంతో పాటు ధనియం, మరువం, లవంగం, అప్పడం పాత్రలతో మల్లాదిగారు చక్కటి హాస్యాన్ని పండిస్తున్నారు.

– పి. అనసూయ, *చెన్నై*

★ 'బలగం' తెలుగు కథ ముగింపు చక్కగా ఉంది. బంద్ వల్ల కలిగే అనర్థాల్ని తన కథలో రచయిత ప్రసాద్‌గారు హృద్యంగా తెలియజేశారు. మరో తెలుగు కథ 'వెంటాడిన నీడ' సమాజంలోని కొంతమంది ఆలోచనాధోరణిని ప్రతిబింబించింది.

–వందన, *హన్మకొండ*

★ కథలన్నీ బాగున్నాయి. ముఖ్యంగా 'ఇప్పుడిలాగే వుంది మరి', 'వెంటాడిన నీడ' కథల్ని ప్రత్యేకించి చెప్పుకోవాలి. నేటి సమాజంలోని వృద్ధుల స్థితికి 'ఎండమావులు' కథ అద్దంపట్టింది. పుష్కిన్ 'మజిలీ గుమాస్తా' మాకు ఎంతగానో నచ్చింది. అనువాద కథల్లో 'బొంత' మా హృదయాన్ని కదిలించింది. హిందీ కథ 'నేను మళ్లీ జీవిస్తాను' వాస్తవికతకు చాలా దగ్గరగా ఉంది.

– విజయలక్ష్మి, *కాకినాడ*

మీ అభిప్రాయాల్ని e-mail : vipula.chatura@gmail.com కు మెయిల్ చేయవచ్చు.



రాంగ్ నెంబర్

"హలో! అది పోలీస్‌స్టేషనా? "

"హలో! ఎవరది! ఎవరయ్యా మాట్లాడేది? "

"అహఁ అది పోలీస్‌స్టేషనా? కాదా!"

"పోలీస్‌సేషన్ నెంబరుకు ఫోన్ చేసి అది పోలీస్‌స్టేషనా? కాదా? అడగటం ఏంటి? "

"అది కాదండీ బాబూ! అది టూటౌన్ పోలీస్‌స్టేషనేనా? అని"

"అవునయ్యా! ఇది టూటౌన్ పోలీస్‌స్టేషనే"

"అయితే ఇక్కడ కొంపలంటుకున్నాయ్ సార్!"

"రాంగ్‌నెంబర్. ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేయి. మాకు చేస్తావేంటి? మరీ లోకువైపోయామే. మర్డర్లకీ, మానభంగాలకీ, ఎలక్షన్లకీ, ఎన్‌కౌంటర్లకీ, బందోబస్తుకి, దొంగతనాలకీ ఇలా అడ్డమైన పన్లతో మేం ఛస్తుంటే మళ్లీ ఈ కొంపలు కాలటానికి కూడానా!"

"అది కాదండీ.. అక్కడ హెడ్‌కానిస్టేబుల్ మరిడయ్యగారున్నారా? "

"ఉన్నారయ్యా! ఆ హెడ్‌కానిస్టేబుల్‌ను నేనే. ఆ మరిడయ్యనూ నేనే! ఏంటంట? "

"అరే! మరిడయ్యగారు! మీ ఇల్లే కాలిపోతోందండి! మీ పక్కయింటి మస్తాన్‌ను ఫోన్ చేస్తున్నా..."

"ఆఁ!"

– కొలచన

ఎ.ఎస్. రావు నగర్, హైదరాబాద్



రక్త సంబంధాలు

రాములమ్మగారూ! మీరు బాధపడకండి. మీ పిల్లల మనస్తత్వం తెలుసుకోవాలి. అందుకే ఈరోజు 'మదర్స్ డే' మిషతో మీ నలుగురు పిల్లల్ని పిలిపిస్తున్నాం అన్నాడు, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకుడు రఘు.

"వాళ్లు రారు నాయనా!" అంది బాధగా రాములమ్మ.

మాటల్లోనే మధు, రవి, మురళి, ప్రభు వచ్చారు.

"మీ అమ్మగార్ని మా 'ఓల్డ్‌ఏజ్ హోం'లో మూడేళ్లుగా చూశాం. ఇక్కడ వైద్యసౌకర్యం అంత బాగాలేదు. మీ అమ్మగార్ని తీసుకెళ్లండి" అన్నాడు రఘు.

"నా భార్య పురిటికెళ్లింది.. నాకు కుదరదు" అన్నాడు మధు.

"నా భార్య మెడిసిన్ ఫైనలియర్.. నాకు కుదరదు" అన్నాడు రవి.

"నా జాబ్ పోయింది నాకు కుదరదు" అన్నాడు మురళి.

"నా భార్యకు.. మా అమ్మకు పొసగదు.. వద్దు..." అన్నాడు ప్రభు.

"మీపై పోలీసు కంప్లయింట్ ఇస్తాం... వృద్ధుల్ని నిరాదరించడం నేరం.." అన్నాడు కోపంగా రఘు.

"ఇవ్వండి, మేం... లాయర్లను పెట్టుకుంటాం. కేసు డీల్ చేస్తాం" అంటూ విసురుగా లేచారు నలుగురు...

"మీ అమ్మగారిపైనే ఎదురుకేసు పెడతారా? ఆమె కోరింది పట్టెడన్నం, గుప్పెడు జాలి.. పిడికెడు సానుభూతి.. అంతేగా? " అన్నాడు పక్కమంచంలోని ముసలయ్య.

"ముందు నువ్వు.. నీ పిల్లల దగ్గరకు పో... మాకు నీతులు చెప్పకు" అన్నారు కొడుకులు.

"లాటరీలో మీ అమ్మగారికి పది లక్షలు వచ్చింది. మీ బుద్ధులు తెలుసుకోవాలని పిలిసించాం... సరే మీరు వెళ్లవచ్చు. ఆ డబ్బు ఆమె ఆశ్రమానికి ఇచ్చేసింది.. ఇకపొండి..." అన్నాడు రఘు.

నలుగురూ అవాక్కయ్యారు...

– తంగిరాల చక్రవర్తి,

సంతోష్‌నగర్, హైదరాబాద్



ప్లాట్ నెం. 144

రవళి కాకినాడలో ఇంజనీరింగ్ చదువుతోంది. తన ఫ్రెండ్ బర్త్‌డేకి రాజమండ్రి వెళ్లి, నాన్‌స్టాప్‌లో తిరిగి వస్తోంది. బస్సులో టూ సీటర్‌లో తన పక్కనే ఒక యువకుడు వచ్చి కూర్చున్నాడు. బస్సు అంతా నిండిపోయింది. అతన్ని సీటు మారమనడం ఏం బావుంటుంది? అనుకుని కూర్చుండిపోయింది.

ఆమె రవళి, ఇలియానా కన్నా అందంగా వుంటుంది. బంగారం రంగులో వుంటుందేమో, పింక్‌కలర్ చుడీదార్‌లో వుంది. అంత ఆకర్షణగా వున్న ఆమెను చూస్తే యువకులకు పిచ్చెక్కకుండా వుంటుందా?

"మిస్ మీరు కాకినాడలో ఏం చేస్తారు? " అన్నాడా యువకుడు క్షణం పోయేక.

"ఇంజినీరింగ్ చదువుతున్నాను" అంది, ముభావంగా...

"ఎక్కడ ఉంటున్నారు? అయ్ మీన్ ఏ పేటలో? " అన్నాడు ఆమెను అదోరకంగా చూస్తూ...

"గాంధీనగరం రెండో వీధిలో.. ప్లాట్ నెం.144, చాలా? ఎందుకు అమ్మాయిలు ఒంటరిగా కనిపిస్తే వివరాలన్నీ అడుగుతారు? నేనేమైనా మిమ్మల్ని అడిగేనా? " విసుక్కుంటూ అనేసింది, నోటి కొచ్చినట్లుగా.

ఆ తరువాత అతన్ని చూసింది. అతని ముఖం చాలా సీరియస్‌గా వుంది. ఏమిటో మొరటుగా ఆడపిల్లల ముఖాలపై యాసిడ్ పోసే దుర్మార్గుడిలా వున్నాడు. రవళికి భయమేసింది. ఇలా ఆలోచిస్తుండగానే కాకినాడ రావడం, బస్సు దిగిపోవడం జరిగిపోయింది.

రవళి పక్కన కూర్చుని, బస్సులో ప్రయాణం చేసిన యువకుడు, మర్నాడు టిప్‌టాప్‌గా తయారై, బైక్ మీద రవళి ఇంటికి బయలుదేరాడు. అతను రాజమండ్రిలో ధనవంతుల బిడ్డ. అమ్మాయి ఓకేగా వుంది, లైనులో పెట్టేద్దామని అతని ఆలోచన.

గాంధీనగరం రెండో వీధిలో ప్లాట్ నెంబర్లు వెతుక్కుంటూ ఆమె చెప్పిన ప్లాట్ నెంబరుకు చేరేడు. అది గాంధీనగరం పోలీస్‌స్టేషన్! బలే హేండిచ్చేసిందే అనుకుని, బయట నిలబడి వున్న కానిస్టేబుళ్లని చూసి భయంతో బ్రేక్ వేయకుండా ముందకు సాగిపోయాడు.

– కె.బి. కృష్ణ,

వలసపాకల, కాకినాడ

తమిళ కథ

-రాజేష్ కుమార్



కాగితం జాబిలి

అనువాదం : జిల్లేళ్ళ బాలాజీ

త్రినేత్ర న్యూస్ ఛానల్‌లో షాలిని హెచ్చరికలు చేస్తోంది. "కొందరు సంఘ విద్రోహులు ఆంధ్రప్రదేశ్‌లో బాంబు విస్ఫోటనలు జరుపుతుండటం గురించి ప్రభుత్వం కొన్ని ముందస్తు హెచ్చరికలు చేస్తోంది. బాగా జనసంచారం ఉన్న ప్రాంతాల్లోని సూట్‌కేసులు, బ్రీఫ్‌కేసులు, ట్రాన్సిస్టర్, టిఫిన్‌బాక్స్ లాంటి వస్తువులను ప్రజలు తాకకుండా పోలీసులకు వెంటనే సమాచారాన్ని చేరవేయాలి. ఈ విషయంలో సహకరించినట్టయితే సంఘ విద్రోహులను తొందరగా పట్టుకోవడానికి వీలవుతుందని పోలీస్ కమిషనర్ అన్నారు. అంతే కాకుండా.."

టెలిఫోన్ మోగటంతో టీవీ వార్తల్లో మునిగిపోయిన సైకియాట్రిస్ట్ నవీన్ రాజ్..రిమోట్ కంట్రోల్‌తో టీవీని 'మ్యూట్'లో పెట్టి రిసీవర్ తీశాడు.

"హల్లో"

"డాక్టర్ నవీన్‌రాజ్"? అవతలి నుండి ఓ స్త్రీ కంఠం వినిపించింది.

"హోల్డింగ్.."

"డాక్టర్! నేను మమతా చౌదరిని. 'షెల్టర్' పేరుతో సాయిబాబా కాలనీలో అనాథ మహిళల పునరావాస కేంద్రాన్ని నడుపుతున్నాం"

"ఓహో! అది మీరేనా? పేపర్‌లో చూశాను. అనాథ మహిళల కోసం ఓ ఆవాస కేంద్రాన్ని నడపటం నిజంగానే ఒక మంచి విషయం. గతవారం కూడా మీ గురించి ఓ వారపత్రికలో గొప్పగా రాసున్నారు. దాన్ని చదివాక నాకు చాలా సంతోషం కలిగింది. రియల్లీ ఐ.. అప్రీషియేట్ యు"

"థాంక్యూ వెరీమచ్ ఫర్ యువర్ కాంప్లిమెంట్. నా భర్త చనిపోయాక మన శ్శాంతి కోసం షెల్టర్ పేరుతో చిన్నదిగా ఒక అనాథ శరణాలయాన్ని ప్రారంభించాను. మొదట్లో పదిమంది ఉండేవాళ్ళు.. ఇప్పుడు నూట ముప్పైరెండు మంది ఉన్నారు"

"నిర్వహణ ఖర్చంతా..? "

"నా భర్త పేరుమీద ఒక ట్రస్ట్ ఏర్పాటు చేశాను. గవర్నమెంట్ నుండి కొంత ఫండ్ వస్తుంది. ఎలాగో నెట్టుకొస్తున్నాను"

"నా నుండి ఏదైనా సాయం ఎదురుచూస్తున్నారా మమతా చౌదరిగారూ? "

"నో..నో.. మీనుండి మానిటరీ ఫండ్ ఏదీ ఆశించి మీకు ఫోన్ చెయ్యలేదు డాక్టర్!"


"దెన్..? "

"అదీ.. అదీ.."

"డోంట్ హెజిటేట్.. ఎప్పుడూ ఫోన్ చెయ్యనివాళ్ళు ఇప్పుడు చేశారు. మీకు ఏదైనా సాయం కావాలా? "

"ఎస్.. డాక్టర్.."

"చెప్పండి"



"ఇవ్వాళ సిటీలో మీరు ఓ లీడింగ్ సైకియాట్రిస్ట్. మనోవ్యాధికి సంబంధించిన సమస్యల్ని పరిష్కరించటంలో ఎక్స్‌పర్ట్ అని అందరూ అంటూంటారు"

"బై గాడ్స్ గ్రేస్. మీకు ఏ సాయం కావాలో చెప్పండి? "

"డాక్టర్! మీ వద్దకు ఓ కన్సల్టేషన్ కోసం రావలసి ఉంది"

"ఈజిట్.? ఎవరికి, ఏం ప్రాబ్లమ్..? "

"మా ఆవాస కేంద్రంలో విశాలి అని ఓ అమ్మాయి ఉంది. ఐదేళ్ళప్పుడు ఇక్కడికొచ్చింది. ఇప్పుడు వయస్సు ఇరవై. చూడ్డానికి లక్షణంగా ఉంటుంది. రెండు నెలలుగా ఆమెకొక సమస్య వచ్చిపడింది"

"చెప్పండి.. ఏమిటీ సమస్య? "

"ఆ విషయాన్ని ఫోన్లో చెప్పడానికి వీల్లేదు డాక్టర్. మీరు ఎప్పుడు ఫ్రీగా ఉంటారో చెప్పండి.. ఆ విశాలిని వెంటబెట్టుకొచ్చి, ఆమె నోటి నుండే సమస్యను చెప్పిస్తాను"

"ఇప్పుడు నేను ఫ్రీగానే ఉన్నాను. ఆ అమ్మాయిని వెంటబెట్టుకుని రండి.. విషయమేమిటో అడిగేద్దాం"

"థాంక్యూ డాక్టర్! అరగంటలో విశాలిని వెంటబెట్టుకుని మీ క్లినిక్‌కు వచ్చేస్తాను"

"రండి.. ప్లీజ్.." నవీన్‌రాజ్ రిసీవర్‌ను పెట్టేసి, ఓ సిగరెట్‌ను వెలిగించి వాళ్ళ రాకకోసం ఎదురుచూడసాగాడు. తెరిచి ఉన్న కిటికీ నుండి వర్షం వచ్చే సూచనగా చల్లని గాలులు వీయసాగాయి.

మరో అరగంట తర్వాత- మమతా చౌదరి, విశాలి డాక్టర్ నవీన్‌రాజ్ ముందు కూర్చుని ఉన్నారు. విశాలి అందంగా ఉంది. చామనచాయ, విశాలమైన కళ్ళు, చిన్నసైజు ముక్కు, కింద తడితో మెరుస్తున్న పెదాలు. బిగుతుగా చుట్టుకున్న చీరకొంగును ఎడమచేతి వేలికి చుడుతూ కూర్చుని ఉంది.

నవీన్‌రాజ్ ఆమెను పరిశీలనగా చూడసాగాడు. "చెప్పమ్మా, ఏమిటి ప్రాబ్లమ్? "

డాక్టర్ అలా అడగ్గానే, విశాలి శరీరంలో ఒక విధమైన బెరుకు ఒళ్ళంతా పాకింది. కనురెప్పలు వేగంగా కొట్టుకున్నాయి. ఏదో మాట్లాడ్డానికి నోరు తెరచింది కానీ, మాటలు మాత్రం బయటకు రాలేదు.

మమతాచౌదరి ఆమె భుజంమీద చెయ్యి వేసింది.

"చెప్పు విశాలీ.."

విశాలి నిటారుగా కూర్చుంది. కళ్లలో నీరు ఉబికింది. "డా.. డాక్టర్.."

"చెప్పమ్మా.."

"గత రెండు నెలలుగా.. రోజూ రాత్రి నిద్రలో ఓ కల వస్తోంది"

" ఏం కల? "

"ఓ పెద్దాయనా, ఒక అమ్మా వచ్చి నన్ను- 'రా హంసా.. వచ్చేయ్.. మనింటికి వచ్చేయ్' అని పిలుస్తున్నారు"

"ఏమిటీ హంసా..? నీ పేరు విశాలి కదూ?

"విశాలినే! కానీ నా కలలో వచ్చే ఆ పెద్దాయన, ఆ అమ్మా నన్ను హంసా అనే పిలుస్తున్నారు.."

"రోజూ ఇదే కల వస్తోందా? "

"ఔను! పడుకుని నిద్రపోయిన కాసేపటికంతా మా ఆవాసం గేటు ముందు ఒక కారొచ్చి ఆగినట్టు ఉంటుంది. కారు డ్రైవర్ దిగొచ్చి డోరు తియ్యగానే, ఆ పెద్దాయనా, ఆ అమ్మా దిగి ఆవాసం లోపలికి వస్తున్నట్టు అనిపిస్తుంది. తర్వాత నిద్రపోతున్న నన్ను తట్టి లేపుతున్నట్టూ ఉంటుంది. ఇద్దరూ మార్చి మార్చి- "రా.. హంసా.. వచ్చేయ్.. మనింటికి వచ్చేయ్' మని పిలుస్తారు. వాళ్ళు అలా పిలవగానే నాకు మెలకువ వచ్చేస్తుంది. ఒళ్ళంతా చెమటతో తడిసి పోయుంటుంది"

నవీన్‌రాజ్ తన ముక్కును రుద్దుకుని అడిగాడు

"రోజూ ఇదే కల వస్తుందా? "

"ఔను"

"గత రెండు నెలలుగా? "

"ఔను డాక్టర్.."

"నీకు హంసా అనే పేరున్న వాళ్ళెవరయినా తెలుసా? "

"తెలియదు"

"కలలో వచ్చే పెద్దాయనకూ, ఆ అమ్మకూ ఎంత వయసు ఉండొచ్చు? "

"పెద్దాయనకు అరవై, ఆ అమ్మకు యాభై ఏళ్ళు ఉండొచ్చు. ఇద్దరూ ధనవంతుల్లా కనిపిస్తున్నారు"

"కార్లోనే వస్తారు కదూ? "

"ఔను. ఎర్రటి కారు.. పొడవుగా ఉంటుంది. కారు నెంబరూ.." సాగదీసింది విశాలి.

"చెప్పమ్మా."

"టి.ఎన్. జీరోఫైవ్.. 57798"

"నువ్వు చెప్పే నెంబర్‌ను చూస్తుంటే... తమిళనాడు రిజిస్ట్రేషన్‌లా అనిపిస్తోంది"

అప్పటివరకూ మాట్లాడకుండా కూర్చొనున్న మమతా చౌదరి.. నవీన్‌రాజ్‌కేసి ఆశ్చర్యంగా చూస్తూ అంది. "డాక్టర్! మీకు పునర్జన్మమీద నమ్మకం ఉందా? "

"కొద్దిగా ఉంది.."

విశాలి దీర్ఘంగా తలాడించింది. "నాకు వాటిమీదంత నమ్మకం లేదు డాక్టర్"

"అలా అనకమ్మా. ఈ ప్రపంచంలో పుట్టే మనుషులూ, వాళ్ల జీవితాల్లోని సంఘటనలూ క్యాసెట్ లాంటి అమరికతో ఉంది. క్యాసెట్‌ను వేసి చూసుకున్నట్టే ఇది కూడా! వంద సంవత్సరాలు అయ్యాక ఇదే రోజున, ఇదేలాంటి ఓ సమస్యకు మమతా చౌదరిగారిని వెంటబెట్టుకుని నా వద్దకు నువ్వు రావచ్చు. ఇవే మాటల్ని నేను ఆరోజూ నీతో చెబుతాను.."

"మీరు చెబుతున్న విషయాలు నమ్మలేకపోతున్నాను డాక్టర్!"

"నమ్మటానికి కష్టంగానే ఉంటుంది. కానీ, ఇవ్వాళున్న శాస్త్ర సాంకేతిక విజ్ఞానమూ పునర్జన్మ విషయాన్ని అంగీకరిస్తోంది.. నీ విషయంలో ఇది సరియైనదేనా అని చూసేద్దాం. చెన్నైలో నాకు తెలిసిన డాక్టరొకరున్నారు. ఆయన పేరు యోగేంద్రన్. ఆయనతో ఇప్పుడే దీని గురించి మాట్లాడి చూద్దాం" అంటూ డాక్టర్ నవీన్‌రాజ్ తన మేజాబల్ల సొరుగును తెరిచి డైరీని తీశాడు. పేజీలు తిప్పి ఒక టెలిఫోన్ నెంబర్‌ను బాల్‌పాయింట్ పెన్‌తో అండర్‌లైన్ చేసి, రిసీవర్‌ను తీసి చెవికి ఆనించుకొని ఎస్‌టీడీ కోడ్‌తో నెంబర్లు నొక్కాడు. రెండుమూడు పర్యాయాలు ప్రయత్నించాక కనెక్ట్



అయింది.

నవీన్‌రాజ్ ఆసక్తిగా మాట్లాడాడు.

"డాక్టర్ యోగేంద్రన్..?"

"ఓ.. మీరేనా! నమస్కారం. నేను డాక్టర్ నవీన్‌రాజ్‌ను. మీవల్ల నాకో సాయం కావాలి. అందుకే ఫోన్ చేస్తున్నాను"

"ఎస్..ఎస్..! సైకలాజికల్ ప్రాబ్లెమ్.." అని మొదలుపెట్టిన నవీన్‌రాజ్.. విశాలి కొచ్చిన కల గురించి విపులంగా చెప్పి, ఇలా కొనసాగించాడు..

"..యోగేంద్రన్! మీరు చెయ్యవలసిందంతా ఇంతే. రేపు చెన్నై ఆర్.టి.ఓ ఆఫీసుకు వెళ్ళి టి.ఎన్.జీరోఫైవ్.. 57798 నెంబరు గల కారు యజమాని ఎవరో తెలుసుకొని వాళ్ళ గురించిన వివరాలను సేకరించి నాకు ఫోన్ చెయ్యండి"

"థాంక్యూ వెరీమచ్. నేను మీ నుండి ఫోన్‌కాల్‌ను రేపు సాయంత్రంలోపు ఎదురుచూస్తాను"

రిసీవర్‌ను క్రెడిల్ చేసి నవీన్‌రాజ్-

"విశాలీ! నీకు వచ్చింది ఒట్టి కలేనా..లేక.. గత జన్మకు సంబంధించిందా అనేది రేపటికి తెలిసిపోతుంది. అది ఒట్టికలే అయితే..ఆ కల మళ్ళీ రాకుండా ఉండటానికి ఎన్నో ట్రీట్‌మెంట్‌లున్నాయి"

విశాలి నీళ్ళు నిండిన కళ్ళతో చేతులెత్తి నమస్కరించింది.

"డాక్టర్! ఈ దేవుడు, పాపం - పుణ్యం, స్వర్గం - నరకం అనే మాటలపై నాకెప్పుడూ నమ్మకంలేదు.. ఏదో ఈ ప్రపంచంలో పుట్టేశాం. మొలకెత్తే మొక్క పెరిగి వృక్షమైనట్టు మనమూ పెరిగిపోయాం..ఏదో జీవిస్తున్నాం"

డాక్టర్ చిరునవ్వు చిందించాడు.

"బాగా వేదాంతం మాట్లాడుతున్నావమ్మా! నీకు వచ్చింది మనోవ్యాధి అయితే నయం చెయ్యటానికి నేనున్నాగా..ధైర్యంగా వెళ్ళి రామ్మా.."

మమతా చౌదరి లేచి నిలబడింది.

"నేను మళ్ళీ విశాలిని వెంటబెట్టుకుని ఎప్పుడు రమ్మంటారు డాక్టర్?"

"చెన్నై నుండి వివరాలు అందగానే నేనే మిమ్మల్ని కాంటాక్ట్ చేస్తాను"

"విశాలి విషయంలో మీరు వెంటనే స్పందించినందుకు కృతజ్ఞతలు డాక్టర్..!"

డాక్టర్ నవ్వి ఊరుకున్నాడు.

మరు రోజు సాయంత్రం ఐదు గంటలు.

ఏదో లెడ్జర్‌లో తలమునకలై ఉన్న మమతా చౌదరి తమ ఆవాసం ముందు ఓ కారొచ్చి ఆగటం, దానిలో నుండి డాక్టర్ నవీన్‌రాజ్ దిగి రావటాన్ని చూశాక గబగబా లేచి నిలబడింది.

"రండి డాక్టర్"

ఆమె చూపించిన కుర్చీలో కూర్చున్నాడు నవీన్‌రాజ్.

"చెన్నై నుండి ఏవైనా విషయాలు తెలిశాయా డాక్టర్?"

"తెలిసింది. అదే మీతో మాట్లాడి వెళదామని వచ్చాను. విశాలి లేదా..?"

"లేదు. కాయగూరలు తీసుకురావటానికి మార్కెట్‌కు వెళ్ళింది. వచ్చేసరికి ఎలాగూ ఆరైపోతుంది.. చెన్నై నుండి ఏం విషయాలు తెలిశాయి డాక్టర్?"

"ఇది పునర్జన్మ వ్యవహారమే.. డాక్టర్ యోగేంద్రన్ క్లియర్‌గా విచారించి విషయాలను సేకరించారు. టి.ఎన్.జీరో ఫైవ్ 57798 నంబరు గల కారు ఒక చెవర్లెట్. ఎరుపురంగు. దాని యజమాని సుబ్రమణియన్, వయసు యాభై సంవత్సరాలు. ఇరవై ఏళ్ళక్రితం 'హంస' పేరుతో వాళ్ళకు ఒక కూతురు ఉండేది. మంచి వరుణ్ణి చూసి పెళ్ళి ఏర్పాట్లు చేస్తున్నప్పుడు ఓ రోజు బంగళా వెనక తోటలోని బావిలో పొరబాటున కాలుజారిపడి చనిపోయింది. ఆ చనిపోయిన హంసే ఇప్పటి విశాలి. విశాలి తన కలలో చూసిన పెద్దాయన పోలికలు అచ్చు సుబ్రమణియన్‌కూ, ఆ అమ్మ పోలికలు అలాగే వళ్ళియమ్మకూ సరిపోయాయి"

"డాక్టర్! ఇవన్నీ సాధ్యమేనా?"

"సాధ్యమే! సుబ్రమణియన్‌కూ, వళ్ళియ

మ్మకూ పుట్టిన కూతురు హంస చనిపోయినప్పుడు ఆమె వయసు ఇరవై ఏళ్ళు. విశాలికి ఈ ఇరవయ్యవ ఏడులోనే గత జన్మ సంబంధాల గురించి కల వచ్చింది"

"ఇప్పుడేం చేద్దాం డాక్టర్? "

"ఈ వారంలో ఒకరోజు విశాలిని వెంటబెట్టుకుని మీరూ, నేనూ చెన్నైకు వెళ్ళి ఆ సుబ్రమణియన్‌నూ, వళ్ళియమ్మనూ కలిసి విషయాలు తెలియజేద్దాం. వాళ్ళు ఇష్టపడితే విశాలిని కూతురుగా ఉంచుకోనీ. లేకపోతే ఇక్కడికి తీసుకొచ్చేద్దాం"

"డాక్టర్! మీరు చెప్పే ఒక్కో విషయమూ నాకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది"

"ఇందులో ఆశ్చర్యపడ్డానికి ఏమీలేదు. తీరని ఆశలతో చనిపోయిన హంస, ఈ జన్మలో విశాలిగా పుట్టి ఆ ఆశల్ని నిజం చేసుకోబోతోంది..అంతే! విశాలిని చెన్నైకు తీసుకెళితే ఇంకా ఎన్నో విషయాలు ఆమెకు గుర్తుకు రావచ్చు"

"విశాలి చెన్నైకు రావటానికి ఒప్పుకుంటుందా? "

"మాట్లాడి ఒప్పించాలి"

"నాకైతే ఆమె ఒప్పుకొంటుందన్న నమ్మకం లేదు"

"నా దగ్గరకు ఆమెను పిలుచుకురండి. నేను మాట్లాడి ఆమెను కన్విన్స్ చేస్తాను"

డాక్టర్ నవీన్‌రాజ్ మమతా చౌదరి వద్ద శెలవు తీసుకుని కారు వద్దకు నడిచాడు.

కారులో కూర్చుని స్టార్ట్ చేసి డ్రైవ్ చేసుకుంటూ నవీన్‌రాజ్ రెండు వీధులు దాటాక.. జన సందడిలేని ఒక అవెన్యూ ప్రాంతంలోకి ప్రవేశించాడు. అక్కడ అప్పటికే ఒక చెట్టుకింద తన కోసం ఎదురుచూస్తున్న విశాలి ముందు కారును ఆపాడు. పక్కన ఒక చెత్తకుండీ. అందులో ఓ వీధికుక్క దేన్నో కెలుకుతోంది.

విశాలి - మెల్లగా నవ్వింది.

"ఏం డాక్టర్.. ఇంత సేపయింది? "

నవీన్‌రాజ్ కారు డోర్ తీయగానే విశాలి అతని పక్కనొచ్చి కూర్చుంది. డాక్టర్ నవ్వాడు.

"మమతా చౌదరితో మాట్లాడి రావద్దూ.."

"ఏమన్నారు? "

"చెన్నై సుబ్రమణియన్ గురించీ, వళ్ళియమ్మ గురించీ చెప్పాను. నమ్మేశారు"

"డాక్టర్! నాకు భయంగా ఉంది"

"ఎందుకు భయం? "

"గత జన్మలో హంసగా ఉన్నది నేనేనని అబద్ధం చెప్పి.. ఆ ఇంట్లో ఉండగలనా?

సుబ్రమణియన్, వళ్ళియమ్మ నన్ను తమ కూతురిగా అంగీకరిస్తారా? "

డాక్టర్ నవ్వాడు. "నేనెందుకున్నాను? ఆ పథకాన్ని పక్కాగా ప్లాన్ చేసింది నేను. దాన్ని ఎలా డీల్ చెయ్యాలో నాకు తెలియదా ఏం? నేనొక సైకియాట్రిస్ట్‌ను. ఆ సుబ్రమణియన్, వళ్ళియమ్మల వద్ద ఎలా మాట్లాడాలో అలా మాట్లాడి.. ఈ జన్మలో విశాలిగా ఉన్న ఈ అమ్మాయే గత జన్మలో హంస అని నిరూపించడం నాకు చేతనౌను. దానికి తగ్గట్టు ఇంతకుముందే నేను చెప్పినట్టు నువ్వు నడుచుకోవాలి"

"డాక్టర్! మీరెంత ధైర్యమిచ్చినా నాకెందుకో భయంగానే ఉంది"

నవీన్‌రాజ్ నవ్వాడు. "ఇది మన పథకంలోని మొదటి ఘట్టం. ఇప్పుడే నువ్విలా భయపడితే ఎలా? నీకు కల వస్తున్నట్టు చెప్పి, మమతా చౌదరిని నమ్మించి, ఆమెను నా దగ్గరకు తీసుకొచ్చినట్టే- మన ప్లాన్‌లోని మిగిలిన పనులనూ జాగ్రత్తగా చేసెయ్ చాలు. సుబ్రమణియన్‌కు దగ్గిర దగ్గిర ఒక కోటి రూపాయల ఆస్తి ఉన్న విషయాన్ని ఎప్పుడూ నీ మనసులో గుర్తుపెట్టుకో.. ధైర్యం దానంతటదే వస్తుంది. ఆ ఇద్దరు ముసలాళ్ళూ పైకెళ్ళిపోయాక ఆ ఆస్తంతా నీదే కదూ? ఆస్తి నీకు సొంతమయ్యాక నన్ను గుర్తుపెట్టుకుంటే చాలు"

"డాక్టర్! ఈ అనాథను ఒక విలాస జీవితానికి తీసుకెళ్ళబోయే మిమ్మల్ని నేను మరువగలనా? ఎప్పటికీ మీరే నాకు గాడ్ ఫాదర్.."

విశాలి ఇంకా తన మాటల్ని పూర్తిచెయ్యలేదు.

పక్కనున్న చెత్తకుండీ 'ఢాం' అనే పెద్ద శబ్దంతో పేలిపోయి కారును ముక్కముక్కలుగా చేసేసింది. నవీన్‌రాజ్ - విశాలిల రక్తంతో తడిసిన మాంసం ముక్కలు తునాతునకలైపోయిన కారు విభాగాలకు అతుక్కుని కనిపించాయి!

మరుసటిరోజు దినపత్రికలో.. రెండో పేజీలో.. కింది శీర్షికతో ఒక వార్త ప్రచురితమైంది.


'చెత్తకుండీలో శక్తివంతమైన బాంబు పేలి.. ఒక పురుషుడు, ఒక స్త్రీ బలి' V

తెలుగు కథ



మిస్సింగ్

వెంకటేష్



ఉద్ధృతంగా పారుతున్న గోదావరికి అటూ ఇటూ కొండలు. ఆ కొండల మీద పేర్లు కూడా తెలియని పెద్ద పెద్ద వృక్షరాజాలు. ఆ వెనుకగా దట్టమైన అడవి.

తూర్పువైపున ఎత్తైన కొండమీద ఉందా గెస్ట్‌హౌస్. ప్రభుత్వానిది. ఆ కొండ పాదం దగ్గర గోదావరి. గెస్ట్‌హౌస్ వెనుక అడవి. గోదావరిలో లాంచీల్లో విహారయాత్రలకి వెళ్ళే ప్రయాణికులు ఆ గెస్ట్‌హౌస్‌ని ఆనుకుని తయారుచేసిన పార్కులో భోజనాలు చేస్తుంటారు. మిగతా సమయాల్లో నరసంచారం ఉండదక్కడ.

అక్కడికి దగ్గర్లో గోదావరి మీద కడుతోన్న ప్రాజెక్టు పనుల నిమిత్తం విహారి అక్కడికి వచ్చాడు. ఆ ప్రాంత అధికారులు అతనికి ఆ గెస్ట్‌హౌస్‌లో బస ఏర్పాటు చేశారు.

అతను భార్య ప్రణవితో సహా వచ్చేసరికి కాస్తదూరంలో ఉన్న కొండరెడ్డిపల్లె అనే గిరిజన గ్రామం నుంచి, వాళ్ళ అవసరాలు చూడ్డానికి ఒక జంటని ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు సైటునించి మోటారుబోటు వచ్చి విహారిని తీసుకెళ్ళి, తీసుకొస్తూ ఉంటుంది.

అటవీ అందాలు, గోదావరి గలగలలూ, కొండగాలులూ... మొదట్లో ఉత్సాహాన్నిచ్చినా, నెమ్మది నెమ్మదిగా బోరు మొదలయింది విహారిలో. అతడి భార్య ప్రణతి అయితే మరీ గోల చేస్తోంది... బొత్తిగా కాలక్షేపం కావడం లేదనీ, సమయం మరీ భారంగా గడుస్తోందనీ 'ఇంకా ఎన్నాళ్ళండీ ఇక్కడ? ' అంటోంది రోజూ.

ఆ ప్రాజెక్టు పని దినదినగండం నూరేళ్ళ ఆయుష్షులా ఉంది. ప్రభుత్వం ప్రెస్టేజిగా తీసుకుని పని జరిపిస్తోంది. ప్రతిపక్షాలూ, పత్రికలూ గొడవ గొడవ చేస్తున్నాయి. పర్యావరణానికి నష్టమనీ, వన్యప్రాణులకి ముప్పనీ, ప్రాజెక్టు వల్ల నిర్వాసితులయ్యేవారికి నష్టపరిహారం సరిగా ఇవ్వడం లేదనీ, ప్రాజెక్టు వల్ల సాగులోకి వచ్చే భూమికన్నా ముంపునకు గురయ్యేది ఎక్కువనీ.... రోజూ ఏదో ఒక గొడవ....

విహారి వాళ్ళకి ఎవరి పని వారు చేసుకుంటూ పోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు. 'స్టే' కోసం ప్రతిపక్షాలూ వాళ్ళు చేస్తోన్న ప్రయత్నాలు కోర్టుల్లో బెడిసికొడుతున్నాయి. పోలీస్ ప్రొటెక్షన్ వలయంలో పనులు తాపీగా జరిగిపోతూ ఉన్నాయి.

ఇవన్నీ భార్యకి వివరించి "కొన్నాళ్ళు తప్పదు ప్రణతీ" అన్నాడు విహారి.

★ ★ ★

'అమ్మా! నేనెల్లొత్తానమ్మా...' అంది సివంగి, యింటి పనులు ముగించుకుని వెళ్లడానికి సిద్ధమై.

సివంగిది కొండరెడ్డిపల్లె. ఇంటి పనుల కోసం గెస్ట్‌హౌస్‌కి వస్తోంది. బయట పనులన్నీ ఆమె భర్త భీకన్న చూస్తుంటాడు.

సివంగి మాటలు విన్న ప్రణతి వంటగదిలోంచి అరిచింది 'సివంగీ.. వెళ్ళిపో వద్దు... ఒక్క నిమిషం...' అంటూ.

సివంగి ఇంటికి వెళ్ళేటప్పుడు ఆపడం, ఏ



కూరో నారో పెట్టడం ప్రణతి కలవాటే.

కాసేపు నిలబడిన సివంగి... ప్రణతి రాకపోవడంతో మళ్ళీ చెప్పింది 'అమ్మగారూ... రండమ్మా... సీకటడిపోతాంది'.

'ఏంటి సివంగీ అంత తొందరా? ఇప్పుడెళ్ళి ఎవర్నుద్ధరించాలని... నీ కూతురు వంటా గింటా చేసే ఉంచుతుందిగా...' క్యారియర్ బాక్స్ ఒకటి సివంగి చేతిలో పెడుతూ, నవ్వుతూ అంది ప్రణతి.

'అదికాదమ్మా.. సీకటడిపోతే రక్తపిశాచాలు తిరుగుతాయమ్మా ఈ అడవిలో. అయిగానీ పట్టుకుంటే రోజూ మన రత్తం పీల్చేత్తాయి. సచ్చిపోతాం...' భయం భయంగా అంది సివంగి.

ప్రణతి మొహంలో నవ్వు మాయమైంది. ఒళ్ళు ఒక్కసారిగా జలదరించింది.

దెయ్యాల రక్తం పీల్చి చంపేసిన మనుషుల గురించీ, జంతువుల గురించీ, మనుషుల్ని పట్టి పీడించే దెయ్యాల గురించీ చాలా విందామె.

'రక్త పిశాచాలా' అంది గొంతు తడారిపోతుండగా.

'అవునమ్మగారూ... మడిసి మడిసిలాగే ఉంటాడా... ఎక్కడో అక్కడ కోరలు దింపి రోజుకింతని రత్తం తాగేత్తాయి... రత్తం పోయి పోయి మడిసి సచ్చిపోతాడు...' అంది సివంగి. అనుకోకుండా వచ్చిన దెయ్యాల ప్రసక్తి ఆమెని భయపెట్టినట్టుంది 'వత్తానమ్మా... పూరాగా సీకటడిపోకండానే గూడెం ఎళ్ళిపోవాలి' అంటూ పరుగెత్తుకుపోయింది.

ఒంటరిగా నిలబడలేక పడగ్గదిలో ఉన్న విహారి దగ్గరికి పరిగెత్తింది ప్రణతి.

★ ★ ★

'కెవ్వ్... కె... వ్వ' మంటూ పెద్ద కేక. ఆ వెనకే మళ్ళీ మళ్ళీ అవే కేకలు... భయవిహ్వలంగా... చూడకూడనిదేదో చూస్తున్నట్టు, ఆ చూసినదాన్ని చూసి భరించలేకపోతున్నట్టు...

ఉలిక్కిపడి లేచిన విహారి, ఒక్కదుటున మంచం మీద నుంచి దూకి కేకలు విన వస్తున్నవైపు పరిగెత్తాడు.

వాష్‌బేసిన్ ముందు నిలబడి, అద్దంలోకి చూస్తూ అరుస్తోంది ప్రణతి.

ఆమె భుజాల మీద చేతులేసి దగ్గరకి అదుముకుంటూ 'ఏమైంది ప్రణతీ.. ఏమైంది? ' ఆతృతగా అడిగాడు విహారి.

'ఇది... ఇది...' అంటూ మెడ చూపించింది ప్రణతి... పాము కాటేసినప్పుడు ఏర్పడే గాయాల్లా, ఎర్రగా మెరుస్తున్నాయి,

రెండు గోటి ముద్రల్లాంటి గుంటలు...

ఒక్కసారిగా ఊపిరి బలంగా వదిలి నిట్టూర్చాడు విహారి. 'ఏంటి ప్రణతీ ఇది... ఏ గోరో గుచ్చుకుని ఉంటుంది. ఆ మాత్రం దానికే అంత భయమా...' అన్నాడు.

'గోరు కాదండీ... కోరలు... రక్తపిశాచి కోరలు...' భయంభయంగా అంది ప్రణతి.

'ఏంటి ప్రణతీ... నువ్వు కూడా... ఆ సివంగేదో చెప్పిందని... వెళ్ళు... వెళ్ళి స్నానం చేసిరా... పిచ్చి పిచ్చి ఆలోచనలు పెట్టుకోక...' అంటూ బలవంతంగా బాత్ రూమ్‌లోకి నెట్టాడు విహారి.

...స్నానం చేసొచ్చి మరోసారి అద్దంలో చూసుకుంది ప్రణతి. మెడమీద ఆ గుర్తులు లేవు.

★ ★ ★

ఈ గొడవంతా సివంగికి చెప్పలేదు ప్రణతి. చిన్నతనంగా అనిపించి కొంత. ఆమె భయపడి పనిలోకి రావడం మానేస్తే తను మరీ ఒంటరిది అయిపోతుందని కొంత...

ఆ రోజంతా సివంగి వెంట వెంటే ఉంటూ గడిపింది ప్రణతి పగలంతా. విహారి వచ్చాక అతడి మెడని కరుచుకుని పడుకుండిపోయింది, ఆంజనేయ దండకం మనసులోనే చదువుకుంటూ.

ఎప్పుడు నిద్ర పట్టిందో తెలియదు. మెలకువొచ్చాక అద్దంలో చూసుకుంటే... మెడమీద మళ్ళీ అవే గుర్తులు...

★ ★ ★

వరుసగా మూడో రోజూ, నాలుగో రోజూ.. ప్రతిరోజూ ఉదయం అవే గుర్తులు ఆమె మెడమీద.

చిక్కి సగమైపోయింది ప్రణతి. పాండు రోగిలా తెల్లగా పాలిపోయింది. గోళ్ళు, కంటి రెప్పకింది చర్మమూ రక్తం లేనట్టు తెలతెల్లగా అయిపోయాయి.

అవన్నీ చూసి విహారి కూడా భయపడ్డాడు.

'ఈ సింప్టమ్స్ అన్నీ చూస్తుంటే నీ ఒంట్లో బొత్తిగా రక్తం లేనట్టుగా ఉంది ప్రణతీ. అంటే... కొంపతీసి... నిజంగానే నిన్ను రక్తపిశాచి ఆవహించి రక్తం పీల్చేస్తోందా? ...' భయం భయంగా ఆమెని చూస్తూ అన్నాడు విహారి.

ఆ దెబ్బకి ఆమెలో ఏ మూలో ఉన్న ధైర్యం కూడా జారిపోయింది. భయంతో బల్లిలా అతడ్ని కరుచుకుపోయింది. విహారిని బయటకి వెళ్ళొద్దని ఏడ్చింది.

'ఇవాళ ఒక్కరోజు ఓపిక పట్టు ప్రణతీ. ఇక ఇక్కడ ఉండొద్దు మనం. అర్జంటుగా వెళ్ళిపోదాం..ఇవన్నీ వదుల్చుకుని వచ్చేస్తాను. సివంగి ఎలాగూ వస్తుంది కదా. నేనెళ్ళి త్వరగా వచ్చేస్తాను' అంటూ ఆమెని వదిలి బయటికి వెళ్ళాడు విహారి.

'శ్రీఆంజనేయం, ప్రసన్నాంజనేయం' అనుకుంటూ బిక్కుబిక్కుమంటూ ఉంది ప్రణతి. సమయం భారంగా గడుస్తోంది.

సివంగి రాలేదు.

ఇంకా వస్తుంది... ఇంకా వస్తుంది అనుకుంటూ ఎంతలా ఎదురుచూసినా... సివంగి రాలేదు.

క్షణక్షణానికీ భయం అధికమైంది ప్రణతిలో. కూర్చున్న చోటునించి కదలడానికి కూడా ఆమెకి ధైర్యం చాలడం లేదు.

మధ్యాహ్నం అయింది. సివంగి రాలేదు. ఇంక రాదని అర్థమౌతోంది. ఆమె మనసు ఆ నిజాన్ని ఒప్పుకోవడానికి

ధైర్యం చేయడం లేదు.

సాయంత్రమైంది. సివంగిని మరచి పోయి విహారి కోసం ఎదురుచూడసాగింది ప్రణతి. వెలుతురు నెమ్మదిగా క్షీణించి చీకట్లు ముసురుకొనేకొద్దీ ఆమె భయం ఎక్కువ కాసాగింది.

తనున్న స్థితి గుర్తుకు రాసాగింది.

విహారి వచ్చే సమయం దాటినా అతను రాలేదు. బాగా చీకటి పడింది...

మనుషుల జాడంటూ లేని అడవిలో... గెస్ట్‌హౌస్‌లో... ఆమె ఒక్కతే...

అర్ధరాత్రికూడా విహారి రాలేదు.

ఆ తర్వాత ఇంక ఆమెకి భయం వేయ లేదు. అనుభూతులకి అతీతంగా మారిపో యిందామె.

★ ★ ★

'గుడ్ మార్నింగ్ మిస్టర్ విహారీ' ఇన్స్పెక్టర్ శంకర్ ప్రసాద్ విష్ చేశాడు.

'గుడ్ మార్నింగ్' ఇంకా బద్ధకంపోని బరువైన గొంతుతో అన్నాడు విహారి.

'రాత్రి మీ బోటు పోవడం వల్ల మీతో ఒక చక్కటి రాత్రిని గడిపే అవకాశం వచ్చింది. అఫ్‌కోర్స్... హేంగోవర్ దంచేస్తోందనుకోండీ'

'రాత్రి తాగిన మందే మంచి మందు. మా గెస్ట్‌హౌస్‌కి వెళ్దాం రండి'

'నో. థాంక్స్. ఇప్పుడొద్దు. మరోసారి...'

' రండి. కలిసివెళ్లి కలిసి వచ్చేద్దాం. ఈ ఉదయం కాఫీని కూడా ఇద్దరం షేర్ చేసుకుందాం' మొహమాటపెట్టాడు విహారి.

'ఊ...' అంటూ సాగతీస్తూ ఆలోచించి 'సరే' అన్నాడు ప్రసాద్.

విహారి హాయిగా నిట్టూర్చాడు.

నాటు పడవలో వాళ్లు కొండపాదం చేరేసరికి, సివంగీ, భీకన్నా కనిపించారు.

నలుగురూ గెస్ట్‌హౌస్ చేరేసరికి...

... పిచ్చి చూపులు చూస్తూ, పిచ్చిదానిలా ప్రవర్తిస్తూ ప్రణతి కనిపించింది.

★ ★ ★

పదిహేను రోజుల తర్వాత-

ఎస్సై శంకర్ ప్రసాద్ స్టేషన్లో ఒక మిస్సింగ్ కేసు నమోదయింది. మిస్సయింది ప్రణతి. విహారి భార్య.

గత పదిహేను రోజులుగా పిచ్చిపిచ్చిగా ప్రవర్తిస్తోన్న తన భార్య ప్రణతి, ఆ రోజు ఉదయం తను నిద్ర లేచేసరికి గెస్ట్‌హౌస్‌లో కనిపించలేదని, ఎంత వెదికినా కనిపించలేదనీ, విహారి రాసియిచ్చిన ఆ రిపోర్టు సారాంశం.

కేసు నమోదు చేసుకుని, విహారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశాడు. ఎస్సై శంకర్ ప్రసాద్. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఆమెని వెతికిస్తాననీ, తొందరలోనే అప్పగిస్తాననీ హామీ ఇచ్చాడు.

అయితే ఆ మాటల మీద పెద్దగా ఆసక్తి చూపించలేదు విహారి.

ఇక ఆమె కనిపించదని అతడికి ఖచ్చితంగా తెలుసు.

పాడ్యమి నాటి చందమామలా పెంచిన తన చిటికెనవేలు గోరునీ తనకెంతో ఉపయోగపడిన ఎర్ర తిలకం సీసానీ, భార్య ప్రణతితో సహా అఖండ గోదావరిలో కలిపేసిన నిజం అతనికొక్కడికే తెలుసు.

ప్రణతిని వదిలించుకోవాలన్న తన దీర్ఘకాలపు కోరికకి ఒక ఆచరణ రూపమిచ్చే అయిడియా యిచ్చిన సివంగికి మనసులో పదే పదే కృతజ్ఞతలు చెప్పుకున్నాడు. రక్త పిశాచమనే మాటకీ, ఆ గెస్ట్‌హౌస్‌కీ చాలా రుణపడి ఉంటాను అనుకున్నాడు.

పోలీసుల్నుంచి కూడా ఏ ప్రమాదమూ లేకుండా పకడ్బందీగా వేసిన ప్లాన్‌కి తనని తనే అభినందించుకున్నాడు.

అయితే... భార్య తరపునించి కలసిరాబోయే భారీ ఆస్తీ, ఇన్సూరెన్స్ పాలసీ సొమ్ము... యివన్నీ అతడి మీద పోలీసులకి అనుమానం కలిగించవా అంటే... ఖచ్చితంగా కాదని చెప్పలేం... Ⓥ

ఒరియా కథ

-అఖిల మోహన్ పట్నాయక్



చివరి వెతుకులాట

అనువాదం : అచ్యుతుని రాజ్యశ్రీ

మధుపూర్ రైల్వే స్టేషన్‌మాస్టర్‌గా శివశేఖర్ వచ్చి రెండు నెలలైంది. అతి చిన్నపల్లె అయిన ఆ ఊళ్లో రైలుబండి వస్తుంటే, నగ్నంగానే పిల్లలంతా ఇంట్లోంచి బయటకొచ్చి చూస్తారు. ఏ రెండుమూడు సార్లో, కేవలం ఏ రెండు నిమిషాల కోసమో ఒక అప్ అండ్ డౌన్ పాసింజర్ ఆగుతుందక్కడ! ఓ నల్గురైదుగురు ప్రయాణీకులు మాత్రమే ఎక్కి దిగుతారు. మిగతా టైంలో స్టేషనంతా చీమ చిటుక్కుమంటే విన్పించేంత నిశ్శబ్దంగా ఉంటుంది.

అర్ధరాత్రి ఒకటీ రెండూ గంటల మధ్య

స్టేషన్‌ని దడదడలాడిస్తూ అప్ అండ్ డౌన్ మెయిల్ రైళ్లు ఎదురెదురు దిశలో పరుగులు తీసేప్పుడు మాత్రం శేఖర్, పాట్స్‌మాన్ చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తుంటారు. అదీ ఎంతెంతో అప్రమత్తతతో! ఎన్నో పెద్ద స్టేషన్లకి శేఖర్‌ని వేస్తామన్నారు అధికార్లు. తన జీవితంలో భార్యని పోగొట్టుకున్నాడతను. ఎంతో సర్వీస్ పూర్తిచేసిన తను .. చిన్న స్టేషన్లకే ప్రాధాన్యతనిచ్చి, ఒంటరి జీవితాన్ని గడుపుతున్నాడు. పిల్లా జెల్లా లేరు. క్యాన్సర్‌తో భార్య పది సంవత్సరాల క్రితమే చనిపోవటంతో, ఆ స్టేషన్ మాస్టర్ రూంలోనే ఉంటున్నాడు. పాట్స్‌మాన్ చేసిన వంట తింటూ, అక్కడున్న పెట్టెనే పడకగా మార్చుకుని ఉంటూ కాలక్షేపం చేస్తున్నాడు. పెద్ద స్టేషన్‌లో పనిచేయాలనే, డబ్బు సంపాదించాలనే తాపత్రయం అతనికి లేవు మరి! ఉదయం, సాయంత్రం స్టేషన్లో హాకర్ నించి ఓ కప్పు టీ తీసుకుంటాడు. ప్రయాణీకుల్తో బాతాఖానీ వేస్తూ, మధ్యాహ్నం పేపరు చదువుతూ, కాలక్షేపం చేస్తుంటాడు.

అది డిసెంబరు మాసం. రాత్రి కాగానే పెట్టెపై నడుం వాల్చాడు. తలుపు తట్టిన చప్పుడవటంతో లేచాడు. బైట చలిగాలికి శరీరం వణుకుతుండగా.. కన్పించిందో యువతి. తలుపుతీసిన శేఖర్‌ని తోసుకుంటూ..లోపలికి చొరబడింది. అప్పుడు పన్నెండూ ముప్పావైంది. ఆ అర్ధరాత్రిపూట ఆమె హాయిగా కుర్చీలో బైఠాయించింది. అతను 'పాపం చలికి లోపలికి వచ్చింది కాబోలు' అనుకుని ఆలోచిస్తుండగానే, ఆ ఇరవై రెండు- ఇరవైమూడు సంవత్సరాల యువతే పలకరించింది. "మెయిల్ ట్రైన్ ఎప్పుడొస్తుంది? "

"ఒకటింబావుకి. అయినా మెయిల్ ఇక్కడ ఆగదు" అన్నాడు.

చదువుకున్న మంచి కుటుంబంలోంచి వచ్చిన యువతిలా ఉందామె. మరి ఇంత బుల్లి స్టేషన్‌కి ఎందుకు ఎలా వచ్చిందో శేఖర్‌కి అంతుబట్టడంలేదు. 'పిచ్చిదా? '

"సార్! నాకో సాయం చేయాలి"

"ఏంటమ్మా? "

"నేను ఆ వచ్చే మెయిల్ ట్రెయిన్‌లో వెళ్లి తీరాలి"

"అదెలా? "

"మీరు తల్చుకుంటే, దాన్ని ఈ చిన్న స్టేషన్లో కూడా ఆపగలరు. సిగ్నల్‌కి రెడ్ లైట్ వచ్చేలా చేయటం మీ చేతిలో పని"

"లేదమ్మా! డ్యూటీకి, కర్తవ్యానికి ఎదురీదను.. నా ఉద్యోగం ఊడ్తుంది" ఖరాఖండీగా చెప్పాడతను.

కాసేపు మౌనంగా ఉన్నా, అటుతర్వాత దీనంగా బతిమాలసాగింది.. "సార్! ఈ మెయిల్‌లోనే ఓ మనిషి.. నా ఫ్రెండ్ కన్నబిడ్డను.. పసిబిడ్డను.. ఎక్కడో అజ్ఞాత స్థలంలో విడిచిపెట్టాలని వెళ్తున్నాడు. పెళ్లికాని నా ఫ్రెండ్‌కి అతను బాయ్‌ఫ్రెండ్. ఆ శిశువుని ఒక మిషనరీకి అప్పగిస్తూ, ఆ మెయిల్‌లో కూచోపెట్టినట్లు.. అంటే బిలాస్‌పూర్‌లోనే.. నాకు తెల్సింది. నా ఫ్రెండ్‌కి తెలిసేటప్పటికి ఆలస్యమైంది. అందుకే ఈ మెయిల్ ఎక్కి ఆ పాపని దక్కించుకోవాలనుకుంటున్నా"

ఎక్కడి బిలాస్‌పూర్? ఎక్కడి మధుపూర్? ఆమె చెప్పిందంతా ఏదో చిక్కుముడిలా అన్పించసాగింది శేఖర్‌కి. ఇంతలో ట్రైను వస్తున్న సూచనగా గంట మోగింది. ఆ వెంటనే రైలు వస్తున్నట్లు ధన్‌ధన్ చప్పుడు! ఆమెకేమీ జవాబీయకుండా బైటికి పరుగెత్తాడతను. సిగ్నల్ దగ్గర ఎప్పటిలా ఆకుపచ్చ లైటు వెలుగుతోంది. పాట్స్‌మాన్ దీపం పట్టుకుని తన నిర్ణీత స్థానంలో నిల్చొని ఉన్నాడు.

హఠాత్తుగా శేఖర్ ఉలిక్కిపడ్డాడు. తనకి సమీపంలోనే ఉందా యువతి! పెద్దగా నవ్వుతోంది."చూడండీ! మీ మొండిపట్టు విడవకపోతే, నా పని నేను చేసి చూపిస్తా. పది సంవత్సరాల క్రితం నేనెంత నెత్తీ నోరు బాదుకుని ఏడ్చానో, పట్టాలపై ఎలా పరుగులుదీశానో.. 'బండి ఆపండీ!' అని గొంతు చిల్లులుపడేలా ఎలా అరిచానో, ఆ మెయిల్ ట్రెయిన్ నా శరీరంపైనుంచి ఎలా పోయిందో తెలుసా? కానీ ఈ రోజు.." అంటూ ఆమె తన కుడిచేతి బొటనవేలిని పైకెత్తింది.

శేఖర్ ఆమెనే చూడసాగాడు. ఆ మొహమంతా రక్తసిక్తం! శూన్య ఆకాశంలోకి ఆమె రెండు చేతులూ..వెళ్లాయి. అవి నలభై అడుగుల ఎత్తున్న సిగ్నల్ పోస్టు పైకి చేరటం, సిగ్నల్ పైకి లేవటం, ఎర్ర లైటు వెలగడం జరిగిపోయాయ్!

అతనింకా దిగ్భ్రమతోనే చూస్తున్నాడు. ఆర్తనాదం చేస్తూ.. తొడలు విరిగిన రాక్షసిలా నుంచుంది మెయిల్ ట్రెయిన్! పొగలు విడుస్తూ కేవలం ఒకే ఒక్క అర నిముషం! వెంటనే ఆకుపచ్చ రంగు వెలగడం, ఊపిరి తీసుకుంటూ రైలు కదలటం! గార్డుపెట్టె కనుమరుగయ్యేదాకా.. అలా నిశ్చేష్టుడై ఉండిపోయాడు శేఖర్!

పాట్స్‌మాన్ పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు శేఖర్. "సార్! నా వల్ల పొరపాటైంది. ఈ రోజు డిసెంబరు 15. గత తొమ్మిదీ పది సంవత్సరాలుగా.. ఈ రోజు జరిగే సంఘటన గురించి.. ముందే మిమ్మల్ని హెచ్చరించటం మర్చిపోయాను నేను. ఆ స్త్రీ అలా వచ్చి హఠం చేయటం, సిగ్నల్ దానంతటదే పైకి లేవటం, మెయిల్ ఆగటం ఎప్పుడూ జరిగేదే!"

శేఖర్ ఆలోచిస్తున్నాడు. ఆ శరీరం తాలూకూ ఆత్మ తన సంతానంపై ప్రేమతో.. ప్రతి రైలుపెట్టెనీ వెతుకుతూ, వేరే గ్రహం నుంచి కూడా వస్తున్నట్లుంది అతనికి.

"సాబ్! ఆ రోజు ట్రెయిన్ వచ్చేప్పుడు పట్టాలపై ఆమె అరుస్తూ పరుగులు దీయటాన్ని మేమంతా చూశాం" పాట్స్‌మాన్ మాటలు వింటూ స్తబ్దుగా ఉండిపోయాడు స్టేషన్ మాస్టర్ శివశేఖర్!

హిందీ కథ



-సుషమా మునీంద్ర

బ్రేకింగ్ న్యూస్

అనువాదం : ఆర్.శాంతసుందరి


ఈ వారమంతా సుప్రీమ్ టీవీ ఛానెల్లోని వార్తల్లో.. మూడేళ్ల ఈ పిల్లవాడే లీడ్‌స్టోరీగా ఉండటం మీరందరూ చూస్తూనే ఉన్నారు. పసుపురంగు చొక్కా, ముద్దొచ్చే బూరెబుగ్గలూ, మొహంమీద పడే ఉంగరాల జుట్టూ.. చాలా అమాయకంగా కనిపిస్తున్నాడు కదూ! చూడగానే వాడిమీద జాలితో నిండిన మీ హృదయం.. ఎలాగైనా వాడు బతికి బైట పడాలని కోరుకోవటం లేదూ?

ఆ పిల్లవాడి పేరు ధ్రువ్. జరిగిందేమిటంటే, ఒకరోజు సాయంత్రం ఉన్నట్టుండి కనబడకుండాపోయాడు. ఇంటిబైట కూర్చుని కొందరు పిల్లలు గాలిపటాలు ఎగరేస్తూంటే చూస్తున్నవాడు.. తల్లి పిలవటానికి వచ్చేసరికి అక్కడ లేడు. ఆమె మిగతా పిల్లల్ని అడిగితే, వాళ్ళు 'మేం చూడలేద'ని అన్నారు. ధ్రువ్ తల్లి ఆ చుట్టుపక్కల వీధులూ, సందుగొందులూ అన్నీ వెతికింది. కానీ వాడెక్కడా కనబడలేదు. ఇంటికొచ్చి నిస్త్రాణగా కూలబడింది.

ధ్రువ్ వాళ్లనాన్న కూలిపనికెళ్ళి ఇంటికొచ్చేసరికి బాగా చీకటిపడింది. ఆ చీకట్లో తన పెళ్లాం.. కొంతమంది ఆడవాళ్ళ మధ్య కూర్చుని శోకాలు పెడుతూ కనిపించింది. ధ్రువ్ నాన్నకి రోజూ కూలిపని దొరకదు. ఆ రోజు పని దొరికింది. అందుకని బంగాళదుంపలూ, టమాటాలు కొని తెచ్చాడు. ధ్రువ్ తప్పిపోయాడన్న వార్త వినగానే ఆ కూరల సంచీ జారవిడిచి, పెళ్లాం వీపుమీద కాలితో బలంగా తన్నాడు. ఆ తరువాత తిట్లు లంకించుకున్నాడు. "ఏమే, ఎక్కడికి పోయావే? ఉన్నది ఒక్క పిల్లాడు, వాడిని సరిగా చూసుకోలేవూ? వాడు దొరక్కపోతే నిన్ను నరికి పోగులుపెడతా జాగ్రత్త!" అన్నాడు.

మురికివాడలోని ఆ ఇరుకు సందులో, పడిపోతున్న ఆ పూరిగుడిసెలో.. ధ్రువ్ తల్లి ఉండుండి మూర్ఛపోతోంది. రాత్రంతా అలాగే గడిచింది. శోకం మూర్తీభవించినట్టున్న ధ్రువ్ తండ్రి వాడికోసం వెతకని చోటంటూ లేదు.

మర్నాడు పొద్దున్నే ఇరుగుపొరుగు వాళ్ల సలహా విని పోలీస్‌స్టేషన్‌లో రిపోర్టు రాయించటానికి వెళ్లాడు. ఏదో నేరాన్ని గురించి వాకబు చెయ్యటానికి అదే సమయంలో పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సుప్రీమ్ ఛానెల్ రిపోర్టర్ ప్రసాద్.. ధ్రువ్ సంగతి విన్నాడు. అంత మంచి సమాచారం పొద్దున్నే దొరికినందుకు అతను మురిసిపోయాడు! ఎవరో పెద్ద పెట్టుబడిదారు కొడుకుని కాదు, ఒక కూలీవాడి కొడుకుని ఎవరో ఎత్తుకుపోయారు. దీనివెనుక ఏదైనా సంచలనాత్మకమైన కారణం ఉందని బైటపడితే న్యూస్ బులెటిన్‌ని జనం ఆసక్తిగా వింటారు. ఈ వార్తని అందరికన్నా ముందు జనానికి అందించిన పేరు కూడా ఛానెల్‌కి దక్కు



తుంది. అంతేకాదు.. ఈ ఛానెల్ పేరు ప్రతిష్ఠలున్న వాళ్ల గురించే కాక, బడుగువర్గాలకి జరిగే అన్యాయాలని కూడా పట్టించుకుంటుందన్న పేరూ వస్తుంది. ఛానెల్ సగటు మనిషి పక్షాన ఉందనీ, మానవత్వానికే పెద్దపీట వేస్తుందనీ జనానికి నమ్మకం కలుగుతుంది.. ఇలా సాగాయి ప్రసాద్ ఆలోచనలు.

ఆ పడిపోతున్న పూరిగుడిసె హఠాత్తుగా ప్రధాన వార్తల్లో చోటు చేసుకుంది. కెమెరా ఫ్లాష్‌లు మెరుపుల్ని మెరిపించాయి. పిచ్చిదానిలా ఉన్న ధ్రువ్ తల్లిని ఎన్నో కోణాలనించి కెమెరాలో బంధించారు. ఆమె ఏమీ చెప్పే స్థితిలో లేనప్పటికీ ఏవేవో ప్రశ్నలు వేశారు. ధ్రువ్ తండ్రి మాత్రం తనకు తోచినదేదో చెప్పాడు. ఆ తరవాత కెమెరాలన్నీ పోలీస్ స్టేషన్‌కి బైలుదేరాయి.

రాత్రి సరిగ్గా తొమ్మిది గంటలకి.. మెరిసిపోయే చీర కట్టుకుని, వార్తలు చదివే యువతి వార్తల ముఖ్యాంశాలని ఖంగుమనే గొంతుతో చెప్పటం ప్రారంభించింది.

"నగరంలో నీలి ఫిల్ముల సీడీలు, దొంగతనాలూ దోపిడీలూ, అపహరణలు, స్త్రీలపై అత్యాచారాలు, హింస పెరిగిపోవటంతో జనం భయాందోళనకు గురవుతున్నారు. అభద్రతా భావం పెరిగిపోతోంది. కూలి పని చేసి పొట్టపోసుకునే సుందర్ కొడుకు ధ్రువ్ కనిపించకపోవటం.. మన న్యాయ వ్యవస్థకే ఒక సవాలై కూర్చుంది.."

ఇంతలో కెమెరా మురికివాడలోని ధ్రువ్ ఇంటిమీదికి ఫోకస్ అయింది. వాడి ఫొటో కూడా ఇన్‌సెట్‌లో కనిపిస్తూ ఉంది..

"పిల్లవాడు ఎక్కడ తప్పిపోయాడు? "

"ఇంటిముందే కూర్చునున్నాడు సార్!"

..సుందర్ మొహంలో భయం.

"ఎవరి మీదన్నా అనుమానం ఉందా మీకు? "

"అనుమానమా? మాకెవరితోనూ గొడవలు లేవు సార్!"

"పోలీసు రిపోర్టిచ్చారా? "

"ఆ.. కానీ పోలీసులెవరూ రాలేదు సార్!"

..స్క్రీన్‌మీద పోలీస్ స్టేషన్ దృశ్యం..

"ఆ.. పిల్లవాడు తప్పిపోయాడని రిపోర్టు నమోదుచేసుకున్నాం. అప్పుడే ఏమీ చెప్పలేం..లేదు..ఇది కిడ్నాప్‌లా అని పించటం లేదు.. ఏ పిచ్చి వెధవ ..కూలివాడి పిల్లవాణ్ణి..ఎత్తుకెళ్తాడండీ? ..పిల్లల్ని అమ్ముకోవటమా? అలా నిర్ధారణగా ఎలా చెప్పగలం.. మేం వాకబు చేస్తున్నాం కదండీ.." అన్నాడు కానిస్టేబుల్.

ఛానెల్ ఆఫీసులో చెప్పలేనంత ఉత్సాహం నిండింది...'మన న్యూస్‌కి మంచి రెస్పాన్స్ వస్తోంది. ధ్రువ్ గురించి జనం ఎంతో ఆందోళన పడుతూ, మిగతా సీరియల్సన్నీ చూడటం మానేశారు! ఈ ఈవెంట్‌కి మంచి కవరేజ్ ఇవ్వండి. ధ్రువ్ విషయం అటో ఇటో తేలేదాకా చూపిస్తూనే ఉండండి. న్యూస్ ఐటమ్ అమ్ముడుపోయేట్టు ఉండాలి. టీఆర్‌పీ పెరగాలి. మనకి కావల్సింది అదే. ప్రేక్షకుల సంఖ్య పెరిగితే ప్రకటనల సంఖ్య కూడా పెరుగుతుంది..' ఇలా ఎప్పటికప్పుడు ఛానెల్ హెడ్.. రిపోర్టర్లకి సలహాలిస్తున్నాడు.

మర్నాడు సుందర్ ఇల్లున్న సందులో టీవీ రిపోర్టర్లు ప్రత్యక్షమయ్యారు. న్యూస్ లిస్ట్‌లో ధ్రువ్ ఇంకా టాప్‌లోనే ఉన్నాడు. నలభై ఎనిమిది గంటలు గడిచాయి, కానీ ధ్రువ్ గురించి ఏ సమాచారమూ తెలీలేదు. పోలీసులకి క్లూలేవీ దొరకలేదు.

పోలీసులకి ఏం చెయ్యాలో తోచక, సుందర్ ఇంటి పక్కనే ఉన్న నానూ అనే కుర్రాడిని అరెస్టు చేశారు. బాగా చావబాది వదిలిపెట్టారు.

స్క్రీన్‌మీద మళ్ళీ ధ్రువ్ ఫొటో, తరువాత వాడి తండ్రి సుందర్ మొహం కనిపించాయి. సుందర్ విపరీతంగా బెంగపడి గాభరా పడుతున్నాడని ఆ మాటలవల్లా, ముఖకవళికల వల్లా అర్థమవుతోంది.

"పిల్లగాడు ఏమైనాడో ఏమో! మురికివాడలో ఉండి, కూలిపని చేసుకునే మా గోడు ఎవరు వింటారు సార్? మాకు ఎవరిమీదా సందేహం లేదని చెప్పినాం. అయినా నానూని పట్టుకుపోయి కొట్టారు. నానూ తల్లికి నా మీద కోపం. నేనే వాడి పేరు చెప్పినానని ఆమెకి అనుమానం.." అంటున్నాడు సుందర్.

కెమెరా..నానూ మీదికీ వాళ్ళమ్మ మీదికీ తిరిగింది. నానూ ఒంటినిండా దెబ్బలు! వాడి తల్లి ఘొల్లున ఏడుస్తోంది. ఆ ఏడుపుని చాలాసేపు చూపించారు టీవీ వాళ్ళు.

మళ్ళీ టీవీ కెమెరా.. పోలీస్ స్టేషన్‌లో సూపరింటెండెంట్ మీద ఫోకస్ అయింది.

"మా టీం.. అనుమానం ఉన్న వాళ్లందర్నీ స్టేషన్‌కి పిలిపించి ఎంక్వైరీ చేస్తోంది. కొన్ని ముఖ్యమైన క్లూలు దొరికాయని అనుకుంటున్నాం.." అంటున్నాడాయన.

మర్నాడు ధ్రువ్ విషయంలో ఎటువంటి కొత్త సమాచారమూ దొరక్క పోవటంతో, ఛానెల్ హెడ్డు.. 'మిస్ సిటీ బ్యూటీ పోటీల'ని కవర్ చెయ్యటం కోసం విలేకరులని టౌన్‌హాల్‌కి పంపుదామని అనుకుంటున్నాడు. అంతలో ప్రసాద్ సెల్‌ఫోన్ మోగింది. ఫోన్‌లో సమాచారం విని అతను ఎగిరి గంతేశాడు. "ఉండండి.. ఉండండి.. ధ్రువ్‌ని అపహరించినవాళ్ళ దగ్గర్నించి.. 'డబ్బు ఇచ్చి పిల్లవాణ్ణి విడిపించుకోమ'ని ఉత్తరం వచ్చిందిట. ఆ మురికివాడలో ఒక వ్యక్తికి నా సెల్ నంబరిచ్చి, కొత్త సమాచారం ఏమైనా ఉంటే ఫోన్ చెయ్యమని చెప్పాను. అతనే ఫోన్ చేశాడు.." అన్నాడు ప్రసాద్. దాంతో ఆఫీసులో మళ్ళీ హడావిడి మొదలైంది.

"..అరె ప్రసాదూ! ఏమిటయ్యా నువ్వనేది? చిల్లిగవ్వ లేని వాడికి.. డబ్బివ్వమని బెదిరిస్తూ.. ఉత్తరం రాసే బుద్ధిలేని వాళ్లెవరుంటారు చెప్పు? వెళ్ళు, వెళ్లి కాస్త మంచి సమాచారమేదైనా ఉందేమో చూడు బాబూ!" అన్నాడు ఛానెల్ హెడ్డు.

ఉత్తరంలో.. ఎవరికైనా చెపితే పిల్లవాడి ప్రాణాలు దక్కవన్న బెదిరింపు ఉండటం

చేత.. సుందర్ నోరు విప్పటానికి నిరాకరించాడు. కానీ ఇప్పుడు విషయం అతని చెయ్యి దాటిపోయింది. మీడియా బరిలోకి దిగింది. ప్రసాద్ మామూలు శాల్తీ కాదు. విషయాన్ని ఆసాంతం తెలుసుకునిగాని వదలడు. ఎలా చూసినా ఛానెల్‌కే లాభం అనుకున్నాడతను. సురక్షితంగా వెనక్కి వచ్చేస్తే 'మా ఒత్తిడి వల్లే ప్రభుత్వమూ, పోలీసులూ ధ్రువ్ జాడ తెలుసుకోగలిగార'ని అనచ్చు. ఒకవేళ పిల్లవాడికి జరగకూడనిది జరిగితే, ఛానెల్.. ముందే వార్నింగ్ ఇచ్చినా దుండగులని పోలీసులు పట్టుకోలేకపోయారని.. నింద వాళ్లపై మోపచ్చు.

సుందర్‌ని మీడియా వదల్లేదు, "చెప్పు! నీకు వాళ్ల దగ్గర్నించి ఉత్తరం వచ్చిందని మాకు తెలుసు. మేం నీకు సాయం చేస్తాం. అపహరించిన వాళ్లమీద ఒత్తిడి తెస్తాం, పోలీసులమీద కూడా ఒత్తిడి తెస్తాం. ధ్రువ్ దొరుకుతాడు.. నువ్వొక్కడివే ఈ పోరాటం చెయ్యలేవు" అన్నారు. ఏమీ చెప్పకూడదనుకున్న సుందర్.. అంతా చెప్పేశాడు.

టీవీ ఈవెంట్ న్యూస్‌ని తయారుచేశారు. వార్తలు చదివే యువతి ముఖ్యాంశాలు చెపుతూ " పోలీసులు ఇది కిడ్నాప్ కేస్ కాదని అంటున్నా.. ఇది కిడ్నాప్ కేసే అనిపిస్తోంది. పిల్లవాణ్ణి వదిలిపెట్టటానికి పదిహేనువేలు అడుగుతూ ధ్రువ్ వాళ్ల నాన్నకి ఒక ఉత్తరం అందింది" అంది.

మళ్లీ కెమెరా సుందర్ ఇంటి దగ్గర ఫోకస్ అయింది -

"ఉత్తరంలో ఏమని రాసి ఉంది? " అంది వాయిస్ ఓవర్ గొంతు.

"పిల్లగాడు కావాలంటే పదిహేనువేలు ఇవ్వాలట.. పోలీసులకి చెప్పొద్దని బెదిరిస్తున్నారు."

"డబ్బులెక్కణ్ణించి తేగలవు? "

"అప్పో సోప్పో చెయ్యాలి, రక్తం అమ్ముతాను లేదా కన్నం వేస్తాను"

"ఉత్తరం ఎవరిచ్చారు? "

"తెలీదు, ఇంట్లో ఎప్పుడో పడేసి పోయినట్టుంది!"

కెమెరా.. పోలీస్ ఇన్‌స్పెక్టర్‌మీదికి మళ్లింది-

"సార్! మీరేమంటారు? "


"డబ్బివ్వద్దంటాను. డబ్బు ఎక్కడ ఎప్పుడు ఇవ్వాలో ఏమీ రాయలేదు. నేరస్థుడు అనుభవం లేనివాడనిపిస్తోంది. మేం నేరస్థుడికి ఇంకా దగ్గరగా వచ్చామనే అనుకుంటున్నాం. చూడండి..ఇందులో మీరిక జోక్యం కలిగించుకోవద్దు..మా పని మమ్మల్ని చెయ్యనివ్వండి" అన్నాడాయన.

కానీ ఒక్కోక్షణం చాలా విలువైందని మీకు కూడా తెలిసిపోతోంది. టీవీవాళ్లు కదల్లేదు.. ధ్రువ్ అపహరణ గురించి చెప్పటం మానలేదు. చివరికి ఒకరోజు వార్తల్లో.. పోలీసుల బృందం ఏమీ సాధించలేక పోయిందనీ, ధ్రువ్ హత్యకు గురయ్యాడనీ సమాచారం అందింది!

పోలీసులు ఉపదేశాలు ఇస్తూ, అపహరణ కర్తల్ని పట్టుకుంటామన్న భరోసా ఇస్తూ కాలాన్ని వెళ్లబుచ్చారు. కానీ సుందర్‌కి ఉన్న ఒకే ఒక సంతానం.. అతని ఇంటి దీపం..ఇంక లేడు! ఊరికి పదమూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక సున్నం కుప్పలో ధ్రువ్ శవం దొరికింది. కొందరు గ్రామస్థులకి.. ఆ కుప్పలోంచి బైటికి పొడుచుకొచ్చిన ధ్రువ్ కాళ్లు కనిపించేసరికి.. పోలీసులకి సమాచారాన్ని అందించారు.

జనం మనసుల్లో వెయ్యి ప్రశ్నలు.కానీ ధ్రువ్ తలిదండ్రుల పరిస్థితి దయనీయంగా ఉంది. 'నేను డబ్బు పోగుచేస్తున్నాను కదా.. మరి వాళ్లు నా పిల్లగాణ్ణి ఎందుకు చంపినట్టు' అంటున్నాడు సుందర్.

పోలీసు సూపరింటెండెంటు "ఇది చాలా



విచారకరమైన సంఘటన. మనమందరం తలదించుకోవాల్సినంత అన్యాయం జరిగిపోయింది. కానీ నేరస్థుల్ని త్వరలోనే పట్టుకుంటామని హామీ ఇస్తున్నాను..” అన్నాడు.

కొన్నాళ్లు గడిచాక, టీవీలో మళ్లీ ధ్రువ్ ఫొటో ప్రత్యక్షమైంది. పోలీసులు నేరస్థులని తాము ఎంత కష్టపడి పట్టుకున్నారో చెప్పేందుకు.. మీడియావాళ్లని పిలిచారు.

పోలీసులు వాళ్ళని పట్టుకున్నమాట నిజమే. కానీ.. పోయిన ధ్రువ్ ప్రాణాల మాటేమిటి? పిల్లాడిని ఎత్తుకెళ్లిన వాళ్లు ముగ్గురు పేద యువకులు, నిరుద్యోగులు. ఇటువంటి నేరాలు జరగటానికి బాధ్యులు ఎవరని అనాలో తెలీదు. ధనికులకీ పేదవారికీ మధ్య పెరుగుతున్న అగాధమా? లక్షలు ఆశ చూపే టీవీ రియాలిటీ షోలా? హింసని చూపే టీవీ ఛానళ్లా? తల్లిదండ్రులా? సమాజమా? దారి తప్పిన యువత ఎప్పుడు నేరస్థులుగా మారతారో వాళ్లకే తెలీని పరిస్థితి. అప్రమత్తంగా లేని ప్రభుత్వమూ, పెరిగే జనాభా, తరిగే ఉద్యోగావకాశాలూ.. ఇవన్నీ కారణాలేనా?

టీవీ కెమెరా.. పోలీస్ ఇన్‌స్పెక్టర్ మీదికి తిరిగింది-

“పిల్లవాడు దొరికిన చోటనే మేము నేరస్థులకోసం వెతికాం. పిల్లవాణ్ణి చంపినవాడు ఆ చుట్టుపక్కలే ఎక్కడో దాక్కుని ఉన్నాడన్న సమాచారం మాకు లభించింది. మా టీమ్ వెతుక్కుంటూ వెళ్లేసరికి, ..ఇదుగో.. ఈ మోహన్ అనే యువకుడు ఒక ఇంట్లో దొరికిపోయాడు. బిక్కచచ్చి, భయంతో బిగుసుకుపోయి, నేరాన్ని సులభంగానే ఒప్పుకున్నాడు.. ఇతని పక్కన ఉన్న ఈ ఇద్దరు కుర్రాళ్ల ఆచూకీ కూడా ఇతనే చెప్పాడు”

ఆ ముగ్గురు కుర్రాళ్లూ ఏడాది క్రితం పనికోసం వెతుక్కుంటూ ఈ ఊరికి వచ్చారు. ఎంత ప్రయత్నించినా ఏ పనీ దొరకలేదు. ఈ లోపల జూదం ఆడే అలవాటు వ్యసనంగా మారింది. గొప్పింటి పిల్లవాణ్ణి అపహరించాలన్న ప్లాన్ అప్పుడే వేసుకోవడం మొదలుపెట్టారు.


తలొంచుకున్న మోహన్ అన్నాడిలా “ఆ మురికివాడలో బొగ్గులమ్మే అతని పిల్లవాణ్ణి ఎత్తుకుపోదామని అనుకున్నాం సార్! పిల్లవాణ్ణి విడిపించుకోవటానికి డబ్బివ్వమని బెదిరించి, ఆ డబ్బుతో ఏ బాంబేనో పోదామని అనుకున్నాం..”

కాసేపు అతను మాట్లాడలేదు. మళ్లీ “ఇదుగో.. వీడు ఇంకెవరో పిల్లవాణ్ణి ఎత్తుకొచ్చాడు” అంటూ తన పక్కనున్న కుర్రవాణ్ణి చూపించాడు మోహన్. “మేం పిల్లవాణ్ణి ఊరి బైట కొండల దగ్గరకి తీసుకుపోయాం. ఉత్తరం రాసి పంపాం. ఎంతకీ ఎవరూ జవాబు ఇవ్వలేదు. ఇంకోపక్క పిల్లాడు ఒకటే ఏడుపు. ఏమిచ్చినా తినకుండా విసిరికొట్టడం..మాకు ఏం చెయ్యాలో పాలుపోలేదు. వాడి ఏడుపు విని ఎవరైనా పసిగడతారేమోనని చాలా భయపడ్డాం. ఇంతలో వీడు బొగ్గుల వ్యాపారి కొడుకు కాదని తెలిసిపోయింది. కూలిపని చేసుకునే అతి పేదవాడి కొడుకని తెలిసింది. మాకేం చెయ్యాలో తెలీలేదు. పిల్లవాడిని ఎక్కడినించి ఎత్తుకొచ్చాడో అక్కడే వదిలేసి రమ్మని.. ఇదిగో వీడికి చెప్పాం. వీడు ఒక్కడూ ముందు వెళ్లి చూసి వచ్చి.. అక్కడంతా పోలీసులు, టీవీ వాళ్లు గుమిగూడి ఉన్నారని చెప్పేసరికి పిల్లాడ్ని ఎలా వదిలించుకోవాలో అర్థంకాలేదు. ఒకరోజు వాడు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లిపోయాడు. వాణ్ణి ఎలాగైనా వదిలించుకోవాలని తెగ కంగారుపడిపోయాం. అక్కడ దగ్గర్లో ఒకచోట సున్నం కుప్పగా పోసి ఉంటే.. మూర్ఛపోయిన పిల్లవాణ్ణి ఆ కుప్పలో కప్పెట్టి వెళ్లిపోయాం.. పిల్లాడు చచ్చిపోయినందుకు మాకు చాలా బాధగా ఉంది సార్!” అంటూ మోహన్ వెక్కివెక్కి ఏడవటం మొదలుపెట్టాడు.

ముగ్గురు నిరుద్యోగులు.. నేరం చేయటంలో ఏమాత్రం అనుభవం లేని, దారి తప్పిన ఆ యువకులు.. నేరం చేసినా అలా అనిపించటం లేదు. ధ్రువ్‌ని చంపటం వాళ్ల ప్లాన్ కాదు. తాము పట్టుపడతామన్న భయం వల్లే.. టీవీలో ఈ వార్త వచ్చిందన్న కంగారుతోనే వాళ్లు నేరం చేశారు.

టీవీవాళ్లు మరీ అంతగా ఈ సంఘటనని ప్రచారం చేసి ఉండకపోతే.. ధ్రువ్ బతికేవాడేమోననే ఆలోచన మీకు కూడా వస్తూనే ఉండాలి. ఈ 'బ్రేకింగ్ న్యూస్' ముక్కుపచ్చలారని ఒక పసివాడి ప్రాణాల్ని బలితీసుకుంది, తల్లిదండ్రులిద్దరికీ తీరని దుఃఖాన్ని కలిగించింది. ఇప్పుడిక ఏం చేసినా..సంఘటనని రీవైండ్ చేసి, ధ్రువ్‌ని బతికించటం సాధ్యంకాదు! V

ఆంగ్ల కథ



-సర్ ఆర్థర్ కానన్ డాయల్

నీలి సూర్యకాంత మణి

అనువాదం : మేకల మదన్ మోహన్‌రావు


క్రిస్మస్ వెళ్లాక ఆ సందర్భంగా అభినందనలు తెలియజేయటానికి మిత్రుడు షెర్లాక్ హోమ్స్ ఇంటికి ఆ ఉదయాన్నే వెళ్లాను. చలి బాగా ఉంది. గాలిని వెచ్చబరచటానికి ఒకమూల నెగడు వెలుగుతోంది. ఆయన సోఫాలో కూర్చొని, పర్పుల్ డ్రెస్సింగ్ గౌన్ వేసుకుని, కుడి చేత్తో పైప్ పట్టుకుని వున్నాడు. దినపత్రికలు కుప్పగా పడివున్నాయి. అక్కడే వున్న కౌంటర్‌పక్క ఒక చెక్క కుర్చీ వుంది. దాని వెనుక శిథిలావస్థలో వున్న ఓ టోపీ వ్రేలాడుతోంది. ఆ కుర్చీ మీద వున్న లెన్స్, ఫోర్‌సెప్స్ ఆయన ఆ హ్యాట్‌ను ఏవేవో క్లూస్ కోసం నిశితంగా పరిశీలిస్తున్నాడని వెల్లడిస్తున్నాయి.

హోమ్స్ నన్ను సాదరంగా ఆహ్వానించి, ఆ టోపీని చూపి, "ఈ పాత హ్యాట్‌కు ఓ కథ వుంది. దాన్ని సంతోషంగా చెప్పుకుందాం" అన్నాడు.

"ఆ కథ ఏదన్నా మిస్టరీ లేక నేరాన్ని తెలియజేస్తుందా? " అన్నా.

"అంత సీరియస్ విషయమేం కాదు. కానీ ఒక ఆసక్తికరమైన విషయమే" అన్నాడు హోమ్స్. అలా అంటూ ఆ కథనం కొనసాగించాడు.

"క్రిస్మస్ పండుగనాడు పొద్దున్నే యింటికి వెళ్తున్న పోలీస్ కమీషనర్ పీటర్సన్ ఈ పాత హ్యాట్‌ను, ఒక బాగా బలిసిన బాతును చూసి యిక్కడికి తెచ్చాడు. బాతేమో వంటకంగా మారుతోంది. హ్యాట్‌నేమో దాని కథేంటో చెప్పమంటూ నాకు ఇచ్చాడు. పీటర్సన్ గూడ్జ్‌స్ట్రీట్ మలుపు తిరగ్గానే ఒక పొడవాటి వ్యక్తి ఒక చేత్తో యీ బాతును పట్టుకుని రెండో చేతిలోని కర్రతో జనాల మధ్య దారి చేసుకుంటూ, తన మీదికి దాడి చేయటానికి వస్తున్న వారిని తప్పుకుంటూ వెళ్తున్నాడు. ఆ క్రమంలో అతడు ఒక షాపు విండో అద్దాన్ని పగుల గొట్టాడు. సరిగ్గా అప్పుడే యూనిఫాంలో వున్న పీటర్సన్‌ను చూసి ఆ కంగారులో ఈ హ్యాట్‌ను, బాతును అక్కడే వదిలి పరుగు లంకించుకున్నాడు. అతని మీదికి దాడిచేయడానికి వచ్చిన వాళ్ళు కూడా పారిపోయారు. పీటర్సన్ అలా దొరికిన వాటిని స్వంతదారుకు యివ్వలేక పోయాడు. ఎందుకంటే ఆ వస్తువులు ఎవరివో తెలిసే ఆధారాలు ఏమీలేవు. కాకపోతే ఆ బాతు ఒక కాలుకు ఒక చిన్న టాగ్ కట్టివుంది. దానిమీద 'మిసెస్ హెన్రీ బేకర్‌కు' అని మాత్రం రాసి వుంది. హ్యాట్ మీద 'హెచ్. బి.' అనే అక్షరాలు వున్నాయి. లండన్ నగరంలో కొన్ని వేలమంది బేకర్స్ వుండవచ్చు. వారిలో యీ బేకర్ ఎవరో తెలుసుకోవటం సులువేం కాదు. అందుకని పీటర్సన్ ఆ బాతుతో విందు చేసుకుంటున్నాడు. నేనేమో ఈ పాడుబడ్డ హ్యాట్ వెనకాల వున్న రహస్యం తెలుసుకునే



ప్రయత్నం చేస్తున్నా"

"ఇప్పటిదాకా ఆ హ్యాట్ ఎంత ఇన్ఫర్మేషన్ యిచ్చింది? " అడిగాను.

చిరునవ్వు నవ్వుతూ, "చాలా యిచ్చింది. దీని ఓనర్ ఎవరో నువ్వేమన్నా వూహించగలవా? " అన్నాడు హోమ్స్.

హ్యాట్‌ను పరిశీలనగా చూసినా ఏమీ చెప్పలేకపోయాను. అదొక మామూలు నల్లటి హ్యాట్. గుండ్రంగా, గట్టిగా వుంది. అతి వాడకంవల్ల శిథిలావస్థకు చేరింది. దానికున్న సిల్క్ లైనింగ్ వెలిసిపోయింది. రంగు పూర్తిగా వెలిసిపోయి అక్కడక్కడా పాచ్‌ల మాదిరిగా వుంది. అక్కడక్కడ కొంచెం ఇంకు అంటింది. అంచుకు రంధ్రాలు పడ్డాయి. ఎలాస్టిక్ లేదు.

ఆ టోపీని చూపిస్తూ హోమ్స్ అదెవరిదై వుండవచ్చని తాను అనుకుంటున్నాడో చెప్పాడు. "సైజు చాలా పెద్దగా వుంది కాబట్టి యిది పెట్టుకున్న వ్యక్తి బ్రెయిన్ పెద్దదై వుండాలి. మేధావి అయి వుండాలి. అతడు బాగా బతికి చెడ్డవాడై వుండాలి. ఎందుకంటే దానికున్న ఖరీదైన రిబ్బన్ సిల్క్ లైనింగ్ వెలిసిపోయి వుంది. కొత్త టోపీ కొనుక్కోలేక పోయివుంటాడు. దాని మీద పడిన చిన్న గుంత, లూప్ ఆయన తీవ్రంగా వీస్తున్న గాలి నుంచి తనని తాను రక్షించుకునేందుకు దీన్ని ధరించి వుండొచ్చని చెప్తున్నాయి. అంటే అతనికి చాలా దూరదృష్టి వుండాలి. కానీ తెగిన ఎలాస్టిక్‌ను మార్పించే శ్రద్ధ తీసుకోలేదంటే ఆయన శక్తి బలహీనమైనట్టుగా సూచిస్తుంది. ఏది ఏమైనప్పటికి ఆయనొక ఆత్మాభిమానంగల వాడని, మరకలు కనిపించకుండా దీనిమీద ఇంకు రుద్దటాన్ని బట్టి తెలుస్తుంది" అని విశ్లేషించాడు హోమ్స్.

హోమ్స్ కన్‌క్లూజన్‌లు నన్ను ఆశ్చర్యచకితుణ్ణి చేశాయి.

"ఊc తర్వాత" అన్నాను.

"లైనింగ్ క్రింది భాగాన్ని లెన్స్‌తో పరీక్షించి చూస్తే ఆ వ్యక్తి నడివయసు వాడని తేలింది. అతడు ఇటీవలే క్షవరం చేయించుకుని, లైమ్‌క్రీమ్ వాడివుండాలి. ఎందుకంటే ఆ లైనింగ్‌కు ఎన్నో కట్‌చేసిన వెంట్రుకలు, వాటికి రాసిన లైమ్ క్రీమ్‌వల్ల అంటుకుని వాసన వస్తోంది. టోపీమీద పేరుకుపోయిన దుమ్ము అతడు దీన్ని చాలా కాలంగా వాడట్లేదని చెప్తుంది. అక్కడక్కడ వున్న తడి అతని ఆరోగ్యం అంత బాగాలేదని, బాగా చెమటలు కక్కుతూ వున్నాడని సూచిస్తుంది.

దానికి అంటిన గ్రీజు మరకలు కొవ్వొత్తి మైనం మరకలు. అంటే వాళ్ళ యింట్లో గ్యాస్ లేదన్నమాట. ఆ టోపీని దుమ్ము దులిపి శుభ్రంగా వుంచాల్సిన అతని భార్య అలా చేయలేదంటే ఆమెకు అతనిపట్ల చాలా నిర్లక్ష్యమని, ఏ మాత్రం ప్రేమ లేదని తెలుస్తుంది. కానీ ఆ భర్తకు మాత్రం తన భార్యంటే చాలా ప్రేమని అతడు యింటికి తీసుకెళ్తున్న ఆ బలిసిన బాతు సూచిస్తుంది.

ఆ టోపీ ఓనరు గురించి హోమ్స్ అద్భుతమైన కన్‌క్లూజన్‌లకు అతణ్ణి హృదయపూర్వకంగా అభినందించాను.

"బహుశా నీ విలువైన కాలాన్నీ, అద్భుతమైన మేధాశక్తిని యీ టోపీ సొంతదారును తెలుసుకునే ప్రయత్నంలో వృథా చేస్తున్నావేమో అనిపిస్తుంది. ఎందుకంటే యిప్పుడు ఏ నేరమూ జరుగలేదు. మనకు తెలిసిందల్లా కేవలం యీ బాతు తప్పిపోయిందనే" అన్నాను.

సరిగ్గా అప్పుడే దిగ్భ్రాంతి చెందిన వానిలా వున్న పీటర్సన్ ఆ గదిలోకి దూసుకువచ్చాడు. తన చెయ్యిచాపి అరచేతిలో వున్న ధగధగలాడుతున్న ఒక నీలి వజ్రాన్ని చూపించాడు. అది ఆ బాతు కడుపులో బయట పడిందట.

"నిజంగానే యిదో నిధి! ఈ ఖరీదైన వజ్రం మరో విషయం తెలియ జేస్తుంది. ఇది కొద్దిరోజుల క్రితం హోటల్ కాస్మోపాలిటన్‌లో మోర్కార్ కౌంటెస్ పోగొట్టుకున్న నీలిసూర్యకాంతమణి. దాదాపు ఇరవైవేల పౌండ్లకన్నా ఎక్కువ విలువచేసే యీ వజ్రం దొరికిన వారికి వెయ్యి పౌండ్ల బహుమతి ప్రకటించారు. ఆ కౌంటెస్‌కు ఆ వజ్రం అంటే ఎంత యిష్టమంటే ఆమె యిది దొరికిన వారికి యింకా ఎక్కువ బహుమతే యివ్వవచ్చు. పీటర్సన్ గుడ్ లక్!" అన్నాడు హోమ్స్.

ఆ తర్వాత హోమ్స్ ఆ వజ్రం ఎలా దొంగిలింపబడిందో ఉటంకించే వార్తా పత్రిక కథనం చదివి వినిపించాడు.


జాన్ హార్నర్ అనే ప్లంబర్ ఆ వజ్రాన్ని మోర్కార్ కౌంటెస్ జ్యూయల్ కేస్ నుంచి డిసెంబర్ 22న దొంగిలించినట్లుగా నేరం ఆరోపించటం జరిగింది. హార్నర్‌ను జేమ్స్ రైడర్ అనే అటెండెంట్, కౌంటెస్ వుంటున్న ఆ గదిలోని ఒక బార్ వదులైతే దాన్ని అతుకు పెట్టమని పిలిచినట్టుగా అతడు స్టేట్‌మెంట్ యిచ్చాడు. హార్నరే దాన్ని కాజేసి పారిపోయాడని కూడా ఆరోపణ. కౌంటెస్‌గారి మెయిడ్ కాథరీన్ క్యూసాల్ దొంగతనం జరిగిన విషయం తెలిసినప్పుడు రైడర్ నిర్ఘాంతపోయాడని సాక్ష్యమిచ్చింది. ఇన్‌స్పెక్టర్ బ్రాడ్‌స్ట్రీట్ తాను హార్నర్‌ను అరెస్ట్ చేసినప్పుడు తాను 'ఆ దొంగతనం చేయలేదని వాదించడమే కాక మాట్లాడుతూ మాట్లాడుతూ మూర్ఛ కూడా పోయాడు' అన్నాడు. మేజిస్ట్రేట్ ఆ కేసును అస్సైజెస్‌కు కమిట్ చేశాడు.

"ఆ పోలీసుకేసు ఆ దొంగతనం గురించిన అసలు నిజాన్ని వెలికి తీయలేకపోయింది. ఆ సీక్రెట్ అంతా ఆ వజ్రాన్ని కడుపులో దాచుకున్న బాతులోనే వుంది" అన్నాడు నాతో హోమ్స్.

ఆ దొంగతనం వెనుకగల రహస్యాన్ని తెలుసుకోవటానికి మొదటి స్టెప్ 'సాయంకాలం దినపత్రికల'లో ఒక నల్లటి ఫిల్ట్ హ్యాట్, ఒకబాతు గూడ్జ్‌స్ట్రీట్ కార్నర్ వద్ద దొరికాయి. వాటి ఓనరు అయిన మిస్టర్ హెన్రీ బేకర్ యీ సాయంత్రం 6.30 గంటలకు 221బి. బేకర్ స్ట్రీట్‌కు వచ్చి వ్యక్తిగతంగా వాటిని పొందవచ్చు' అని ప్రకటన యివ్వటం.

హోమ్స్ ఆ వజ్రాన్ని తన దగ్గరే వుంచుకుని పీటర్సన్‌కు "అన్ని ముఖ్యమైన వార్తా పత్రికలలో యీ ప్రకటన వెంటనే యివ్వు. అలాగే తిరిగి వచ్చేటప్పుడు మిస్టర్ బేకర్‌కు యివ్వటానికి ఒక బాతును కూడా





కొనుక్కురా" అని చెప్పాడు.

ఆ తర్వాత ఆ నీలి సూర్యకాంతమణి ఎలా రెండు హత్యలకు, ఒక యాసిడ్‌దాడి కేసుకు, ఒక ఆత్మహత్య కేసుకు, యింకా ఎన్నో దోపిడీలకు కారణమైంది, అలాంటి విలువైన రాళ్ళు ఎలా దెయ్యాల్లాగా మనుషులను నేరాలు చేసేలా ప్రభావితం చేసేది వివరంగా చెప్పాడు హోమ్స్ నాకు.

"హోర్నర్ నిజంగానే అమాయకుడా? హెన్రీ బేకర్‌కు తాను తీసుకెళ్తున్న బాతు విలువ ముందే తెలుసా? " అని చర్చించుకుంటూ యిద్దరం విడిపోయాము.

హోమ్స్ నన్ను "సాయంకాలం డిన్నర్‌కు రా" అని పిలిచాడు. ఆ ప్రకారమే నేను సాయంత్రం హోమ్స్ యింటికి వచ్చేసరికి హెన్రీ బేకర్ గుమ్మంవద్దే నిల్చుని వున్నాడు- లోపలికి వెళ్ళేందుకు ఎదురు చూస్తూ. అతడు లోపలికి వెళ్ళాడు.

హోమ్స్ ఆ టోపీని చూపించి, "ఈ టోపీ మీదేనా? " అని అడిగాడు.

బేకర్ కృతజ్ఞతా పూర్వకంగా, "నాదే" అన్నాడు.

బేకర్ తెలివితేటలు ప్రతిబింబించే అతని ముఖాన్ని బాగా మాసిపోయి, కాలర్ పైకి తిరిగి వున్న అతని ఫ్రాక్‌కోట్‌ను పరిశీలనగా చూడసాగాను. అతని కోట్ చేతులలో నుంచి బక్కపలుచటి రెండు అరచేతులు బైటికి చాపాడు. వాటి పైన షర్ట్‌గానీ, కఫ్‌గానీ వున్న జాడలేం లేవు. ఇతని గురించి హోమ్స్ యింతక్రితమే చెప్పిన విషయాలన్నీ నిజమే కావచ్చు అనిపించింది నాకు.

దురదృష్టవంతుడైన ఆ మేధావిని చూస్తే జాలేసింది నాకు.

"పోయిన నా వస్తువుల గురించి పత్రికలలో ప్రకటన యిచ్చేటంత డబ్బు లేదు" అని హోమ్స్‌తో నిజాయితీగా ఒప్పుకున్నాడు హెన్రీ.

తన బాతును అప్పటికే కోసుకొని తిన్నారని తెలిసినా, దానిబదులు మరొక బాతును తీసుకోవటానికి సంతోషంగా అంగీకరించాడు హెన్రీ.

హోమ్స్ బాగా బలిసిన మరొక బాతును అతనికిచ్చాడు. అలాగే హోమ్స్ అడిగిన ప్రశ్నకు అతడు "నేనా బాతును మ్యూజియంకు దగ్గరగా వున్న అల్ఫా సత్రానికి చెందిన మిస్టర్ విండిగేట్ దగ్గర కొన్నాను" అని చెప్పాడు.

అంటే హెన్రీకి ఆ మణి గురించి ఏమీ తెలియదనేది స్పష్టంగా అర్థమైంది.

హోమ్స్, "మనం డిన్నర్‌ను సప్పర్‌గా మార్చుకుని యీ క్లూను అనుసరించి వెళ్దామా? " అని అడిగాడు.

మేము డాక్టర్ల క్వార్టర్లను, వింపోల్ స్ట్రీట్‌ను, హ్యార్లీ స్ట్రీట్‌ను, ఆక్స్‌ఫర్డ్ స్ట్రీట్‌ను దాటి చివరికి 'అల్ఫా ఇన్'ను చేరాము. అప్పుడు చలిగా వున్న రాత్రి స్పష్టంగా వుంది.

లోనికి వెళ్లగానే హోమ్స్ రెండు గ్లాసుల బీరు ఆర్డరిచ్చాడు. ఎర్రగా కందినట్లున్న ముఖం, తెల్లటి ఆప్రన్ వేసుకున్న ఆ ఇన్ యజమానే స్వయంగా బీరు గ్లాసులు తెచ్చాడు.

హోమ్స్, "మీ బాతులు వున్నంత బాగా వుంటే యీ బీరు ఎక్స్‌లెంట్‌గా వుంటుందనుకోవచ్చు" అన్నాడు.

"మా బాతులా? !" అన్నాడతను ఆశ్చర్యంగా.

"అవును. మీ 'గూస్ క్లబ్'లో మెంబరైన మిస్టర్ హెన్రీ బేకర్ మీరు తనకిచ్చిన అద్భుతమైన బాతుల గురించి తెగ మెచ్చుకున్నాడు" అన్నాడు హోమ్స్.

"ఓ... అవా? ... అవి మావి కావు. నేను ఒక రెండు డజన్ల బాతులు

'కాన్వెంట్ గార్డెన్' సేల్స్‌మ్యాన్ మిస్టర్ బ్రెకిన్ రిడ్జ్ దగ్గర తీసుకున్నా" అని చిరునవ్వుతో చెప్పాడు ఓనరు.

మేము అతని ఆరోగ్యంకోసం బీరు తాగి, సరాసరి కాన్వెంట్ గార్డెన్‌కు దారి తీశాం. ఆ మంచు కురిసే వాతావరణంలో గబగబా వెళ్తూండగా హోమ్స్, "ఆ కౌంటెస్ గారి నుంచి సూర్యమణిని తస్కరించిన వాణ్ణి మనం త్వరలోనే పట్టుకుంటాం. అది పోలీసులు చేయలేకపోయారు" అన్నాడు.

హోల్‌బార్న్, ఎండెల్ స్ట్రీట్, మరికొన్ని గుడిసెలు దాటి మేము వేగంగా కాన్వెంట్ గార్డెన్ మార్కెట్ చేరుకున్నాము. అక్కడ మాకు బ్రెకిన్‌రిడ్జ్ స్టాల్ కనిపించింది. దాని ఓనర్ ముఖం చురుగ్గా వుంది. మీసాలు ట్రిమ్ చేయించాడు. అప్పుడే అతను షాప్ మూసెయ్యబోతున్నాడు.

హోమ్స్ అడిగిన ప్రశ్నకు అతడు "ఈ రోజు స్టాకు అయిపోయింది. కావాలంటే రేపు ఉదయం 500 బాతులనైనా సప్లై చేయగలం" అన్నాడు.

"అల్ఫా ఇన్ యజమాని మిమ్మల్ని కలువమన్నాడు. ఈ రోజు ఉదయం మీరు వాళ్లకు రెండుడజన్ల మంచి బాతులు పంపినట్టుగా వుంది. అవి ఎక్కడనుంచి తెచ్చారు? " అని అడిగాడు హోమ్స్.

"ఎందుకు మీ జనాలంతా పొద్దుటినుంచి నన్ను ఆ బాతుల గురించి చంపుతున్నారు? నేనేం చెప్పను. వెళ్లండి" అని అరిచాడు ఓనరు.

హోమ్స్ నింపాదిగా, "మిమ్మల్ని ప్రశ్నలతో విసిగించిన వాళ్లెవరో నాకు తెలియదు. మీరు పొద్దున అల్ఫాఇన్ వాళ్లకు అమ్మిన బాతులు పల్లెటూరిలో పెంచబడినవి అని నేను నా స్నేహితునితో పందెం వేశా. వాట్లో ఒకటి నేను కూడా తిన్నా" అన్నాడు.

ఆ షాపు ఓనరు నెమ్మదించి, "కాదండి. అవి నగరంలో పెంచినవే. కావాలంటే ఒక సావరిన్ పందెం కాస్తా" అన్నాడు.

ఆ తర్వాత తనబిల్లు బుక్కులు చూపించి, తాను రెండు డజన్ల బాతులు కొన్న వ్యక్తిపేరు- మిసెస్ గ్యాక్ షాట్, 177, బ్రిక్స్‌టన్ రోడ్ 249 అనడంతోపాటు ధర కూడా చూపించాడు.

హోమ్స్ ఓడిపోయినట్టుగా ముఖంపెట్టి, అయిష్టంగా ఇస్తున్నట్టుగా ఓ సావరిన్ అతని మీదికి విసిరాడు.

మేం గబాలున వెనక్కి తిరిగి కార్నర్ తిరగ్గానే హోమ్స్ శబ్దం రాకుండా తనకే సాధ్యమైన నవ్వు నవ్వుతూ విజయగర్వంతో అన్నాడు "ఆ దొంగతనం మిస్టరీ దాదాపు ఛేదించినట్లే"

తర్వాతి స్టెప్ గురించి చర్చిస్తుండగా మాకు మిస్టర్ బ్రెకిన్‌రిడ్జ్ షాపు దిశనుంచి పెద్దపెద్ద అరుపులు వినిపించాయి. అక్కడి సేల్స్‌మ్యాన్ ఒక కోలమొహం వాడి మీద అరుస్తున్నాడు- తనను పొద్దున కొన్న బాతులు ఎక్కడివో చెప్పమని, మిసెస్ ఓక్‌షాట్ అనే ఆమె ఆ విషయం తెలుసుకురమ్మని పంపిందని చెప్తూ ఆ వ్యక్తి విసిగిస్తున్నాడు.

మిస్టర్ బ్రెకిన్ రిడ్జ్ అతణ్ణి షాపు నుంచి బయటికి వెళ్లగొట్టాడు.

ఫైనల్ క్లూ దొరికినందుకు సంతోషిస్తూ హోమ్స్, ఆ కోలమొహం వ్యక్తిని ఆ గుంపులో వెంటాడాడు. మేము అతణ్ణి అందుకోగానే హోమ్స్ అతని భుజం మీద చెయ్యేశాడు. అతడు కంగారుగా, "ఎవరు మీరు? మీకేం కావాలి? " అన్నాడు.

"క్షణం క్రితం బ్రెకిన్‌రిడ్జ్ షాపు దగ్గర జరిగిందంతా విన్నా. నేను మీకేమన్నా సహాయపడగలనేమో అని వచ్చాను.. బ్రిక్స్‌టన్‌కు చెందిన మిసెస్ ఓక్‌షాట్, బ్రెకిన్‌రిడ్జ్ అనే సేల్స్ మ్యాన్‌కు అమ్మిన బాతుల గురించి తెలుసుకోవాలనుకుంటున్నావు కదా? వాటిని అతడు అల్ఫా ఇన్ యజమాని మిస్టర్ విండిగేట్‌కు అమ్మాడు. వాటిని అతడు తన క్లబ్‌కు సరఫరా చేసాడు. అందులో మిస్టర్ హెన్రీబేకర్ ఒక సభ్యుడు" అని చెప్పాడు హోమ్స్.

"ఓ.. సరే! నేను కలవాలనుకుంటున్న వ్యక్తి మీరే!" అంటూ ఆ వ్యక్తి తన రెండు చేతులూ చాపి, వణుకుతున్న వేళ్ళతో, "నాకు యీ విషయంలో చాలా ఆసక్తి వుంది" అని అరిచాడు.

"నీ పేరేంటి? " అన్నాడు హోమ్స్ ఆ యువకునితో.

అతడు కొద్దిగా సంకోచించి, "జాక్ రాబిన్సన్!" అన్నాడు. అతడు చెప్పేది అబద్ధమని హోమ్స్‌కు అర్థమైంది.

"కాదు.. నీ నిజమైన పేరు చెప్పు. అలియాస్ పేరు, అబద్ధపు పేరు అవసరం లేదు" అన్నాడు హోమ్స్.

"నా అసలు పేరు జేమ్స్ రైడర్" అన్నాడు సిగ్గుతో ఎర్రబారిన బుగ్గలతో.

"అవును, నువ్వు హోటల్ కాస్మోపాలిటిన్‌లో హెడ్ అటెండెంట్‌వు. నువ్వు తెలుసుకోవాలనుకుంటున్న అన్ని విషయాలు త్వరలోనే చెప్తా. టాక్సీ క్యాబ్ ఎక్కు" అన్నాడు హోమ్స్.

ఆ కోలమొహం, పొట్టి వ్యక్తి సగం సంకోచంతో, సగం ఆశతో, తనకు అదృష్టం పట్టబోతుందా, లేక తానేదైనా ప్రమాదంలో ఇరుక్కోపోతున్నాడా అనే అనుమానంతో, అయోమయంగా టాక్సీ ఎక్కాడు. అతడు టెన్షన్‌తో వేళ్ళు నొక్కుకుంటున్నాడు.

హోమ్స్ ఇంటికి చేరుకుని అందరం సౌకర్యంగా ఫైర్‌ప్లేస్ దగ్గర సెటిల్ అయ్యాము.

"మిస్టర్ రైడర్, ఆ బాతుకేమైందో తెలుసుకోవాలనుకుంటున్నావు కదూ? దానికి తోక దగ్గర నలుపు, తెలుపు చారలున్నాయి. ఆ బాతు చచ్చిపోయాక, అద్భుత ప్రకాశవంతమైన కాంతులీనే చిన్ని నీలి రంగు గుడ్డు పెట్టింది. అదే యిది..." అంటూ హోమ్స్ ఒక పెట్టె తెరిచి ఆ నీలి సూర్యకాంతమణిని చూపాడు. అది చూసి రైడర్ కళ్ళు చెదిరాయి.

"సరే, దాన్ని నాదే అని క్లెయిం చేయవచ్చా? లేక మొత్తానికి దాన్ని వదిలేసుకోవాలా? " అన్నాడు రైడర్.

"ఆట ముగిసిపోయింది రైడర్" అన్నాడు హోమ్స్.

రైడర్ కళ్ళు తిరిగినట్లయి పడబోయాడు. కొంచెం బ్రాందీ యిచ్చాను. అతడు హోమ్స్‌నే భయ విహ్వల నేత్రాలతో చూస్తూ కూర్చుండిపోయాడు.

"రైడర్, ఇది మోర్కార్ కౌంటిస్‌కు చెందిన నీలి సూర్యకాంతమణి అని నీకు బాగా తెలుసని నాకు తెలుసు. దీని గురించి నాకు ఆ కౌంటెస్‌గారి వెయిటింగ్ మెయిడ్ క్యాథరిన్ క్యూసాక్ అంతా చెప్పింది. ఎంతో సులభంగా అందిన యీ సంపదకు మీ యిద్దరూ ఆకర్షితులయ్యారు. నువ్వు కావాలనే కుట్రపన్ని ప్లంబర్ హార్నర్‌ను కౌంటిస్ గదిలో ఏదో రిపేరు వుందని పిలిపించి, అతడు వెళ్ళిపోయాక ఆ వజ్రాన్ని దొంగిలించి, పాపం హార్నర్ అరెస్టయ్యేలా చేసావు" అన్నాడు షెర్లాక్ హోమ్స్.

రైడర్, హోమ్స్ కాళ్ళమీద పడి, "అయ్యా దేవుని ముఖం చూసి నామీద దయ చూపించండి. ఈ సంగతి తెలిస్తే మా తల్లిదండ్రులు చచ్చిపోతారు. ఇక జన్మలో ఏతప్పూ చేయనని ప్రమాణం చేస్తున్నా. దయచేసి నన్ను కోర్టుకు లాగకండి" అని ప్రాధేయపడ్డాడు.

"కాని హర్నర్‌మీద నేరం మోపినప్పుడు నువ్వు అతని గురించి ఎప్పుడూ ఆలోచించలేదా" అన్నాడు హోమ్స్ కఠినంగా.

"అయ్యా, నేను యీ దేశాన్ని వదిలిపెట్టి వేరే దేశానికి పారిపోతా. అప్పుడు హార్నర్ మీద పెట్టిన కేసు వీగిపోతుంది" అన్నాడు రైడర్ పరిష్కార సూచకంగా. V

తమిళ కథ

-కుమార మూర్తి



ఆఖరి అధ్యాయం

అనువాదం: డా॥ కె. శివ సుబ్బారావు

సుమతి మళ్లీ అద్దంలోకి తననో మారు చూసుకుంది. ముఖం అంతా ఉబ్బినట్లుంది. కళ్ల చుట్టూరా నల్లటి వలయాలు వచ్చాయి. వాటిని చూడగానే మొహం తిప్పేసుకుంది. ఆమె హృదయంలో ఓ ఆవేదన అల ఎగిసింది. విచారపు మేఘం ముఖంనిండా అలుముకుంది. 'రాత్రంతా నిద్రపోకుండా మేల్కొనటం వల్లే ఈ కష్టాలు ' అని సర్దిచెప్పుకుంది.

అప్పుడప్పుడు మోగే పిస్తోలు ధ్వనులు, రాత్రిపూట 'ఢాం' అనే బుల్లెట్ల చప్పుళ్లూ పొద్దున్నే వినిపించడం లేదు. ఉదయపు సూర్యుని వేడి, పొద్దున్నే పక్షుల కిలకిలారావాలు, పావురాళ్ల కువకవలు.. ఇవే వినబడుతున్నాయి.

ఈ నిశ్శబ్ద వాతావరణం ఆమెను భయకంపితురాల్ని చేస్తోంది. అది దైనందిన జీవితం నుండి తనను దూరం చేస్తున్నట్లు భావించి ఆమె వణికిపోయింది. ఎంత దారుణం! ఈ మధ్య పరిస్థితులు ఆమె బుర్రని పనిచేయనివ్వడంలేదు. 'మనిషి.. పరిస్థితులకు బానిస. అవే అతణ్ణి క్రూరుణ్ణి చేస్తాయి. ప్రకృతి.. మనిషి పట్ల నిర్దయగా వుంటుందా? మనిషే ప్రకృతిని దోచుకుంటున్నాడా? '.. అలా ఆ ఉదయపు గంటలు ఆమెని ప్రశాంతంగా ఉంచకుండా, కల్లోలానికి గురిచేస్తున్నాయి.

ఏదో ఒక ఊహ ఆమెని బాధ పెడుతోంది. క్రితంరోజు జరిగిన సంఘటనను ఆమె తలచుకుంటోంది. 'ఆ ఆలోచనకు మూలం ఏమిటా? 'అనుకుంది. సుదీర్ఘ ఆలోచనలకు వేర్లు ఎక్కడున్నాయో తెల్సుకోవటం కష్టంగా వుందామెకు.

గుండె మూలలో దాచుకున్న ఓ జ్ఞాపకం ఆమె గుండెని తడుతూనే వుంది. బహుశా ఆ జ్ఞాపకం ఎప్పుడు నాటుకుందీ అంటే.. రోడ్డుమీద ఓ శరీరాన్ని చూచినప్పటి నుంచీ. 'ఆ శరీరం అక్కడికి ఎలా వచ్చి వుంటుంది? ఎవరు తెచ్చిపడేసి వుంటారు? వాళ్లల్లో ఎటువంటి బాధా వుండదా? ఏమైనప్పటికీ అది నిర్జీవ శరీరం.. ప్రాణం ఎప్పుడో పోయివుంటుంది. అదే నిజం. శవపేటికలో శవాన్ని పెట్టి చుట్టూ మెత్తగా దూది వుంచినా లేక రోడ్డుమీదకు విసిరేసినా ఒకటే ఫలితం.. శవం తిరిగి బతికిరాదు కదా! ఊపిరి ఆగిపోతే ప్రతి ఒక్కరూ యింతే'. ఆమె తన ఛాతీని చేత్తో నొక్కుకుంది.. హృదయ వేగం పెరిగినట్లయింది. మనస్సులో ఆందోళన ఆరంభమయింది.. ఈ భావాలు సాధారణ మెడికల్ స్టూడెంట్ కి వచ్చేవిలా లేవు. ఎందుకంటే ఆమె ఓ మెడికల్ గ్రాడ్యుయేట్.

"చావు'. శరీరం చేసే చివరి యత్నం లేదా ఒకరి ఆలోచనలకు..చావు ఆఖరి బిందువు. చావు.. మనిషిని బాధలనుంచి తప్పించటానికి ఆఖరి అవసరంగా వస్తుంది. మరణం అదే రోజు రావచ్చు లేదా వేరే రోజు రావచ్చు. ఏదో ఒకరోజు యమధర్మరాజు దర్శనం తప్పనిసరి! మరణం ఎప్పుడొస్తుందో ఎవరు చెప్పగ

లరు లేదా నిర్ణయించగలరు..? శరీర రాహిత్యంగా.. కనబడని శక్తి ఏదో..! సాధారణ కంటికి మృత్యువు కనబడదు కదా!

అకస్మాత్తుగా చేతిలో వున్న శిశువు గట్టిగా ఏడుస్తోంది. ఆమె తొందరగా లేచి నిలబడి, బిడ్డని ఎత్తుకుంది. పిల్ల శరీరం కాలుతోంది.

లేదు. ఆమె ఈ పూట ఎక్కడికీ వెళ్ల లేదు. పిల్లలతోనే కాలక్షేపంచేయాల్సి వుంది. 'నా పిల్లలు నాకు ధనం' అనుకుంది. కళ్లలోంచి నీళ్లు కారసాగాయి. పిల్లల్ని కల్సుకొని ఎన్ని రోజులు గడిచాయి?


ఓ గాఢ నిట్టూర్పు విడిచిందామె. బాధ్యత వహించిన తర్వాతే, ఆమె బిజీగా మారింది. ఆ బాధ్యతా యాదృచ్ఛికంగా లభించిందామెకు.

మన సమాజం ఇప్పుడు బోలెడంత తికమకతో బాధపడుతోంది. ప్రతీదీ ఎండమావిలా వుంటోంది. సత్యమేదో, అబద్ధమేదో కనిపెట్టడం కష్టతరమవుతోంది. మన భావాలు, లక్ష్యాలు ప్రతీదీ నోట్‌చేసుకుని డైరీలో రాయాలి. మనం ఈ డైరీని భవిష్యత్ జనానికి యివ్వాలి. యివాళ జరిగే సంఘటనలు, విశ్లేషణలు భావి తరానికి అందివ్వాలి.

ఆమె కొలీగ్స్ కొందరూ అదే ఆలోచనలతో వున్నారు. ఆమె యోచనల్ని ఆచరణ రూపంలోకి ఎలా తీసుకురావాలన్నదే ఆ ఆలోచన. ఈ సంఘటనల సమాహారమే చివరి అంశం కోసం ఎదురుచూస్తోంది.

డైరీ రాయటంవల్ల రాత్రి బాగా పొద్దు పోయింది. పాప ఆమె కౌగిట్లో నిద్రపోయింది. కొడుకు మంచంకోసం చూసింది. అది ఖాళీగా వుంది. 'ఈ పిల్లాడెక్కడికి వెళ్లాడు? '

పిల్లాడ్ని పిలుస్తూ ఆమె బయటికి వచ్చింది. అతడు బొమ్మ తుపాకీ



పేలుస్తూ బిజీగా వున్నాడు. నోటితో శబ్దం చేస్తూవున్నాడు. ఆమె కంగారుగా అతడి చేతిలో నుంచి బొమ్మ తుపాకీని తీసుకొని పొదల్లోకి గిరాటేసింది. ఆమె ఆందోళన అధికమయ్యింది. పిల్లాడి చేతికి మారణాయుధాలు వచ్చాయా.. అంటే.. పరిస్థితుల ప్రభావం ఎంత తీవ్రంగా వుందో అర్థం చేసుకోవచ్చు. 'పిల్లలకి ఆయుధాలపై ఎందుకంత వ్యామోహం? '

పిల్లాడ్ని తిట్టటం వల్ల పరిస్థితి సద్దుమణుగుతుందని చెప్పలేం. ఇది ఓ రోగం.. చిన్నతనంలోనే ఆయుధాలపై వ్యామోహం పెంచుకోవడం! ఈ జబ్బు సమాజంలో లోతుకంటా చొచ్చుకుపోయి వుంది. 'భగ



వంతుడా! ఇది ఎప్పటికి ఆఖరవుతుంది? '

కళ్లని గట్టిగా క్షణంసేపు మూసుకుంది. ప్రపంచం గుండ్రంగా తిరుగుతోంది.

ఆమె మెల్లిగా పిల్లాడ్ని తీసుకొచ్చి బల్ల మీద కూర్చోబెట్టి, చదువుకోవడానికి పుస్తకాన్ని చేతికిచ్చింది. తల బరువుగా అన్పించింది. కనుబొమ్మలని తాటించింది. ఓ భయంకర నిప్పుల గుండం మధ్యలో నిల్చున్నట్లు అన్పిస్తోందామెకు..

ఇంతలో ఆమె తల్లి కప్పుతో టీ తీసుకొచ్చింది. ఓ గుక్క వేయగానే ప్రాణం కాస్త కుదుటపడినట్లుంది. ఆమె తల్లి వంక తేరిపార చూసింది. ముసలితల్లి మొహంలో బాధాతప్త మేఘాలేమీ లేవు.

నిజంగా తన తల్లి పగలూ రాత్రీ కష్టపడి, తనకో వ్యక్తిత్వం వుండేట్లు తయారు చేసింది. అమ్మ.. సాధించిన విజయానికి గుర్తుగా ఎంతో ఎత్తులో హుందాగా నిలబడి వుంది. ఆమె త్యాగం, స్వార్థరాహిత్యం అనుపమానం. ప్రశాంతమైన ఆమె వదనం చూడగానే తన విధులు సంతృప్తికరంగా నిర్వర్తించాననే విజయగర్వం వుంటుంది.. 'కానీ నేను..'?

ఆమె తన కొడుకువంక చూసింది. అతడు బయట పడేసిన తుపాకీ వంక చూస్తున్నాడు. గుండెల్లో గునపం గుచ్చి

నట్లు బాధపడిందామె. 'నా త్యాగం, అంకితభావం ఈ కుర్రాడ్ని ఎప్పటికైనా పరిపూర్ణ మానవుడిగా తయారుచేస్తాయా?'

ఆమె మనసు ఊగిసలాడుతోంది. 'సంఘం ఆరోగ్యకరంగా వుంటేనే నా పిల్లలు ఎటువంటి భయాందోళనలూ లేకుండా పెరుగుతారు'. ఏ కోణంలో చూసినా సంఘమే గొప్పదిలా తోస్తోంది.

కాలేజీకి తప్పనిసరిగా వెళ్లాలి. ఆఖరి చాప్టర్‌లోని అంశాలు.. ఆమెని బలోపేతం చేస్తున్నాయి. సరికొత్త డ్రస్ ధరించి ఆమె బయటికి వచ్చింది. తలుపు వరకూ వెళ్లి, మళ్లీ వెనక్కి తిరిగి వచ్చేసింది.

ఆమె చర్యలు తల్లికి వింతగా వున్నాయి. ప్రేమమయంగా ఉండే ఆ కళ్లు ఆమెవైపు భయంగా చూశాయి. సుమతి కళ్ళు తడి అయ్యాయి. విచారం ఆమె ముఖాన్ని కప్పేసింది. అతికష్టం మీద చెప్పేసింది.. "పిల్లల్ని జాగ్రత్తగా చూసుకో" అని. ఆ మాటలు అంటున్నప్పుడు ఆమె గొంతు బొంగురుపోయింది.

ఆమె కాలేజి నుంచి తిరిగొచ్చే సమయానికి.. సూరీడు బాగా అలసిపోయి వుంటాడు, కొబ్బరి తోటలో విశ్రాంతి తీసుకుంటూ ఉన్నాడు. రోడ్లు నిశ్శబ్దంగా, ఖాళీగా వున్నాయి. దూరం నుంచి వచ్చే తుపాకీ శబ్దాలకు కుక్కలు అరుస్తూ వున్నాయి.

నిశ్శబ్దం.. ఆమెను భయపెట్టినా, పిల్లలతో కలిసి వుండాలనే తపన ఆమెతో వేగంగా అడుగులు వేయించింది. రోడ్డు పక్కన చెట్ల ఆకులు కదిలిన శబ్దాలు కూడా ఆమెను భయపెడ్తున్నాయి.

చీకటి ఆమెను కప్పేసింది. చీకటిని ఎప్పుడూ గెలిపించలేదామె. తన వెనుక అడుగుల చప్పుడు వినబడింది. ఆమె వెనక్కి తిరిగి చూసింది.

ఇద్దరు కుర్రవాళ్లు ఆమె వెనకగా నడుస్తున్నారు. సన్నటి ఆకారాలు, భావరహితమైన ముఖాలు.. ఆమెను బాధపెట్టసాగాయి. 'ఇంకో సంవత్సరమో, రెండు సంవత్సరాలో.. నా కొడుకు కూడా ఈ పిల్లవాళ్లలా ఎదుగుతాడు'. ఆమె తన మనోనేత్రంతో.. ఎదిగిన ఆమె పిల్లాడి రూపును ఆ కుర్రవాళ్ల పక్కన పెట్టి..చూస్తూ ఆనందిస్తోంది. కొడుకు కోటేరు ముక్కు, గిరజాల జుత్తు, గులాబీలాంటి నీడ ఆమెకు గుర్తుకొచ్చింది.

'ఓ దయనీయమైన కుర్రాళ్లారా! ఎదురయ్యే కష్టాలను ఎవ్వరు తీర్చగలరు? పిల్లలకి కష్టాలను ఎదుర్కొనే సామర్థ్యం చిన్నప్పుడే తల్లిదండ్రులివ్వాలి. ఈ అంతులేని వ్యథ యిప్పట్లో అంతం అవుతుందా? ఇప్పుడు సైన్యం రంగప్రవేశం చేస్తే..'

ఆమె నిటారుగా అయ్యింది. మౌనంగా ప్రార్థన చేసింది. ఆ ఇద్దరు కుర్రాళ్ళనూ మంచి మార్గంలో పెట్టాలని నిర్ణయించుకుంది. 'బాలలూ.. త్వరగా యింటికి వెళ్లమ'ని కోరిందామె.

వాళ్లు దగ్గరికి వచ్చారు. వస్తూ స్నేహపూర్వకంగా నవ్వారు.. ఆమె నోరు తెరిచి ఏదో మాట్లాడబోయింది. ఆమెనుండి మాటలు రాకముందే కుప్పలా కూలిపోయింది. తల పగిలి రక్తప్రవాహం. రక్తం జుట్టును తడిపేస్తోంది. మిగిలిన రక్తం భూమిలోకి ఇంకిపోతోంది. కష్టంమీద కళ్లు తెరిచి ఈ కుర్రాళ్లు ఎటువైపు వెళ్లారో తెల్సుకోవడానికి ప్రయత్నించింది. ఆమె దృష్టిని మూసేస్తూ, చీకటి కప్పేసింది! V

న్యాయం తప్పవు" చెప్పాడు సేమ్.

"అదెలా సాధ్యం? అమెరికా నేలమీదకి ఇంతదాకా ఎవరూ దండెత్తలేదు, దండెత్తలేరు కూడా"

సిగరెట్ ఆఖరి దమ్ము లాగి, దాని వంక చూసి నర్మగర్భంగా నవ్వి, దాన్ని ఏష్‌ట్రేలో నలిపేసి చెప్పాడు.

"యుద్ధం, న్యాయం.. వెదికితే అది ఉండని చోటుండదు"

రెండువారాల తర్వాత మేం ఇద్దరం పెట్రోల్ డ్యూటీలో ఉండగా అతని మాటల వెనక అర్థం ఏమిటో నాకు తెలిసింది.

'థర్టీ ఎయిట్ పేరలల్' అని మా మేప్‌లో సైన్యం పేరుపెట్టిన ఓ కొండ పక్కనే ఉన్న పొలంలోకి వెళ్ళాం. అప్పటికే అది అమెరికన్, కొరియా సైన్యం చేతులు రెండుసార్లు మారింది. అమెరికన్ యుద్ధ విమానాలు అక్కడ కురిపించిన బాంబుల వర్షం వల్ల ఇప్పుడు అక్కడ ప్రజలెవరూ నివసించడం లేదు. అంతా ఇళ్ళువదిలి పారిపోయారు. పదిళ్ళు మించి లేవక్కడ.

రైఫిల్స్‌ని సిద్ధంగా పట్టుకుని మేం పెట్రోలింగ్‌లో ఉండగా, దూరంగా కొరియన్ సైనిక దళం ఆ పొలంలోని ఓ ఇంట్లో మా కంటపడింది. వైర్‌లెస్‌లో ఆ విషయం మేం తెలియచేయగానే, ఓ మోర్టారు దళం ఆఘమేఘాల మీద వచ్చి ఆ చిన్న దళాన్ని ఎదుర్కొంది. గంట తర్వాత మేం ఆ ఇంటిని స్వాధీనం చేసుకోగలిగాం.

ఆ ప్రదేశాన్నంతా సేమ్‌తో కలిసి నేను గాలిస్తుండగా, ఓ గోతిలో దాక్కుని ఉన్న కొరియన్ మాకంట పడ్డాడు. మేం అతన్ని స్వాధీనంలోకి తీసుకున్నాం. సివిల్ దుస్తుల్లోని అతను గూఢచారి అనే అనుమానం మాకు కలిగింది. నిజానికి ఎవర్ని చూసినా మాకదే అనుమానం కలుగుతుండేది.

అతనికి కాపలాగా ఉన్న ఓ సైనికుడు తన రైఫిల్‌ని కింద పెట్టి సిగరెట్‌ని వెలిగించుకుంటుంటే, అతను అకస్మాత్తుగా ఆ రైఫిల్‌ని లాక్కుని ఆ సైనికుడి మీద రెండుసార్లు కాల్పులు జరిపి చంపేశాడు.

సేమ్ అతని మీదకి దూకి, తన రైఫిల్‌తో అతని చేతిమీద కొట్టి, మా కళ్ళ ముందే మరణించిన ఆ సైనికుడి రైఫిల్ కిందపడేలా చేశాడు. అతనిలో ఎలాంటి భయం కనపడలేదు.

"ఇతను కొరియన్ ఆర్మీ ఆఫీసర్. సివిల్ దుస్తుల్లో వున్న గూఢచారి. మామూలు పౌరుడైతే రైఫిల్‌ని ఎలా ఉపయోగించాలో తెలియదు" చెప్పాడు సేమ్ నాతో.

అతని వంక చూశాను. రైఫిల్ తగిలిన చోట.. చేతిమీద కారే రక్తాన్ని తుడుచుకుంటున్నాడతను.

"ఇతన్ని మన దళ కమాండర్ దగ్గరికి తీసుకెళదాం" సేమ్‌కి సూచించాను.

గూఢచారి అయినా, పౌరుడైనా అతను మా వాళ్ళని చంపాడు కాబట్టి మేం చేయాల్సిందదే.

"యుద్ధఖైదీ అవుతాడు అప్పుడు. అందు వల్ల తక్షణ న్యాయం జరగదు" చెప్పాడు సేమ్.

"కానీ, మనం చేయాల్సిన పని అదే కదా? "

"మరణశిక్షే ఇతనికి తగిన శిక్ష" చెప్పాడు సేమ్.

"కావచ్చు. కానీ న్యాయవిచారణ అనంతరం కదా ఆ సంగతి? "

నా వాక్యం పూర్తి కాకుండానే, సేమ్ చేతిలోని రైఫిల్ రెండుసార్లు పేలింది. ఆ రెండు గుళ్ళ తాకిడికి ఆ కొరియన్ నేలకూలాడు. సేమ్ చర్యకి ఆశ్చర్యపోయాను.

"నిరాయుధుడైన అతన్ని ఎందుకలా చంపావు? " ప్రశ్నించాను నేను. "యూనిఫాంలో లేడు. కాబట్టి వీడు ఖచ్చితంగా గూఢచారే. అంతేకాక హంతకుడు కూడా. వాడికి పడాల్సిన శిక్ష మరణదండనే" చెప్పాడు సేమ్.

అతని శరీరాన్ని పూడ్చకుండా అలాగే



వదిలి, మేం పెట్రోలింగ్ డ్యూటీని నిర్వహిస్తూ ముందుకు సాగాం. ఆ సంఘటన నా మనసులో నిలిచిపోయింది.

రెండు వారాల తర్వాత యుద్ధం ముగిసింది. శాంతిపత్రం మీద ఇరుపక్షాల వాళ్ళు సంతకాలు చేశారు. అంతా తిరిగి అమెరికాకి వెళ్ళిపోయాం.

శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లో, నేను సైన్యంనుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో.. సేమ్ జోడియాక్ నాకు మళ్ళీ తారసపడ్డాడు. అదేరోజు అతను కూడా సైన్యంనుంచి డిశ్చార్జి అయ్యాడు.

నేను తూర్పుకి వెళ్ళి, ఒహోయ్‌లో మధ్యలో వదిలిన నా చదువుని పూర్తి చేశాను. సేమ్ జోడియాక్‌కి తరచూ ఉత్తరాలు రాస్తూ, అతనితో స్నేహ సంబంధాన్ని వదలకుండా కొనసాగించాను.

ఓసారి పడమరకెళ్ళినప్పుడు నేను సేమ్‌ని కలిశాను. శాన్‌ఫ్రాన్సిస్కోలో సెకండ్ హేండ్ కార్లని కొని అమ్మే వ్యాపారం చేస్తూ, అతను ఆర్థికంగా బాగానే ఉన్నాడని తెలుసుకున్నాను.

"న్యాయం, నిజాయితీ..ఇవి సెకండ్ హేండ్ కార్ల డీలర్ల దగ్గర ఉండవు. నాకు ఆ రెండూ పుష్కలంగా ఉండబట్టే కస్టమర్స్ పెరిగారు. కస్టమర్ అంటే ఆదాయం" తన విజయరహస్యం చెప్పాడు సేమ్.

కాలేజీలో పరిచయమైన ఓ అమ్మాయితో, ఆరునెలల తర్వాత నాకు వివాహమైంది. సేమ్ జోడియాక్ దానికి హాజరవడమేకాక 'బెస్ట్‌మేన్'గా వ్యవహరించాడు. మా పెళ్ళయ్యాక కూడా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఎప్పటిలా కొనసాగుతూనే ఉన్నాయి.

సంవత్సరం తర్వాత ఓ రోజు సేమ్ నుంచి నాకు ఫోన్‌కాల్ వచ్చింది.

"చాలా సంతోషకరమైన వార్త ఇది. నేను పెళ్ళి చేసుకోబోతున్నాను" అనందంగా చెప్పాడు.

"వచ్చేనెల పదహారో తారీకున ఆ శుభ కార్యం జరుగుతుంది. నువ్వు నీ భార్యతో కలిసి తప్పక రా" ఆహ్వానించాడు.

"నీతో ఆ సంతోషాన్ని పంచుకోడానికి రాకుండా ఉంటానా? వస్తాను" ఆనందంగా చెప్పాను.


వారి పెళ్ళికి నాలుగు రోజుల ముందు మళ్ళీ సేమ్‌నుంచి నాకో ఫోన్‌కాల్ వచ్చింది.

"విమానం టిక్కెట్లు కూడా రిజర్వ్ చేయించాను. మీ పెళ్ళికి మేమిద్దరం హాజరవుతున్నాం" చెప్పానతనితో.

"మా పెళ్ళి రద్దయింది" బాధగా చెప్పాడు సేమ్.

"అదేం? " ఆశ్చర్యంగా అడిగాను.

"ఏన్ చనిపోయింది"



"అరెరె! ఎలా?

"బ్యాంక్ దొంగతనానికి పాల్పడ్డ ఒకడు, ఆ బ్యాంక్‌ని పోలీసులు చుట్టుముట్టడంతో బెదిరింపుగా.. తుపాకీతో బ్యాంక్‌లోని ఒకర్ని కాల్చిచంపాడు. ఆమే ఏన్"

"అయ్యయ్యో!"

మా ఆవిడ సలహా ప్రకారం, నేను ఒక్కడ్నే వెంటనే శాన్‌ఫ్రాన్సిస్కోకి చేరాను. అతని విచారంలో భాగం పంచుకోడానికి వెళ్ళి సేమ్‌ని కలిశాను.

సేమ్ నన్ను చూసి చాలా సంతోషించాడు. నేను వస్తాననుకోలేదతను. నా భుజాల్ని గట్టిగా వత్తి చెప్పాడు "పెళ్ళి జరిగేప్పటి కన్నా ఇప్పుడే నాకు నీ అవసరం వుంది."

రెండు రోజులు అతనితో ఉన్నాను. ఓదార్చడం నాకు చేతకాదు. అంచేత మేం కలిసి, కొరియాలో పనిచేసిన రోజుల్లో తమాషా సంఘటనల గురించి మాట్లాడాం. అతను వాటికి నవ్వినా, ఆ నవ్వులో జీవం లేదు.

"ఏన్‌ని చంపిన బేంక్ దొంగ పేరు గార్డన్. అతను కొద్ది సంవత్సరాల తర్వాత మళ్ళీ స్వేచ్ఛగా జైల్లోంచి బయటకి వచ్చేస్తాడు. ఈ రాష్ట్రంలో మరణ దండన లేదు" చెప్పాడు సేమ్ ఓ సాయంత్రం.

మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి. ఓ ఉత్తరంలో రాశాడు సేమ్.."నే చెప్పినట్లే జరిగింది చూశావా? నా కాబోయే భార్యని చంపిన జార్జ్ గార్డన్ జైలునుంచి పూర్తి శిక్ష అనుభవించకుండానే విడుదలయ్యాడు. సత్ ప్రవర్తనట. జైల్లో కాదు, జైలు బయట మనుషులు సత్‌ప్రవర్తనతో ఉండాలి"

ఆ ఉత్తరానికి ఓ దినపత్రికలోని కటింగ్ జత చేసి ఉంది. అందులో జార్జ్ గార్డన్‌ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కాల్చి చంపాడన్న వార్త ఉంది.

ఆ వార్త కింద సేమ్ చేతి రాతతో ఇలా ఉంది. 'దీన్నే నేను న్యాయం అనేది. పగ కాదు.. న్యాయం.'

కొద్ది నెలల తర్వాత నేను ఉద్యోగం మారాను. నా కొత్త కంపెనీ మందుల కంపెనీ. ముడి సరుకు కొనే నిమిత్తం నేను రెండు, మూడు నెలలకోసారి శాన్‌ఫ్రాన్సిస్కోకి వెళ్లాల్సివచ్చేది. ప్రతిసారీ సేమ్‌ని కలిసే వాడిని.

ఓ రోజు సాయంత్రం బీర్ల మధ్య అడిగాను.

"నువ్వు పెళ్ళి చేసుకోదగ్గ అమ్మాయి నీకు మళ్ళీ తారసపడలేదా సేమ్? "

ఆ ప్రశ్నకి జవాబు చెప్పే ముందు అతను చూసిన చూపులో.. నా హృదయం ద్రవించే బాధ కనిపించింది.

"లేదు. ఏన్ ఇక తిరిగి బతికిరాదు"

"నేను నిన్నో ప్రశ్న చాలాకాలంగా అడగాలనుకుంటున్నాను"

"అడుగు"

"ఏన్‌ని చంపినతని మరణం గురించిన వార్త గల పేపర్ కటింగ్‌ని నువ్వు నాకు పంపావు. గుర్తుందా? "

"గుర్తుంది, ఏం? "

నేను నా మనసులోని విషయాన్ని మాటల్లోకి, ప్రశ్న రూపంలో అనువాదం చేయడానికి.. పడే అవస్థని, నా మొహమాటాన్ని కూడా గమనించి, నవ్వి చెప్పాడు.

"నువ్వు అడగని ప్రశ్నకి నేను జవాబు చెప్తాను విను. ఇదేం రహస్యం కాదు. బైబిల్‌లో దీని గురించి ఉంది. కంటికి కన్ను. ఈ రాష్ట్రంలో మరణదండన లేదు"

అతని సమాధానానికి నా మొహంలోకి రక్తం తన్నుకు వచ్చింది. చిన్నగా పాలమారి దగ్గాను.

"నాకు తెలుసు..నువ్వేం ఆలోచిస్తున్నావో! ఆ రోజు కొరియాలో జరిగిన సంఘటన, తర్వాత నేను చెప్పిన మాటలు కదా? " నవ్వాడు.

నేనేం మాట్లాడలేదు.

“కొరియాలో ఆ రోజు నేను చేసింది సరైన పనే. ఇక్కడి అమెరికాలో నేను చేసిందీ సరైన పనే. ఏన్‌ని చంపినందుకు అతన్ని బైబిల్‌లో చెప్పినట్లుగా ఎవరూ శిక్షించలేదు. మరి నేనేం చెయ్యాలి? ”

నేనా ప్రశ్నకి జవాబు చెప్పలేదు. చెప్పలేను కూడా. సాధ్యమైనంత త్వరగా సేమ్ నుంచి దూరంగా వెళ్లాలనిపించింది. ఆ తర్వాత నేను సేమ్‌ని కలవడం చాలా తగ్గించేశాను. అతని సెకండ్‌హేండ్ కార్ల అమ్మకం వ్యాపారం బాగా అభివృద్ధి చెందిన గుర్తుగా.. శాన్‌ఫ్రాన్సిస్కోలో చాలా చోట్ల కనిపించే ప్రకటన బోర్డులు నాకతన్ని గుర్తుకు తెచ్చేవి.

ఏడాది తర్వాత నేను శాన్‌ఫ్రాన్సిస్కోకి నా ఉద్యోగ రీత్యా వచ్చినపుడు, ఓ ఉదయం హోటల్‌గదిలో వేసిన లోకల్ పేపర్‌ని తిరగేస్తూ ఓ వార్తని చదివాను.

పధ్నాలుగేళ్ల అమ్మాయిని ఎవరో పాశవికంగా బలాత్కారం చేశారు. ఆమె శరీరం ఓ కారు ట్రంక్‌లో దొరికింది. గంటలో పోలీసులు ఆ కారు యజమాని పేరు, చిరునామాల్ని కనుగొన్నారు. అతన్ని పోలీసులు నెవేడా రాష్ట్రంలో అరెస్టు చేసి, క్రితం రోజు శాన్‌ఫ్రాన్సిస్కోకి తీసుకొచ్చారు. అతన్ని రైల్వేస్టేషన్‌నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి.. ప్రశ్నించడానికి తరలిస్తుండగా.. ఫోటోలు తీయడానికి పత్రికా విలేకరులు, చూడడానికి ప్రజలు హెడ్‌క్వార్టర్స్ బయట గుమిగూడారు. అతన్ని లోపలికి తీసుకెళ్తుండగా, ఆ గుంపులోంచి పేలిన తుపాకినుంచి వెలువడిన ఒకే ఒక గుండు.. తల వెనుక భాగంలో దిగి ఆ నిందితుడు తక్షణం మరణించాడు. గుమిగూడిన వందలమంది ఆ హత్యకి బెదిరి పారిపోయారు. వాళ్లతో పాటు హంతకుడు కూడా ఆయుధంతో సహా పారిపోయాడు.

అది చదివాక నాకు సేమ్ గుర్తుకు వచ్చాడు. అతన్ని చూసి ఏడాది దాటుతోంది. ఓ సారి చూడాలనుకుని అతనికి వెంటనే ఫోన్ చేశాను. నా కంఠం విని చాలా ఆనందపడ్డాడు.

“సాయంత్రం ఏం చేస్తున్నావు? కలుద్దాం” చెప్పాడు ఉత్సాహంగా. ఆ సాయంత్రం చీకటి పడుతుండగా నేను సేమ్‌ని కలిశాను.

“ఎలా ఉన్నావు ఎక్స్ కార్పొరల్? మీ ఆవిడ ఎలా ఉంది? తండ్రివయ్యావా? ” అడిగాడు.

ఏన్‌తో పరిచయం కాకముందటి సేమ్‌లానే కనిపించాడు. అతనిలో పూర్వపు విషాదం లేదు. మా భోజనానంతరం అతనితో నేను మాట్లాడాలనుకున్న టాపిక్‌లోకి సంభాషణ తీసుకెళ్లాను.

“ఇవాళ పేపర్లో.. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ముందు ఆస్కార్ అనే రేపిస్ట్‌ని ఎవరో కాల్చి చంపారని చదివాను. ఘోరం కదా? ” అని అడిగాను.

“ఘోరం? ఆస్కార్ చేసింది ఘోరం కాదా? ఓ మైనర్ అమ్మాయిని చంపడం ఇంకా ఘోరం”

“కానీ ఆస్కార్ నేరం.. విచారణ ద్వారా రుజువుకాలేదు కదా? ”

“విచారణ వల్ల కలిగే లాభమేమిటి? ఈ రాష్ట్రంలో మరణదండన లేదు”

“అందువల్ల ఆ హత్య న్యాయసమ్మతమనే అంటావా? ” అడిగాను సిగరెట్ వెలిగిస్తూ.

“అవును”

“జార్జ్ గార్డన్ హత్యలానా? ”

“అవును. జార్జ్‌గార్డన్ హత్యలా ఇదీ న్యాయమే”

“సేమ్.. నీకేమైంది? ” ప్రశ్నించాను.

“నాకేం కాలేదు. ఆధునిక మొరాలిటీలోనే ఏదో అయింది. నన్ను చూసిన వారంతా సెకండ్‌హాండ్ కార్ల వ్యాపారి అనుకుంటారు. నా లాంటి వాడికి న్యాయం ఉండదనుకుంటారు. కానీ వాళ్లని చూడు. హంతకులకి మరణదండన వేయరు. జైల్లో కూర్చో



'టాప్' సీక్రెట్



'నేను పెళ్లిచేసుకుంటే ఎంత మంది కుర్రాళ్లు డీలాపడతారో తెలుసా? '
ఇంటర్వ్యూలో గొప్పలు చెప్పుకుందో హీరోయిన్
'అసలు అంతమందిని చేసుకోడం ఎందుకో'
గొణిగాడు విలేకరి

బెట్టి మేపి బయటకి పంపుతారు. హంతకులంటే సానుభూతి వాళ్లకుంది. బాల్యంలో విషాదం, తక్కువ మేధాశక్తి, మానసిక అనారోగ్యం, దరిద్రం.. ఇలా ఏదో ఓ కారణంగా ప్రతీ హంతకుడి మీద సానుభూతిని వర్షిస్తున్నారు. హంతకులకి మరణదండన విధించే బదులు వాళ్లని పిచ్చాసుపత్రులకో, జైళ్లకో పంపుతున్నారు. బయటకి పంపి మళ్లీ వాళ్లు హంతకులవడానికి కారణమవుతున్నారు"

నాకు అతని మాటలకి గాలాడలేదు. దీర్ఘంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీసుకుని వదిలాను. సేమ్.. బిల్లు పే చేసి, నా భుజంమీద చేతిని వేసి నడుస్తూ చెప్పాడు "నేను న్యాయం జరిపించే విషయంలో వీరుడ్ని, యుద్ధ వీరుడ్ని"

"నీకు పిచ్చెక్కింది. ఇలా ఎంతకాలం? " ప్రశ్నించాను.

చీకట్లో అతని వంకర నవ్వుని క్షణకాలం కనబడ్డ పళ్ళద్వారా అర్థంచేసుకున్నాను.

"నువ్వు నా ప్రియమిత్రుడివి కాబట్టి నీకో రహస్యం చెప్తున్నాను విను. దీన్ని పోలీసుల ముందు నువ్వు రుజువు చేయలేవు కూడా. అందువల్ల నీకు చెప్పడంతో నాకెలాంటి హానీ కలగదు. సంవత్సరంగా అయిదుగురి హంతకుల హత్యల గురించి వార్తల్లో వచ్చింది. మిగిలిన వాళ్ళ గురించి ఎందుకో దినపత్రికలు ఉత్సాహం చూపించలేదు"

"అంతమందా? " అదిరిపడ్డాను.

"అవును. అంతా నేరస్థులే. ఆ పన్నెండు మందీ హంతకులే. మన చట్టాల వల్ల వాళ్ళు మరణదండనని తప్పించుకోగలిగారు.. నా నుంచి తప్ప"

నాకు మళ్ళీ ఊపిరాడలేదు. మాట్లాడాలని ప్రయత్నించినా, నా నోట్లోంచి చాలాసేపటికి కానీ మాటలు రాలేదు.

"నీకు మరణదండన విధించే హక్కు ఉందనుకుంటున్నావా సేమ్? " అడిగాను.

ఆ చీకట్లో సేమ్ జోడియాక్ మొహంలో ఎలాంటి భావాలు చోటుచేసుకున్నాయో గోచరించలేదు. అతని మాటలు మాత్రం నా చెవులకి మామూలుగానే వినిపించాయి.

"నా జాబితాలో ఇప్పటికీ ఇంకా ముగ్గురున్నారు. సరైన అవకాశాల కోసం చూస్తున్నాను"

"ముగ్గురు".. అదిరిపడ్డాను.

"ప్రస్తుతానికి" సన్నగా సేమ్ నవ్వు వినిపించింది నాకు.

అప్పుడు నేను సేమ్‌ని తోశాను. నా బలాన్నంతా ఉపయోగించి రైలింగ్ మీద కూర్చున్న అతని ఛాతీమీద..రెండుచేతులూ ఉంచి బలంగా వెనక్కి తోశాను. వెనక్కి పడుతూ అతను పెద్దగా అరిచాడు. కానీ, కొద్ది క్షణాల్లోనే అతను మూడు డిగ్రీల సెల్సియస్ మహా పసిఫిక్ సముద్రపు నీళ్లల్లో పడడంతో, ఆ అరుపు ఆగిపోయింది!

నేను శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండగానే, మర్నాడు అతని శరీరాన్ని జాలరులు కనుక్కున్నారు. ఆ వార్తలో అనుమానితుల గురించి ఎక్కడా లేదు. సేమ్‌కి శత్రువులెవరూ లేరని, సెకండ్ హేండ్ కార్ల వ్యాపారంలోని వారిలా కాక చాలా నిజాయితీపరుడని పోలీసులు పేర్కొన్నారు. అతను పొరపాటున పసిఫిక్ మహా సముద్రంలో పడ్డాడని పోలీసులు భావించారు.

ఆ తర్వాత నేను శాన్‌ఫ్రాన్సిస్కో దినపత్రికలకి చందాకట్టి, వాటిని నిత్యం చదువుతున్నాను. జైలునించి విడుదలైన హంతకులెవర్నీ ఆ తర్వాత ఎవరూ చంపిన వార్తలు రాలేదు. V

తెలుగు కథ



- కలిగినీడి దుర్గాదేవి



భాగస్వామ్యం

శ్రీరామా కోకోనట్ కంపెనీ, అల్లవరం.

ప్లాస్టరింగ్ లేకుండా ఉన్న నాలుగు ఇటుకల గోడలు. పైన కొబ్బరాకుల పైకప్పు. అదే కంపెనీ భవనం. లోపలా, బయటా ఎటుచూసినా ఎక్కడ చూసినా కొబ్బరికాయలే. పైడొక్కలు వలిచేసి పీచుతో ఉన్న కాయలు కొన్ని, మామూలుగా ఉన్నవి కొన్ని, రాశులు రాశులుగా ఉన్నాయి.

అక్కడే ఒక మూలకి ఒక టేబుల్, దాని లోపలివైపు పెద్ద కుర్చీ, దానిమీద పరచి ఉన్న బొచ్చుతువ్వాలు. బయట అరడజను నీల్‌కమల్ ప్లాస్టిక్ కుర్చీలు...

చుట్టుపక్కల కొబ్బరి తోటల యజమానుల నుంచీ, సైకిలు మీద తిరుగుతూ కొబ్బరి కాయలు కొనేవాళ్ల దగ్గర్నుంచీ కొబ్బరి కాయలు కొని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకీ, ఇతర రాష్ట్రాలకీ ఎగుమతి చేసే వ్యాపారం అది.

డబ్బు రొటేషన్‌కి ఇబ్బందిలేని కొంత మంది వ్యాపారులు, సమయాన్ని బట్టి కొబ్బరికాయల్ని కొని నిలవచేస్తూ, మంచి ధర పలికినప్పుడు అమ్ముతుంటారు. అదృష్టవశాత్తూ అంచనాలు నిజమై ఆశించిన ధర వస్తే... పండగే. ఎన్ని కాయలు నిల్వవుంటే అన్నీ రూపాయిలే. సాధారణంగా కొబ్బరికాయ తొమ్మిది నెలలు నిలవుంటుంది. తర్వాత కురిడీగా మారుతుంది.

శ్రీరామా కోకోనట్ కంపెనీకి సుబ్బరాజు, చక్రధర్‌లు భాగస్వాములు. మొదటగా ఆ వ్యాపారం పెట్టిన సుబ్బరాజు, ఆ తర్వాత స్నేహితుడు చక్రధర్‌కి వాటా ఇచ్చాడు. వ్యాపారం అనూహ్యంగా పుంజుకోవడంతో ఇద్దరి భాగస్వామ్యంలో మరిన్ని వ్యాపారాలు మొదలుపెట్టారు వాళ్లు. ఎటు చూసినా లాభాలే లాభాలు.

ఏటా లెక్కలు వేసుకుని సమానంగా పంచుకుంటున్నారు లాభాల్ని. భారీగానే వస్తోంది ఒక్కొక్కరి వాటాకి.

ఒకవేళ ఒకడు లేకపోతే...

★ ★ ★

'ట్రింగ్... ట్రింగ్...' ఫోను మోగుతోన్న శబ్దం రిసీవర్ తీసిన చిన్న చప్పుడుతో ఆగింది.

"హలో..."

"హలో చక్రం నేనూ..."

"చెప్పు"

"గుండె చేత్తో పట్టుకుని విను... కొబ్బరి రేటు హఠాత్తుగా మూడు రూపాయలు పెరిగింది..."

"నిజంగానా... ఎంత శుభవార్త చెప్పావ్... పెరిగిన రేటు ప్రకారం మనకో పది లక్షలు ఎక్స్‌ట్రా లాభం.. దాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి మనం..."

"తప్పకుండా..."

ఫోన్ పెట్టేసి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు చక్రధర్. అధిక ధనలాభం ఎప్పుడూ సంతోషదాయకమే. ఒక్కోసారి నేరాలకి ప్రేరకం కూడా. చాలా నేరాలకి డబ్బే ముఖ్య కారణం అవుతుంది.

★ ★ ★



అంతే చేశా!

జైలుకొచ్చిన జోగారావుని అడిగాడు సింగినాదం
'నువ్వుచేసిన నేరమేంటి? '
'బట్టల షాపు ఓపెన్ చేశా'
'అదేంటీ.. అంతమాత్రానికే జైలా? '
'కాదా మరి.. నేనా షాపుని ఓపెన్ చేసింది అర్ధరాత్రి!'

అల్లవరం నుంచి అమలాపురం మీదుగా ఏకధాటిగా ప్రయాణించిన కారు ఎదుర్లంక నుంచి గోదావరి మీది బాలయోగి వారధిని దాటి యానాం బైపాస్ రోడ్డులోని బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర ఆగింది.

మందు తాగే అలవాటున్న అందరికీ యానాం పేరు చెప్తేనే చాలా హుషారొస్తుంది. కారణం, అక్కడ మద్యం తక్కువ ధరకి లభించడమే. కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో యింకా చాలా వాటి ధరలు తక్కువ.

ఆ తక్కువ ధరల వల్లే మామూలుగా బయట హాఫ్‌బాటిల్ మందు తాగేవాడు కాస్తా అక్కడికెళ్తే ఫుల్లు తాగుతాడు.

వ్యాపార విజయం తాలూకు ఆనందాన్ని ఆస్వాదిస్తూ వేయించిన జీడిపప్పుని నంజుకుంటూ పీకల్దాకా తాగిన సుబ్బరాజు, చక్రధర్‌లు కాలాన్ని కోల్పోయారు.

వాళ్లకి తిరిగి సమయం చిక్కేసరికి...

"షాలా మంషి పాటీ ఇచావు షుబ్బరాజ్జూ. థాంక్స్... ఇల్లాంటి పాటీలు ఎన్నో షేసుకోవాలి మనం" ముద్దముద్దగా అంటున్నాడు చక్రధర్.

"అహహ... పార్టీ యిక్కడితో అయిపోలేదు. యింకా ఉంది."

"ఇంకానా..."

"అవును. మన పార్టీలో సగం గోదావరొడ్డున జరిగింది. మిగతాది కొండల్లో... మేఘాల మధ్యలో... కార్లో లాంగ్ డ్రైవ్‌కి వెళ్తూ..." ఊరించాడు సుబ్బరాజు.

"వా...వ్... ఇల్లాంటివి ప్లాన్ షెయ్యాలంటే నీ్న తర్వాతే షుబ్బరాజూ... సెబాస్..." అంటూ విజిలేశాడు చక్రధర్.

మందు బాటిల్స్, వాటర్ బాటిల్స్, జీడిపప్పు ప్యాకెట్లు, సిగరెట్ పెట్టెలు కొని కార్లోపడేసి, చక్రధర్‌ని ఎక్కించుకుని బయలుదేరాడు సుబ్బరాజు.

★ ★ ★

కాకినాడ మీదుగా కార్‌ని పోనిచ్చి కత్తిపూడిలో హైవే పక్కన దాబా దగ్గర ఆపాడు సుబ్బరాజు.

అక్కడ ఇద్దరూ మళ్లీ తాగీ, తిన్నాక బయలుదేరారు.

కారు అన్నవరం, తలుపులమ్మలోవ దాటాక తునికి ముందు నుంచి ఎడం పక్కకి తిరిగింది. అప్పటిదాకా వెనకసీట్లో కూర్చుని తాగుతూ ఏకధాటిగా అదీ యిదీ వాగుతోన్న చక్రధర్ అప్పటికి మత్తులోంచి నిద్రలోకి జారిపోయాడు.

నర్సీపట్నం దాటాక మొదలైన ఘాట్‌రోడ్డులో వెళ్తోంది కారు. ఒక్కో కొండా ఎక్కుతూ అర్ధరాత్రి దాటాక నరసంచారం అస్సలుండని దట్టమైన అడవిలో ఆగింది.

పచ్చా పచ్చటి ఆ కొండలన్నీ కాటుకని పులుముకున్నట్టు చీకట్లో నల్లగా... నలుపు రంగు ముద్దలా కనిపిస్తున్నాయి. ఆకాశంలో భయం భయంగా మెరుస్తున్నాయి నక్షత్రాలు. చంద్రుడు భయంతో ముందే చీకటి దుప్పటి కప్పేసుకున్నట్టున్నాడు. నలుపురంగు తప్ప కన్ను పొడుచుకున్నా మరొకటి కనిపించని ఆ కారుచీకట్లో అంతా బాగా తెలిసిన, అలవాటైన మనిషిలా ఇంజన్ ఆఫ్‌చేసి కిందకి దిగాడు సుబ్బరాజు. నిషాతో మత్తుగా పడిపోయి ఉన్న చక్రధర్‌ని బయటకి లాగి భుజాన వేసుకుని నడవడం మొదలుపెట్టాడు.

దెయ్యాలు సైతం భయంతో హడలి చచ్చేటంత దట్టమైన అడవి. పైగా చీకటి. కాళ్లకింద నలుగుతోన్న ఎండుటాకుల



ర్యాంకు వీరుడు



'మమ్మీ! పది పెద్దదా? వంద పెద్దదా? '
'అదేంట్రా.. ఆ మాత్రం తెలీదా? వందే పెద్దది'
'అయితే ఓకే మమ్మీ! పరీక్షల్లో నాకు పెద్ద ర్యాంకే వచ్చింది'

చప్పుడే డి.టి.ఎస్.లా వినిపిస్తోన్నంత నిశ్శబ్దం. దారి చూపించమంటూ పత్రికల్లో వచ్చే పజిల్స్‌లోని గీతల్లా వంకర టింకరగా పెరిగిన చెట్లు. వాటి మధ్య నుంచి తాపీగా నడచిపోతూన్న సుబ్బరాజు, భేతాళుడ్ని భుజాన మోస్తున్న పట్టువదలని విక్రమార్కుడిలా ఉన్నాడా క్షణం.

అడవిని ఆనుకుని ఉన్న పెద్ద కొండమీదకి ఎక్కుతున్నప్పుడు మాత్రం ఆయాసంతో గసపోసుకుంటూ చాలా శ్రమపడ్డాడు సుబ్బరాజు. అయినా పట్టువదల్లేదు. చక్రధర్‌ని కిందకి దించలేదు. అనుకున్నది సాధించేదాకా నిద్రపోని చాలా మందిలో ఉండే లక్షణమే అది. ఆ మొండితనం, బండతనం వాళ్లకి ఆ ఆశయసాధన మీది ఆశే కల్పిస్తుంది మరి... అవన్నీ సుబ్బరాజు నిండా నిండి ఉన్నాయా సమయంలో.

ఎలాగైతేనేం కొండమీదకి చేరాక చక్రధర్‌ని కిందికి దింపాడు సుబ్బరాజు. మరో భుజానికి వేలాడుతున్న సంచిలోంచి ప్లాస్టిక్ తాడు తీశాడు. చక్రధర్ ఒంటిమీద బట్టలన్నీ తొలగించాడు. కాళ్లూ చేతులూ కట్టేశాడు. మరో తాడుని అతడి ఒళ్లంతా చుట్టేశాడు. నోరుతెరచి గుడ్డలు కుక్కి ప్లాస్టర్ వేశాడు. నాలుగు పెద్ద పెద్ద రాళ్లు తెచ్చి అతనికి నాలుగువైపులా పెట్టాడు, లోయలోకి జారిపోకుండా ఉండటానికి.

మత్తులో స్పృహ కోల్పోయినట్టున్న చక్రధర్, సుబ్బరాజు ఎలా జరిపితే అలా జరుగుతూ శవానికిమల్లే పడి ఉన్నాడు.

కాళ్ల దగ్గరున్న బండరాయి వెనకాల చిన్న గొయ్యి తవ్వి ఒక కర్రపాతాడు. దానికి ఒక నలుచదరపు అట్టముక్కని వేలాడదీశాడు. దాని మీది అక్షరాలు చీకట్లో కనిపించడం లేదుగానీ వెలుగులో అయితే యిలా ఉంటాయి.

'చక్రధర్... నీకు వ్యాపారంలో మాత్రమే భాగస్వామ్యం యిచ్చాను. నా జీవిత భాగస్వామిలో కాదు. అత్యంత రహస్యంగా నువ్వు నాకు ద్రోహం చేయడం ద్వారా నేరం చేశావు. మూడో కంటికి తెలియకుండా దానికి నేన్నీకు శిక్ష వేసి న్యాయం చేశాను.

మీ ఇద్దరి సంగతి తెలిసి... నువ్వు మా బెడ్‌రూమ్‌లో ఉన్నప్పుడు కూడా మా యింటి డాబామీద వెల్లకిలా పడుకుని పగతో రగిలిపోతూ, నాలో నేను కుమిలిపోతూ.... ఆకాశంలోని నక్షత్రాల్ని చూస్తూ ఎన్నో రాత్రులు గడిపాను నేను. ప్రతిసారీ నిన్నెలా శిక్షించాలా అని ఆలోచించీ ఆలోచించీ ఈ పథకం వేశాను. ఇప్పుడు నాలాగే నువ్వు కూడా బతికి వున్నన్నాళ్లూ రాత్రిళ్లు ఆకాశంలో నక్షత్రాల్ని లెక్కపెడుతూ గడపాలి కదా... ఎలా ఉంది శిక్ష? ... బాగుంది కదూ.

మైడియర్ పార్ట్‌నర్... ఈ ద్రోహంలోని నీ పార్ట్‌నర్‌ని కూడా త్వరలోనే నీ దగ్గరికి పంపిస్తాను. ఉంటాను మరి'

★ ★ ★

డబ్బు తర్వాత, డబ్బుంతగా నేరాల్ని ప్రేరేపించేది అక్రమ సంబంధాలేనట. ఎక్కడో చదివింది తన జీవితంలో అనుభవంగా ఎదురైనందుకు బాధగానే ఉంది సుబ్బరాజుకి.

చట్టం చేతులు చాలా పొడవన్నది మాత్రం ఎదురు కాకూడదని నిత్యం అపరాధ భావంతో వేయి దేవుళ్ళకు మొక్కుకుంటున్నాడు సుబ్బరాజు. Ⓥ

బ్రిటన్ కథ



-జెఫ్రీ ఆర్చర్

ప్రయాణం

అనువాదం : కె.వరలక్ష్మి

మే 1986..

భార్యతో ఎయిర్‌పోర్ట్‌కి వెళుతుంటే.. హమీద్‌కి నవ్వొచ్చింది. అయిదు సంవత్సరాల క్రితం అది సాధ్యంకాలేదు.. వాళ్లు అమెరికాకు రాజకీయ బహిష్కృతులుగా వచ్చినప్పుడు. అప్పట్నించి అతను న్యూయార్క్‌లో కొత్త జీవితాన్ని ప్రారంభించాడు. జీవితంలో ఏదైనా సాధ్యమే అనుకుంటున్నాడిపుడు..

"తిరిగి ఎప్పుడొస్తావ్ నాన్నా? " కొడుకు నదీమ్ అడిగాడు. కారు వెనకాల సీట్లో నడుంకి బెల్టుకట్టుకొని వున్నాడా కుర్రాడు. పక్కనే చెల్లి 'మే' వుంది. తండ్రి వూరు వెళుతున్నాడన్న విషయం కూడా తెలీని చిన్నపిల్ల ఆమె.

"పదిహేను రోజులు మాత్రమే.. ఒట్టు. తర్వాత మనందరం సెలవుకి టూర్ వెళదాం" తండ్రి చెప్పాడు.

"పధ్నాలుగు రోజులు ఎక్కువ డాడీ" కొడుకు అన్నాడు.

"పధ్నాలుగు రాత్రిళ్లు కూడా".. కారుని టర్కీష్ ఎయిర్‌వేస్ అనేచోట ఆపుతూ అంది భార్య. డాష్ బోర్డులో బటన్ నొక్కితే తలుపు తెరుచుకుంది. హమీద్ సామాను తీసుకొని దిగాడు. కూతుర్నీ కొడుకునీ కౌగలించుకున్నాడు. కూతురు ఏడుస్తోంది.. తండ్రి వెళుతున్నందుకు కాదు! కారు ఆగినందుకు ఆ పిల్ల ఏడుస్తోంది. అంతకుముందు తండ్రి మీసాలు సాగదీస్తూ ఆనందపడింది.

"పధ్నాలుగు రోజులా? " కొడుకు ఇంకా అంటూనే వున్నాడు. హమీద్ భార్యని కౌగలించుకున్నాడు. 'మూడో బిడ్డ..ఇదిగో నేనున్నాన'ంటూ ఆమె ఉబ్బెత్తుగా వున్న పొట్ట అతడ్ని స్పృశించింది.

"మేం మళ్లీ ఇక్కడే ఎదురుచూస్తూ వుంటాం..మరి మీరొచ్చే రోజునాటికి" అంది భార్య.

సామానుని చెక్ చేశాక, ఎయిర్‌పోర్ట్ అధికారులు అతణ్ణి టర్మినల్‌లోకి పంపించారు. టర్కిష్ ఎయిర్‌లైన్ డెస్క్ వైపు వెళ్లాడు. అదే ఫ్లైట్‌లో సంవత్సరానికి రెండుసార్లు ప్రయాణం చేస్తాడు కాబట్టి.. అతడికి అన్ని విషయాలూ తెల్సు.

అతణ్ణి పూర్తిగ చెక్ చేశాక బోర్డింగ్ పాస్ యిచ్చారు. ఇంకా గంటసేపు వెయిట్ చెయ్యాలి.. ఫ్లైట్ కోసం. గేట్ బి వైపు వెళ్లాడు. పామ్ ఆమ్ చెక్ డెస్క్ గుండా వెళ్లినవాళ్లు అతడికంటే గంట ముందు వెళతారు..వాళ్లు దానికోసం అరవైమూడు డాలర్లు లంచం యిచ్చారు.

చెక్ ఇన్ ఏరియాలోకి అడుగుపెట్టాక టర్కీష్ ఎయిర్‌లైన్స్ స్టీవార్ట్స్ వచ్చి ఫ్లెయిట్ 014కి గుర్తుపెట్టాడు. న్యూయార్క్- లండన్ - ఇస్తాంబుల్ అని బోర్డుమీద రాసి వుంది. తర్వాత 10.10కి విమానం బయలుదేరుతుంది.

విమానం సీట్లు.. కాస్మోపాలిటన్ ప్రయాణికులతో వరుసగా నిండిపోతాయి. అక్కడున్న టర్క్స్ అంతా తమ కుటుంబా

లను చూడటానికి వాళ్ల దేశం వెళుతున్నారు.

హమీద్ రెస్టారెంట్- బార్ వైపు వెళ్లాడు. కాఫీ ఆర్డర్ చేశాడు.. రెండు ఉడకబెట్టిన గుడ్లు కూడా. అవి తింటూన్నప్పుడు అమెరికాలో తాను ఎంత స్వేచ్ఛగా వున్నాడో గుర్తుకు వస్తుంది.

'ఇస్తాంబుల్ వైపు వెళ్లే ప్రయాణికులు, చిన్న పిల్లలు వున్నవాళ్లు వచ్చి విమానంలో కూర్చోండి' అని స్టీవార్ట్స్ స్పీకర్‌లో చెప్పాడు.

ఆఖరి గుక్క కాఫీ తాగి హమీద్ విమానంవైపు బయలుదేరాడు. 'ఆఖరి క్షణంలో బయలుదేరటం' అనే అమెరికా అలవాటు అతడికి ఇంకా అబ్బలేదు. బిల్ చెల్లించి.. డాలర్‌ను టిప్‌గా వదిలాడు.

'సీట్ల సంఖ్య 35 నుండి 41 వరకు వున్న వారు సీట్లలో కూర్చోండి' ఎనౌన్స్ చేశారు మళ్లీ.

హమీద్ బ్రీఫ్‌కేస్ తీసుకొని పాసేజ్ వే వైపు వెళ్లాడు. టర్కిష్ ఆఫీస్ వర్కర్ అతడి బోర్డింగ్ పాస్‌ని తనఖీ చేసి విమానంలోకి అనుమతించాడు.

అతడికి కిటికీ పక్క సీటు దొరికింది.. ఎకానమీ క్లాస్ వెనుక వైపు. 'పది నెలలు దాటితే బిజినెస్ క్లాస్‌లో ప్రయాణం చేస్తాను' అనుకున్నాడు. అప్పటికి అతడి జీతం పెరుగుతుంది.

ఫ్లైట్ చక్రాలు గాల్లోకి లేచాయి. అమెరికా భూమి తన కంటినుండి దూరం అవుతోంది.. అతడి ఆలోచనలు గతంవైపు దూసుకు వెళ్లాయ్.

★ ★ ★

హమీద్‌ను.. సద్దాం హుస్సేన్.. ఇరాక్ కేబినెట్ నుంచి తప్పించి అప్పటికి అయిదు సంవత్సరాలు గడిచాయి. అతను గవర్నమెంట్‌లో రెండు సంవత్సరాలు వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆ టైమ్‌లో రెండు తడవలూ గోధుమ పంటలు దెబ్బతిన్నాయి. ప్రజా సైన్యం తినగా, దళారులు దోచుకోగా, ఇరాకీ ప్రజలకు మిగిలింది చాలా తక్కువ. ఎవరో ఒకరు నింద భరించాలి కదా.. అందరూ కల్సి హమీద్‌ని బలిపశువు చేశారు. హమీద్ తండ్రి 'ఈ రాజకీయాలెందుకురా? చక్కగా కార్పెట్ల వ్యాపారం చేసుకో'మని సూచించాడు. ఆ మాట వినకపోవడం వల్లనే ఈ దుష్పరిమాణాలన్నీ! అంతక్రితం వ్యవసాయ శాఖ తీసుకున్న మంత్రులిద్దరూ మాయమయ్యారు.. ఇరాక్‌లో మాయమయ్యారూ అంటే హత్యకు గురయ్యారన్నమాటే! కానీ హమీద్ ఛాలెంజ్‌గా వ్యవసాయశాఖ తీసుకున్నాడు. ఎప్పటికైనా వ్యవసాయమే దేశాభివృద్ధికి తొలిమెట్టు అని నమ్మాడతను.

సద్దాం హుస్సేన్ కూడా 'నా మిత్రుడు' అని గర్వంగా అందరిముందూ ప్రకటించేవాడు. కానీ పరిస్థితులు తారుమారయ్యాక, హమీద్ దేశాన్ని వదిలి పారిపోవటానికి సహకరించిన ఒకే మిత్రుడిని సద్దాం అనుచరులు హతమార్చారు. ఆ తర్వాత అతడి మిత్రులందరూ హత్యకు గురయ్యారు.. ఒ..క..రి..తర్వాత.. ఒ..క..రు.

అతడు తీసుకున్న ఒకే ముందు జాగ్రత్త.. ప్రతివారం బ్యాంక్ నుండి కేష్ డ్రా చెయ్యడం. ఆ డబ్బుని అమెరికన్ డాలర్స్‌గా మార్చడం.. కొద్దిగా. మరీ ఎక్కువగా మార్చితే అనుమానం వస్తుంది. ఇరాక్‌లో ప్రతి ఒక్కడూ.. గూ..ఢ..ఛా..రే.

అతడిమీద ఆరోపణలు, విచారణలు ప్రారంభమయ్యాక.. పరుపుకింద ఎంత సొమ్ముందో చూశాడు. దాదాపు పదకొండు వేల డాలర్లు వున్నాయి.

ఆ రోజు గురువారం. బాగ్దాద్‌లో సెలవుదినం. అతడు, గర్భిణీ భార్య .. ఎర్బిల్ వెళ్ళే బస్ ఎక్కారు, ఎవరి కంటా పడకుండా. అతడి మెర్సిడస్ కారుని ఒక పెద్ద యింటిముందు పార్క్ చేసినట్టు వదిలే



శాడు. వాళ్లు సామానేం తీసుకు వెళ్లలేదు తమ వెంట. పాస్‌పోర్ట్స్ మాత్రం వున్నాయి. భార్య గర్భిణీ పొట్టకింద.. డాలర్లు దాచారు.

బస్‌లో అదృష్టవశాత్తూ ఎవరూ గమనించలేదు. ఎర్బిల్ చేరాక ఇద్దరూ కల్సి టాక్సీలో సులేమానియా చేరుకున్నారు. మిగిలిన దీనార్లు డ్రైవర్‌కిచ్చారు. చిన్న హోటల్‌లో ఆ రాత్రి గడిపారు. మరుసటిరోజు బస్‌లో కుర్దిస్తాన్ కొండల్లోకి వెళ్లారు. ఆ సాయంత్రం జాకో చేరుకున్నారు.

ఆఖరి ప్రయాణం చాలా స్లోగా గడిచింది. కొండల్లో గాడిదలమీద ప్రయాణించారు. బోర్డర్ చేరుకున్నారు. ఒక కుర్దిష్ స్మగ్లర్ సహాయం చేశాడు. బోర్డర్ వద్దకు చేరుకున్నాక, నడకతో టర్కీ దేశంలోని ఒక చిన్న గ్రామానికి చేరుకున్నారు. నిద్రలేని రాత్రి గడిపాక, ఇస్తాంబుల్ వెళ్లే మొదటి రైలు ఎక్కారు.

టర్కీ రాజధాని వెళ్లేవరకు ట్రైన్‌లో గాఢ నిద్రపోయారు. దిగిన వెంటనే బ్యాంక్‌లో పదివేల డాలర్లు డిపాజిట్ చేశాడు. తర్వాత అమెరికన్ ఎంబసీకెళ్లి తన డిప్లొమేటిక్ పాస్‌పోర్టు సమర్పించి.. రాజకీయ ఆశ్రయం కల్పించమని కోరాడు. అతడి తండ్రి ఎప్పుడూ చెప్తూ వుండేవాడు.. అమెరికన్స్ ఇరాక్ మంత్రుల పట్ల సదభిప్రాయం కలిగివున్నారని.

ఎంబసీ వారు ఆ పూట మంచి గెస్ట్‌హౌస్ ఇచ్చారు. వాషింగ్టన్‌కి ఓ విషయం ఫోన్‌లో చెప్పారు వాళ్లు.. ఇరాక్‌లో చిన్న కూప్ జరిగిందని. అమెరికన్ అధికారులు హమీద్‌కి ప్రామిస్ చేశారు.. అమెరికన్ వీసా ఏర్పాటు చేస్తామని, ఆశ్రయం కల్పిస్తామనీ..

ఆ తర్వాత టర్కీ బజార్లలో తిరిగి విలువైన కార్పెట్లు కొనుగోలు చేశాడు.

అమెరికన్ వీసా వచ్చాక ఆ కార్పెట్లతో సహా న్యూయార్క్‌లో అడుగుపెట్టాడు. సి.ఐ.ఏ. వాళ్లు ఓ పట్టాన వదిలిపెట్టలేదు. అయిదురోజులు తీవ్రంగా ప్రశ్నించారు. హమీద్ ఇచ్చిన సమాచారం అమెరికాకు బాగా ఉపయోగకరం. అందుకే అతణ్ణి ఫ్రీగా వదిలారు. అతడు, భార్య.. కార్పెట్లతో సహా ట్రైన్ ఎక్కి మరో నగరం చేరారు.

అది ఆరంభం. ఆ కార్పెట్లు అమ్మి సొమ్ము చేసుకొని, మళ్లీ అదే కార్పెట్ల వ్యాపారం చేసి కోట్లు గడించాడు. పెద్ద అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాడు. 'ఏదైనా సరే అమెరికాలో సాధ్యం' అంటూ వుంటాడు భార్యతో. అతడు.. సంపూర్ణ అమెరికన్ సిటిజన్. కేవలం ప్రవాస దేశీయులకిచ్చే నీలిరంగు పాస్‌పోర్టు మాత్రమే కాదు.. అతడు చాలా ధనవంతుడు కూడా. సద్దాం హుస్సేన్ బతికుండగా (ఈ కథ 1986లో జరిగింది) మళ్లీ ఇరాక్‌లో అడుగుపెట్టనని ప్రతిజ్ఞ చేశాడు. అతడి స్టేటస్‌ని, ఆశ్రయాన్నీ.. ఇరాక్ సవాల్ చేసింది. చివరకు డెత్ సెంటెన్స్ పాస్ చేశారు కూడా. అతను బాగ్దాద్‌లో మళ్లీ అడుగుపెట్టలేడు. పెడితే.. మ..ర..ణ.. శి..క్షే.

ఆలోచనల నుంచి తేరుకున్నాడతను.. లండన్‌లో ఆగాక.. విమానం ఇస్తాంబుల్ ఎయిర్‌పోర్టులో ఆగింది. అతను దిగి మార్కెట్‌కెళ్లి చాలా కార్పెట్లు కొనుగోలు చేశాడు. అక్కడే పదిహేను రోజులు గడిపాడు.

తిరుగు ప్రయాణం ఆరంభమయ్యింది. ఎప్పుడు అమెరికా వెళ్లి పిల్లల్ని చూద్దామా? అని తహతహలాడుతున్నాడు. హమీద్ పరిస్థితి చూసి ఫ్లైట్ అటెండెంట్ "తొందరపడకండి సార్... మీ ఫ్యామిలీని కొద్ది గంటల్లో కల్సుకోవచ్చు" అంది అమెరికన్ యాసలో. లంచ్ సర్వ్ అయింది. హమీద్ ఫ్లైట్‌లో వేసే సిన్మా పట్ల ఆసక్తి ప్రదర్శించలేదు. మత్తు ఆవహించిందతడ్ని. భవిష్యత్ గురించి బంగారు కలలు కంటూ గాఢనిద్రలోకి జారుకున్నాడు.

అప్పుడే.. సరిగ్గా అప్పుడే.."లేడీస్ అండ్ జెంటిల్‌మెన్! దయచేసి జాగ్రత్తగా వినండి" అంటూ కెప్టెన్ గొంతు ఇంటర్‌కమ్‌లో వినపడింది.

"మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు విచారిస్తున్నాను. మన ఫ్లైట్ ఇంజన్‌లో చిన్న ప్రాబ్లమ్ వచ్చింది. భయపడాల్సిన పనేమీ లేదు. ఏవియేషన్ అధికార్లు దగ్గరలోని విమానాశ్రయంలో దిగిపొమ్మని ఆర్డర్ వేశారు. ఆ సమస్య తీరాక మళ్లీ బయలుదేరదాం"

హమీద్ అకస్మాత్తుగా నిద్రలేచాడు.

మళ్లీ కెప్టెన్ గొంతు వినబడింది "మనం విమానం నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగాల్సిన (డిస్ ఎంబార్కింగ్) పని లేదు. ఎందుకంటే ఇది మన షెడ్యూల్ స్టాప్ కాదుగా. ఏమైనప్పటికీ మనం బాగ్దాద్ ఎయిర్‌పోర్ట్‌ని కూడా ప్రయాణంలో చూశామని కథలుగా చెప్పుకోవచ్చు"

వింటున్న హమీద్ మొత్తం శరీరం చెమటతో తడిసి ముద్దయింది. వణికిపోయాడు. తల ముందుకు తూలిపోయింది.

వెంటనే అటెండెంట్ వచ్చింది. "ఫర్వాలేదుగా సార్?" అంది నమ్రతగా, అతడి ఆందోళనను గమనించి.

అతడు బేలగా ఆమె కళ్లలోకి చూస్తూ అన్నాడు "నేను అర్జెంటుగా కెప్టెన్‌ని కలవాలి! అ..ర్జెం..టు.గా.

ఫ్లైట్ అటెండెంట్ అతడి పరిస్థితిని బాగానే అర్థం చేసుకుంది. వెంటనే అతణ్ణి ఫస్ట్‌క్లాస్ లాంజ్ గుండా ఫ్లైట్ డెక్‌లోకి తీసుకెళ్లారు.

ఆమె కాక్‌పిట్ డోర్‌ని తట్టి, తెరచి.. "కెప్టెన్! ఒక ప్రయాణికుడు మీతో అర్జెంటుగా మాట్లాడాలనుకుంటున్నాడు" అంది.

"రమ్మను" అన్నాడతను.



వీడెవడండీ బాబూ!

'మా వాడి జ్ఞాపకశక్తి మరీ ఘోరంరా'

'ప్రతిదీ మర్చిపోతుంటాడా?'

'మర్చిపోవడమా.. పాడా! ప్రతి ఒక్కటీ గుర్తుపెట్టుకుంటాడ్రా'

హమీద్‌ని కెప్టెన్ చూశాడు. హమీద్ వణికిపోతున్నాడు.

"నేను మీకు ఏవిధంగా సాయపడగలను సార్?" అన్నాడు కెప్టెన్.

"నా పేరు హమీద్.. నేను అమెరికన్ సిటిజన్ని. నేను బాగ్దాద్‌లో దిగితే.. నన్ను అరెస్ట్ చేస్తారు, హింసిస్తారు, చివరకు ఉరితీస్తారు.." అతడి మాటలు తడబడుతున్నాయ్. "నేనొక రాజకీయ బహిష్కృతుడ్ని.. వాళ్లు నన్ను చూసిన వెంటనే కాల్చేస్తారు కూడా.."

కెప్టెన్.. హమీద్ పరిస్థితిని వెంటనే అర్థం చేసుకున్నాడు. కో పైలెట్‌కి తన పని కూడా అప్పగించాడు. "నేను ఇతడితో మాట్లాడుతూ ఉంటా.. కిందనుంచి క్లియరెన్స్ వచ్చాక నన్ను పిలువు" అన్నాడు కెప్టెన్.. కో పైలెట్‌తో.

జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు వివరించాడు హమీద్.. కెప్టెన్‌కి. అంతా విన్నాక కెప్టెన్ నవ్వి "భయపడాల్సిన అవసరం లేదు సర్. విమానాన్ని ప్రయాణికులెవ్వరూ ఎట్టి పరిస్థితుల్లోనూ వదలరు. పాస్‌పోర్ట్ చెక్ చేయడం ఉండదు. ఇంజను ఒకసారి బాగయ్యాక తిరిగి వెళ్లిపోవడమే.." అన్నాడు.

బాగ్దాద్ ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్ ఇచ్చింది.. ఇరవై నిముషాలలో ఇరాక్ భూమి మీద లాండ్ అయింది విమానం.

హమీద్ వణుకు ఇంకా ఎక్కువైంది. విమానం చక్రాలు ఇరాక్ భూమిని తాక

ఆపండోచ్



'ఆపండి గోల. లేదంటే నా ప్రసంగం ఆపేస్తా' జనాన్ని బెదిరించాడో రాజకీయ నాయకుడు.

'ముందు నువ్వా ఉపన్యాసం ఆపు. అప్పుడిక ఏ గొడవా ఉండదు' జనంలో అరిచాడొకడు

గానే అతడు దాదాపు స్పృహతప్పాడు. కిటికీలోంచి చూశాడు.. ఆయుధాలు ధరించిన సైనికులు పహారా కాస్తున్నారు.. అతడు అల్లాని ప్రార్థించాడు.. జీసస్‌నీ ప్రార్థించాడు.. అమెరికా అధ్యక్షుడుగా ఉండిన రొనాల్డ్ రీగన్‌ని కూడా ప్రార్థించాడు.

పదిహేను నిమిషాల తర్వాత నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఓ వ్యాన్ వచ్చి ఆగింది.

అందులోంచి ఇద్దరు ఇంజినీర్లు సామాన్ల సంచి మోసుకుంటూ దిగటం హమీద్ కంటపడింది. చిన్న క్రేన్ ఎక్కి విమానం రెక్కలోని ఇంజన్ బాగుచేయడం ప్రారంభించారు. కొన్ని ప్లేట్లు ఊడదీశాక, పని ఆపి మళ్లీ టెర్మినల్ వైపు వెళ్లారు.

హమీద్ రిలాక్స్‌గా ఫీలయ్యాడు. సీటు బెల్టుని సర్దుకుని కూర్చున్నాడు. అతడి గుండె కొట్టుకునే వేగం తగ్గింది. కొన్ని నిమిషాల వరకూ ఏం జరగలేదు. హమీద్ మళ్లీ టెన్షన్ పడ్డాడు. అప్పుడే కాక్‌పిట్ డోర్ తెరుచుకుంది. కెప్టెన్ తనవైపు నడుచుకుంటూ వచ్చాడు. అతడి ముఖంలో ఏదో సంశయం చోటు చేసుకుంది.

"మీరు మా ఫ్లైట్ స్టాఫ్‌తో కలవడం మంచిది" అని అతడి చెవిలో గొణిగాడు. హమీద్ భయంతో లేచి కెప్టెన్‌ని అనుసరించాడు. కాక్‌పిట్ తలుపు మళ్లీ మూసుకుంది.

కెప్టెన్ ఇలా అన్నాడు "ఇంజనీర్లు ప్రాబ్లమ్ ఎక్కడుందో కనుక్కోలేకపోయారు. గంట తర్వాత చీఫ్ ఇంజనీర్ వస్తాడు.. అందుకే విమానం అంతా ఖాళీ చేయాలని ఆదేశాలు వచ్చాయి"

'ప్లేన్ కూలిపోయి నేను చనిపోయినా బావుండేది' బరెస్ట్ అవుతూ అన్నాడు హమీద్.

"బాధ పడకండి మిస్టర్ హమీద్! మేం ఉపాయం కనుక్కున్నాం. మా ఫ్లైట్ స్టాఫ్ యూనిఫామ్ వేసుకోండి. తర్వాత మీరు మాతోపాటే ఉండొచ్చు. ఎవరూ మిమ్మల్ని పాస్‌పోర్ట్ అడగరు".

"ఎవరైనా నన్ను గుర్తుపడితే? " హమీద్ అన్నాడు భయంగా.

"మీరు మీసాన్ని తీసేయండి. తర్వాత ఫ్లైట్ ఆఫీసర్ యూనిఫామ్ ధరిస్తారు, నల్ల కళ్ళజోడు, పెద్ద టోపీ పెట్టుకుంటారు.. ఎవరూ గుర్తుపట్టరిక"

మీసాన్ని తీసేయడం, మేకప్ వేసుకోవడం క్షణాల్లో జరిగాయి. ప్రయాణికులు ముందు విమానం దిగారు. ఎయిర్‌పోర్టు బస్ వచ్చి వాళ్లని తీసుకెళ్ళింది.. ఇంకో వ్యాన్ వచ్చి స్టాఫ్‌ని ఎక్కించుకుంది. అందులో హమీద్.. వాళ్ల సంరక్షణలో ఒదిగి కూర్చున్నాడు. వ్యాన్ టర్మినల్ వైపు వెళ్లే కొద్దీ మరణానికి దగ్గరవుతున్నట్లు ఊహించుకోసాగాడు.

సెక్యూరిటీ గార్డ్ విమానపు సిబ్బందిని పట్టించుకోలేదు. ఓ పెద్ద హాలులో సిబ్బందిని అంతా కూర్చోబెట్టారు. అక్కడే హాలుకున్న గోడపై 'సద్దాం హుస్సేన్' యూనిఫామ్ ధరించి.. చేతిలో కలాషినికోవ్ తుపాకీతో వున్న నిలువెత్తు ఫొటో వేలాడుతోంది. హమీద్ ఆ ఫొటోవంక భయంగా చూశాడు.

ఇంకో విమానం సిబ్బంది కూడా అక్కడే కూర్చుని వున్నారు. హమీద్ వాళ్లతో మాటలు కలపలేదు.

"వాళ్లు ఫ్రెంచ్ విమానపు సిబ్బంది" అన్నాడు పైలెట్. ఫ్లైట్ అటెండెంట్.. ఫ్రెంచ్ కెప్టెన్‌తో మాట్లాడటానికి ప్రయత్నించింది. వాళ్లు న్యూఢిల్లీ మీదుగా సింగపూర్ వెళ్ళబోతున్నారట.

అప్పుడే సాద్-ఆల్-టక్రిటీ రావడం హమీద్ చూశాడు. అతడి గుండెల్లో రాయి పడింది. టక్రిటీ.. సద్దాం హుస్సేన్ వ్యక్తిగత సంరక్షకుడు. ఇప్పుడు ఎయిర్‌పోర్ట్ సిబ్బందికి లీడర్ అతనే!

"చీఫ్ ఇంజనీర్ విమానాన్ని తనిఖీ చేస్తున్నాడు. మనమిక్కడ ఎక్కువసేపు ఉండం" ధైర్యం చెపుతూ అన్నాడు పైలెట్.

అప్పుడే వెళుతున్నవాడల్లా టక్రిటీ వెనక్కి తిరిగొచ్చి హమీద్ వంక తేరిపార చూశాడు. మళ్లీ వెంటనే పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

"వాడు నన్ను గుర్తుపట్టాడు" అన్నాడు హమీద్ కెప్టెన్‌తో.

అతడి మేకప్ కరిగిపోయి పెదాలపై కారసాగింది.

మళ్లీ టక్రిటీ తిరిగొచ్చి.. "విమానపు బృందమంతా పాస్‌పోర్ట్సు చూపించండి" అన్నాడు. హమీద్‌కి..స్పృహ తప్పుతోందా? .. అనిపిస్తోంది.

"నేను పాస్‌పోర్ట్స్ తనిఖీ చేసేవరకు ఎవరూ బయటికెళ్లవద్దు" ఆదేశించాడు. పధ్నాలుగు పాస్‌పోర్ట్స్ టేబుల్‌పైకి చేరాయి. అతడు ఒక్కోదాన్ని తీరిగ్గా పరీక్షిస్తున్నాడు..అంతా చూశాక "నేను పదిహేను మందిని లెక్కపెట్టాను.. ఇంకో పాస్‌పోర్ట్ ఏదీ? " .. గయ్‌మన్నాడు.

"మీరు పొరబడ్డారు. మేం పధ్నాలుగు మందే" అన్నాడు కెప్టెన్.

"అయితే ఎవరి పాస్‌పోర్ట్ వారు తీసుకోండి.. ఒక్కొక్కళ్లనీ చెక్ చేస్తాను"

"సార్.. ఇది అంతర్జాతీయ విమాన ప్రయాణ నియమాలకు విరుద్ధం" అన్నాడు కెప్టెన్.

"ఇరాక్‌లో నియమాలేవీ వుండవు"

ఇంతలో సిబ్బంది అంతా లేచి హాలులో అటూ ఇటూ తిరగసాగారు. గట్టిగా మాట్లాడుతూ శబ్దం చేయసాగారు.

అతడు విసుగ్గా "అందర్నీ కూర్చోమని చెప్పండి.. నేను లెక్కపెట్టాలి " అన్నాడు. ఇంతలో ఫ్రెంచ్ విమాన సిబ్బంది విమానానికి క్లియరెన్స్ వచ్చింది. వాళ్లు హడావుడిగా లేచి వెళ్ళసాగారు.. మళ్లీ గజిబిజి..

టక్రిటీ తికమకపడ్డాడు.

ఫ్రెంచ్ విమాన సిబ్బంది వెళ్ళాక లెక్కబెడితే, పధ్నాలుగు మందే వున్నారు.. "ఓ.. షిట్! ఇక్కడో వ్యక్తిని చూశాను. మీసం లేదు. మేకప్..పెదాలపై కారిపోతూ వుంది.. వాడేడీ? " అరిచాడతడు.

"అంటే.. మా కో పైలెట్టా" అన్నాడు కెప్టెన్.

"కాదు.. అరబ్‌లా వున్నాడు"

"మా విమానంలో అరబ్‌లు ఎవరూ లేరు"

అతడు వెంటనే ఫ్లైట్ అటెండెంట్ వైపు తిరిగి అన్నాడు "నీ పక్కన భయపడుతూ కూర్చున్నాడే..ఏడీ.. వాడు..? "

"నా పక్కన.. ఫ్రెంచ్ విమాన కెప్టెన్ వున్నాడు" అనేసి నాలిక కరుచుకుంది ఆమె. జరిగిన పొరపాటు అప్పుడు గ్రహించాడు. వెంటనే పరుగున మెట్లు దిగి.. అక్కడే వున్న జీప్ ఎక్కి "బయలుదేరబోతున్న ఫ్రెంచ్ విమానంవైపు పోనీయ"మన్నాడు. జీప్ ఆఘమేఘాలపై బయలుదేరింది. అప్పటికే విమానం కదిలింది. జీప్.. విమానానికి సమాంతరంగా ప్రయాణిస్తూంది. ఫ్లైట్‌ని ఆపమని చేతుల్తో ఆదేశించాడు టక్రిటీ. ఫ్రెంచ్ విమానపు పైలెట్ శాల్యూట్ చేశాడు.. విమానం గాల్లోకి ఎగిరింది..

క్షేమంగా మళ్లీ అమెరికా భూమిపై అడుగుపెట్టాడు హమీద్. పునర్జన్మ..

"ఇంత లేటయ్యిందేమిటీ డాడీ? " అన్నాడు కొడుకు.

పిల్ల మళ్లీ ఏడవటం ప్రారంభించింది..మీసంలేని తండ్రిని చూసి.. ఎవరో ఆగంతకుడనుకొని. Ⓥ

-రస్కిన్‌బాండ్



ఆ దొంగ కథ

అనువాదం : ఎ.వి.రెడ్డిశాస్త్రి

నేను అనిల్‌ని కలిసిన్నాటికి యింకా దొంగనే. అప్పటికి నా వయస్సు పదిహేనేళ్లే. అయినప్పటికీ దొంగతనం చెయ్యడంలో బాగా ఆరితేరిపోయాను. నేను దగ్గరికి వచ్చేటప్పటికి అనిల్ కుస్తీ పోటీ చూస్తున్నాడు. అతనికి యిరవై అయిదు సంవత్సరాల వయస్సు వుండవచ్చు. సన్నగా, పొడవుగా వుండి సరదాగా కాలం గడిపే రకంలా కనపడ్డాడు. జాలి గుండె మనిషి అనిపించింది. అంచేత నేను వేసుకున్న పథకం నెరవేరే అవకాశం వుంది. ఈ మధ్యని అదృష్టం బొత్తిగా కలిసిరావడంలేదు. ముందు యితగాడి నమ్మకాన్ని సంపాదించగలిగితే- ఆ తర్వాత మిగిలిన కార్యక్రమం. “మీరు కూడా కుస్తీలు పట్టే వస్తాదులా అనిపిస్తున్నారు” అన్నాను. సంభాషణ ప్రారంభించడానికి.. పొగడ్తకి మించిన ఉపాయం మరొకటి లేదు.

“నువ్వు కూడా వస్తాదులాగే కనిపిస్తున్నావు” అని సమాధానం చెప్పేడు అనిల్. ఈ జవాబు విని క్షణంపాటు విస్తుపోయాను. ఏంచేతనంటే- ఆ సమయంలో నేను ఎముకలు కూడా కనిపిస్తున్నంత సన్నగా వున్నాను. “మీరన్నదీ నిజమే సార్! నేనూ అప్పుడప్పుడు కుస్తీలు పడుతూ వుంటాను” అన్నాను చాలా అణకువగా.

“నీ పేరేమిటి? ”

“హరిసింగ్” అబద్ధం చెప్పేను. నెలనెలకీ నాకో కొత్తపేరు- నేను పోలీసులకీ, పాత యాజమానులకీ దొరక్కుండా తప్పించుకోడానికి.

మా సంభాషణ ముగిసింది. అనిల్ కుస్తీపడుతున్న వస్తాదుల్ని చూస్తూ ఏవో వ్యాఖ్యలు జేస్తున్నాడు. వొంటికి బాగా నూనె పట్టించిన ఆ వస్తాదులు ఆయాసంతో రొప్పుతూ, మూలుగుతున్నప్పుడల్లా అనిల్ వ్యాఖ్యలు కొనసాగుతున్నాయి. నాకు మాట్లాడ్డానికి పెద్దగా ఏదీ కనబడ్లేదు. అనిల్ అక్కడ్నుంచి వెళ్లిపోతున్నాడు. నేనతన్ని అనుసరించేను. నన్ను చూసి “ఏవిటి మళ్లీ? ” అన్నాడు అనిల్.

ప్రయత్నపూర్వకంగా ఓ మంచి నవ్వు నవ్వి “మీ దగ్గర పనిచెయ్యాలని వుంది” అన్నాను.

“కానీ నేను డబ్బు యివ్వలేనే!”

ఒక్కక్షణం ఆలోచన్లో పడ్డాను- సరైన మనిషిని ఎంచుకోలేదేమోనని.

“పోనీ నాకు భోజనం పెట్టగలరా? ”

“నువ్వు వంట చెయ్యగలవా? ”

“ఓ.. చెయ్యగలను”.. మళ్లీ మరో అబద్ధం.

నన్ను తన గదికి తీసుకువెళ్లేడు. జమునా మిఠాయి షాపుపైన మేడమీద వుంది ఆ గది. నేను వరండాలో పడుకోవచ్చునని చెప్పేడు.

ఆవేళ రాత్రి నేను చేసిన వంట పరమ అధ్వానంగా వుండివుండాలి. ఎందుకంటే, మొత్తం భోజనాన్నంతటినీ వీధికుక్కకి పడేశాడు అనిల్. ఆ తరువాత నన్ను పొమ్మన్నాడు. అయినా నేను అక్కడే తచ్చాడుతూ వుండిపోయేను.. ఎంతో వినయంగా చిరునవ్వు లొలికిస్తూ. దాంతో అతను కూడా నవ్వకుండా వుండలేకపోయాడు. తర్వాత నా తలని తాకుతూ- “ఫర్వాలేదులే- వంట ఎలా చెయ్యాలో నేను నేర్పుతాను” అన్నాడు.

అనిల్ దగ్గర పనిచెయ్యడం చాలా సరదాగా వుండేది. పొద్దున టీ చేసేవాడ్ని. ఆ తరువాత రోజుకి అవసరమయ్యే సరుకుల్ని తీరిగ్గా తిరిగి కొనేవాడ్ని. సరుకుల్ని కొనడంలో నాకో రూపాయి లాభం వచ్చేది. నేను ఈ రకంగా డబ్బులు తస్కరిస్తున్నానని అనిల్ గ్రహించే వుంటాడు. కానీ యిలాంటి చిన్న విషయాలు పట్టించుకునే రకం కాదు అతగాడు.

అనిల్‌కి వున్నట్టుండి వూడిపడుతూ వుంటుంది డబ్బు. ఈ వారం అప్పులు చేస్తాడు- పైవారం అడిగిన వాళ్లకి బదుళ్లు యిస్తూ వుంటాడు- అలా వుంటుంది అతని రాబడి. ‘మళ్లీ ఎప్పుడు చెక్కు వస్తుందా’అని ఆత్రంగా నిరీక్షిస్తూ వుంటాడు. చెక్కు వచ్చీరాగానే బయటికి వెళ్లి ఆనందంగా ఖర్చు పెట్టేస్తాడు. ఆ డబ్బునంతట్నీ అతగాడు పత్రికలకి రాసి సంపాదిస్తూ వుంటాడట. తమాషాగా అనిపించింది.. ఈ రకంగా కూడా డబ్బు సంపాదించగలగడం.

ఓ రోజు సాయంత్రం నోట్ల బొత్తిని పట్టుకొని ఇంటికొచ్చేడు అనిల్. తను రాసిన పుస్తకాన్ని ఎవరో పబ్లిషర్‌కి అమ్మేనని చెప్పేడు. ఆ డబ్బంతట్నీ పరుపుకిందదాస్తూ ఉండడం నా కళ్లపడింది.

ఇంచుమించు ఆరునెలలబట్టి అనిల్ దగ్గర పనిచేస్తున్నానా.. రోజువారీ సరుకులు కొనడంలో మిగుల్చుకుంటున్న కాస్తో కూస్తో తప్పిస్తే, నా వృత్తిపరమైన దొంగతనం ఏదీ యింతవరకూ చెయ్యలేకపోయాను. దర్జాగా దొంగతనం చెయ్యడానికి అన్ని అవకాశాలూ వున్నాయి. ఇష్టమొచ్చిన దగ్గరికి వెళ్ళి యిష్టమొచ్చినప్పుడు తిరిగి రావడానికి నాకు పూర్తి స్వేచ్ఛ యిచ్చేడు అనిల్. అతనిలా మనుషుల్ని నమ్మే వ్యక్తుల్ని నేనింతవరకూ చూడలేదు. అంచేత అతనిలాంటి వాడిదగ్గర దొంగతనం చెయ్యడం అంటే ఎందుకో చాలా కష్టం అనిపిస్తోంది. పిసినారి మనుషుల దగ్గర దొంగతనం చెయ్యడం బహు సులువు. అలాంటివాడి దగ్గర దొంగతనం చేసినా వాడికేం పెద్దగా నష్టం కలగదు. అనిల్‌లాంటి పట్టించుకోని వ్యక్తి దగ్గర దొంగతనం చెయ్యడం యిబ్బందిగా వుంటుంది. తన డబ్బు చోరీ అయినట్టు అతను గమనించను కూడా గమనించడు. అలాంటివాడి దగ్గర దొంగతనం చేస్తే ఏం థ్రిల్ వుంటుంది?

కానీ ఏదో ఒక దొంగతనం చెయ్యాలి- తప్పదు. లేకుంటే అలవాటు తప్పిపోయేటట్టు కనిపిస్తోంది. నేనుగానీ అనిల్ డబ్బుని దొంగిలించకపోతే, ఏమవుతుంది? అనిల్ దాన్ని తిన్నగా తీసుకెళ్ళి స్నేహితులతో గడిపి ఖర్చు పెట్టేస్తాడు. ఇంతకీ, తన దగ్గర పనిచేస్తున్నందుకు- నాకు అతగాడేమీ జీతం యివ్వడంలేదు కదా!

అనిల్ నిద్రపోతున్నాడు. వెన్నెల.. బాల్కనీని దాటుకొని, గదిలోకి ప్రవేశించి, అతనిమీద పడుతోంది. నేను లేచి కూర్చుని పరిస్థితుల్ని మదింపు వేస్తున్నాను. డబ్బుని దొంగలించగలిగేనా.. రాత్రి పదిన్నరకి బయలుదేరే లక్నో ఎక్స్

నువ్వలా.. నేనిలా!



‘నలభై ఏళ్లు వచ్చేదాకా పెళ్లిచేసుకోను’ తేల్చిచెప్పిందా తారామణి
‘నేనలా కాదు, పెళ్లయ్యేదాకా నలభై ఏళ్లు రానివ్వను’
వెంటనే అందుకుంది తోటి నటీమణి

ప్రెస్‌ని అందుకోగల్ను. కప్పుకున్న దుప్పటిని తీసిపారేసి మెల్లగా పాకుకుంటూ అతగాడి మంచం దగ్గరకి చేరుకున్నాను. అనిల్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ముఖం నిర్మలంగా, ఏ బాధలూ లేనట్టుగా కనిపిస్తోంది. ఆ మాటకొస్తే నా ముఖంనిండా బోలెడు గీతలున్నాయి. అనిల్ మాత్రం ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

నా చేతిని లాఘవంగా పరుపు కిందకి దోనిపి, నోట్లకోసం తడిమేను. అవి నాకు దొరగ్గానే- చడీచప్పుడు కాకుండా వాటిని బయటికి లాగేను. నిద్రపోతున్న అనిల్.. ఎందుకో ఓ నిట్టూర్పు విడిచి- నా వైపుకి తిరిగి పడుకున్నాడు. నేను తుళ్ళిపడ్డాను. త్వరత్వరగా పాకుకుంటూ గది నుండి బయటపడ్డాను.

రోడ్డుమీదికి వచ్చాక పరుగు ప్రారంభించాను. నా నడుం దగ్గర నోట్లని వుంచి, నా పైజామా బొందుతో గట్టిగా బిగించేను. పరుగు ఆపి, నడుస్తూ, వేళ్లని కదిపి నోట్లని లెక్కపెట్టేను. ఏభై రూపాయల నోట్లు ఆరువందలు వున్నాయి. బలే దోపిడీ! ఒకటి రెండు వారాలపాటు అనిల్ డబ్బుతో నేను పులిసిఉన్న అరబ్బులా గడపొచ్చు.

స్టేషన్ చేరాక, టిక్కెట్టు తీసుకోవడానికి బుకింగ్ ఆఫీస్ దగ్గరికి వెళ్ళలేదు. జీవితంలో ఏనాడూ నేను టిక్కెట్టు కొనలేదు. తిన్నగా ఫ్లాట్‌ఫాం మీదికి పరుగెత్తాను. లక్నో ఎక్స్‌ప్రెస్ అప్పుడే కదుల్తోంది. రైలు ఇంకా వేగాన్ని అందుకోలేదు. నేను సులువుగా బండిలోకి ఎక్కేసి వుండగలిగేవాడ్ని. ఎందుకనో తటపటాయించేను- కారణం తెలీకుండానే. పారిపోడానికి అవకాశం చెయ్యిజారిపోయింది. రైలు వెళ్ళిపోయింది. మనుష్య సంచారంలేని ఫ్లాట్‌ఫాం మీద నిలబడి వున్నాను. రాత్రి ఎక్కడ గడపాలో తెలీలేదు. నాకు స్నేహితులెవ్వరూ లేరు. స్నేహితులుంటే చికాకులు వస్తాయని.. ఎవరితోనూ స్నేహం చెయ్యలేదు. స్టేషన్‌కి దగ్గరగా వున్న ఏదైనా చిన్న హోటల్లో రాత్రికి బస చేస్తే? అనవసరపు అనుమానాలు కలగొచ్చు. నాకు బాగా తెలిసిన ఒకే ఒక వ్యక్తి.. నేను కొద్దిసేపటి కిందటే దోచుకున్న అనిల్!



బజార్లోంచి మెల్లిగా నడుస్తున్నాడు. దొంగతనం చెయ్యడం నేర్చుకున్నాను కదా.. మనుషులు తమ తమ వస్తువుల్ని పోగొట్టుకున్నప్పుడు కనపరిచే హావభావాల్ని గమనించడం అలవాటయిపోయింది. పిసినారివాళ్ళు భయంతో గడగడ వణికిపోతుండడం గమనించేను. డబ్బున్నవాళ్ళయితే గొప్ప కోపాన్ని ప్రదర్శిస్తారు. అదే పేదవాళ్లయితే- 'పోయింది- మరేం చేస్తాం' అన్నట్టు నిరాసక్తిగా ముఖం పెడతారు. కానీ దొంగతనం జరిగినట్టు గమనించేక అనిల్ ముఖం ఎలా వుంటుందో నేను వూహించగలిగేను. అతని ముఖంలో విచారం కనిపిస్తోంది, డబ్బు పోయినందుకు కాదు- తన నమ్మకం వమ్మయిపోయినందుకు.

మైదానంలోకి వచ్చాను. అక్కడొక బెంచీ మీద కూర్చున్నాను. రాత్రి బాగా చలిగా వుంది- ఇంకా నవంబరు నెల మొదటి రోజులే అయినా, చిన్న జల్లు కూడా కురుస్తోండడంతో మరింత ఇబ్బం

సమయా'భావం'



వాణి: నాకో పదివేలివ్వాలి. మర్చిపోయావా రాణీ?
రాణి: అందుకు ఇంకా టైముంది కదే
వాణి: టైముందా? దేనికి?
రాణి: మర్చిపోడానికి!

దిగా వుంది. ఇంతలో వాన పెరిగింది. నా చొక్కా పైజామా వంటికి అతుక్కుపోయినట్టు కనిపిస్తున్నాయి. చలిగాలి వర్షాన్ని నా ముఖంమీదకి కొడుతోంది.

మళ్లీ బజార్లోకి వచ్చేను. గంట స్తంభం దగ్గర వున్న షెడ్డులో కూర్చున్నాను. బిచ్చగాళ్లు. యిల్లూ వాకిలీ లేనివాళ్లు ఆ షెడ్డులో నిద్రపోతున్నారు.. దుప్పట్లకింద ముణుచుకొని. వాచీ అర్ధరాత్రిని చూపిస్తోంది. నోట్లని తడిమి చూసుకున్నాను. వర్షానికి తడిసి ముద్దయిపోయాయి.

ఆ డబ్బంతా అనిల్‌ది. తెల్లవారింతర్వాత అతగాడే బహుశా నాకొంచెం డబ్బిచ్చి, 'సినిమాకి వెళ్లమ'ని అని వుండేవాడేమో! కానీ యిప్పుడు మొత్తం డబ్బంతా నా దగ్గరే వుంది. ఇంక వంట చెయ్యడాలు, బజారుకెళ్ళి సరుకులు తేవడాలు, పెద్ద పెద్ద వాక్యాలు రాయడాలు- యిలాంటివేవి వుండవు.

వాక్యాలు రాయడం సంగతే మరచిపోయాను..యీ దొంగతనం హడావిడిలో. వాక్యాలు రాయగలగడం నేర్చుకుంటే- వందలకొద్దీ రూపాయిలు సంపాదించవచ్చు. దొంగతనాలు చెయ్యగలగడం చాలా చిన్న విషయం. ఒక్కొక్కప్పుడు దొరికిపోతుండడం జరుగుతూ వుంటుంది.

కానీ నిజంగా గొప్పవాడు కాగలగడం- అందరూ గుర్తించడం- గౌరవించడం- అది చాలా కష్టమయిన విషయం.

అనిల్ దగ్గరకి తిరిగి వెళ్ళిపోవాలి. కనీసం.. రాయడం, చదవడం, నేర్చుకోడానికేనా అనిల్ దగ్గరకి వెళ్లిపోవాలి.

త్వరత్వరగా గదికి పరుగెత్తేను- బాగా భయపడిపోతూనే. దొంగిలించడం చాలా సుళువే- కానీ దొంగిలించిన వస్తువుని ఎవరికీ తెలియకుండా మళ్లీ యధాస్థానంలో వుంచేయగలగడం చాలా కష్టం.

మెల్లగా తలుపు తెరచి ద్వారం దగ్గర నిలబడ్డాను. మేఘాలవల్ల వెన్నెల మసకబారిపోయింది. అనిల్ యింకా నిద్రపోతూనే వున్నాడు. మంచం దగ్గరికి పాకుకుంటూ వెళ్లేను.

నా చేతిలోని నోట్లని అతని పరుపుకింద తిరిగిపెడ్తున్నప్పుడు ..అతని వూపిరి నా చేతికి తగిలింది. ఒక్కక్షణం నిశ్చలంగా వుండిపోయాను. తరువాత మెల్లగా నోట్లని పరుపుకింద పెట్టేశాను.

మర్నాడు బాగా పొద్దెక్కింది నేను లేచేటప్పటికి. అనిల్ అప్పటికే టీ తయారు చేశాడు. అతను చెయ్యి చాపేడు నా ముందుకి. అతని వేళ్లమధ్య ఓ యాభైరూపాయిల నోటు వుంది. నా మనస్సు ఒక్కసారి కుంగిపోయింది.. నేను దొరికిపోయాననిపించి.


"నిన్న కొంచెం డబ్బు సంపాదించేను" అన్నాడు అనిల్. "ఇక నుంచీ నీకు జీతం యిస్తుంటాను" అన్నాడు.


నాకు ఉత్సాహం తిరిగి వచ్చింది. నోటు తీసుకుంటూ గమనించేను- అది తడిగానే వుంది, రాత్రి వానకి తడియడం వల్ల. "ఇవాళ నుంచి వాక్యాలు రాయడం మొదలుపెడదాం" అన్నాడు అతగాడు.


అతనికి తెలిసిపోయింది. కానీ అతని కళ్లు గానీ పెదవులు గానీ.. దేన్నీ బయటకి తెలియనివ్వటం లేదు.

అనిల్‌ని చూస్తూ నవ్వేను. ఈసారి నా నవ్వు ప్రయత్నపూర్వకంగా వచ్చింది కాదు. దానంతట అదే వచ్చింది, నా ప్రయత్నం లేకుండా. V

నవ్వుల విందు







తెలుగు కథ



గుమ్మా ప్రసాదరావు



వజ్రాలు

"అది గాంభీర్యం అని ఎందుకనుకోవాలి? గర్వం అని ఎందుకు అనుకోకూడదు? ఆరునెల్లు విదేశాల్లో ఉండి తిరిగి వచ్చిన గర్వంగా మీ సిబ్బందికి కనిపించి ఉంటుంది. దాన్నివారు గాంభీర్యం అని పొరపడి ఉంటారు" అన్నాడు ఆ ఆసామి.

"మీతో వాదన నాకనవసరం. అది గాంభీర్యమో, గర్వమో కొద్దిక్షణాల్లో తెలిపోతుంది. ముందుగా మిమ్మల్ని, మీ బ్రీఫ్‌కేసును తనిఖీ చేయనివ్వండి" అన్నాడు సౌమ్యంగా కస్టమ్స్ అధికారి విమానాశ్రయంలో గేటువద్ద అతనితో.

"నేను చాలా పెద్దమనిషిని. నా పేరు రాజగోపాలరావు. ఈ చుట్టుపట్ల నాలుగు జిలాల్లో నా వ్యాపారాలున్నాయి. కలెక్టర్లు కూడా నాకు సలాములు చేస్తారు"

"సారీ, మీరేమైనా, మీరెవరైనా నా కర్తవ్యం నాది. అందుకు మీ పేరుప్రఖ్యాతులతో నాకెలాంటి సంబంధం లేదు. ఈ విమానంలో వజ్రాలతో ఒకరు ఎక్కారని మాకందిన సమాచారం. అనుమానం మీ మీద ఉంది" కస్టమ్స్ అధికారి అన్నాడు.

"చూడండి, మీకు అధికారాలు ఉన్నాయని అంగీకరిస్తున్నాను. అయితే పెద్దా చిన్నా అంతరం లేకుండా సోదాచేస్తే మా పరువేం కావాలి? " అంటూ రాజగోపాలరావు సిగరెట్టు కేసు తీశాడు. అది నిండుగా ఉంది. ఒకటి తీసుకొని ఆ కేసు కస్టమ్స్ అధికారి వేపు అందించాడు. "ప్లీజ్ తీసుకోండి" అన్నాడు.

"నో, థాంక్స్"

రాజగోపాలరావు సిగరెట్టు కేసుని జేబులో పెట్టుకుని, లైటరుతో సిగరెట్టు అంటించి "ఆశ్చర్యంగా ఉందే! మీకు సిగరెట్టు అలవాటు లేదా? ఇవి విదేశీ సరుకు. చాలా ఖరీదైనవి. మన కరెన్సీలో ఒక్కోటి పాతిక రూపాయలుంటుంది"


"నేను సిగరెట్లు కాల్చనలేదు. అయితే డ్యూటీలో ఉండగా కాల్చను".

"అలాంటి నిగ్రహం అందరికీ ఉండదు. స్మగ్లింగు జరుగుతోందని నాకు తెలుసు. ఈ విమానంలో నాతోపాటు అరవైమంది ఉన్నారు. చాలామంది ఇక్కడే దిగారు. నన్నే ఎందుకు అనుమానిస్తున్నారు? "

"మేం అందర్నీ అనుమానిస్తాం. అయితే ఈ వజ్రాల స్మగ్లింగు చేస్తున్నది మీరేనని మాకు అనుమానం ఉంది".

"కారణం? " రాజగోపాలరావు ఆ సిగరెట్టు పూర్తిగా కాలిపోతే దాన్ని డస్ట్‌బిన్‌లో పారేసి మరొకటి అంటించాడు. యధాలాపంగా అతని వేపు చెయ్యి చాపి వెంటనే వెనక్కు తీసుకుంటూ "సారీ, మీరు డ్యూటీలో కాల్చనన్నారుగా? " అన్నాడు.

"కారణాలు మీకు చెప్పవలసిన అవసరం లేదు రాజగోపాలరావుగారూ! రైలులో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసేవాడు అల్లంత దూరాన టిక్కెట్టు కలక్టర్ని చూసి గతుక్కుమంటాడు. ఆ చర్య అసంకల్పితం,





సరిపోయింది!

'మా పక్కింటి జంటను చూస్తే ముచ్చటేస్తుందే' ఫ్రెండ్ కాదంబరితో అంది నీలాంబరి

'ఎందుకే? వాళ్లది అంత గొప్ప దాంపత్యమా?'

'అవునే! అతనికి దగ్గు, ఆమెకి చెముడు!'

టిక్కెట్టు ఉన్నవాడు భయపడడు. దొంగతనం చేసేవారే గిల్టీగా ఫీలవుతారు".

"అదిగో! మళ్లీ నన్ను దొంగనంటున్నారు. నా ముఖం మీద దొంగ అని రాసి ఉందా? ఈ వేషభాషల్లో నేను మీ కంటికి దొంగగా కనిపిస్తున్నానా?"

★ ★ ★

"నన్ను దొంగననడానికి మీ వద్ద ఆధారాలు ఏమున్నాయి?"..అప్పుడతను మూడో సిగరెట్టు ముట్టించాడు. "నా ఎదుటి వ్యక్తి సిగిరెట్టు తాగకుండా నేను తాగడం నాకు బాధగా ఉంది. డ్యూటీలో తాగకూడదని మీ నియమం. మిమ్మల్ని అభినందిస్తున్నాను. నా దగ్గర ఇంకా ఏభై పెట్టెలు ఉన్నాయి. రేపు మీ ఆఫీసుకి ఇరవై పంపుతాను మా డ్రైవరు చేత. మీ పేరు చెప్పండి"

"నా పేరు స్వామినాథన్, ఐ.పి.ఎస్. నాకు మీరేం పంపనక్కరలేదు. ముందు ఆ పెట్టి తాళం తీయండి"

"స్వామినాథన్‌గారూ! మళ్ళీ మొదటికే వచ్చారు. దాని తాళంచెవి నా పొరపాటు వల్ల పోయింది. ఆమాట మీ వాళ్లకూ, మీకూ చెప్పాను. నన్ను నమ్మరేం?"


"నమ్ముతాను. అయినా ఆ బ్రీఫ్‌ను సోదా చెయ్యడం మా కర్తవ్యం. మీరు స్వయంగా తాళం తియ్యకపోతే పెట్టెను బద్దలుకొట్టవలసి వస్తుంది"

"ఏమన్నారు? ఈ బ్రీఫ్ కేసు ఈ ఊరి సంతలోని సరుకు కాదు, ఇంపోర్టెడ్. చాలా ఖరీదైనది. ఇది నా ప్రాణం. దీన్ని బద్దలు కొడితే నేను సహించలేను"

★ ★ ★

"ఈ బ్రీఫ్‌కేసు మన మెట్రోలలోనూ దొరకదు. అయిదువేలు చేస్తుంది. ఇంత ఖరీదైన బ్రీఫ్‌ను మీరు బద్దలు కొట్టాలని ఎందుకనుకుంటున్నారు? నేను దొంగను కానంటే నమ్మరేం?"..రాజగోపాలరావు ఏడో సిగరెట్టు అంటించాడు.

"పట్టుబడేవరకు దొంగలూ దొరలే! రాజగోపాలరావుగారూ, ఉత్తరాంధ్రలో మీ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయని మాకు తెలుసు. కలెక్టర్లు కూడా మీకు సలాములు చేస్తారని తెలుసు. కోటీశ్వరులైన మీరు అయిదువేల ఖరీదు చేసే బ్రీఫ్ కేస్ బద్దలు చేస్తామంటే భయపడుతున్నారెందుకు? ఆ డబ్బు మీకు లక్ష్యం కాదు. ఏదో దాచి తెస్తున్నారు. అది మాకంటబడితే మీరు కటకటాల వెనుక ఉంటారు".



రాజగోపాలరావు నిరుత్తరుడయ్యాడు. సిగరెట్టు కాల్చాలన్న ధ్యాస పోయింది. స్వామినాథన్ అతని ముఖ కవళికలు గమనిస్తున్నాడు. చేరువలో ఇద్దరు, ముగ్గురు కస్టమ్స్ అధికారులు మఫ్టీలో ఉన్నారు. వారివంక చూస్తున్నాడు.

"స్వామినాథన్‌గారూ! మీరే గెలిచారు. ఈ బ్రీఫ్‌లో వజ్రాలున్న మాట నిజం. ఆరు వజ్రాలున్నాయి. మీకు రెండు ఇస్తాను. కొన్ని కోట్ల విలువ చేస్తాయి. మీరు నిజాయితీగా ఎంతకాలం పనిచేసినా కోటీశ్వరుడు కాలేరు. ఇది మీకు సమ్మతమేనా?" అన్నాడు రాజగోపాలరావు.

"శభాష్! మా దారికి వచ్చారు. వజ్రాలు స్మగుల్ చేసినట్లు ఒప్పుకున్నారు. నేను లంచగొండిని కాను. నిజాయితీ నా జీవిత లక్ష్యం. ఆ వజ్రాలు ఇచ్చి నాతో స్టేషనుకు పదండి" అన్నాడు స్వామినాథన్.

రాజగోపాలరావు భళ్లున నవ్వాడు.

అతడలా ఎందుకు నవ్వాడో స్వామినాథన్‌కు అర్థం కాలేదు.

"నా మాట నిజమేనని నమ్మేశారా? మీ నిజాయితీని పరీక్షించాలని ఆరు వజ్రాలున్నాయని అన్నాను"

"అంటే మీ దగ్గర లేవనా?"

"ఊ! ఈ బ్రీఫ్‌కేసే కదా అనుమానానికి హేతువు. ఒక పని చెయ్యండి. నేను మీతోపాటు స్టేషనుకి వస్తాను. అక్కడ దీనికి మనం ఇద్దరం సీలు వేద్దాం. ఇది మీ కస్టడీలో ఉంటుంది. వారం పదిరోజుల్లో మారుతాళం తెప్పిస్తాను. మీ సమక్షంలో తెరుద్దాం. అప్పుడు మీ అనుమానం పటాపంచలవుతుంది."

"శభాష్! నాటకం రక్తికట్టేలా ఆడేరు. ఆ బ్రీఫ్‌లో వజ్రాలు లేవని నాకు తెలుసు".

"తెలిసి..ఇంతసేపు నన్నెందుకు దోషిలా



ఉచిత సలహా

పండు: మాస్టారు నన్ను వాయించార్రా

పాండు: ఎందుకు?

పండు: 'నీకు తలకాయ ఉందా..లేదా?' అన్నారు. తెలీదనగానే, నా వీపువిమానం మోత మోగించారు

పాండు: తప్పంతా నీదేరా. తలకాయ ఉందో లేదో.. చూసుకుంటే సరిపోయేదిగా!

నిలబెట్టారు? నాకు ఒక్కొక్క నిముషం ఎంతో విలువైనది. పోనీలెండి మీలాంటి నిజాయితీగల అధికారితో మాట్లాడేనన్న సంతృప్తి ఉంది. ఇంక నేను వెళ్ళనా?"

"రాజగోపాలరావుగారు, అప్పుడేనా? ఆ సిగరెట్టు కేసు ఇలాగివ్వండి"

"ఏం సిగరెట్టు కాల్చాలని వుందా? తాగుడికి, సిగరెట్లకు అలవాటుపడినవారు ఎంతోసేపు నిబ్బరంగా వుండలేరు. మీరు నిగ్రహస్తులు. సిగరెట్టు కేసు కావాలా? తీసుకోండి. నా దగ్గర ఇంకా ఉన్నాయి" రాజగోపాలరావు సిగరెట్లు లాగి ఖాళీ కేసు స్వామినాథన్‌కు ఇవ్వబోయాడు.

"ఊహు, ఒట్టి కేసుకాదు, ఆ సిగరెట్లతో సహా. మా దృష్టి బ్రీఫ్ కేసు మీద లగ్నం కావాలని భలే నాటకం ఆడేరు. ఏడు సిగరెట్లు తాగినవారు ఆ తరువాత మరి కాల్చలేదు. అంటే ఆ మూడింట్లో వజ్రాలున్నాయి. పెట్టెను బద్దలుకొట్టినా అందులో వజ్రాలు దొరకవని మీకు తెలుసు. అయినా మా దృష్టి దానిమీదే వుండాలని అతి తెలివిని ప్రదర్శించారు."

స్వామినాథన్ కనుసైగ చేయగానే ఇతర అధికారులొచ్చారు.

"రాజగోపాలరావుగారూ! మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం. ఇదిగో.. సిగరెట్టులో రెండు వజ్రాలున్నాయి" అన్నాడు స్వామినాథన్, ఐ.పి.ఎస్. Ⓥ

ఆంగ్ల కథ



-ఫ్రెడరిక్ ఫోర్సిత్

ఐర్లండులో పాములుండవు

అనువాదం : ఎలనాగ

మెక్‌క్వీన్ తన ఎదురుగా ఉన్న యువకుడికేసి చూస్తూ "చాలా కష్టమైన పని. నీకు తెలుసు కదా? " అన్నాడు.

"తెలుసు" అన్నాడా యువకుడు

"ఐతే నీవు రాయల్ విక్టోరియాలో ఫైనలియర్ వైద్య విద్యార్థివన్నమాట? ఇప్పుడు సమ్మర్ వెకేషన్‌లో ఉన్నావన్నమాట? "

"ఔను"

చదువు కొనసాగించడానికి డబ్బు అవసరమున్న ఎందరో విద్యార్థులలో ఆ యువకుడొకడు. మెక్‌క్వీన్ పాత కట్టడాల్ని కూల్చివేసే కాంట్రాక్టర్. అతని దగ్గర ఒక పాత ట్రక్కు, టన్నులకొద్దీ పనిముట్లు ఉన్నాయి.

"సరే! మేమిక్కడ ఉదయం ఏడు నుండి సాయంత్రం సూర్యాస్తమయం వరకూ పని చేస్తాం. కానీ జీతం తక్కువగానే దొరుకుతుంది."

"సరే సర్! మరి పనిలోకి ఎప్పుడు రమ్మంటారు? "

"స్టేషన్‌యార్డ్ వద్ద ప్రొద్దున్నే ఆరున్నరకు ఒక ట్రక్ వచ్చి గ్యాంగును తీసికెళుతుంది. గ్యాంగ్ ఫోర్‌మెన్ బిగ్‌బెల్లీ కెమరాన్. సోమవారం ఉదయం నువ్వు అక్కడ ఉండు. నేనతనికి నీ విషయం తెలియజేస్తాను. ఇంతకీ నీ పేరు? "

"హరికిషన్ రామ్‌లాల్"

"ఓకే! 'రామ్'అని పిలుస్తాం నిన్ను"

ఆ సాయంత్రం రామ్‌లాల్‌కు ఒక చౌక గది అద్దెకు దొరికింది. కిటికీనుండి చూస్తే, బెల్‌ఫాస్ట్ నుండి బంగోర్‌కు వచ్చిపోయే రైళ్ళు కనబడతాయి. ఆదివారం ఉదయం రామ్‌లాల్ బెల్‌ఫాస్ట్ నుండి తన సామాను, పుస్తకాలు తెచ్చుకున్నాడు. మధ్యాహ్నం మంచంమీద పడుకొని, పంజాబులోని తన ఊరి కొండల్లో ప్రతిఫలించే చిక్కని వెలుగును తలుచుకొన్నాడు.

ఒక ఏడాదిలో తన చదువు పూర్తవుతుంది. ఇంకొక ఏడాది తరువాత తన ఊరిలో ప్రాక్టీసు ప్రారంభిస్తాడు. ఈ ఎండాకాలం సంపాదించిన సొమ్ము ఫైనల్ ఇయర్ వరకూ పనికొస్తుంది. ఇంటర్న్‌షిప్‌లో ఎలాగూ జీతం వస్తుంది.


ఇది అతడు కంటున్న కల. రామ్‌లాల్ మరునాడు పావుతక్కువ ఆరుగంటలకు లేచి, మొహం కడుక్కొని కేఫ్‌లో రెండు కప్పుల టీ తాగి స్టేషన్ యార్డ్‌కు చేరాడు. సరిగ్గా ఆరుంపావుకు ఒక పాత ట్రక్కు అక్కడికి వచ్చింది. ఒక పదీ పన్నెండు మంది అక్కడ గుమిగూడారు. ఆరుగంటల ఇరవైఐదు నిముషాలకు ఫోర్‌మెన్ తన కారులో అక్కడికి వచ్చి రోడ్డు పక్కన కారు పార్కుచేసి, ట్రక్కు దగ్గరకు వచ్చాడు.

తన జేబులో నుండి ఒక కాగితం తీసి అందరి పేర్లూ చదవసాగాడు.

'హరికిషన్ రామ్‌లాల్'

"యస్"

బిగ్‌బెల్లీ కెమరాన్ ఆరడుగుల మూడంగుళాల ఎత్తు, చింత మొద్దులాంటి చేతులు. తన చిన్న కళ్ళను సన్నగా, నల్లగా ఉన్న ఇండియన్ వైపు తిప్పాడు. ఆ కళ్ళలో ఏదో అయిష్టత గోచరించింది. నేలమీద తుపుక్కున ఉమ్మి, "అందరూ



ట్రక్కులోకి ఎక్కండి" అని ఆజ్ఞాపించాడు. అందరూ లారీ వెనక భాగంలో చెక్కబల్లలపై కూర్చున్నారు.

పొట్టిగా ఉన్న, నీలి కళ్ళున్న టామీ బర్న్స్. రామ్‌లాల్‌ను ప్రశ్నించాడు."మీదే ఊరు? "

"ఇండియా. పంజాబు"

"ప్రొటెస్టెంటువా? కాథలిక్కువా"

"రెండూ కాదు. హిందువుని"

"హే! ఇతను క్రిష్టియన్ కాదట" అతను మిగతావారితో అన్నాడు. అతని కళ్ళలో హేళనకంటె ఆశ్చర్యం ఉంది. తనే రామ్‌లాల్‌ను అందరికీ పరిచయం చేశాడు.

"నీవు లంచ్‌బాక్సు తెచ్చుకోలేదా? " పాటర్సన్ అడిగాడు.

"లేదు. రేపటినుండి తెచ్చుకొంటాను"

"ఇలాంటి పని నువ్వు ఇంతకుముందు చేసినట్టు లేదు? "

రామ్‌లాల్ తలాడించాడు.

"నీ అసలు ఉద్యోగం ఏమిటి? "

"నేనొక మెడికల్ స్టూడెంటును. వచ్చే ఏడాదికి నా చదువు పూర్తవుతుంది"

టామీబర్న్స్‌కు సంతోషం కలిగింది. "హే! బిగ్‌బెల్లీ! మనకేమైనా జరిగితే రామ్ చూసుకుంటాడు"

బిగ్‌బెల్లీ గుర్రుగా చూస్తూ "అతను నామీద మాత్రం చేయి వేయడానికి వీల్లేదు" అన్నాడు.

కొద్దిసేపట్లో వారి ట్రక్కు చెట్ల మధ్యనున్న ఒక పాత భవనం ముందు ఆగింది. అది ఒక పాత విస్కీ డిస్టిల్లరీ. అది పనిచేయడం మానేసి చాలారోజులైంది.

ట్రక్ దిగి బిగ్‌బెల్లీ అందర్నీ పురమాయించాడు. "ఓకే! పని ప్రారంభిద్దాం, పైకప్పు నుండి మొదలెడదాం"


పెద్ద పెద్ద గునపాలు, సమ్మెటలు పట్టుకొని వర్కర్స్ బయలుదేరారు. అందులో ఒకతను తలుపుచెక్కను విరిచి మంటవేసి, టీ కాచి తయారుచేశాడు. అందరూ టీ తాగారు. మొదట పెంకులన్నీ ఊడబెరికి కింద పచ్చికలోకి విసిరేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు అందరూ తమ తమ లంచ్ బాక్సులతో ఒకచోట చేరారు. టామ్ బర్న్స్ రామ్‌లాల్‌కు ఒక సాండ్‌విచ్ ముక్క ఇవ్వబోయాడు.

"ఏమిటి ఇక్కడ నువ్వు చేస్తున్న పని? " చితుకుల మంట వద్ద కూర్చున్న బిగ్‌బెల్లీ అడిగాడు.

"కొద్దిగా సాండ్‌విచ్ ఇస్తున్నాను" నసిగాడు టామ్‌బర్న్స్.

"అతని సాండ్‌విచెస్ అతన్నే తెచ్చుకోనియ్. నీ సంగతి నువ్వు చూసుకో."

అందరూ మౌనం వహించారు. అతనికి ఎదురుతిరగడం అంటే ఎంత తెలివితక్కువ పనో అక్కడున్న అందరికీ తెలుసు.



"థాంక్యూ! నాకాకలిగా లేదు" అని రామ్‌లాల్ నది ఒడ్డుకు వెళ్ళి మండుతున్న తన చేతుల్ని నీటిలో ముంచాడు. సాయంత్రం మళ్ళీ ట్రక్కు వచ్చి వారిని తీసికెళ్ళింది. ఇలా వారం రోజులు గడిచాయి. ఇప్పుడు బంగళాకి గోడలు, కిటికీలు మాత్రమే మిగిలాయి.

రామ్‌లాల్‌కు ఇలాంటి పని అలవాటు లేదు. చేతులు బొబ్బలెక్కాయి. ఐనా డబ్బు చాలా అవసరం కాబట్టి కష్టపడుతున్నాడు. అతను లంచ్‌బాక్సు, మగ్, గట్టి బూట్లు, గ్లోవ్స్ కొన్నాడు. వారం అంతా బిగ్‌బెల్లీ రామ్‌లాల్‌కు కష్టమైన పని ఇస్తూ ఎత్తులో పని చేయిస్తూ తిప్పలు పెట్టాడు.

లంచ్ అవర్ తర్వాత కెమెరాన్ బంగళా చుట్టు రెండు చక్కర్లు కొట్టి, మూడవ అంతస్తులోని గోడల్ని ఎలా పడగొట్టాలో అందరికీ వివరించాడు. రామ్‌లాల్‌వైపు తిరిగి "నువ్వు ఆ పైకెక్కి గోడను కూల్చివేయ్" అని ఆజ్ఞాపించాడు. రామ్‌లాల్ గోడవైపు చూశాడు. అది బీటలువారి పడిపోవడానికి సిద్ధంగా ఉంది.

"అలా చేస్తే ప్రమాదం" అన్నాడు రామ్‌లాల్.

"యూ స్టుపిడ్! నువ్వు నాకు చెబుతున్నావా? చెప్పినట్టు చెయ్"

బిగ్‌బెల్లీ అరిచాడు.

రామ్‌లాల్ లేచాడు. తీవ్రమైన స్వరంతో "మిస్టర్ కెమెరాన్!.."

అందరూ నోళ్ళు తెరిచారు.

"నేను పంజాబ్ నుండి వచ్చాను. క్షత్రియుణ్ణి. నేను బీదవాడినే కావచ్చు. కానీ మా తాతలు, తండ్రులు గొప్ప సైనికులు, రాజులు. దయచేసి నన్ను అవమానపరచవద్దు"

బిగ్‌బెల్లీ కళ్ళు ఎరుపెక్కాయి. "అలాగా! ఐతే ఏం చేస్తావో చూద్దాం!" అంటూ తన కుడిచేతిని విసిరాడు. రామ్‌లాల్ కొన్ని అడుగుల దూరంలో వెళ్ళి పడ్డాడు. ఇంతలో టామ్‌బర్న్స్ గొంతు వినబడింది. "రామ్‌లాల్! లేవద్దు! లేస్తే నిన్ను బిగ్‌బెల్లీ చంపేస్తాడు"

రామ్‌లాల్ ఆకాశంలోకి చూశాడు. కెమెరాన్ పిడికిళ్ళు బిగించి రాక్షసుడిలా కనిపించాడు. 'వాడిని గెలవడం అసాధ్యం' అని తెలుసుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు రామ్‌లాల్. కొన్ని నిముషాల తరువాత బిగ్‌బెల్లీ దూరం జరిగాడు. రామ్‌లాల్‌కు అవమానంతో కన్నీళ్లు వచ్చాయి. పూర్వీకులు కనులముందు మెదిలారు. వారంతా ఒకే కంఠంతో ఇలా అనడం వినిపించింది. 'ప్రతీకారం! ప్రతీకారం!'

ఆ రోజంతా రామ్‌లాల్ ఎవరితోనూ మాట్లాడలేదు. రాత్రికి తన గదిలో దేవీమాత ఫోటో ఉంచి అగరువత్తులు వెలిగించి పూజించాడు. అప్పుడే వర్షం ప్రారంభమైంది. "ఓ దేవీ! శక్తి స్వరూపిణీ! తప్పు చేసినవాడిని శిక్షించు తల్లీ"

కొద్దిసేపటి తరువాత గదిమూలలో అతనికి తన డ్రెస్సింగ్ గౌను నాడా ఒకటి కనిపించింది. అది అచ్చం చుట్టచుట్టుకొని పడుకున్న పాములా కనిపించింది. రామ్‌లాల్‌కు అర్థమైంది తనేం చేయాలో. మరునాడు బెల్‌ఫాస్ట్‌కు వెళ్లే రైలును పట్టుకొని తన స్నేహితుడు రంజిత్‌సింగ్‌ను కలిశాడు. అతను ధనవంతుడు. అతనికి తల్లిదండ్రులు బాగా డబ్బు పంపిస్తారు.

"నా తండ్రి చావుబతుకుల్లో ఉన్నాడు. ఇండియా వెళ్ళడానికి కొంచెం డబ్బు కావాలి. తరువాత నీ బాకీ తీరుస్తాను."

"ప్చ్! అలాగా! పాపం!" అంటూ రంజీత్‌సింగ్ డబ్బు ఇచ్చాడు. ఇరవైనాలుగు గంటల తరువాత రామ్‌లాల్ బొంబాయిలో అడుగుపెట్టాడు. మరునాడు గ్రాంట్‌రోడ్డు బ్రిడ్జి వద్ద గల 'సరీసృపాల





ఎంపోరియమ్‌కు వెళ్ళాడు. అది ఒక ముసలి బెంగాలీ వ్యాపారిది. రామ్‌లాల్ తనకు సాస్కేల్డ్ వైపర్ ఒకటి కావాలని అడిగాడు.

"నా దగ్గర ఆ పాము ఒకటే ఉంది. నిన్ననే రాజస్థాన్ నుండి తెప్పించాను"

సాస్కేల్డ్ వైపర్ అతి ప్రమాదకరమైన చిన్నని పాము. తొమ్మిది నుండి పదమూడు అంగుళాల మధ్య పొడవుంటుంది. మెరుపువేగంతో కాటే స్తుంది. అసలు నొప్పి తెలియదు. మనిషి కొన్ని గంటల్లో మరణి స్తాడు సెరెబ్రల్ హెమరేజ్‌తో.

అక్కడున్న గాజుజాడీలోని ఆకుల మధ్య ఏదో కదిలినట్టయింది. నల్లని నాలుకలు చాస్తూ చిన్న తల ఒకటి బయటకి కనిపించింది.

రామ్‌లాల్ మూడువందల యాభై రూపాయలకు బేరంచేసి ఆ పామును కొన్నాడు. శుక్రవారం ఉదయం లండన్ హీత్రో విమానాశ్రయంలో దిగాడు. బస్‌లో బెల్‌ఫాస్ట్‌కు చేరుకున్నాడు. అక్కడినుండి టీ సమయానికి బంగోర్ చేరాడు.

చీకటి పడ్డాక ఒక కాఫీ డబ్బాను కొని ఖాళీచేసి, గ్లోవ్స్ తొడుక్కుని , పాముని అందులోకి మార్చాడు. దానిని తన లంచ్ బాక్సుతో పాటు ఉంచాడు. తరువాత తను పనిచేసే స్థలానికి వెళ్ళాడు మామూలుగా.

బిగ్‌బెల్లీకి ఒక అలవాటుంది. అతడు తన కోటును ఒక చెట్టుకొమ్మకు తగిలి స్తాడు. లంచ్ తర్వాత తన కోటుజేబులో నున్న పైప్ తీసికొని పొగతాగుతాడు రోజూ. తను మెల్లగా పామును కోటుజే బులో వదులుతాడు. అప్పుడు బిగ్‌బెల్లీ యథాలాపంగా కోటుజేబులో చేయిపెడ తాడు పైప్‌కోసం. పాము అతడిని కరు స్తుంది. తను ముందుకు దూకి పామును బిగ్‌బెల్లీ వేలి నుండి వేరు చేసి నేలమీద పడేసి, దాని తలను బూటుకా లితో నొక్కి చంపే స్తాడు. అందరూ చూస్తుండగా దానిని నదిలోకి విసిరే స్తాడు. ఇదీ రామ్ లాల్ వేసుకున్న పథకం. లంచ్ అవర్‌కు ముందు రామ్‌లాల్ వేరే సమ్మెట తెచ్చే మిషమీద వెళ్ళి, ఎవరూ చూడకుండా కాఫీ డబ్బాను కోటు కుడి జేబులోకి ఖాళీచేశాడు.



లంచ్ టైమ్‌లో అందరూ ఎప్పటిలాగే మాట్లాడుతూ, నవ్వుతూ సాండ్‌విచెస్ తింటున్నారు. రామ్‌లాల్‌కు బ్రెడ్ మింగుడు పడడంలేదు. అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. చివరికి బిగ్‌బెల్లీ లంచ్ పూర్తిచేసి తన కోటు వద్ద కెళ్ళి జేబులో చేయిపెట్టాడు. కాసేపు వెతికి పైపుతీసి వెలిగించాడు.

"ఏమిటలా చూస్తున్నావు? " బిగ్‌బెల్లీ రామ్‌లాల్‌ను ప్రశ్నించాడు గుర్రుగా.

"ఏమీలేదు".. రామ్‌లాల్ ముఖం అటు వేపు తిప్పుకున్నాడు. అతను నమ్మలేకపోతున్నాడు.

'పొరపాటు ఎక్కడ జరిగింది? ఆ దేవీ మాత ఎందుకిలా చేసింది? '

కోటుజేబుకు ఒక చిన్న రంధ్రం కనిపించింది. అదీ సంగతి! తిరుగు ప్రయాణంలో బిగ్‌బెల్లీ ఎప్పటిలాగే కోటును తన కాళ్ళ మీద వేసుకొని ముందు కూర్చున్నాడు.

రామ్‌లాల్ టామ్‌బర్న్‌ను అడిగాడు "బిగ్‌బెల్లీ ఉండేది ఎక్కడ? "

"ఆపైన గల హిల్‌కూలీ ఎస్టేట్‌లో".

"అతనికి ఫ్యామిలీ ఉందా? "

"యస్. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు"

రామ్‌లాల్ తన గదిలో దేవి పటం ముందు మోకరిల్లి 'మాతా! అతని భార్యా పిల్లలకు ప్రమాదం రానీకు. నా ఉద్దేశ్యం వారిని చంపడం కాదు' అంటూ ప్రార్థించాడు. ఆ వీకెండ్ టెన్షన్‌తో గడిపాడు రామ్‌లాల్. సాయంత్రం హిల్‌కూలీ ఎస్టేట్‌కూ వెళ్ళి బిగ్‌బెల్లీ ఇంటిని గుర్తించాడు.

బూత్‌లో ఫోను చేస్తున్నట్టు నటిస్తూ ఒక గంట గడిపాడు. ఇంతలో బిగ్‌బెల్లీ భార్య చేతిలో సంచీతో బయటికి వచ్చి, దగ్గరలో నున్న సూపర్‌మార్కెట్‌కు వెళ్ళింది. వెంటనే ఆమెను కలిసి అసలు సంగతి చెప్పేసి, కోటుజేబులో పాముందని చెప్దామనుకున్నాడు రామ్‌లాల్.

కానీ ధైర్యం చాలలేదు. పిచ్చివాడనుకుంటుందో ఏమో! తన గదికి తిరిగి వచ్చాడు. రాత్రి కలలో పామే కనిపించింది అతనికి.

సోమవారం ఉదయం బిగ్‌బెల్లీ ఫ్యామిలీ బ్రేక్‌ఫాస్ట్‌కోసం డైనింగ్ టేబుల్ చుట్టూ చేరింది. "జెన్నీ! నా కోటు ఇలా తీసుకురా" అంటూ కూతురును కేకేశాడు.. బిగ్‌బెల్లీ బ్రేక్‌ఫాస్ట్ ముగిస్తూ.

జెన్నీ.. కోటును కాలరు దగ్గర పట్టుకొని తీసుకొని వస్తూండగా, దాని మడతల్లోంచి ఏదో ఒక సన్నని నల్లని వస్తువు జారిపడి, శబ్దంచేస్తూ గది మూలకు వెళ్ళడం గమనించింది. "డాడీ! నీ జాకెట్‌లో నుండి ఏదో పడింది"

పధ్నాలుగేళ్ళ బాబీ టోస్టును తినడం ఆపేసి అటు చూశాడు. ఏదో ఒక నల్లని పురుగు గదిమూలలో చుట్టుకొని ఉంది. దాని నోటినుండి నాలుకలు వేగంగా కదులుతున్నాయి. "ఓరి దేవుడా! పాము!" అంటూ అరిచింది మిసెస్ కెమెరాన్.

"నీకేమైనా పిచ్చా! ఐర్లండ్‌లో పాములు లేవని నీకు తెలియదా? " కెమెరాన్ అన్నాడు. స్పూను.. ప్లేట్లో పెడుతూ అడిగాడు "ఏమిటది బాబీ? "

"ఏదో పురుగు డాడీ!" అంటూ బాబీ చెప్పుతో దానిని చంపడానికి దగ్గరికి వెళుతున్నాడు.

"ఉండు బాబీ, ఉండు. నాదొక చిన్న ఐడియా. ఏదైనా ఒక జార్‌ను తీసుకు రండి" అని అరిచాడు బిగ్‌బెల్లీ.

"ఏం చేద్దామనుకుంటున్నావు డాడీ దానితో? " బాబీ అడిగాడు.

"నా దగ్గర రామ్ అని ఒక ఇండియన్ ఉన్నాడు. అతనిని ఒక ఆటపట్టిస్తాను దీనితో. గ్లోవ్ ఒకటి తీసుకుండి"

బిగ్‌బెల్లీ గ్లోవ్‌ను చేతికి తొడుక్కొని జాగ్రత్తగా పామును పట్టేశాడు. కానీ అది మెరుపు వేగంతో కాటేసింది. దాని కోరలు గ్లోవ్‌కు ఉన్న ప్యాడింగ్‌లో దిగాయి.

తన చేతులే అడ్డుగా ఉండడంవల్ల కెమెరాన్‌కు ఇదంతా కనబడలేదు. దానిని ఒక జామ్ సీసాలోకి మార్చి, లంచ్ బాక్సున్న తన బ్యాగులో వేసుకున్నాడు.

ఆ రోజు ఉదయం బిగ్‌బెల్లీ తను రామ్‌లాల్ మీద వేయబోయే ప్రాక్టికల్ జోక్ గురించి ముందే అందరికీ చెప్పాడు రహస్యంగా. " అంతా తమాషాలే' అనుకున్నారు అందరూ. రామ్‌లాల్‌కు ఇదంతా తెలియదు.

మధ్యాహ్నం లంచ్ అవర్లో చాలా యథాలాపంగా బాక్సు మూతను తెరిచాడు రామ్‌లాల్.

సాండ్‌విచెస్ మధ్యన చుట్టుకొని, కరవడానికి సిద్ధంగా ఉన్న పాము అతనికి కనిపించింది.

రామ్‌లాల్ కేక పనివాళ్ళ నవ్వుల హోరులో కలిసిపోయింది. లంచ్‌బాక్సు విసురుగా గాలిలోకి లేచింది. సాండ్‌విచ్‌లన్నీ చెల్లాచెదురుగా అక్కడి పచ్చికలో పడిపోయాయి.

రామ్‌లాల్ చటుక్కున లేచి నిలబడి, "అది పాము! చాలా ప్రమాదకరమైన విష పాము. అందరూ దూరం జరగండి" అంటూ అరవడం మొదలుపెట్టాడు. గ్యాంగ్‌మెన్ పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుతూ కిందపడి దొర్లసాగారు. అందరి కంటే ఎక్కువగా నవ్వింది బిగ్‌బెల్లీయే. ఈ మధ్య అంతగా ఎప్పుడూ నవ్వలేదు అతను. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు "ఓ పిచ్చివాడా! ఐర్లాండులో పాములు లేవని నీకు తెలియదా? " నవ్వీ నవ్వీ అతని పక్కటెముకలు నొప్పి పుట్టాయి.

పచ్చికలో చేతులు వెనక్కి పెట్టుకొని కూర్చున్న బిగ్‌బెల్లీ, తన కుడిచేతి మణికట్టు మీద రెండు చిన్న ముళ్ళు గుచ్చుకున్నట్టు గమనించలేదు.

తమాషా అయిపోయాక అందరూ తమ లంచ్‌బాక్సులు సర్దుకుని మళ్ళీ పనిలో పడ్డారు. ఆ పాత బంగళా పని పూర్తి కావస్తోంది. మూడు గంటల ప్రాంతంలో బిగ్‌బెల్లీ తన నుదుటిపై చేతిని ఉంచి "నాకు ఒంట్లో ఏదోలా ఉంది" అని పాటర్సన్‌తో చెప్పాడు. ఆ వెంటనే చెట్టునీడన కూర్చున్నాడు.. తలను రెండు చేతులతో పట్టుకొని. ఒక గంట తర్వాత బిగ్‌బెల్లీకి ఫిట్స్ వచ్చి పచ్చికలో ఒరిగిపోయాడు. ఒక అరగంటలో అంబులెన్స్ వచ్చి అతడిని జనరల్ హాస్పిటల్‌కు చేరవేసింది. అక్కడ డాక్టర్లు 'డెడ్ ఆన్ అరైవల్' అని చెప్పారు. కొద్దిసేపట్లో అక్కడికి మెక్‌క్వీన్ ఉరుకులు పరుగులతో చేరుకున్నాడు.

అటాప్సీ రిపోర్టు తయారైంది. 'చనిపోయిన వ్యక్తికి సుమారు నలభై ఏళ్ళు. చాలా దృఢమైన శరీరం. చేతులమీద చిన్నచిన్న గాయాలున్నాయి. అతను చేసే పనిలో అవి మామూలే. తీవ్రమైన ఎండలో, చాలాసేపు ఉండడం వల్ల సెరెబ్రల్ హేమరేజ్ జరిగి ఉండవచ్చు'.

విచారణ ప్రారంభమైంది. పాటర్సన్ ఆ రోజు లంచ్ అవర్లో జరిగిన తమాషా గురించి చెప్పాడు. 'అతిగా నవ్వడం, తరువాత ఎండలో పనిచేయడం వల్ల మెడలోని రక్తనాళం చిట్లి బిగ్‌బెల్లీ ప్రమాదవశాత్తూ మరణించాడ'ని కరోనర్ తన రిపోర్టులో పేర్కొన్నాడు.

రామ్‌లాల్ బిగ్‌బెల్లీ అంత్యక్రియలకు హాజరుకాలేదు. నేరుగా టాక్సీలో తను పనిచేసే స్థలానికి వెళ్ళి, చితుకుల మంట వేసేచోట నిలబడ్డాడు.

చుట్టూ ఎత్తుగా పెరిగిన గడ్డివైపు చూస్తూ ఇలా అన్నాడు. "ఓ విషసర్పమా! వింటున్నావా? నేను అనుకున్న పనిని నువ్వు పూర్తిచేశావు. కానీ నువ్వు నా చేతిలో చచ్చి ఉండాల్సింది.. ప్లాను అనుకొన్నట్టు జరిగి ఉంటే. నువ్వు కొన్నాళ్ళు జీవించవచ్చు. కానీ చివరకు నువ్వు ఒంటరిగా చావాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ఐర్లండులో పాముల సలే ఉండవు కాబట్టి."

పాము రామ్‌లాల్ మాటలు విన్నట్టు లేదు. ఇసుక అడుగున బొరియలో అది తన ప్రకృతిసిద్ధమైన పనిని నిర్వర్తించడంలో బిజీగా ఉంది.

తన తోక అడుగునుండి ఒక అంగుళం పొడవున్న అతి ప్రమాదకరమైన ఓ డజను పిల్లల్ని అది ఈ భూమ్మీదకి తీసుకు వస్తోంది! V

అదీ విషయం!



'మీ క్లాసులో గోలచేయని వాడంటూ ఉన్నాడా? '
'ఒక్కడున్నాడు. నా ఫ్రెండు నాని'
'గుడ్. వాడిని మెచ్చుకోవల్సిందే'
'ఏం మెచ్చుకుంటావ్? వాడికి మాటలు రావు!'

తెలుగు కథ



యడవల్లి



ది ఎండ్

"మీరు ఎప్పుడు చచ్చిపోవాలనుకుంటున్నారు? "

"జూన్ 24వ తేదీన"

"ఆ రోజుకి ఏమయినా ప్రత్యేకత ఉందా? అరె! ఇవాళే 24 తేదీ!"

"ఉంది"

"ఏమిటి? "

"ఆ రోజు నా పుట్టిన రోజు."

"వాట్.. పుట్టిన రోజునే చచ్చిపోవాలనుకుంటున్నారా? వింతగా ఉంది"

"ఇంకో ప్రత్యేకతా ఉంది ఆ రోజుకి"

"ఇంకోటా? అదేమిటి? "

"ఆ రోజు నా పెళ్ళిరోజు కూడా"

"పెళ్ళిరోజు! వావ్! పెళ్ళిరోజు, పుట్టిన రోజు, ఒకేసారి, అదీ ఒకే తారీఖున రావడం చాలా అరుదుగా జరుగుతుంది."

"ఆ రెండూ కలిసిన అరుదయిన రోజునే చనిపోవాలనుకోడం కూడా అరుదుగానే జరుగుతుంది."

"యస్.. యస్.. అవునూ.. ఇంతకీ ఎందుకు చచ్చిపోవాలనుకుంటున్నారు? "

"చాలా ఆలస్యమయింది ఇప్పటికే!"

"అలస్యమా? దేనికి? "

"మీరు ఈ ప్రశ్న అడగడానికి. ఎప్పుడు చచ్చిపోవాలనుకుంటున్నారు? అని అడిగారు కానీ; ఎందుకు చచ్చిపోవాలనుకుంటున్నారు? అని ఈ క్షణం వరకు అడగలేదు. అందుకే ఆలస్యమన్నాను"

"నిజమే.. ఆలస్యం అయింది. కారణం చెప్పండి ఇప్పుడైనా"

"బతకడం ఇష్టంలేక"

"మీరు చెప్పేది నమ్మడం కష్టంగా ఉంది. మీకు దాదాపు 10 కోట్ల ఆస్తి ఉంది అంటారు అంతా"

"అబద్ధం"

"అంటే? "

"10 కోట్లు కాదు. 20 కోట్ల రూపాయల ఆస్తి ఉంది"

"గాడ్!"

"యస్.. ఆ ఇరవైకోట్లు నేను న్యాయంగా సంపాదించిందే. అయితే.."

"ఏం జరిగింది? "

"నా భార్య, కొడుకు ఆస్తినంతా వాళ్ళ పేర రాయించుకున్నారు"

"ఇష్టం లేకపోతే ఎలా ఒప్పుకున్నారు? "

"బలవంతాన ఒప్పించారు"

"మీరు చిన్నపిల్లలు కాదు.."

"హు! మెడమీద కత్తి పెట్టినప్పుడు, రివాల్వరు గుండెకి గురిపెట్టినపుడు, ఎంతటి వారయినా లొంగాల్సిందే!"

"అబ్బ.. మీరు చెబుతుంటేనే నాకు వళ్ళు గగుర్పొడొస్తోంది"

"మరి అదంతా అనుభవించిన వాడిని, నేను ఎంత భయపడితే వాళ్ళకి లొంగి ఆస్తి రాసిచ్చానో అర్థం అయిందిగా"

"అర్థమైంది. కానీ ఒక సందేహం. మీరు



ఈ విషయం పోలీసులకు ఎందుకు రిపోర్టు చేయలేదు? "

"ఏమని చేయమంటారు? వాళ్ళు బెదిరించారు అని చెప్పడానికి ఆధారాలు లేవు. నా యిష్టపూర్తిగానే ఆస్తినంతా వాళ్ళకి రాసిచ్చినట్టుగా ఉంది డాక్యుమెంటులో"

"కష్టమే! ఇప్పుడర్థమయింది, మీరెందుకు కంప్లయింట్ చేయలేదో!"

"చేసినా ఫలితం ఉండదని తెలుసు"

"ఎలా? "

"నా భార్య తమ్ముడు హోం మినిస్టరుకు బాగా దగ్గర మనిషి"

"అర్థమయింది. మీరు ఏ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేసినా ఫలితం ఉండదు"

"అలా అని వాళ్ళని వదలదలుచుకోలేదు"

"అవునా? ఎలా? "

"నేను చచ్చిపోవడమే!"

"అర్థం కాలేదు"

"కొంత టైము పడుతుంది"

"తెలుసు.. మీరు చావడానికి ఇంకో 24 గంటలు టైముంది అని"

"నేను చావడానికి కాదు, మీకు అర్థం కావడానికి"

"చచ్చి ఏం సాధిస్తారు? "

"బతికుండి సాధించలేనిది"

"అదే.. ఏమిటని? "

"నా ఆస్తి నాకు కాకుండా చేసిన వాళ్ళకి.. దాన్ని అనుభవించే యోగం ఉండకూడదు"

"వాళ్ళు ఇప్పుడు హాయిగా ఉన్నారా.. మీ ఆస్తి అనుభవిస్తూ? "

"లేరు. ఇంకా ఆస్తి వాళ్ళ స్వాధీనం కాలేదు. బ్యాంకు లాకర్లలో చాలా కాష్ ఉంది, బంగారంతో పాటు అదింకా వాళ్ళకి అందలేదు"

"ఎందుకని? "

"నేను సంతకం చేసి 24 గంటలు కాలేదు. ఆ తరువాత నేను వాళ్ళకి దూరంగా వచ్చేశాను"

"అర్థమైంది. ఏ బ్యాంకులో ఎంతెంత, ఏమేమి ఉన్నదీ వాళ్ళకి తెలుసుకునే అవకాశం ఇవ్వకుండా, అందనంత దూరం వచ్చేశారన్నమాట!"

"అవును. వాళ్ళకి నా జాడ తెలిసేలోగా, నేను ఎప్పటికీ వాళ్ళకి అందని లోకాలకి వెళ్ళిపోవాలి"


"కానీ.."

"ఆ కూల్‌డ్రింక్ బాటిల్ ఇవ్వండిలా"

"చల్లగా లేదు. ఫ్రిజ్‌లోది ఇవ్వనా? "

"వద్దు. నా కోపం, కసి, నన్ను చల్లదనాన్ని కోరుకోనివ్వడంలేదు. ఫరవాలేదు. ఇలాగే తాగేస్తాను.. మరి మీకు.."

"నాకు కూల్‌డ్రింక్స్ అలవాటులేదు.



యూ కారీ ఆన్!"

"అదృష్టవంతులు"

"థాంక్స్"

"కానీ, మీ దురదృష్టం నా రూపంలో వచ్చింది మీకు"

"మీ..రు.. ఏమంటున్నారో? "

"కొంచెం సేపట్లో అర్థమవుతుంది"

"చూడండి. నేను మీ ఫ్యామిలీ శ్రేయోభిలాషిని. మీరు నాకు ఏ విషయం దాచకుండా చెబితే మంచిది"

"ఎవరికి మంచిది? "

"మీకు, మీ వాళ్ళకి కూడా.."

"వాళ్ళకి మంచి జరగకూడదనేగా.. నేను చావాలనుకుంటున్నది!"

"మీ ఆలోచన, ఈ ప్రయత్నం మరిచిపోయి.."

"వీల్లేదు"

"ఒక్క అయిదు నిముషాలు అన్నీ మర్చిపోయి, కూల్‌గా ఆలోచించండి. మీరు పగ సాధించాలి అనుకున్నది పరాయి వాళ్ళమీద కాదు"

"పరాయి వాళ్ళయితే నా చేతకానితనానికి, తెలివితక్కువతనానికి పెనాల్టీ కట్టానని ఊరుకుని ఉండేవాడిని. కానీ నా అనుకున్నవాళ్ళే. నేను నమ్మినవాళ్ళే."

"ఆవేశపడకండి. వాళ్ళు అలా ఎందుకు చేయవలసి వచ్చిందో తెలుసుకుంటే.."

"అదీ తెలుసుకున్నాను. నాకు వేరే ఆడ మనిషితో సంబంధం ఉందన్నారు"

"నిజం కాదా? "

"ఉంది. కాని వాళ్ళు అనుకునే 'ఆ' రకమయిన సంబంధం కాదు"

"మీరు చెప్పలేదా? వివరంగా చెబితే వాళ్ళు అర్థం చేసుకునేవాళ్ళు కదా!"

"పచ్చకామెర్ల వాళ్ళకి.. లోకం అంతా పచ్చగానే కనిపిస్తుంది"

"అంటే? "

"మీకు అర్థం అయ్యేట్టు చెప్పాలంటే.. పచ్చి నిజాలని, అందంగా చెప్పాల్సి వస్తుంది. ఇప్పుడవన్నీ అనవసరం. నేను చాలావరకు అవన్నీ మర్చిపోవాలని ప్రయత్నం చేశాను. కానీ ముల్లులా ప్రతిక్షణం అవి పొడుస్తూనే ఉన్నాయి? "

"మీరు ఈ నిర్ణయం తీసుకునే ముందు.. ఒక్కసారి నన్ను.."

"అంటే నేను చచ్చిపోవడానికి మీ పర్మిషన్ కావాలంటారా? "

"నా ఉద్దేశ్యం.."

"చూడండి! పుట్టేటప్పుడు ఎప్పుడు పుడతామో తెలియదు. చచ్చేటప్పుడయినా, ఎవరి ఇష్టప్రకారం వాళ్ళు చస్తే, ఓ తృప్తిగా ఉంటుంది. ఆ సంతృప్తి అయినా ఉండకూడదంటారా, శాశ్వతంగా ఈ లోకం విడిచి వెళ్ళే వాళ్ళకి? "

"నేను చదువుకున్న బీఎల్ ఇలాగయినా ఉపయోగపడుతున్నందుకు సంతోషంగా ఉంది"

"మీ నిర్ణయం బయటపెట్టకుండా.. మీ వాళ్ళతో మీటింగ్ ఏర్పాటు చేస్తా"

"దేనికి? మనసు మార్చుకుంటాననా.. మీ భ్రమ!"

"పోనీ అలాగే అనుకోండి. కానీ నా కోరిక.."

" చచ్చిపోయే వాళ్ళ కోరిక తీర్చాలి గానీ, బతికున్నవాళ్ళది కాదండీ!"

"మాటలతో చంపుతున్నారు!"

"వాళ్ళ విషయం వదిలేసి, ముందు మీ విషయం ఆలోచించుకోండి"

"నా విషయమా? "

"అవును! ఎలా? వాళ్ళతో బాటు, మీరూ ఇబ్బందుల్లో పడతారు! పడాలి."

"వాట్.. ఇబ్బందుల్లో పడటమా? నేనా? ఏం మాట్లాడుతున్నారు మీరు? "

"నేను సంతకాలు చేసిన డాక్యుమెంట్లు తయారుచేసింది మీరు! అసలు ఆ సలహా ఇచ్చిందే మీరు? "

"అబద్ధం"

"జరిగినదంతా అబద్ధం అయితే ఎంతో

బాగుండును. కానీ అదంతా చేదు నిజం!"

"మీ వాళ్ళు రాయమన్నారు. ఒక లాయర్గా.."

"మీరు లాయరే కాదు. ఆవిడకి లవర్ కూడా అని నాకు తెలుసు"

"... ... ..."

"నాకు ఎలా తెలుసని షాక్ అయ్యారా? .. లేక ఆ విషయం తెలిసినా మిమ్మల్ని ఈ హోటల్ గదికి పిలిపించానని షాక్ అయ్యారా? "

"మీరు ఏం అనుకున్నా నేను కేర్ చెయ్యను. నేను ఏ రకంగానూ ఇబ్బందుల్లో పడను. ఒక క్రిమినల్ లాయర్గా.. నేను నా జాగ్రత్తలో ఉంటాను."

"మీరు క్రిమినల్ లాయరని ఎలా మర్చిపోతాను? ముల్లుని ముల్లుతోనే తియ్యాలి"

"ఏమిటి మీరనేది? "

"డెత్ స్టేట్‌మెంట్ తయారుచేశాను. అది జూన్ 24వ తారీఖున అందవలసినవాళ్ళకే అందుతుంది. అది ఈ రోజే!"

"సో వాట్"?

"డియర్ లాయర్! ఎప్పుడయినా, ఎక్కడయినా, డెత్ స్టేట్‌మెంటుకి విలువ ఉంటుంది"

"... ... ..."

"నాకు మీరు విషం ఇచ్చి చంపారని, అందుకు నా భార్య, కొడుకు ప్రోద్బలం ఉందని.. ఆ డెత్ స్టేట్‌మెంటులో రాశాను"

"కుట్ర! మోసం!"

"నాదా? మీదా? మా చక్కటి సంసారంలో విషపుబొట్టు నువ్వు"

"నేనా? ఓ. కే. కానీ తప్పంతా నాదేనన్నట్లు మాట్లాడటం.."

"తప్పే! కానీ నేను నిన్ను ఎంత నమ్మాను? అందుకే నిన్ను ఇంట్లోకి రానిచ్చాను. నా మంచితనాన్ని, నీమీద ఉన్న నమ్మకాన్ని నువ్వూ, నా భార్య కలసి..".





"ఎస్. నేను అవకాశవాదిని. అవకాశాలను నేనే సృష్టిస్తాను. నీ భార్య మానసికంగా చాలా బలహీనురాలు. ఆ సంగతి తొందరగానే గ్రహించాను. అవకాశం కోసం ఎదురుచూశాను. వచ్చిన అవకాశాన్ని తెలివిగా వాడుకున్నాను. ఎప్పుడూ తెలివయిన వాళ్ళదే గెలుపు"

"న్యాయమైన గెలుపుకి, మోసమైన గెలుపుకి చాలా తేడా ఉంటుంది"

"ఈ వాదన కోర్టులో వాదించడానికి కూడా పనికిరాదు. అయినా చచ్చే నీతో వాదిస్తూ, టైం వేస్ట్ చేసుకుంటే, నేను తెలివైనవాడిని ఎలా అవుతాను? "

"ఒక్క క్షణం ఆగు. ఇందాక నేను చెప్పింది మరిచిపోయి, నాకేదో వీడ్కోలు చెప్పి వెళ్ళిపోతున్నావు. ఆ వీడ్కోలు నీకు. చెప్పవలసింది నేనే!"

"రబ్బిష్"

"నన్ను మీరలా జమకట్టారని, మీ దృష్టిలో నేను అంతేననీ నాకు తెలుసు. కానీ.. కానీ.."

"ఛస్తున్నావా? నువ్వలా దగ్గుతూ, గుండె పట్టుకుని, గిల గిలలాడుతుంటే, నాకు చూడటానికి చాలా సంతోషంగా ఉంది. కానీ ఒక్కటే విచారం"

"వి..చా..ర..మా! దే..ని..కి? "

"ఈ దృశ్యాన్ని నీ భార్య, కొడుకు చూడలేకపోతున్నారని"

"నా.. కూ.. వి.. చా.. రం.. గా.. నే.. ఉం.. ది"

"ఇలా అర్ధాంతరంగా చస్తున్నందుకా? నీకో విషయం చెప్పాలి. ఒక మనిషి చావును నేను కళ్ళారా చూడటం ఇదే మొదటిసారి. ఏమిటి నవ్వుతున్నావా? "

"నాకూ విచారంగానే ఉంది.. ఇదే నీకు ఆఖరిసారి అవుతున్నందుకు. దేనికో తెలుసా? నా భార్యా, కొడుకు పడే

అలనాటి సినీ ముచ్చట్లు



శవాలే శిల్పాలుగా...

మద్రాసుకి 1953లో 'హౌస్ ఆఫ్ వాక్స్' అనే త్రీడి సినిమా వచ్చింది. ఒక శిల్పికి ప్రమాదంలో ఒళ్లంతా కాలిపోతుంది. అప్పటి నుంచి శిల్పాలు మలచలేడు. దాంతో అందమైన అమ్మాయిల్ని చంపేసి, వాళ్ల శవాల్ని తెచ్చి, అలంకరించి తన గాలరీలో నిలబెడుతూ వుంటాడు. అతని కాలిపోయిన రూపాన్ని కనిపించనీయకుండా, యథారూపాన్నే మాస్క్‌గా ధరించి, చక్రాల బండిలో తిరుగుతూ వుంటాడు. రాత్రివేళ, అమ్మాయిల్ని చంపవలసివస్తే మాత్రం కాలిన శరీరంతో వెళ్తాడు. ఈ దృశ్యాలన్నీ భయంకరంగా వుంటాయి. అందులో త్రీడి కదా. కొన్ని షాట్స్‌లో ప్రేక్షకులపైకి వస్తూవుంటే, భయంతో అరిచేవారు. కొందరు తట్టుకోలేక, తలుపులు తోసుకుని బయటికి పారిపోయేవారు!

బాధలు నువ్వు చూడలేనందుకు.. అబ్బ.. గుండెల్లో.. మంటగా.."

"సంధి ప్రేలాపనంటారు.. నువ్వు ఇప్పుడు వాగింది. నిన్ను చూస్తే జాలేస్తోంది. కాసేపు ఈ బాధ ఓర్చుకో. సరే, నువ్వు ఏదో డెత్ స్టేట్‌మెంటు ఇవ్వాలి అని ఫోన్ చేశావు నాకు. ఏదీ అది? "

"కొ..రియర్‌లో.. అబ్బా.. మంట"

"ఓ! కొరియర్‌లో ఎవరికి పంపించావు? ఎప్పుడు పంపించావు? "

"నిన్ను ఇక్కడికి రమ్మని.. ఫోన్.. చేసే.. ముందు. పోలీస్‌కి ఒక కాపీ.. నీకు.. ఒక కాపీ.."

"ఎంత పని చేశావురా రాస్కెల్! ఇంతసేపూ నువ్వు చస్తావన్న ఆనందంలో ఉన్నాను. ఇప్పుడు మమ్మల్నందరినీ ఇరికించి చస్తున్నావు కదరా!"

"దీన్నే. చచ్చి.. సాధించడం.. అంటారు.. అమ్మా.. నొప్పి.."

"నిన్ను.. నిన్ను ఏం చేస్తే పాపం.."

"చస్తున్న వాడిని.. ఇంకా.. ఏం చేయగలవు? ముందు నీ సంగతి చూసుకో. నీ చేత్తో.. ఇచ్చిన కూల్‌డ్రింకులో.. ముందే విషం కలిపాను.."

"ఒరే! నువ్వు ఇంకాసేపటి తరువాత కాదు. ఇప్పుడే చావాలి. అబ్బ! నీ గొంతు ఇంత బలంగా ఉందేమిట్రా. చేతులు నొప్పెడుతున్నాయి నులమలేక.. ఆ! చచ్చావా! అబ్బ! ఎంత శ్రమ పెట్టావురా! నన్నే ఇరికించాలని చూస్తావా? "

"సార్.. కొరియర్!"

"వస్తున్నా! జస్ట్ ఎ మినిట్"

"ఇదుగో సార్! కవరు. సైన్ చేయండిక్కడ. మీరేగా ఆనందరావు. అడ్వకేటు? "


"యస్! యస్!"

"వస్తా సార్"

"ఆశ్చర్యంగా ఉందే! నా పేరుమీద ఇక్కడికి కొరియర్‌లో కవరు పంపించే ఏర్పాటు ముందే చేసి, నాకు ఫోన్ చేసి కరెక్టుగా ఈ టైముకి నేను ఇక్కడుండేలా చేశాడు. చస్తే చచ్చాడు గానీ, బ్రెయిన్ ఉన్న వెధవ! ఈ కవరు ఇంత బరువుగా ఉందేమిటి? లోపల డెత్‌స్టేట్‌మెంటు కాపీ కాకుండా, ఇంకా ఏవయినా రాసి చచ్చాడా! సరే! టెన్షన్ దేనికి? ఓపెన్ చేస్తే సరి! వాడి మరణవాగ్మూలం ఏం రాశాడో తెలుస్తుంది. ఆ.. కరెక్ట్‌గా చిరిగింది కవరు"

ఢాం..!

V



ఆంగ్ల కథ

-కాథరిన్ మాన్స్ ఫీల్డ్

దెయ్యం వచ్చిన రాత్రి

అనువాదం : డా॥ ఎ. హరిప్రసన్న

ఆ రాత్రి నేను ఆ అడుగుల చప్పుడు విననట్టయితే అంత గొడవయ్యేది కాదు. ఒకవేళ ఆ అడుగుల చప్పుడు విన్నా, దాన్ని పట్టించుకోనట్లయితే ఎవరితో ఏ ఇబ్బందీ వుండేది కాదు. దాని మూలంగానే మా అమ్మ చెప్పు విసిరి పక్కింటి కిటికీ పగలగొట్టింది. మా తాతయ్య తుపాకీతో పోలీసును కాల్చాడు. ఈ గొడవంతా చూశాక నాకనిపించింది- ఆ అడుగుల శబ్దం గురించి అనవసరంగా పట్టించుకున్నానేమోనని.

సరిగ్గా రాత్రి ఒంటిగంటకు మొదలయ్యాయి ఆ చప్పుళ్లు. గతి తప్పని, క్రమబద్ధమైన అడుగుల శబ్దాలవి. డైనింగ్ టేబుల్ చుట్టూ ఎవరో నడుస్తున్న చప్పుడది. పైన ఓ గదిలో అమ్మ నిద్రపోయింది. తమ్ముడు ఇంకో గదిలో పడుకున్నాడు. తాతయ్య యథాప్రకారం అటక మీద పక్కేసుకుని పడుకున్నాడు. నేనప్పుడే స్నానం చేసి ఒళ్లు తుడుచుకుంటున్నాను. ఇంతలో ఆ అడుగుల సవ్వడి. ఎవరో ఖచ్చితంగా డైనింగ్ టేబుల్ చుట్టూ తిరుగుతున్నారు. చప్పుడు వినిపిస్తోంది. కానీ మనిషి కనబడటం లేదు. స్నానాలగది దీపం వెలుతురు హాలుమెట్ల మీద పడుతోంది. ఆ మెట్లు నేరుగా భోజనాల గదిలోకి వెళ్తాయి. దీపం వెలుతురు భోజనాలగది అలమారు మీద పడుతోంది. ఆ వెలుతురుకి పళ్ళాలు మెరుస్తున్నాయి, కానీ డైనింగ్ టేబుల్ కనబడటం లేదు. అడుగుల శబ్దం మాత్రం వినవస్తోంది. చెక్క నేల కావటంతో, వదులుగా వున్న చెక్కమీద అడుగు పడినప్పుడు కిర్రుమని చప్పుడు చేస్తోంది. నేను కూడా మొదట ఆ అడుగుల శబ్దం వినగానే మా నాన్న కానీ, అన్నయ్యకానీ అయి వుంటారనుకున్నాను. ఎందుకంటే వాళ్లు వూళ్లకి వెళ్లారు. ఈ పాటికి ఇంటికి రావాల్సిందే. నా తర్వాతి వూహ.. అది దొంగ అయ్యుండవచ్చని. చాలాసేపటి తర్వాత కానీ నా మట్టి బుర్రకీ తట్టలేదు, అది ఖచ్చితంగా దెయ్యమేనని.

ఆ అడుగుల చప్పుడు విన్నాక, మా తమ్ముడు హెర్మన్ గదిలోకి వెళ్లాను పిల్లిలాగా చప్పుడు చేయకుండా. లేపగానే.. వాడు మాట్లాడబోతుంటే.. నిశ్శబ్దంగా వుండమని గడియ వేశాను. ఏ అపరాత్రి వేళో వచ్చి తనకేదో చేసేస్తుందని భయపడుతూ వుంటాడు వాడు.

"ష్! నేనేరా. కింద గదిలో ఏదో వుంది. చప్పుడవుతోంది- చూద్దాం రా" అన్నాను. ఇద్దరం మెటదగ్గర నిలబడి వున్నాం. ఎక్కడా ఏ చప్పుడూ లేదు. అడుగుల శబ్దం ఆగిపోయింది. హెర్మన్ భయం భ

యంగా నావైపు చూశాడు. నా నడుం చుట్టూ ఒక్క టవల్ తప్ప ఏ ఆచ్ఛాదనా లేదు. వెళ్లి పడుకుందామన్నాడు వాడు. కానీ నేను వినలేదు. వెళ్లకుండా వాడి చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. "ఖచ్చితంగా కింద గదిలో ఏదో వుంది" అన్నాను.

నేనలా అంటూండగానే ఆ అడుగుల చప్పుడు మొదలైంది మళ్లీ. డైనింగ్ టేబుల్ చుట్టూ పరిగెత్తిన అడుగులు, వున్నట్టుండి మేమున్న మెట్ల వైపుకి మళ్లాయి. అడుగుల శబ్దం మా వైపుకే వస్తున్నా, మెట్లమీద ఎవరూ కనపడలేదు మాకు. అడుగుల చప్పుడు మాత్రం వినపడుతోంది. మా తమ్ముడు ఒక్క గెంతులో తన గదిలోకెళ్లి తలుపు బిగించేసుకున్నాడు. నేను దఢేల్‌న మెట్లపైనున్న తలుపు మూసేసి మోకాలు అడ్డుపెట్టి నుంచున్నాను. ఒక్క నిమిషం గడిచాక తలుపు తీసి చూస్తే ఏమీ లేదక్కడ. ఏ శబ్దమూ లేదు. మళ్లీ ఆ దెయ్యం అడుగుల చప్పుడు వినపడలేదు.

దభాలున తలుపులు మూసిన చప్పుడుకి మా అమ్మకి మెలకువ వచ్చింది. తన గదిలోంచి తొంగి చూసి "ఏం చేస్తున్నారు మీరిద్దరూ అక్కడ? " అని అడిగింది.

"ఏం లేదు" హెర్మన్ గొణిగాడు.

"ఏంటా పరుగులు కింద గదిలో? " అడిగింది అమ్మ.

అయితే ఆ అడుగుల చప్పుడు మా అమ్మ కూడా విందన్నమాట. నేనూ, తమ్ముడూ సమాధానం చెప్పకపోయేసరికి ఆవిడకి అనుమానం వచ్చింది. నిస్సందేహంగా దొంగలే అయ్యుంటారు వాళ్లు అనుకొని "దొంగలు- దొంగలు పడ్డారు" అని గట్టిగా కేకలు పెట్టిందావిడ.

ఆవిణ్ణి సమాధానపరచడానికి మెట్లు దిగి చూపిద్దామని "రారా హెర్మన్" అని తమ్ముణ్ణి పిలిచాను. వాడసలే ఎస్కేపిస్ట్ కావడంతో మెట్లు దిగటం తప్పించుకోవడానికి "అమ్మ చాలా కంగారుపడుతోంది.. కావాలంటే నువ్వెళ్లు" అని తోశాడు.

నేను మెట్ల వేపుగా నడుస్తుంటే అమ్మ గట్టిగా వారించింది, "ఒక్క అడుగు కూడా ముందుకెయ్యద్దు, పోలీసుల్ని పిలుద్దామ"ని. వచ్చిన చిక్కల్లా అదే. పోలీసుల్ని పిలవడం ఎలా? అన్నది సమస్య అయింది. ఎందుకంటే మా టెలిఫోన్ కింద గదిలో వుంటుంది. అంతే కాకుండా, అసలు పోలీసులతో పెట్టుకోవడం నాకిష్టం లేదు. అయితే మా అమ్మ వూరుకోలేదు. తన పడకగది కిటికీ తెరచి, పక్కింటి వాళ్లని పిలిచింది. ఆ పిలవటం ఎలా పిలిచిందనుకున్నారూ? తన బూటు తీసి ఆ ఇంటి కిటికీ మీదకి విసిరింది. అద్దం భళ్లున పగిలిన చప్పుడు.

మా పక్కింటాయన పేరు బాడ్వెల్. ఆయన, భార్య మాత్రమే వుంటారు. వాళ్ల పిల్లలందరూ వేరే వూళ్లో సెటిల్ అయ్యారు. ఎప్పుడూ తనమీద ఎవరో యుద్ధానికి వస్తున్నారనుకుంటూంటాడు ఆయన. ఆయనదొక వింత మనస్తత్వం. వారందరూ కూడా తిక్క మనుషులే. ఎవరూ ఎవరికీ తీసిపోరు ఎందులోనూ.


అర్ధరాత్రి రెండైందప్పుడు. చంద్రుడు కూడా కనబడటం లేదు. ఆకాశం మబ్బులతో నిండి వుంది. ఆ వేళప్పుడు ఎవరో కిటికీ అద్దం పగలగొట్టారని బాడ్వెల్‌కి వీరావేశం వచ్చింది. ఒక్క గెంతులో కిటికీ దగ్గరకొచ్చి అరవడం మొదలెట్టాడు.

"వీళ్లతో మనం వేగలేం గానీ ఇల్లమ్మేసి మన వూరు వెళ్దాం" అని ఆయన భార్య చెప్పటం స్పష్టంగా వినపడింది మాకు.

ఆగ్రహంలో వున్న ఆయనకి చాలా సేపటిగ్గానీ మా అమ్మ అంటున్నదేమిటో అర్థంకాలేదు.

"దొంగలు, దొంగలు" గొంతు పగిలేలా అరిచింది మా అమ్మ. మా ఇంట్లో దొంగలు పడ్డారు అంటూ...

నేనూ తమ్ముడూ 'దొంగలు కాదు- అది



దెయ్యం' అని నోరు తెరచి చెప్పలేక పోయాం. ఎందుకంటే మా అమ్మకి దొంగ లకన్నా దెయ్యాలంటేనే భయమెక్కువ.

పోలీసులకి ఫోన్ చేయడానికని మా పక్కింటాయన లోపలికి వెళ్లాడు. ఈ లోపల మా అమ్మతో పెద్ద చిక్కొచ్చిప డింది. కిటికీలోకి బూటు విసరటం ఆవిడకి మహ బాగా నచ్చిందట. తన సరదా తీర్చు కోవడానికి రెండో బూటు కూడా విసుర్తా నని పట్టుపట్టి కూర్చొంది.

ఇంతలో పోలీసులు అట్టహాసంగా రంగ ప్రవేశం చేశారు. రెండు వ్యాన్ల నిండా, రెండు మోటార్ సైకిళ్ల మీద.. కొంతమంది విలేఖరులతో సహా..

వీధి తలుపులు బాదుతున్నారు వాళ్లు, "తలుపులు తెరవండి, పోలీసులం వచ్చాం"

కిందికెళ్లి తలుపు తీద్దామనే వుంది నాకు. కానీ అమ్మ ససేమిరా అంది. "ఒంటి మీద నూలుపోగు కూడా లేకుండా ఎలా వెళ్తావ్? చలికి బిగుసుకుపోతావ్" అంది.

అమ్మ ఆ మాట అనగానే నేను హడావు డిగా కిందికి జారిపోయిన టవల్ సరిచేసు కున్నాను. ఈలోపల పోలీసులు తలుపులు బద్దలుకొట్టి లోపలికొచ్చారు. తలుపులు విరిగి పడిన చప్పుడు, అద్దం బద్దలైన శబ్దం వినపడుతూనే వున్నాయి నాకు. వెనువెం టనే ఇల్లంతా ఫ్లాష్‌లైట్ల వెలుతురు పరుచు కుంది. ఎక్కడ చూసినా ఆ వెలుతురే.. భోజనాల గదిలో, ముందుగదిలో, హాల్లో గోడలమీద, ముందు మెట్లమీద, చివరగా మేమున్న వెనకమెట్ల మీదా.

ముందుగా నేనే వాళ్ల కంట్లో పడ్డాను. పైమెట్టు మీద, టవల్ తప్ప మరే ఆచ్ఛాదనా లేకుండా నించున్న నన్ను చూసి "ఎవర్నువ్వు?" అని గద్దించారు ఆ పోలీ సులు.

"ఇది మా యిల్లే" అన్నాను.


"అయితే? ఒంటిమీద ఆ టవల్ ఏం టి? ఆ అవతారమేంటి? బాగా వుక్క పోస్తోందా?" అని వెటకారం చేశాడతను.


నిజానికి అప్పుడు బాగా చలేస్తోంది. వెంటనే నా గదికి వెళ్లి బట్టలు మార్చుకు న్నాను. బైటికి వస్తుంటే ఇంకో పోలీసు ఎదురుపడ్డాడు. తుపాకీ నాకు గురిపెట్టి "ఎవరయ్యా?" అని గద్దించాడు.

"ఇది మా యిల్లే" అనేశాను.

"ఇక్కడెవరూ లేరమ్మా, దాటేసినట్లు న్నారు. అసలా దొంగ ఎలా వున్నాడో చెప్ప గలరా .. రూపురేఖలు?" అని పోలీసాఫీ సర్ మా అమ్మను అడిగాడు.

"ఇద్దరో ముగ్గురో వున్నారు వాళ్లు. ఒకటే మూటలో కట్టి మోసుకెళ్లడం, తలు





పులు విరిగిపడేలా దఢేల్ దఢేల్‌మని తెర వటం, మూయటం" అంది మా అమ్మ.

"ఆశ్చర్యంగా వుందే. వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి. కిటికీ తలుపులన్నీ గట్టిగా బిగించి వున్నాయి" అన్నాడతను.

కింద గదిలో పోలీసులు చేస్తున్న హడా వుడి మాకు వినిపిస్తూనే వుంది. ఇంటి నిండా ఎక్కడ చూసినా పోలీసువాళ్లే. వాళ్ల హడావుడి ఇంతా అంతా కాదు. తలుపులు విరక్కొట్టారు, కిటికీలు బార్లా తెరిచేశారు. అలమారాలన్నీ తీసేశారు, ఇంట్లోని వస్తువు లన్నీ చెల్లాచెదురుగా కిందపడేశారు. ఇంట్లో వున్న సోఫాలు, కుర్చీలు అన్నీ లాగిపడే శారు. పడకలన్నీ చిందరవందర చేసి, బీరు వాలో గుడ్డలన్నీ తీసి కిందపడేశారు. సూట్‌కేసులు, పెట్టెలు అన్నీ అల మారాలనుంచి లాగిపడేశారు.

సితారలాంటి వాద్యం ఒకటి అలమా రాలో కనపడగానే దాన్ని చూపిస్తూ "ఏమి టిది?" అడిగాడు ఒకతను.

"అది మా అన్నయ్యది. మా పెంపుడు గిన్నీ పిగ్ దానిమీద నిద్రపోయేది.."

ఆ మాట అనగానే గతుక్కుమన్నాడ తను. పైనుంచి కిందకి నన్ను అదోలా చూశాడు. అది చూశాక నేను నాలిక్కరచు కున్నాను. 'నిజం చెప్పకుండా వుండాల్సింది' అనుకున్నాను నాలో నేను.

"ఎక్కడా ఎవరూ ఉన్న జాడే లేదు" తన తోటివారితో చెప్పాడా పోలీస్ ఆఫీసర్. "వీడు చూస్తేనేమో ఒంటిమీద నూలుపో గైనా లేకుండా తిరుగుతున్నాడు ఇంట్లో. అటు చూస్తేనేమో మెంటల్ కేసులా ఉంది" అన్నాడు మా అమ్మను పట్టుకొని.

దానికి మిగతావాళ్లంతా ఏం బదులు చెప్పలేదు గానీ అటు వింతగా చూస్తూ నుంచున్నారు..

ఆ నిశ్శబ్దంలో వున్నట్టుండి ఒక కిర్రు చప్పుడు వినపడింది అటక మీదనుండి. మా తాతయ్య ఒక పక్కనుంచి ఇంకో పక్కకి ఒత్తిగిల్లాడేమో.

"ఏమిటది?" అడిగాడా పోలీసాఫీసర్.

నేను వారించే లోపలే ఇద్దరు పోలీ సులు ఒక్క గెంతులో అటకవైపు పరిగెత్తారు.

తాతయ్య ఈ వేళలో లేవటం వల్ల ఎవ రికీ ఏమీ ప్రయోజనం ఉండదు. ఆయన వూరికినే కంగారుపడతాడు. అసలే శత్రు సైనికులు తననేదో చేస్తారనే భ్రమలో ఉంటాడాయన అస్తమానం.

నేను పైకి వెళ్ళేసరికి అనుకున్నదంతా అయ్యింది. అంతా గందరగోళంగా వుంద

క్కడ. నిద్రమత్తులో శత్రు సైనికులు తన మీద కొచ్చారనుకుని ఎదురుగా ఉన్న పోలీసు దగ్గర్నుంచి తుపాకీ లాక్కొని గురి పెట్టాడు .. పోలీసుల మీదకి తాతయ్య.

ఆయన ప్రవర్తన, వేషభాషలు చూసీ చూడగానే ఆయన ఆ ఇంటి మనిషేనని అర్థమైంది వాళ్లకి. అయితే వాళ్లు పొరబడ్డా రన్న సంగతి ఆయనకెలా అర్థమయ్యేట్టు చెప్పాలి?

ఒక పోలీసు దవడను వాయగొట్టాడు. ఇంకొకతని భుజంమీద తుపాకీ పేల్చాడు. ఇది చూసి మిగిలిన పోలీసులు ఎక్కడివార క్కడే చెదిరిపోయారు. ఎలాగో ఒకలాగా అందరం బయటపడి గదికి గొళ్లెం పెట్టేశాం. కాస్త సద్దుమణగగానే ఆయన నిద్రలోకి జారుకున్నాడు.

"మా తాతయ్య మతిమరుపు మనిషి. సైన్యంలో పనిచేశాడు. మీరు సైన్యం నుంచి పారిపోయి వచ్చిన సైనికులు అను కుంటున్నాడు" వివరించాను నేను.

"ఓహో అదా సంగతి?" అన్నాడా పోలీసాఫీసర్. ఆయన కంఠంలో వినపడిన రిలీఫ్‌ను నేను పసిగట్టాను.

అయితే పోలీసులు వెనుదిరిగి వెళ్లి పోవడానికి అంత ఉత్సాహం చూపలేదు. వాళ్లపరంగా చూస్తే ఆ రాత్రి వాళ్లు సాధిం చేదేమీ లేదు. 'మీరేం భరోసా చెప్పి వచ్చార'ని పై అధికారులు అడిగితే వాళ్ల దగ్గర సమాధానం లేదు మరి, అందరూ 'ఫూల్స్' అవడం తప్ప. పైగా ఎక్కడో ఏదో సరిగా శోధించటంలేదని, సంథింగ్ రాంగ్ అనీ వాళ్ల అనుమానం. ఆ బాధ నేనర్థం చేసుకోగలను. నిజమే కదా మరి.

అక్కడే తచ్చాడటం మొదలుపెట్టారు. సన్నగా ఉన్న ఒకతను.. పత్రికా విలేఖరి అనుకుంటా.. నా దగ్గరకొచ్చాడు. మా అమ్మ బ్లౌజ్ తొడుక్కుని వున్నప్పుడు, నా పట్ల అనుమానం, ఆసక్తి రెండూ నిండి వున్నాయతని చూపుల్లో. "ఏంటి సార్ అసలు కథ?" అడిగాడు.

అతనితో నిజం చెప్పేద్దామని నిశ్చయిం చుకొని "దెయ్యాలు కనపడ్డాయి ఇక్కడే" అని చెప్పేశాను.

దాంతో అతను నావైపు కన్నార్పకుండా, సుదీర్ఘంగా చూసి అక్కణ్నుంచి కదిలాడు. పోలీసులు కూడా అతన్నే అనుసరించారు.

తాతయ్య చేతిలో దెబ్బతిన్నతను మాత్రం వెనక్కు తచ్చాడుతున్నాడు.

"ఆ ముసలాయన దగ్గర్నుంచి నా తుపాకీ తప్పనిసరిగా వెనక్కి తెచ్చుకుం టాను" అని పక్కతనితో చెప్తున్నాడు.

"వెళ్లు. కానీ ఎలా తెచ్చుకుంటావు? మేమేదీ చేయలేం" అన్నాడు ఇంకొకతను.

అసహాయంగా నిల్చున్న అతన్ని చూసి జాలేసి "మరుసటిరోజు నేనే పోలీస్‌స్టేషన్‌కి తెచ్చిస్తాన"ని చెప్పాను.

"ఏమైందతనికి?" మా అమ్మ అడిగింది.

"తాతయ్య.. అతన్ని తుపాకీతో కాల్చా డమ్మా" చెప్పాను. అప్పటికి పోలీసులు వె ళ్లిపోయారు.

"ఎందుకు"? అని అడిగింది అమ్మ.

"సైన్యం నుంచి తప్పించుకు పారిపో యిన సైనికుడు అనుకున్నట్టున్నాడు తాతయ్య" చెప్పాను.


"అంత మంచి కుర్రాడైతేనూ పాపం!" అంది అమ్మ.

మరుసటిరోజు పొద్దున్న టిఫిన్‌తినే టైమ్‌కి.. తాతయ్య రాత్రి జరిగిందంతా మర్చిపోయాడు. యథాప్రకారం హాస్యాలు మొదలెట్టాడు. 'రాత్రి జరిగిందంతా మరిచి పోయాడేమో, నమ్మలేదేమో' అనుకున్నాం అందరం మొదట.

అస్సలు మర్చిపోలేదాయన. ముచ్చటగా మూడోసారి కాఫీ తాగుతూ తమ్ముణ్ని, నన్నూ ఉరిమిచూశాడు.

"మధ్యలో ఆ పోలీసులు, హంగామా ఏమిటి నిన్నరాత్రి?" అని గద్దించాడు.

ఏం చెప్తాం ఆయనకి? V



తెలుగు కథ

దెయ్యం

- హోతా పద్మినీదేవి

రాత్రి పదిన్నరయింది. అరగంట కిందటే నేను, రాజేష్ భోజనం ముగించి టెర్రస్ మీదకొచ్చాం. మా ఇల్లు సిటీ అవుట్ స్కర్ట్స్‌లో వుంది. వాహనాల రణగొణ ధ్వనులు, వాయుకాలుష్యం లేకుండా పల్లెటూరిని తలపించే పరిసరాలు, చుట్టూ కొండలు, పచ్చనిచెట్లు, పచ్చికబయళ్లు, దూరంగా బొమ్మరిళ్లలా కనిపిస్తున్న గుడిసెలు, అద్భుతమైన ప్రకృతి చిత్రంలా వుంటుంది అక్కడ.

ఆరోజు అమావాస్య కావడంవల్ల ఆకాశం నల్లటి దుప్పటి కప్పుకుంది. నిశ్శబ్దం రాత్రికి కాపలా కాస్తున్నట్టుంది.

నేను రాజేష్, సిగరెట్లు వెలిగించి రిలాక్స్‌డ్‌గా చెరో కుర్చీలో కూర్చున్నాం.

"ఇంకేమిటి? చెప్పరా" అన్నాను.

"ఏముంది? ఇంజనీరింగ్ పూర్తయి, డిగ్రీ చేతికొచ్చింది. సాఫ్ట్‌వేర్ బూమ్‌తగ్గి ప్రపంచదేశాలన్నీ ఆర్థిక సంక్షోభంతో విల విల్లాడుతున్న నేపథ్యంలో నాకు ఉద్యోగం వస్తుందనే ఆశలేదు. అందుకే చదువు కొనసాగించాలనుకుంటున్నా"

"ఎమ్.ఎస్. చేస్తావా? "

"అమెరికా వెళ్లి సెకండ్ సిటిజన్‌గా బత కడం నా అభిమతం కాదు. కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలన్నారు పెద్దలు. అందుకే సివిల్స్‌కి ప్రిపేరవబోతున్నాను. నాలుగురోజుల్లో ఢిల్లీ ప్రయాణం. అక్కడ కోచింగ్ తీసుకుంటాను.

"వెరీగుడ్!" అభినందనగా అన్నాను.

"మరి నీ సంగతేవిట్రా"

"నేను నీ జూనియర్‌నిరా!" నవ్వేను.

"అదేంట్రా? " ఆశ్చర్యంగా అడిగేడు.

"ఆరోగ్యం బాగాలేక ఎమ్‌సెట్ సరిగ్గా రాయలేకపోయాను. అందుకే లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని, మళ్లీ ఎమ్‌సెట్ రా శాను. మంచి ర్యాంకు వచ్చి సిటీలోని నెంబర్‌వన్ కాలేజీలో సీటొచ్చింది. నాన్న గారు చాలా ఏళ్ల కిందట ఈ ఇంటిస్థలం కొన్నారు. పల్లెటూళ్లంటే ఆయనకి ఇష్టం. మేము పల్లెటూరిలో స్థిరపడే అవకాశం ఎలాగూ లేదు కనుక పల్లెని తలపించే ఈ వాతావరణంలో ఈ ఇల్లు కట్టారు. ఆయన ఎందుకీ ఇల్లు కట్టినాగాని, నాకు హాస్ట ల్‌లో వుండే బాధ తప్పింది. సొంత ఇంట్లో, స్వయంపాకం చేసుకుంటూ హాయిగా చదువుకుంటున్నాను. అప్పుడ ప్పుడు మా అమ్మనాన్నలు వస్తుంటారిక్క డికి. నేనూ వాళ్ల దగ్గరకి వెళ్తుంటాను"

దగ్గరలో నక్క ఊళ వినిపించింది.

"ఇక్కడ నక్కలు వున్నాయేమిట్రా? " రాజేష్ అడిగాడు.

"పక్కనే శ్మశానం వుంది" అందుకని నక్కలు వస్తుంటాయి.


"శ్మశానమా!"

వాడు ఉలిక్కిపడడం ఆ మసక వెలుతు రులో నాకు స్పష్టంగా కనిపించింది.

"అవును" అన్నాను, చివరంటా కాలిన సిగరెట్‌ని దూరంగా విసిరేస్తూ.

"శ్మశానం దగ్గర స్థలంలో ఇల్లు కట్టా లని మీనాన్నగారికెందుకనిపించింది? "

"శ్మశానం పక్కన మా ఇల్లు వుండడం కాదు. ఇదంతా ఒకప్పుడు శ్మశానమే. ఎవరో శ్మశానాన్ని కబ్జాచేసి ప్లాట్లుగా అమ్మేసి వుంటాడు. అలా.. అలా.. చేతులు మారి మాకొచ్చిందీస్థలం. ఇల్లు కట్ట డానికి పునాదులు తవ్వుతుంటే మనిషి తాలూకు అస్థిపంజరం బయటపడింది. మరొకళ్లయితే భయపడి ఇల్లుకట్టేవారు కాదేమో! కాని మా నాన్నగారు పెద్ద పెద్ద సిద్ధాంతులని పిలిపించి హోమాలు, పూజ లతో శాంతి చేయించి ఇల్లు కట్టారు"



రాజేష్ ఇబ్బందిగా కదిలాడు. "అదేం సరదారా బాబూ? "

"చెప్పానుగా ఆయనకీ వాతావరణం అంతగా నచ్చిందని"

"ఏడ్చినట్టుంది" అని రాజేష్ గొణగడం స్పష్టంగా వినిపించింది.

కరెంటు పోయింది. చీకటి ఇంకా చిక్క బడింది. ఠప్‌మని ఏదో పేలిన చప్పుడు. నిప్పుల కుంపటిలో పచ్చి వెలక్కాయని కాల్చినప్పుడు పేలిన శబ్దంలా.

ఉలిక్కిపడినట్టడిగాడు రాజేష్.

"ఏవిట్రా ఆ చప్పుడు? "

"కపాలమోక్షం అయివుంటుంది. నువ్వి క్కడకి వచ్చేముందు ఎవరిదో శవం ఊరే గింపుగా మా ఇంటిముందు నుంచి వె ళ్లింది" గుండెలనిండా గాలిపీల్చుకుని అన్నాను.

"అవును.. శవదహనమే. కమురు కంపు కూడా వస్తోంది"

వెంటనే రాజేష్ ముక్కు మూసుకోడం ఆ చీకట్లో కూడా కనిపించింది.

"ఒంటరిగా ఎలా వుంటున్నావురా బాబూ ఈ ఇంట్లో? "

"అలవాటయిపోయిందిరా! ఏమీ తోచన ప్పుడు డాబామీద నిలబడి శవదహనాన్ని చూస్తుంటాను"

"అదేం దిక్కుమాలిన హాబీరాబాబూ? "

"నాకు శ్మశానం జీవితసత్యాలని తెలియ జేస్తోందిరా! మనం ఎంత సంపాదించినా, ఎన్ని కీర్తిశిఖరాలని అధిరోహించినా మనకి మిగిలేది ఆరడుగుల నేలేనని. చనిపో యాక పిడికెడు బూడిదయ్యే ఈ శరీరం కోసం బతికి వున్నన్నాళ్లూ ఎంత స్వార్థంగా ప్రవర్తిస్తాం? "

"అపర సిద్ధార్థుడిలా ఏమిటో పాపం ఇంత వైరాగ్యం? " రాజేష్ స్వరంలో వ్యంగ్యం.

"వైరాగ్యం కాదురా జ్ఞానోదయం" అన్నాను. దూరంగా చావుమేళం వినిపిం చింది. అది దగ్గరవుతున్న సూచనగా మేళాలు గట్టిగా వినిపించసాగాయి.

"ఎవరిదో శవయాత్ర. చూద్దాంరా" అన్నాను కుర్చీలోంచి లేస్తూ.

"వద్దులే!" అన్నాడు రాజేష్.

"ఏం భయమా? "

"నాకేం భయం? "

"మరి రా!" అన్నాను. వాడు నన్ను అనుసరించాడు. ఇద్దరం పిట్టగోడ దగ్గ రకెళ్లి నిలబడ్డాం. మా ఇంటి ముందు నుంచి శవయాత్ర సాగిపోయింది.

"అదుగో శ్మశానం. శవం కాలుతోంది చూడు" అన్నాను దక్షిణం వైపు చూపిస్తూ.

కరెంటొచ్చింది. వీధిలైట్ల వెలుతురులో రాజేష్ కళ్లలో భయాన్ని స్పష్టంగా చూశాను.

★ ★ ★

మరుసటి రోజు రాత్రి... అలవాటు ప్రకారం టెర్రస్ మీద కుర్చీలో నేను, నా చేతిలో వెలుగుతున్న సిగరెట్టు. నాలుగు రోజులు నా దగ్గర వుండి వెళ్తానన్న నా బాల్యమిత్రుడు రాజేష్ ఒక్కరాత్రి వుండి ఈ రోజు ఉదయమే ఎందుకు వెళ్లిపోయాడో నాకు తెలుసు. వెళ్లే ముందు నాకు చెప్పకపోయినా, వెళ్లడం తెలుసు.

నాకెదురుగా టీపాయ్ మీదున్న సెల్ ఫోన్ రింగయింది. వెంటనే గ్రీన్‌బటన్ నొక్కి చెవికానించుకున్నాను.

'సహజ' నటి



'మా సిన్మాలో తల్లి, కూతురు.. రెండు పాత్రలూ మీరే వేయాలి' అన్నాడు దర్శకుడు

'అంటే.. నేను రెండుసార్లు మేకప్ వేసుకోవాల న్నమాట. ఓకే.. ఓకే' అందా నటి గర్వంగా.

'కూతురి పాత్రకి మేకప్ ఉండాలి. తల్లి పాత్రకైతే మీకా అవసరమేలేదు' అన్నాడతను!



"హలో!"

"నేను రాజేష్‌నిరా!"

"అదేమిట్రా? నేను కాలేజీకి వెళ్లి వచ్చే లోగా వెళ్లిపోయావ్!"నిష్ఠూరంగా అన్నాను.

"ఇలా చెబుతున్నానని ఏమీ అనుకోకు. మీ ఇంట్లో..."

"ఆఁ! మీ ఇంట్లో..."


"దెయ్యం వుందిరా!"

"దెయ్యమా? "నవ్వాపుకుంటూ అన్నాను.

"అవునురా! దెయ్యమే! రాత్రి నువ్వు నీ బెడ్‌రూమ్‌లో పడుకోమని చెప్పినా, ఎ.సి. రూమ్‌లో పడుకుంటే జలుబు చేస్తుందని హాల్‌లో దివాన్‌మీద పడుకున్నానా? అర్ధ రాత్రి గాజుల గలగలలు. గజ్జెలచప్పుడు వినిపించి మెలకువ వచ్చింది. ముందు భ్రమ పడుతున్నాననుకున్నాను. మళ్లీ అదే చప్పుడు. మీ ఇల్లంతటికీ నువ్వు, నేను తప్ప ఎవరూ లేరు కదా! పక్క పోర్షన్‌లో ఆడవాళ్లున్నారేమో అనుకుందామంటే మీ ఇంటిని ఎవరికీ అద్దెకివ్వలేదు. నాకు చాలా భయం వేసింది. ఆ గాజుల చప్పుడు ఎవరిదా? అని ఆలోచిస్తుంటే కిటికీ బయట తెల్లని చీరకట్టుకుని జుట్టు విరబోసుకున్న స్త్రీ... కాదు దెయ్యం! దాని కళ్లు నన్ను సూటిగా భయంకరంగా చూస్తున్నాయి"

"అరె! పోరా! ఆరోక్లాసు చదివేప్పుడే నీ స్కూల్ బ్యాగ్‌ని దెయ్యంచేత మోయించిన ధైర్యవంతుడివి. నీకు దెయ్యమంటే భయ మేమిటి? "

"మీరంతా నన్నో హీరోలా చూడాలని అప్పుడలా కథ చెప్పానురా! ఒట్టు! నేను మొదటిసారిగా దెయ్యాన్ని నిన్న మీ ఇంట్లోనే చూశాను. ఆ దెయ్యం కిటికీ



లోంచి నన్ను అలా చూస్తూనే వుంది. ఒకసారి నన్ను చూసి నవ్వింది. మరోసారి కన్ను గీటింది. ఇంకోసారి చెయ్యి వూపి రమ్మని సైగ చేసింది. కొన్ని నిముషాలకు దెయ్యం మాయమయినా గాజుల చప్పుడు, గజ్జెల చప్పుడు వినిపిస్తూనే వుంది. బాత్‌రూమ్‌కి పోవాలన్నా భయం. కళ్లు గట్టిగా మూసేసుకుని ఆంజనేయ దండకం చదువుతూ కూర్చున్నాను. కదిలినా మెదలినా దెయ్యం నా మీద పడి పీక పిసికేస్తుందని భయం. ఒరేయ్! వెంటనే ఆఇల్లు ఖాళీ చేసెయ్యి"

"థ్యాంక్స్! ఫర్ యువర్ కైండ్ ఎడ్వయిజ్! దెయ్యం నన్నేమీ చెయ్యదు" అన్నాను, గాంభీర్యాన్ని అరువు తెచ్చుకుంటూ.

"అది కాదురా! నేను చెప్పేది విను"

"గుడ్ నైట్!" అని ఫోన్ కట్ చేశాను.

అప్పటి వరకు ఉగ్గబట్టుకున్న నవ్వు వరద గోదావరిలా ఉధృతంగా పొంగి వచ్చింది. పకపక నవ్వేశాను. ఆ నిశ్శబ్దంలో నా నవ్వు ప్రతిధ్వనించింది.

చల్లని గాలితోబాటు శవం కాలుతున్న కవురు కంపు నా నాసికాపుటాలకి సోకింది. దూరంగా నక్క ఊళలు వినిపిస్తున్నాయి.

నాకు ఆ క్షణంలో రాజేష్ గుర్తుకొచ్చాడు. వాడు నిన్నరాత్రి ఈ వాతావరణంలో ఎంత హడలిచచ్చాడో తలచుకుని మళ్లీ మళ్లీ నవ్వేను.

"మీరంతా నన్ను హీరోలా చూడాలని కథలు చెప్పానురా! నాకు దెయ్యమంటే భయం!" రాజేష్ ఫోన్‌లో చెప్పింది విని మరీ నవ్వొచ్చింది.

నవ్వి నవ్వి ఆయాసపడుతూ కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్నాను. నా మనసు బాల్యంలోకి విహంగంలా ఎగిరింది.

రాజేష్ నేను సిక్స్త్ క్లాస్ నుంచి క్లాస్ మేట్స్‌మే కాదు, మంచి ఫ్రెండ్స్‌ం కూడా. మా నాన్న బ్యాంకు మేనేజర్. రాజేష్ వాళ్ల నాన్నగారు వీడీఓ. మా నాన్నగారు గూటాల అనే చిన్న గ్రామంలో బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న రోజులవి. రాజేష్ వాళ్ల కుటుంబం మా పక్కవీధిలో వుండేది.

రాజేష్‌కి నాకు ట్యూషన్ కూడా ఒకే టీచర్ దగ్గర. దాశరథిగారని లెక్కల మేస్టారుండేవారు. సాయంకాలం ఆరుగంటల నుంచి రాత్రి ఎనిమిదింటి వరకు ట్యూషన్. ఊరి శివార్లలో వుండేది ఆయన ఇల్లు. మేమిద్దరమే కాకుండా మరో నలుగురు పిల్లలు కూడా ఆయన దగ్గర ట్యూషన్‌కొచ్చేవారు.

ఒకరోజు మేము ట్యూషన్‌లో వుండగా రాజేష్‌కి కడుపునొప్పి వచ్చింది. ఇంటికెళ్లిపోతానని మాస్టారినడిగాడు.

"ఒక్కడివీ చీకట్లో వెళ్లగలవా?" అని అడిగేరాయన.

"నాకేమీ భయం లేదండి" అని ఒక్కడూ ఇంటికి బయలుదేరాడు.

మరునాడు స్కూల్‌లో లంచ్ అవర్లో వాడు చెప్పిన కథకి కథనం ఇది.

రాత్రి వాడు ఒంటరిగా చీకట్లో నడుస్తుంటే వెనకాల మరో మనిషి నడుస్తూ వీడిని దాటి ఆగి పలకరించాడు.

"ఈ వేళప్పుడు ఎక్కడ నుంచి వస్తున్నావ్ బాబూ?"

"ట్యూషన్ నుంచండి" అన్నాడు రాజేష్.

"చీకట్లో ఒంటరిగానా? ఎంత దూరం మేస్టారి ఇల్లు?"

రాజేష్ చెప్పాడు.

"ఒక్కడివీ ఎందుకొస్తున్నావ్?"

"నాకు కడుపునొప్పిగా వుందండి"

"అయ్యో! కడుపునొప్పా? ఆ బ్యాగ్ ఇటివ్వు నేను పట్టుకుంటాను"


రాజేష్ ఫర్వాలేదు వద్దంటున్నా.. ఆ వ్యక్తి పుస్తకాల బ్యాగ్ తీసుకున్నాడు.

"మీ పేరేమిటండీ?"

"పెద్దిరాజు. అరటిపళ్ల వ్యాపారం చేసే పెద్దిరాజంటే గూటాలలో ఎవరైనా చెబుతారు"

ఆంజనేయస్వామి గుడి అల్లంత దూరంలో వుండగా బ్యాగ్ రాజేష్‌కిచ్చి "జాగ్రత్తగా వెళ్లమ్మా!" అన్నాడు పెద్దిరాజు.

రాజేష్ ఇంటి దారిపట్టాడు. చీకట్లో ఒంటరిగా అంతదూరం నడిచి వచ్చినందుకు కంగారు పడిందతని తల్లి.



"ఒక్కడినీ రాలేదు. ఆంజనేయస్వామి గుడిదాకా పెద్దిరాజు సాయమొచ్చాడు" అన్నాడు రాజేష్.

"ఎవరు? ఏ పెద్దిరాజు?" అడిగాడు రాజేష్ తండ్రి.

"అరటిపళ్ల వ్యాపారం చేస్తాడట"

రాజేష్ తండ్రి నిటారుగా అయ్యాడు. భయాశ్చర్యాలతో కళ్లు పెద్దవయ్యాయి. ఆ రాత్రి వాడు నిద్రపోతున్నాడనుకుని తల్లి, తండ్రి మాట్లాడుకుంటున్నారు.

"రెండునెలల కిందట పెద్దిరాజు అరటిపళ్ల గెలలు సైకిల్‌కి కట్టుకుని రాజమండ్రి వెళ్తుండగా కొవ్వూరు బ్రిడ్జిమీద లారీ గుద్దేసింది. అక్కడికక్కడే చనిపోయాడు. అంటే రాజేష్‌కి సాయంగా వచ్చింది, వాడి పుస్తకాల బ్యాగ్ మోసింది పెద్దిరాజు కాదు. అతని ఆత్మ!" అంటున్నాడు తండ్రి.

"బాబోయ్! నిజమా? దెయ్యం పసివెధవని ఏమీ చెయ్యకుండా వదిలేసింది! భగవంతుడు రక్షించాడు" తల్లిస్వరంలో వణుకు.

"పసివెధవ! వాడితో ఆమాట అనకు; జడిసిపోయి జ్వరం తెచ్చుకుంటాడు. వాడిని చీకటిపడ్డాక ఒంటరిగా ఎక్కడకీ వెళ్లనివ్వకు" అంటున్నాడు తండ్రి.

"చందమామ కథల్లో చదివినట్టు పెద్దిరాజు దెయ్యంగా మారి ఉపకారం చేస్తున్నాడన్నమాట" అనుకున్నాడు. వాళ్ల సంభాషణను విన్న రాజేష్.

రాజేష్ చెప్పింది విన్న నా ఒంటిమీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి. లాగు తడిసిందని అనుమానం కూడా వచ్చింది. మిగతావాళ్ల పరిస్థితి కూడా మెరుగ్గాలేదు. దెయ్యానికి దడిసి వాళ్లు ట్యూషన్ మానుకున్నారు. ఆ దెబ్బతో రాజేష్ సహవిద్యార్థులలో హీరో అయ్యాడు. దెయ్యంతో మాట్లాడి, దెయ్యంచేత తన స్కూల్‌బ్యాగ్ మోయించిన ధైర్యశాలి మరి.

గతంలోంచి వర్తమానంలోకి వచ్చి మనసారా నవ్వుకున్నాను. రాజేష్‌లో అప్పటి ధైర్యం వుందో? లేదో? తెలుసుకోడానికి కస్తూరిని దెయ్యంలా నటించమన్నాను. మా కాలనీలోనే కస్తూరి తల్లితో కలిసి వుంటుంది. ఆమె టి.వి. సీరియల్స్‌లో చిన్నచితక వేషాలు వేస్తుంటుంది. నేనిస్తానన్న డబ్బుకి ఆశపడి దెయ్యంలా రాజేష్‌ని భయపెట్టింది. లేకపోతే ఇవాళ వాడు నాకీ నిజాన్ని చెప్పేవాడేకాదు.

నేను నవ్వుకుంటూ మరో సిగరెట్టు తియ్యబోయాను. సరిగ్గా నాకు పదడుగుల దూరంలో నాకెదురుగా తెల్లనిచీర, జాకెట్టు ధరించి జుట్టు విరబోసుకున్న స్త్రీ ఆకారం వెనుదిరిగి నిలబడి వుంది.

కస్తూరి ఇప్పుడు ఇక్కడకెందుకొచ్చింది? డబ్బు కోసమా? తన దెబ్బకి రాజేష్ భయపడి వెళ్లిపోయాడని ఆమెకి తెలుసేమో.. అనుకుంటూ 'కస్తూరీ! రాత్రి వేళ ఇక్కడకెందుకొచ్చావ్? డబ్బు కోసమే అయితే రేపు నేను మీ ఇంటికొచ్చి ఇస్తాను. ఎవరైనా నిన్నిక్కడ చూస్తే బాగుండదు. ఇంటికి వెళ్లు" అన్నాను.


ఆమె నావైపు తిరిగింది. ఆమె కస్తూరి కాదు. ఆమె కళ్లు ఎర్రగా కొలిమిలో కాలుతున్న ఉక్కు కడ్డీల్లా వున్నాయి. కనుగుడ్లని గుండ్రంగా తిప్పుతోంది.

చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోతూ కెవ్వున అరిచాను.

'దె.. దెయ్యం!'

తరువాత ఏమయిందో స్పృహ తప్పిన నాకు తెలియదు. V

'గృహ' హింస




'టీవీతో హింస పెరుగుతోందిరా' బంటీతో అన్నాడు చంటి

'ఏమైందిరా?'

'ఏముందీ! ఇంట్లో టీవీ పెట్టగానే, మమ్మీ వచ్చి ఎడాపెడా బాదేస్తోంది!

తెలుగు కథ



తిరుమలశ్రీ



క్రాస్ టాక్

ఆ పాత లెదర్ సూట్‌కేస్‌వంక సాలోచనగా చూశాడు అజీజ్. అందులో యాభైకోట్ల రూపాయలు విలువచేసే అమెరికన్ డాలర్స్- వున్నాయని ఎవరూ ఊహించలేరు. హోటల్ రూమ్‌లో ఫోమ్ బెడ్‌మీద పడుకుని మీద మెరిసే కళ్లతో ఆ సూట్‌కేస్ వంకే దీక్షగా చూస్తూన్న అజీజ్ మెదడులో గతం సినిమా రీలులా గిర్రున తిరిగింది...

పదేళ్ల క్రితం ఇరవై ఏళ్ల వయసులో దొంగ పాస్‌పోర్టు, వీసాలతో దుబాయ్‌లో ప్రవేశించాడు అజీజ్. అక్కడే పరిచయమైందతనికి సలీం, బెనర్జీ, పిళ్ళైలతో. సలీంకి నలభయ్యేళ్లుంటాయి. ఎత్తుగా, దృఢంగా వుంటాడు. హైదరాబాద్ పాతబస్తీకి చెందినవాడు. బెనర్జీ పిళ్ళైలు నలభయ్ లోపువారే. బెనర్జీది ఖరగ్‌పూర్, పిళ్లైది ముంబై. దుబాయ్‌లో ఓ స్మగ్లర్ దగ్గర కొరియర్స్‌గా పనిచేసేవారు నలుగురూ. ఆ వృత్తిలో ఆదాయంకంటె అపాయమే ఎక్కువ కావడంతో ఏదో ఒక పెద్ద చేపకు గేలంవేసి జీవితంలో స్థిరపడిపోవాలని ఆలోచించేవారు.

సలీం గర్ల్‌ఫ్రెండ్ జుబేదా. దుబాయ్‌లోని ఓ అమెరికన్ బ్యాంక్‌లో పనిచేస్తోంది. ఆమె ద్వారా ఆ బ్యాంక్ గుట్టుమట్లన్నీ సేకరించాడతను. తర్వాత దాన్ని దోచుకునేందుకు మిత్రులతో పథకం రూపొందించాడు. వరుసగా మూడు రోజులు బ్యాంక్‌కి సెలవులు వచ్చే సమయంలో ముహూర్తం పెట్టాడు. అక్కడ శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలన్నిటికీ సెలవు. ఆ తర్వాత రెండురోజులు ఎందుకో సెలవులు వచ్చాయి. దోపిడి విషయం బైటపడేలోపునే సొమ్ముతో స్విట్జర్లాండ్‌కు పారిపోవాలని నిశ్చయించుకున్నారు. అక్కడ బ్యాంక్స్‌లో ఎంత సొమ్ము డిపాజిట్ చేసినా సోర్స్ గురించి అడగరు.

దోపిడికి ముందురోజు రాత్రి అనుకోకుండా వచ్చిన జుబేదాను చూసి ఆశ్చర్యపోయాడు అజీజ్... పాతికేళ్లుంటాయి ఆమెకు. స్లిమ్‌గా, పొడవుగా, తెల్లగా అందంగా వుంటుంది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు సమ్మోహితం చేస్తుంది. సలీంతో అప్పుడప్పుడు చూడడమే తప్ప అతడామెను ఒంటరిగా ఎప్పుడూ కలవలేదు.

అందమైన తన రూపం నుంచి చూపులు మరల్చుకోలేకపోతూన్న అతని బలహీనతను గుర్తించినట్టు సమ్మోహనంగా నవ్వింది జుబేదా. చేరువగా వచ్చి చొరవగా అతని ముఖాన్ని తన వక్షానికి హత్తుకుంది. అతనికి ఊపిరి ఆగిపోయినట్టయింది. సలీమ్‌తో ఆమెకు 'లివ్ ఇన్' బాంధవ్యం వుందని అతనికి తెలుసు. ఆమెతో తాను సన్నిహితంగా వున్నట్టు తెలిస్తే సలీం సహించడు. స్నేహితుడని కూడా ఆలోచించకుండా చంపేస్తాడు.

తన ఒళ్లో పడుకుని జుబేదా చెప్పిన విషయం అజీజ్‌ని అయోమయానికి గురిచేసింది... తమ గ్యాంగ్‌లో అందరికంటె



హ్యాండ్సమ్‌గా వుంటాడు అజీజ్. ఆమె అతన్ని ప్రేమించిందట. ఆ సంగతి చెప్పడానికి సమయం కోసం ఎదురు చూస్తోందట. బ్యాంక్ దోపిడి చేయగానే సలీం తదితరుల్ని డబుల్ క్రాస్‌చేసి దోపిడి సొమ్ముతో మనిద్దరం అమెరికా పారిపోదామంది. పెళ్లి చేసుకుని భార్యాభర్తలుగా జీవించుదామంది.


అజీజ్‌కి భయం వేసింది. ఇది నిజమేనా? లేక తనను పరీక్షించేందుకు సలీమే ఆమెను తన మీద ప్రయోగించాడో బోధపడలేదు. అతని భయాలను గ్రహించిన జుబేదా అతన్ని నమ్మించడానికి కొంచెం కష్టపడవలసివచ్చింది. కోట్లతోపాటు ఆ బ్యూటీ సొంతమవుతుందంటే కాదనడానికి అతనేమీ మూర్ఖుడు కాడు.

నమ్మినవారినే సులభంగా మోసగించగలరు ఎవరైనా! జుబేదా సలీంకి ప్రాణం. ఆమెను నమ్మినట్టు ఇంకెవరినీ నమ్మడతను. దోపిడి సొమ్మును ముందుగా జుబేదా ద్వారా దేశం దాటించడానికి ముందుగానే నిర్ణయమయింది. ప్రమాదవశాత్తూ తాము పట్టుబడ్డా సొమ్ము చేజారిపోకూడదనే ఆ ఏర్పాటు. దాన్ని క్యాష్ చేసుకుందామంది జుబేదా. ప్లానంతా ఆమెదే. ఆమె చెప్పినట్టు చేయడమే అజీజ్ వంతు.

గురువారం రాత్రి పథకం ప్రకారం బ్యాంక్ దోపిడి జరిగింది. జుబేదా సాయంతో అంతకు ముందే బ్యాంక్ అలారం అవుటాఫ్ ఆర్డర్ చేశారు... సొమ్ము జుబేదాకి అందింది. మిత్రులు నలుగురూ తలో దిక్కుకీ తప్పుకున్నారు. సోమవారం ఉదయం బ్యాంక్ తెరిచాక గాని దోపిడి విషయం బైటపడదు. ఆ లోపునే తామంతా దుబాయ్ విడిచేయాలన్నది ప్లాన్. ఆదివారం రాత్రి అంతా ఎయిర్‌పోర్ట్‌కి విడివిడిగా చేరుకోవాలి. విడివిడిగానే స్విట్జర్లాండ్‌కి ప్రయాణం చేయాలి. జుబేదా అప్పటికి సొమ్ముతోపాటు అక్కడ తమ కోసం ఎదురుచూస్తూంటుంది... అదీ ప్లాన్.

ఐతే జుబేదా ప్రతిపాదనతో అజీజ్ ఆలోచనలు కొత్త పుంతలు తొక్కాయి. ఆ రాత్రి జుబేదా సొమ్ముతో అతని వద్దకు వచ్చింది. తాము డబుల్ క్రాస్ చేసినట్టు మిగతావారు గ్రహించేలోపే అక్కణ్ణుంచి ఎగిరిపోయేందుకు ఏర్పాటు చేసిందామె.

"దుబాయ్‌కి వీడ్కోలు డ్రింక్ ఇది!" అంటూ ఇద్దరూ హాట్ డ్రింక్స్ తీసుకున్నారు. తరువాత తమకంతో రతికేళి.. ఆ తర్వాత మరోసారి డ్రింక్స్ తీసుకున్నారు.



అయితే ఈసారి ఆమెకిచ్చిన డ్రింక్‌లో విషం కలిపాడు అజీజ్. ఆ విషయం గ్రహించేలోపునే జుబేదా అసువులు బాసింది. శవాన్ని హోటల్ బాత్‌టబ్‌లో పడేసి టబ్‌ని నీటితో నింపేశాడు.

నమ్మిన సలీంనే మోసగించిన జుబేదా ఏదో ఒకరోజున తననూ మోసగించదన్న గ్యారంటీలేదు. చేతికి వచ్చిన సొమ్మును ఆమెతో పంచుకోవడానికి దురాశ అడ్డువచ్చింది. అందుకే ఆమె అడ్డు తొలగించుకున్నాడు. జుబేదా కనిపించకపోవడంతో ఆమె సొమ్ముతో పరారయింది అనుకుంటారు. తనని ఎవరూ అనుమానించరు. అదీ అజీజ్ ఆలోచన.

సొమ్మును ఓ పాత సూట్‌కేస్‌లోకి మార్చి పెట్టెను సీల్ చేసాడు అజీజ్. ఓ ఏజెంట్ ద్వారా దాన్ని ఇండియాకి వెళ్లే నెక్స్ట్‌షిప్‌లో స్క్రాప్ కింద బుక్ చేశాడు. కన్సైన్‌మెంట్ ఇండియా చేరడానికి నాలుగైదు నెలలు పడుతుంది. ఆ లోపున విషయం పాతబడిపోతుంది.

హాంకాంగ్ వెళ్లే ఫ్లైట్‌కి అంతకుముందే మారుపేరుతో సీట్ బుక్ చేసుకున్నాడు. మర్నాడు ఎయిర్‌పోర్ట్‌కి వెళ్తూ దారిలో ఆగి పోలీస్‌లకు ఫోన్ చేశాడు. అమెరికన్ బ్యాంక్ దోపిడి విషయం చెప్పి, అందుకు కారకులైన గ్యాంగ్ సలీం, బెనర్జీ, పిళ్లైలు ఏయే హోటళ్ళలో దాక్కున్నదీ సమాచారం అందించాడు.

ఓ గంట తరువాత ఎయిర్‌పోర్ట్‌లోని టీవీలో కనిపించిన దృశ్యం చూసి నవ్వుకున్నాడు. బ్యాంక్ దోపిడి నేరంకింద అతని మిత్రత్రయం అరెస్టయి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి తరలింపబడుతున్న దృశ్యమది!

హాంకాంగ్‌లో రెండునెలలు గడిపి అక్కణ్ణుంచి మాల్‌దీవ్స్‌కి వెళ్లాడు అజీజ్. కన్సయిన్‌మెంట్ చేరుకునే సమయానికి ఇండియాకి వచ్చాడు. ముంబై పోర్ట్‌లో కస్టమ్స్ సిబ్బంది చేతులు తడిపి సూట్‌కేస్‌తో హైద్రాబాద్ చేరుకున్నాడు. ఎవరికీ అనుమానం కలగకుండా ఓల్డ్‌సిటీలోని ఓ చిన్న హోటల్లో బసచేసాడు.

స్మగ్లింగ్ డీల్స్‌చేసే వ్యక్తులతో కొంత పరిచయముంది అజీజ్‌కి. వారిని వెతికి పట్టుకోవడానికి కొద్ది రోజులు పట్టింది. తన వద్దనున్న డాలర్స్‌ని కొద్ది కొద్దిగా మార్చడానికి పూనుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం హోటల్ రూమ్‌లో కూర్చుని తన కాంటాక్ట్ నుంచి కాల్ కోసం ఎదురుచూస్తున్న అజీజ్, ల్యాండ్‌లైన్ మోగడంతో లేచివెళ్లి రిసీవర్ అందుకున్నాడు. 'హలో, హలో' అంటే అటువైపు నుంచి జవాబు లేదు. డిస్కనెక్ట్ అయింది. రిసీవర్ పెట్టేసి వచ్చి కూర్చున్నాడు. రెండు నిముషాల తరువాత మళ్లీ మోగింది ఫోన్. వెళ్లి రిసీవర్ తీసాడు. కొద్ది సెకన్ల నిశ్శబ్దం అటువైపు. అనంతరం ఏదో క్రాస్ టాక్ వినవచ్చింది. ఎవరో ఇద్దరు వ్యక్తుల సంభాషణ అది-

'రహీం! జాగ్రత్తగా విను. ఈ రోజు రాత్రి అమీర్‌పేటలోని 'దిల్‌షుక్' బార్‌కి వెళ్లు. కౌంటర్లో ఓ ఆంగ్లో- ఇండియన్ యువతి ఉంటుంది. ఆమె వద్దకు వెళ్లి వేయి రూపాయలకు చిల్లర అడిగి వంద రూపాయల నోటు ఇయ్యి. ఆమె పది వంద నోట్లతో బాటు ఓ సీల్డ్ కవరూ, ఓ మూవీ టికెటూ ఇస్తుంది నీకు. సికింద్రాబాద్ మంజు థియేటర్‌లో ఆడుతూన్న ఓ ఇంగ్లీష్ పిక్చర్ నైట్‌షోకి చెందిన టికెట్

అదే పని



దాము: ఇప్పుడు నాకు రోజంతా కవిత్వం రాసే పనే

సోము: సంతోషం. ఇంతకు ముందు వైద్యం చేశావు కదా

దాము: ఇప్పుడది మానేశా

సోము: సరేలే.. జనాన్ని చంపడానికి ఏదో ఒకటి!

అది. ఆ థియేటర్‌కి వెళ్లి షో మొదలయ్యాక లోనికి వెళ్లు. టికెట్‌లో వున్న సీటు నంబర్‌లో కూర్చో. ఆ సీటుకి ఇరువైపులా సీట్లు ఖాళీగా ఉంటాయి. షో సగంలో ఓ యువతి వచ్చి నీ పక్క సీట్లో కూర్చుంటుంది. ఆమె నిన్ను వంద రూపాయలకు చిల్లర అడిగి వేయి రూపాయల నోటు ఇస్తుంది. పది రూపాయల నోట్లు పది ఇవ్వు. చిల్లరతో పాటే నీ దగ్గరున్న కవర్ని కూడా ఆమె చేతిలో పెట్టు. తరువాత చీకట్లోనే నిష్క్రమిస్తుందామె. నువ్వు మాత్రం షో ముగిసేంతవరకు థియేటర్‌లోంచి కదలొద్దు..." గబగబా చెప్పుకుపోయాడు ఓ వ్యక్తి.

"ఎవరా యువతి భాయ్? అందంగా ఉంటుందా? " కుతూహలంగా అడిగాడు రహీం. "పిచ్చివేషాలేయకు చిక్కుల్లో పడతావ్!" హెచ్చరించాడు మొదటి వ్యక్తి.

రహీం కుతూహలం చావనట్టుంది. "ఆ కవర్లో ఏముంది? " అడిగాడు మళ్లీ.

"అరె, బేవకూఫ్! అనవసరపు ఆరాలకు పోయి ప్రాణాలు పోగొట్టుకోకు' కటువుగా అన్నాడు మొదటి వ్యక్తి. "చెప్పినట్టు చేయడమే నీ పని. ఏ మాత్రం పొరపాటు జరిగినా పర్యవసానం ఎలా వుంటుందో నీకు తెలియనిది కాదు"

"సరే, సరే ఆ కవర్లో ఏముంటే నాకెందుకు? నా కష్టానికి తగ్గ ఫలం ముడితే చాలు" అన్నాడు రహీం.

"భేష్! షో అయ్యాక నా దగ్గరకు రా. నీ ఫీజు తీసుకుపోదువుగాని" అనేసి మొదటి వ్యక్తి ఫోన్ కట్ చేసేశాడు.

టెలిఫోన్ సైలెంట్ అయిపోయాకగాని అజీజ్ తేరుకోలేదు. అనుకోకుండా చెవిన పడ్డ ఆ సమాచారం అతన్ని నిలువనీయలేదు. ఆ కవర్లో అతి ముఖ్యమైనదీ ఏదో వుందని అర్థమైపోయింది. ఆపరేషన్ కోడ్ తెలిసిపోయింది కనుక రహీం కంటే ముందుగా తానే వెళ్లి ఆ కవర్ని కైవసం చేసుకోవాలనుకున్నాడు. టైమ్ చూసుకున్నాడు. 'దిల్‌షుక్' బార్‌కి వెళ్లడానికి రెండు గంటల టైముంది... సొమ్ములున్న సూట్‌కేస్‌ని బెడ్ క్రిందకు తోసేసి బెడ్ షీట్ కప్పేశాడు.

ఫేడెడ్ జీన్స్‌లో వైట్ ఎల్లో కలర్ టీషర్టు టక్ చేశాడు. కళ్లద్దాలు ఫెల్ట్ హ్యాట్ పెట్టుకున్నాడు.

అంతలోనే సందేహం కలిగింది అతనికి- తాను రహీమ్‌లా నటించగలడా అని! అయితే అది క్షణికం మాత్రమే.

ఓ గంట తరువాత రూమ్‌కి తాళం వేసి బైటకు నడిచి ఆటో ఎక్కాడు. అమీర్‌పేటలోని మైత్రీవన్ దగ్గర ఆటో దిగి టైమ్ చూసుకున్నాడు. ఎనిమిది గంటలకు పది నిముషాలు వుంది... మైత్రీవన్‌కీ, ఎస్సార్ నగర్‌కీ మధ్య ఓ గల్లీలో వుంది 'దిల్‌షుక్' బార్. ఆకర్షణీయమైన నియోన్‌లైట్లతో ఆహ్వానం పలుకుతోంది బార్.

బార్ ముందు ఆగి వాచ్ చూసుకున్నాడు అజీజ్. ఎనిమిది గంటలు కావస్తోంది. గుమ్మం దగ్గర నిలుచుని గ్లాస్ డోర్‌లోంచి లోపలికి చూశాడు. కౌంటర్లో ఆంగ్లో ఇండియన్ యువతి కూర్చుని కస్టమర్స్‌ని స్వీట్ స్మైల్‌తో పలుకరిస్తోంది.

ఆమె వద్దకు నడుస్తూంటే "వెల్‌కమ్, సర్!" అంటూ మృదుస్వరంతో, మధురహాసంతో విష్ చేసిందామె.

"వేయి రూపాయలకు చిల్లర కావాలి" అంటూ వంద రూపాయలనోటు ఆమె ముందుంచాడు అతను.

హఠాత్తుగా ఆమె వదనంలో రంగు కొద్దిగా మారింది. అంతలోనే ఆమె పెదవులపైన మందహాసం! "ష్యూర్ సర్!" అంటూ ఆ నోటు తీసుకుని వంద రూపాయల నోట్లు పది ఆమె లెక్కిస్తుంటే ఓరకంట పరిసరాలను సర్వే చేశాడు అజీజ్. అసలు వ్యక్తి రహీం- ఏ క్షణంలోనైనా అక్కడికి రావచ్చునన్న భయంతో.



నోట్లతోపాటు ఓ మూవీ టికెట్‌ని టేబుల్ మీద పెట్టిందామె. వాటిని తీసుకుని బ్యాక్ పాకెట్‌లో పెట్టుకున్నాడు. తరువాత తొడుక్కున్న టాప్‌లోంచి తెల్లటి పొడవాటి కవర్ ఒకటి బైటకు తీసి అతని చేతిలో పెట్టింది. దాన్ని షర్ట్ లోపలికి తోసేసుకున్నాడు.


అజీజ్ డోర్ తెరుచుకుని బైటకు వస్తూంటే, ముప్ఫై ఏళ్ల వ్యక్తి ఒకడు వాచ్ చూసుకుంటూ హడావుడిగా లోపలికి వస్తూ అతన్ని గుద్దుకున్నాడు. 'సారీ' చెప్పి లోపల ప్రవేశించాడు.

బైటనుంచి గ్లాస్ డోర్ ద్వారా లోపలికి చూశాడు అజీజ్. అతడే రహీం అయి వుండవచ్చుననిపించింది.

అంతే! గబగబా బైటకు నడిచాడు. తన గుట్టు రట్టవకముందే వీలయినంత దూరంగా అక్కణ్ణుంచి జారుకోవాలని బార్ పక్కనున్న సందులో ప్రవేశించాడు. ఫెల్ట్ హ్యాట్‌ని మురికికుంటలోకి విసిరేశాడు. కళ్లద్దాలను దూరంగా పారేశాడు. జుత్తంతా చిందరవందరగా చేసేసుకున్నాడు. మరో సందులో నుంచి మెయిన్ రోడ్ చేరుకున్నాడు. అటువైపు వస్తున్న ఆటోని ఆపి ఎక్కేశాడు. బాలానగర్ పోనివ్వమన్నాడు. తననెవరైనా వెంబడిస్తున్నారేమోనన్న అనుమానంతో మధ్య మధ్య వెనక్కి చూస్తూనే వున్నాడు. బాలానగర్‌లో ఆటో దిగి, రోడ్డు క్రాస్‌చేసి సిటీబస్ ఎక్కాడు. బేగంపేటలో దిగి పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తూ రైల్వేస్టేషన్ వైపు నడిచాడు. ఫలక్‌నుమాకి టికెట్ తీసుకుని, పది నిముషాలలో వచ్చిన లోకల్ ట్రెయిన్ ఎక్కాడు.

షర్ట్ లోపల గుండెల్ని తడుముతూన్న కవర్ అతనిలో కుతూహలాన్ని పెంచుతోంది. త్వరగా దాన్ని తెరిచి అందులో ఉన్న రహస్య పెన్నిధి ఏమిటో తెలుసుకోవాలని ఆత్రుతగా వుంది. కాని, బార్ నుంచి తిన్నగా తన హోటల్‌కి వెళ్లడం రిస్క్‌తో కూడుకున్న పని. తన ఊహే నిజమైతే, బార్‌లో తనకు డ్యాష్ ఇచ్చిన వ్యక్తి రహీమే అవ్వాలి. అంతేకాదు, రహీంని కనిపెట్టి వుండేందుకు అతనికి తెలీకుండా బార్‌బైట అతని బాస్ మనుషులు కూడా వుండొచ్చును. కవర్ రాంగ్ హ్యాండ్స్‌లో పడినట్లు తెలిసిన మరుక్షణం ఏం జరుగుతుందో అజీజ్‌కి తెలుసు. ఆల్ ద హెల్ విల్ బ్రేక్. ఆ యువతి ద్వారా తన ఆనవాళ్లు తెలుసుకున్న ఆ వ్యక్తులు తక్షణమే తన కోసం గాలింపు మొదలుపెడతారు. అందుకే బసను చేరుకునేందుకు అన్ని మార్గాలను, సాధనాలను వాడుకున్నాడు.

అజీజ్ ఫలక్‌నుమాలో దిగి ఓ రెస్టారెంట్‌కి వెళ్లాడు. అక్కడ బిర్యానీ తిని చాయ్ తాగాడు. బైటకు వచ్చి ఆటో ఎక్కి చార్మినార్ దగ్గర దిగాడు. అక్కణ్ణుంచి షాలీబండ వరకు నడచి వెళ్లాడు. ఎయిమ్‌లెస్‌గా రెండు మూడు వీధులు తిరిగి తన హోటల్ చేరుకున్నాడు. అప్పటికి రాత్రి పదకొండు దాటింది.



జనవరి-10
విపుల వినోదిని విజేతలు వీరే!

డ్రాలో ఎంపికైన ఈ అయిదుగురికీ త్వరలో బహుమతులు అందుతాయి.

1. **సిహెచ్.అప్పలనరసింహం** - నిజాంపేట్, హైదరాబాద్
2. **కందుకూరి సుమ** - హన్మకొండ, వరంగల్ జిల్లా
3. **కె.వి.ఆర్.హనుమంతరావు** - మౌలాలి, హైదరాబాద్
4. **శ్రీనివాస్** - రాయచూరు, కర్ణాటక
5. **కె.ఎస్.లక్ష్మి** - సైదాబాద్, హైదరాబాద్

సరైన జవాబులు

1. పుష్కిన్ 2. చక్రపాణి 3. వేణు 4. ఒటోమి సాన్ 5. విశ్వనాథ నాయుడు 6. కాశీవిశ్వనాథ్ 7. అప్పడం 8. క్షయ 9. మొనాకో 10. నరసయ్య

సెకండ్ ఫ్లోర్‌లో వున్న తన రూమ్ బైట నిల్చుని టీషర్ట్ లోపల వున్న కవర్ని చేత్తో తడిమి చూసుకున్నాడు. జేబులోంచి 'కీ' తీసి రూమ్ తాళం తెరిచాడు. లోపల ప్రవేశించి తలుపు మూస్తూంటే, తలుపు క్రింది సందులోంచి హోటల్‌బాయ్ వేసిన ఉర్దూ ఈవెనింగ్ న్యూస్‌పేపర్ 'ఖబర్' కనిపించింది. దాన్ని టీపాయ్ మీద వేస్తూంటే- తాటికాయంతటి అక్షరాలతో ఫ్రంట్‌పేజ్‌లో బాక్స్ కట్టి ప్రచురించిన వార్త మీద పడింది దృష్టి. 'బివేర్ ఆఫ్ హైటెక్ తీవ్స్!' పతాక శీర్షికతో ప్రచురించిన ఐటెమ్ అది. కుతూహలంగా చదివాడు అజీజ్. చదువుతున్నంతసేపూ ముఖంలో రంగులు మారాయి.

దాని సారాంశం ఇది- 'ఆ మధ్య ట్విన్ సిటీస్‌లో కొత్తరకం ఇళ్ల దోపిడీలు జరుగుతున్నాయి. దొంగలు ముందుగా అనుకూలంగా ఇంటిని ఎంచుకుంటారు. తరువాత టెక్నాలజీ ఉపయోగించి విక్టిమ్ టెలిఫోన్‌లో 'క్రాస్‌టాక్' వినియోగించేలా చేస్తారు. కోడ్‌లో మాట్లాడుకుంటున్నట్లు నటిస్తూ ఏదో రహస్యపు పెన్నిధి వున్న 'కవర్' గురించి మాట్లాడుకుంటారు. విక్టిమ్స్‌లో కుతూహలాన్నీ, ఆశనూ రేపుతారు. వారి సంభాషణను ఆలకించిన విక్టిమ్ దురాశతో ఆ కవర్ని సంగ్రహించేందుకు నిర్ణీత వేళకు బైటకు వెళ్లగానే ఫ్రాడ్‌స్టర్స్ ఆ ఇంట్లో ప్రవేశించి దోచుకుంటారు. చివరికి ఆ కవర్లో తాము ఆశించినట్టు ఏమీ లేదనీ, అదంతా పెద్ద హోక్స్ అనీ విక్టిమ్స్ గ్రహించేసరికి ఆలస్యమైపోతుంది. ఆ మధ్య నగరంలో జరిగిన ఇటువంటి కేసులు కొన్ని తమ దృష్టిలోకి రావడంతో, ప్రజల్ని అప్రమత్తంగా వుండాలనీ, మోసపోవద్దనీ పోలీసులు హెచ్చరిక చేశారు. ఎవరి ఫోన్‌లోనైనా అటువంటి క్రాస్‌టాక్

వినవచ్చినట్టయితే తక్షణమే పోలీసు కంట్రోల్ రూమ్‌కి తెలియపరచవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు...!

ఆ రిపోర్ట్ పూర్తిగా చదివిన అజీజ్ తెల్లబోయాడు. వెంటనే షర్ట్ లోపలి నుంచి కవర్ బైటకు తీసి ఆత్రుతగా చింపాడు. లోపల ఓ ఎరుపురంగు కాగితంపై 'దురాశ దుఃఖానికి చేటు!' అని ఉంది.

అదిరిపడి కంగారుగా బెడ్‌కింద చూశాడు. లెదర్‌కేస్ కనిపించలేదు.

గుండె గుభేల్‌మంది. యాభై కోట్లు! అదృశ్యమైపోయాయి. జుత్తు పీక్కున్నాడు. ఆ సొమ్ము విషయం ఎవరికి తెలుసు? ఎలా తెలుసు? ?...నిస్సత్తువతో తల పట్టుకుని మంచంమీద కూలిపోయాడు.

ఎంతసేపు వుండిపోయాడో తెలీదు. డోర్‌బెల్ మోగడంతో ఉలిక్కిపడి హోటల్ బాయ్ అయి వుంటాడని తలుపు తెరిచిన అజీజ్ గుమ్మంలో ప్రత్యక్షమైన మనుషుల్ని చూసి గతుక్కుమన్నాడు.

అతన్ని తోసుకుంటూ లోపలికి వచ్చి తలుపు మూసేసారు ఆ ముగ్గురూ- సలీం, బెనర్జీ, పిళ్ళైలు! వారి చేతుల్లో పిస్టల్స్!

నిముషాల తేడాలో అజీజ్‌కి రెండో షాక్ అది. నోట మాట రాలేదు.

"మిత్రద్రోహీ! మమ్మల్ని డబుల్‌క్రాస్ చేసి సొమ్ముంతా కాజేయాలనుకున్నావ్ కదూ? " తీక్షణంగా అన్నాడు సలీం.

"జుబేదాని చంపేసి సొమ్ము లాక్కుని పారిపోతే కనిపెట్టలేం అనుకున్నావ్ కదూ? " ఉరిమాడు బెనర్జీ.

"మా గురించి పోలీస్‌కి ఇన్‌ఫాం చేసి పట్టించావు. మేమిక జైలునుంచి బయటపడలేమనుకున్నావ్ ఔనా? " అన్నాడు పిళ్లై.

గజగజ వణికిపోయాడు అజీజ్. ఏదో చెప్పబోయాడు. గొంతు పెగల్లేదు.

"జుబేదా మనల్నందర్నీ డబుల్ క్రాస్ చేసి సొమ్ముతో పారిపోయిందనుకున్నాం మొదట. నువ్వు అరెస్ట్ కాకపోవడంతో తికమకపడ్డాం. జుబేదా శవం బైటపడటం నీ జాడ తెలీకపోవడంతో విషయం అర్థమైపోయింది మాకు" కఠిన స్వరంతో చెప్పుకుపోయాడు సలీం. "ఎలాగో జైలు నుండి బైటపడ్డాం. నిన్ను ట్రేస్ చేయడానికి ఇన్నాళ్లు పట్టింది".

"బోలో, సొమ్ము ఎక్కడ? " బెనర్జీ, పిళ్ళైలు ఒకేసారి అడిగారు.

"అది... అది ఏదో చెప్పాలనుకున్నాడు అజీజ్. గొంతు సహకరించలేదు.

"ఎక్కడ దాచావ్? " గర్జించాడు సలీం.

"ముఝే మాఫ్‌కరో భాయ్!" కష్టం మీద గొంతు పెగుల్చుకున్నాడు అజీజ్. "సొమ్ము... దొంగలు ఎత్తుకుపోయారు"

అజీజ్ ముఖం మీద కోపంతో బలంగా గుద్దాడు సలీం. వెనక్కి తూలిపోయాడు అజీజ్. ముక్కునుంచి, నోటి నుంచి రక్తం చిప్పిల్లింది. పన్నొకటి ఊడిపోయింది. "సచ్‌భాయ్! నిజమే చెబుతున్నా" అతని మాటలు నూతిలోంచి వచ్చాయి. "తప్పు చేశాను. కారణం జుబెదాయే.. కానీ ఇంతకు ముందే ఈ గదిలో దొంగలుపడి సొమ్మెత్తుకుపోయారు."

అప్పటికే గదంతా గాలించిన బెనర్జీ, పిళ్ళైలు నిరాశతో సలీం దగ్గరకు తిరిగి వచ్చారు. "సలీం భాయ్! వీడు సొమ్మును దాచేసి నాటకమాడుతున్నాడు" అన్నాడు బెనర్జీ ఆగ్రహంగా.

"నై నై మై సచ్ బోల్ రహా హూఁ" అరిచాననుకున్నాడు అజీజ్. తన మాటలు తనకే వినిపించలేదు.

"ఈ సలీంతో ఆట ప్రాణాలతో చెలగాటం అని తెలీదుబే, బేవకూఫ్? " మళ్లీ దవడ పగలగొట్టాడు సలీం.

"ప్లీజ్, సలీం భాయ్! నన్ను నమ్ము... జరిగిందేమిటో చెబుతాను విను" ప్రాధేయపడ్డాడు అజీజ్.

సమాధానంగా... పిస్టల్స్ మూడూ నెమ్మదిగా పైకి లేచాయి... V



అమెరికన్ కథ

మూడుకోరికలు

-డబ్ల్యు డబ్ల్యు జాకోబ్స్

అనువాదం : రాణి

చలి, తేమ పెద్దగాలేని ఆ రాత్రి లాబర్మ్ బంగళా కిటికీలకు తెరలు వేసేసి ఉన్నాయి. ఫైర్‌ప్లేస్‌లో మంట మండుతోంది ఎర్రగా. జుత్తునెరిసిన వృద్ధురాలు మిసెస్ వైట్ మంటకు దగ్గరగా కూర్చుని అల్లికపనిలో ఉంది.

మిస్టర్ వైట్.. ఆయన కొడుకు హర్‌బర్ట్‌వైట్‌లు చదరంగం ఆడుతున్నారు. తను వేసిన తప్పుడు ఎత్తును కొడుకు గమనించకుండా దృష్టి మళ్లించేందుకు- "గాలిహోరు విన్నావా? ఎంత గట్టిగా విన్పిస్తోందో? " అన్నాడు మిస్టర్ వైట్.

"ఊఁ" అన్నాడు హర్‌బర్ట్ ఆటను పరిశీలిస్తూ. అతడి కళ్లు మెరిశాయి. తండ్రి పొరపాటు తెలిసిపోయింది.. ఒక్క ఉదుటన 'చెక్' పెట్టేసి ఆట ముగించేశాడు.

"అతను ఈ రాత్రి రాకుండా ఉంటే బాగుణ్ను" గొణిగాడు మిస్టర్ వైట్.

“స్నేహితుడా? ” అడిగాడు కొడుకు.

“మన ఖర్మకొద్దీ ఇలాంటి ప్రాంతాలలో ఉండాల్సి వస్తోంది.. రోడ్డేమో బురదతో అడుగేస్తే దిగబడుతుంది. ఇంకోపక్క రోడ్డంతా వరద..” అన్నాడు మిస్టర్‌వైట్.

“ఎందుకా చిరాకు? ఈసారి గేమ్ నువ్వే గెలుస్తావులే” భర్తను ఊరడించింది మిసెస్ వైట్.

ఆయన తలెత్తేసరికి తల్లీకొడుకులు ఒకరినొకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకోవడం కంటపడింది.

అంతలో బంగ్లా గేటు తెరిచిన శబ్దం..

“అతనొచ్చినట్లున్నాడు”అన్నాడు కొడుకు.

పెద్దాయన గభాల్నలేచి తలుపుతెరిచాడు. వచ్చిన వ్యక్తి పొడవుగా, దృఢంగా ఉన్నాడు. పెద్దకళ్లు.. ఎర్రని రంగు.

“సార్జెంట్ మేజర్ మోరిస్” తన భార్యాబిడ్డలకు పరిచయం చేశాడు మిస్టర్ వైట్.

అతను ఫైర్‌ప్లేస్‌కు పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. విస్కీసీసా, గ్లాసులు తెస్తున్న మిత్రుడ్ని తృప్తిగా చూశాడతను.

మూడోగ్లాసు పూర్తిచేసేసరికి అతడి కళ్లలో వెలుగొచ్చింది. యుద్ధాలు, సాహస కృత్యాల గురించి భుజాలెగరేస్తూ అతను చెబుతుంటే వాళ్లు ఆసక్తిగా విన్నారు.

“ఇరవయ్యేళ్లయింది మోరిస్ వెళ్లి..” కుటుంబసభ్యులకు చెప్పాడు వైట్.

“..అతని మాటలు వింటుంటే నాకూ ఇండియా వెళ్లాలని ఉంది.. వింతలూ విడ్డూరాలను చూడ్డానికి” అన్నాడు మళ్లీ.

ఖాళీగ్లాసు కిందపెడుతూ నిట్టూర్చాడు మోరిస్.

“అక్కడి పురాతన గుళ్లని, సాధువుల్ని, గారడీవాళ్లని చూడాలని ఉంది..” అన్నాడు మిస్టర్ వైట్. తిరిగి ఏదో గుర్తొచ్చినట్టు అడిగాడతను, “మోరిస్ ఆరోజు నువ్వేదో కోతిపంజా అన్నావే.. ఏంటది? ”

మోరిస్ ముఖంలో ఉలికిపాటు.

“కోతిపంజానా? ” కుతూహలంగా అడిగింది మిసెస్ వైట్.

“అబ్బే! అదో గారడీ! అంతే” అనాసక్తిగా అన్నాడు మోరిస్.

శ్రోతలు ముగ్గురూ అతనింకేం చెబుతాడోనని వినడానికి ముందుకు జరిగారు.

మిస్టర్ వైట్ మోరిస్ గ్లాసును మళ్లీ విస్కీతో నింపాడు.

మోరిస్ తన జేబులో చెయ్యిపెట్టి “చూడటానికి ఇదొక చిన్న పంజా. ఎండబెట్టినట్టున్నారు” అంటూ జేబులోనుంచి బయటకు తీశాడు.. దాన్ని చూడగానే మిసెస్ వైట్ ముఖం వికారంగా పెట్టింది. కొడుకు మాత్రం దాన్ని పరీక్షగా చూశాడు.

“దీనిలో విశేషం ఏముంది” అంటూ కొడుకు చేతిలోంచి దాన్ని అందుకొని అటూ ఇటూ తిప్పి చూసి బల్లపై పెట్టాడు మిస్టర్ వైట్.

“ఓ ముసలి సాధువు ఇచ్చాడిది. ముగ్గురు వ్యక్తులు దీంతో మూడేసి కోరికలు కోరుకోవచ్చు” చెప్పాడతను.

“బాగుంది. మీరు కోరారా సార్? ” అడిగేడతన్ని హర్‌బర్ట్.

అతడి ముఖం పాలిపోయింది. మెల్లగా “నేను కోరినవి పొందాను” అన్నాడు.

“నిజంగా మీ కోరికలు నెరవేరాయా? ” మిసెస్ వైట్ కుతూహలంగా అడిగింది.

“అవును” చెప్పాడు మోరిస్. ఎందుకో అతడి చేయి వణికింది.

“ఇంకెవరైనా కోరుకున్నారా? ” మళ్లీ అడిగింది మిసెస్ వైట్.

“మొదటివ్యక్తి మూడు కోరికలూ కోరాడు. మొదటి రెండూ ఏం కోరాడో తెలియదుగానీ మూడోది మాత్రం చావును కోరుకున్నాడు. అందువల్లే అది నా చేతికి వచ్చింది” చెప్పాడు మోరిస్.

“మోరిస్, నువ్వు మూడు కోరికలూ కోరితే దాన్ని ఇంకా దగ్గరెందుకు ఉంచుకున్నట్లు? ” అడిగేడు మిస్టర్ వైట్.

“అమ్మేయాలని వుందికానీ ఎవరు కొంటారు? నేచెప్పేది ఏదో కాకమ్మకథ అనుకుంటారు. లేదంటే దాని మహిమను పరీక్షించాక డబ్బిస్తామంటారు” అంటూనే దాన్ని చటుక్కున ఫైర్‌ప్లేస్‌లో మండుతున్న మంటల్లోకి విసిరాడు మోరిస్.

మిస్టర్‌వైట్ చటుక్కున దాన్ని మంటల్లోంచి బయటకు లాగాడు.

“నీకు అక్కర్లేకపోతే నాకిచ్చేయరాదా? ”

“ఇవ్వను. నేను కాల్చేయాలనుకుంటే నువ్వే తీశావు. తర్వాత ఏం జరిగినా నాపూచీ లేదు. ఇప్పటికైనా దాన్ని ఆ మంటల్లో పారెయ్” అన్నాడు మోరిస్.

మిస్టర్ వైట్ తల అడ్డంగా వూపాడు. చేతిలోని పంజాను పరిశీలనగా చూస్తూ “ఎలా కోరుకోవాలి? ” అడిగేడు మోరిస్‌ను.

“కుడిచేత్తో పట్టుకొని, నీ కోరికను గట్టిగా కోరుకో” స్నేహితుడి ముఖంలోకి చూస్తూ మళ్లీ అన్నాడు మోరిస్ “ఫలితాల గురించి మళ్లీ నిన్ను హెచ్చరిస్తున్నా”

“ఇదేదో కథలా ఉంది” అంటూ భోజనాలు ఏర్పాటు చేయటానికి లేచింది మిసెస్ వైట్. తర్వాత భర్తతో “నాకు నాలుగు జతల చేతులిమ్మని కోరాలనిపిస్తోందా? ” అంది నవ్వుతూ.

మిస్టర్‌వైట్ కోతిపంజాను జేబులోంచి పైకి తీశాడు. మోరిస్ కంగారుగా వారిస్తూ “నువ్వేమైనా కోరాలనుకుంటే కాస్తంత తెలివిగా కోరుకో” అన్నాడు.

అప్పటికి దానిని తిరిగి జేబులో పెట్టుకుని స్నేహితుడిని డైనింగ్ టేబుల్ దగ్గరకు తీసుకువెళ్లాడు మిస్టర్ వైట్. భోజనాలయ్యాక మోరిస్ వెళ్ళిపోయాడు.

“ఆ కోతిపంజా గురించి చెప్పిందంతా కట్టుకథ అనుకుంటా” అన్నాడు హర్‌బర్ట్.

“అతనికేమైనా ముట్టచెప్పావా? ” మిసెస్ వైట్ భర్తను అడిగింది.

“ఆ.. ఏదో కొద్దిగా. అతడసలు ఇష్టపడలేదు. వెళ్తూ కూడా దానిని అవతల పారేయమని చెప్పాడు”

“..మనం ధనవంతులం, గొప్పవాళ్ళం



పనిమంతుడు

కొత్తగా పనిలో చేరిన శంభునాధాన్ని కసురుకున్నాడా యజమాని

‘ఏం మనిషివయ్యా నువ్వు.. ఏ పని చెప్పినా ఎప్పటికప్పుడు వాయిదా వేస్తున్నావ్! ఇంతకు ముందు ఎక్కడ పనిచేశావ్? ’

‘జడ్జిగారింట్లోనండీ’

అయిపోతాం ముందు నువ్వో చక్రవర్తివి కావాలని కోరుకో నాన్నా! అప్పుడు అమ్మక్కూడా నువ్వు భయపడక్కర్లేదు” ఆటపట్టించాడు కొడుకు.

“నీ పని చెప్తానుండు” అంటూ తల్లి వెంటపడేసరికి అతను టేబిల్ చుట్టూ పరిగెత్తసాగాడు.

జేబులో వున్న పంజాను చేతిలోకి తీస్కొని, దానివైపు సంశయంగా చూశాడు మిస్టర్ వైట్.

“ఏం కోరాలి? మనకన్నీ వున్నాయి..”

“ప్రస్తుతం ఓ రెండొందల పౌండ్లు కోరుకో.. తర్వాత చూద్దాం”

కొడుకు వ్యంగ్యానికి మనసులో కొద్దిగా నొచ్చుకున్నాడాయన.

భార్య.. కొడుకుల ముఖంలో మిస్టర్ వైట్ నమ్మకం పట్ల అపహాస్యం!

“సరే.. నేను రెండు వందల పౌండ్లు కోరుకుంటున్నాను” అన్నాడు మిస్టర్ వైట్ ఓ నిశ్చయానికి వచ్చినట్లు.

అంతే! పియానో నుంచి సన్నని శబ్దం వెలువడింది. తర్వాత పెద్దాయన కీచుమని కేక పెట్టాడు భయంతో. భార్య, కొడుకు అతడి దగ్గరకు పరిగెత్తారు.

“అది కదిలింది” నేలమీద పడిన పంజాను చూపిస్తూ భయంగా అన్నాడు మిస్టర్ వైట్. “కోరిక కోరగానే అది నా చేతిలో పాములా మెలికలు తిరిగింది” భయంగా అన్నాడాయన.

"ఏది? ఇంతకీ డబ్బు?" హాస్యంగా అంటూ హర్‌బర్ట్ పంజాను నేలమీద నుంచి తీసి టేబిల్‌పై పెట్టాడు.

"అది కదలడం మీభ్రమే" అంది భార్య.

కాదన్నట్టు తల అడ్డంగా తిప్పాడు వైట్.

మళ్లీ ముగ్గురూ ఫైర్ దగ్గర కూర్చున్నారు, తండ్రీ కొడుకులిద్దరూ పైప్‌లు పీల్చటం పూర్తయ్యేవరకూ.

బయట గాలి వేగంగా వీస్తోంది. బంగాళా పైభాగంలో గాలికి కొట్టుకుంటున్న తలుపును వేయటానికి లేచాడు మిష్టర్ వైట్. అసాధారణమైన నిశ్శబ్దం ఇంట్లో చోటు చేసుకుంది.

వృద్ధ దంపతులిద్దరూ నిద్రించడానికి గదికి వెళ్తుంటే, హర్‌బర్ట్ పరిహాసంగా అన్నాడు. "డబ్బు ఒక పెద్ద సంచీలో కట్టి మీ మంచం మీద పెట్టి ఉందేమో చూడండి. మీరా సొమ్మును మూట్టకట్టుకోవటం, భయంకరమైన శక్తేదో చూస్తూనే ఉంటుంది"

వాళ్లు వెళ్లాక హర్‌బర్ట్ ఆరిపోతున్న మంటలవైపు చూస్తూ ఒక్కడూ కూర్చుండిపోయాడు చాలా సేపు.

ఆ మంటల్లో ఏవో అస్పష్ట ఆకారాలు కనిపిస్తున్నాయి. ఒక ఆకారం భయంకరంగా కనిపించడంతో హర్‌బర్ట్ నిలువుగుడ్లేసుకుని చూశాడు. నిప్పుల్ని ఆర్పేయడానికి నీళ్లగ్లాసు కోసం బల్లమీదికి చాపిన అతని చేతికి అనుకోకుండా పంజా దొరికింది. ఉలిక్కిపడి దాన్ని వదిలేసి, వణుకుతున్న చేతిని కోటుకు తుడుచుకొన్నాడు. తర్వాత నెమ్మదిగా నిద్రలోకి జారాడతను.

★ ★ ★

మరుసటిరోజు ఉదయం టిఫిన్ తింటూ గతరాత్రి తన భయాలను తలచుకొని నవ్వుకొన్నాడు హర్‌బర్ట్. ముడుచుకుపోయి వున్న కోతిపంజా అల్మరాపై పడుంది.

మిసెస్ వైట్ అంది. "అతని పిచ్చిమాటల్ని నమ్మటమే తప్పు. అయినా రెండొందల పౌండ్లు ఎక్కడ్నుంచి వస్తాయి?"

"ఆకాశం నుంచి వూడిపడతాయేమో! సర్లే.. నేనొచ్చేవరకు దాన్ని ఖర్చు పెట్టకండేం?" టేబిల్ దగ్గర్నుంచి లేస్తూ నవ్వాడు హర్‌బర్ట్.

ఆ మాటలకు నవ్వుతూ, ఫ్యాక్టరీకి బయల్దేరిన అతనికి వీడ్కోలు చెప్పింది మిసెస్ వైట్. ఆ సొమ్ము ఎవరైనా తెచ్చిస్తారేమోనన్న ఆశ కూడా వుందామెకు. పోస్ట్‌లో వస్తుందనుకుంది. డబ్బురాలేదు కానీ దర్జీ బిల్లు మాత్రం వచ్చింది.

★ ★ ★

"అబ్బాయి తిరిగొచ్చాక మరింత ఎగతాళి చేస్తాడు" భోజనానికి కూర్చుంటూ అంది మిసెస్ వైట్.

"ఒట్టేసి చెప్తున్నా ఆ పంజా మాత్రం నా చేతిలో కదిలింది.. " గ్లాసులో బీరు పోసుకొంటూ అన్నాడు భర్త.

"అలా అనిపించిందేమో!"

"అది ముమ్మాటికీ నిజం!"

మిసెస్ వైట్ మాట్లాడలేదు. ఆమె చూపు బయట గేటుదగ్గర తచ్చాడుతున్న వ్యక్తిపై ఉంది. ఆ అపరిచితుడు నీట్‌గా డ్రెస్ చేసుకుని, సిల్క్ హ్యాట్ పెట్టుకున్నాడు. గేటుదగ్గర మూడుసార్లు ఆగి, ఆఖరుకు నాలుగోసారి గేటు తెరుచుకుని లోనికొచ్చాడు.

అతడు ఏదో చెప్పడానికి ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తున్నాడు.

"మా అండ్ మాగిన్స్ సంస్థ నుండి వస్తున్నాను" అన్నాడతను మాటల్ని కూడదీసుకుంటూ.

"హర్‌బర్ట్‌కి ఏమైనా అయిందా? ఏమైంది? ఏమైంది?' ఆ వృద్ధురాలు ఆత్రుతగా అడిగింది.

అంతలో మిస్టర్ వైట్ వచ్చాడు.

"..నువ్వు గమ్మునుండు.. కీడు శంకించకు" అంటూ ఆమెను వారించి అపరిచిత



వ్యక్తిని అడిగేడాయన "బాబూ నువ్వేం దుర్వార్త తేలేదు కదా? "

"క్షమించండి.." ప్రారంభించేడతను.

"వాడేమైనా గాయపడ్డాడా? " ఉద్వేగంతో అడుగుతోంది మిసెస్ వైట్.

అవునన్నట్లు తల వూపుతూ, "చాలా తీవ్రంగా గాయపడ్డాడు, అయితే అతడికి నొప్పేంలేదు.."

"థ్యాంక్ గాడ్... థ్యాంక్ గాడ్" అని పదే పదే అనుకుంటున్న ఆమెకు అతడి మాటలలో ఏదో అశుభం ధ్వనించి మళ్లీ భయం వేసింది. భర్త చేతిని గట్టిగా పట్టుకుంది.

"హర్‌బర్ట్ యంత్రాల మధ్య ఇరుక్కున్నాడు" ఆగంతకుడు నెమ్మదిగా చెప్పాడు.

"యంత్రాలలో ఇరుక్కుపోయాడా? " అరిచాడు వైట్.

"అవును"

భార్య చేతిని తన చేతులలోకి తీస్కుని కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు మిస్టర్ వైట్. ఎపుడో నలభైఏళ్ళ క్రితం ఆమె చేతిని అలా పట్టుకున్నాడాయన.

"వాడొక్కడే మాకుంది. చాలా బాధగా వుంది" అన్నాడతడితో మిస్టర్ వైట్. తర్వాత చిన్నగా దగ్గుతూ లేచి వెళ్ళి కిటికీ దగ్గర నిలబడ్డాడు.

"మీకు వచ్చిన కష్టానికి సానుభూతి తెలియచేయాల్సిందిగా యాజమాన్యం నన్ను పంపింది" అన్నాడతడు.

భార్యాభర్తలిద్దరూ నిశ్శబ్దంగా వుండిపోయేరు. వృద్ధురాలి ముఖం తెల్లగా పాలిపోయింది. కళ్ళు గాజుకళ్ళలా చూస్తున్నాయి.. శ్వాస వినిపించటంలేదు.

మిస్టర్ వైట్ ముఖంలో ఒక పశ్చాత్తాప భావం. తన స్నేహితుడు, మోరిస్ చెబుతున్నా తాను వినలేదు..

"...మా అండ్ మెగ్గిన్స్ యాజమాన్యం హర్‌బర్ట్ సంస్థకు చేసిన సేవలను దృష్టిలో వుంచుకొని, నష్టపరిహారంగా రెండొందల పౌండ్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు"

'రెండొందల పౌండ్లు' మాట వింటూనే మిసెస్ వైట్ కీచుమని అరిచింది. మిస్టర్ వైట్ జీవంలేని ఓ నవ్వునవ్వి కుప్పకూలిపోయాడు నేలమీద.

★ ★ ★

రెండు కిలోమీటర్ల దూరంలోని శ్మశాన వాటికలో, కొడుకును ఖననంచేసి ఇంటికి చేరుకున్నారు వృద్ధ దంపతులు.

ఏం జరిగిందో అర్థమయ్యేలోగానే అంతా అయిపోయింది.

రోజులు గడిచేకొద్దీ వారాబాధను దిగమింగుకున్నారు. ఇంట్లో ఎటుచూసినా ఒక నిర్లిప్తత.. వారిద్దరూ ఒకమాటైనా మాట్లాడుకోవటం అరుదైపోయింది.. మాట్లాడేందుకు ఏం మిగిలిందని? రోజులు యాంత్రికంగా గడుస్తున్నాయి.

వారం రోజుల తర్వాత-

అర్ధరాత్రి హఠాత్తుగా మెళకువ వచ్చింది మిస్టర్ వైట్‌కు. చూస్తే భార్యలేదు పక్కన. గది చీకటిగా వుంది. కిటికీ దగ్గర్నుంచి చిన్నగా ఏడుస్తున్న శబ్దం.. గభాల్న లేచి కూర్చున్నాడు.

"ఇలారా, చలిగా వుంటుంది అక్కడ" మృదువుగా పిలిచాడు.

"నాబిడ్డకు ఇంతకంటె చలిగా వుంటుంది" అంటూ మళ్ళీ ఏడుపు మొదలుపెట్టిందామె.

కాసేపటికి ఆమె ఏడుపు ఆగింది. ఆయన మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు. అంతలో అతడి భార్య వేసిన భయంకరమైన కేకకు అదిరిపడి లేచాడు..

"ఏమిటి సంగతి? "

భర్త దగ్గరకు పరుగులాంటి నడకతో వచ్చిందామె "ఆ పంజా ఎక్కడుంది? నాక్కావాలి"

"కిందగదిలో అల్మారా పైనుంది. ఎందుకు? " ఆశ్చర్యంగా అడిగాడాయన.

ఆమె సంతోషం, దుఃఖం కలిసిన ఉద్వేగంలో అతడి బుగ్గపై ముద్దు పెట్టింది.

"ఈ ఆలోచన ఇంతకుముందే నాకెందుకు రాలేదు? అసలు నువ్వెందుకలా ఆలోచించలేదు? "

"దేనిగురించి? " అడిగాడతడు.

"ఇంకా రెండు కోరికలూ ఉన్నాయిగా, మనం ఒకటేగా కోరాం"

"ఇప్పటికి జరిగింది చాలలేదా? " కోపంగా అన్నాడాయన.

"మనం మరొక్కటి కోరదాం. కిందకి వెళ్లి అది తొందరగా తీస్కువచ్చి మన కొడుకు బతికి రావాలని కోరు" ఆమె వగరుస్తూ ఆనందంగా అరిచింది.

ఆయన లేచి కూర్చున్నాడు.

"అయ్యో.. భగవంతుడా! నీకేమైనా పిచ్చి పట్టిందా? " అరిచాడు.

"ముందు దాన్ని తీసుకొచ్చి కోరు!"

మిస్టర్ వైట్ అగ్గిపుల్లగీసి కొవ్వొత్తి వెలిగించాడు. "పడుకో! నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలియడంలా"

"మనకి మొదటి కోరిక తీరింది.. రెండోది ఎందుకు కోరుకోకూడదు? వెళ్ళు... దాన్ని తెచ్చి కోరు" ఉద్వేగంగా అరిచిందామె.

ఆయన ఆమెవైపు తిరిగాడు. స్వరం కంపిస్తోంది.."వాడు పోయి పదిరోజులైంది. కేవలం వేసుకున్న బట్టల్నిబట్టే వాణ్ని గుర్తించగలిగాను. ఆ దృశ్యాన్ని నువ్వు చూడలేవు. అర్థంచేసుకో"

"..కనిపెంచిన బిడ్డను చూసి నేను భయపడతానా? " అరిచిందామె.

చీకట్లో తడుముకుంటూ కిందకి వెళ్ళి, గదిలో అల్మారా చేరుకున్నాడాయన. పంజా అక్కడే వుంది. చూడగానే భయం వేసింది. ముక్కలుగా తెగిపోయిన కొడుకు ను తెచ్చి ముందు నిలబెడితే? కంగారుగా గదిలోనుంచి బయటకు రాబోయాడు. చీకట్లో గుమ్మం కనిపించక చెమటలు పట్టాయి. చేతిలో పంజాను పట్టుకుని తడుముకుంటూ బయటకు నడిచాడు.

ఆయన వెళ్ళేసరికి భార్య ముఖంలో కూడా మార్పు కనిపించింది. ముఖం తెల్లగా వుంది పాలిపోయినట్లుంది.

"కోరు!" గట్టిగా అరిచిందామె.

"వద్దు .. ప్రమాదం.."

"కోరు!" తిరిగి అందామె ఆయన మాట పట్టించుకోకుండా.

అతడు చెయ్యి పైకెత్తి కోరాడు.

"నా కొడుకు మళ్ళీ బతకాలి"

పంజా నేలమీదకు జారిపోయింది.. అతడు దానివైపు భయంగా చూశాడు. వణుకుతూ కుర్చీలో కూలబడ్డాడు. భార్య మండుతున్న కళ్ళతో కిటికీ దగ్గరకు వెళ్ళి తెరతీసింది. కొవ్వొత్తివెలుగు గోడలపైనా, సీలింగ్‌పైనా పరుస్తున్న నీడలు గుండె వేగాన్ని పెంచుతున్నాయి. రెపరెపలాడుతున్న కొవ్వొత్తి పెద్దగా వెలిగి రప్పున ఆరిపోయింది. ఆ పంజా మహిమ పనిచేయలేదన్న భావనతో తేలికగా ఊపిరి పీల్చుకున్నాడాయన. కొంచెంసేపయ్యాక మిసెస్ వైట్ వచ్చి ఉదాసీనంగా కూర్చుంది ఆయన పక్కన.

ఎవ్వరూ మాట్లాడలేదు. గడియారం శబ్దం వింటూ కూర్చున్నారు. అంతలో కీచుమని శబ్దం.. చూస్తే ఒక ఎలుక గోడమీద నుంచి పరుగు తీసింది వేగంగా.

చీకటిని భరించటం చాల కష్టంగా వుంది. కాస్త ధైర్యం తెచ్చుకొని అగ్గిపుల్ల వెలిగించి, ఆ వెలుగులో కొవ్వొత్తి కోసం

అదే బాధ!



'జో'గినాథం పోయాడని ఊళ్లో ప్రతి ఒక్కరూ ఘొల్లుమన్నారు'
'అంత మంచివాడా అతను? '
'మంచీ లేదు, ఏమీ లేదు.. వాళ్లంతా అతనికి అప్పులిచ్చిన వాళ్లు!'

కిందకు వెళ్లాడాయన.

మెట్లు దిగేసరికి అగ్గిపుల్ల ఆరిపోయింది. రెండో అగ్గిపుల్ల గీయబోతుండగా వీధి గుమ్మం తలుపుపై ఎవరో తడుతున్నట్లు శబ్దం వచ్చింది.

అగ్గిపెట్టె ఆయన చేతిలోనుంచి జారిపోయింది. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఆ చప్పుడు మళ్లీ వినేసరికి శ్వాస ఆగినట్లైంది. వేగంగా మెట్లెక్కి గదిలోకి వెళ్లిపోయాడు.

మూడోసారి తలుపు తట్టిన శబ్దం ఇల్లంతా మారుమోగింది.

"ఏమిటది? " అరుస్తూ లేచింది భార్య.

"ఎలుక" కంపిస్తూనే చెప్పాడాయన.

మిసెస్ వైట్ లేచి కూర్చుంది. తలుపు తడుతున్న శబ్దం ఇల్లంతా ప్రతిధ్వనించింది.

"ఆ వచ్చింది హర్‌బర్టే!"

ఆమె లేచి కిందకి పరిగెత్తబోయింది తలుపు తీయడానికి. భర్త చెయ్యి గట్టిగా పట్టి ఆపాడు.

"ఎక్కడికి? " లోగొంతుకతో అడిగాడు.

"వచ్చింది నా కొడుకు!" గట్టిగా అరిచిందామె విడిపించుకోవడానికి పెనుగులాడుతూ. "వెళ్లనీ తలుపు తీయాలి" అంది.

"తలుపు తీయకు... వాడ్ని లోనికి రానివ్వకు" పెద్దాయన వణికిపోతూ అరిచాడు.

"సొంత కొడుకును చూడ్డానికి భయమా? వస్తున్నా హర్‌బర్ట్.. వస్తున్నా" పెనుగులాడిందామె భర్తతో.

మళ్ళీ తలుపు శబ్దం..

ఆమె ఒక్కసారిగా పెద్దాయన చేతిని విడిపించుకొని కిందకు పరుగుతీసింది. వద్దంటూ వెనుకే పరుగుతీశాడాయన.

తలుపుకు వేసిన గొలుసు తీసిన శబ్దం.

ఆమె అరిచింది.

"ఆ బోల్ట్ నాకు అందటంలేదు, త్వరగా వచ్చి బోల్ట్ తియ్యి"

ఆ సమయానికి ఆమెభర్త చీకట్లో నేల మీద తడుముకుంటూ ఎక్కడో పడిపోయిన కోతి పంజాకోసం వెతుకుతున్నాడు. బయట నుంచి వాడు లోనికి ప్రవేశించే లోగా పంజా దొరకాలి దేవుడా అని తీక్షణంగా వెదుకుతున్నాడాయన.

తుపాకీ చప్పుడు కన్నా పెద్దగా తలుపు తడుతున్న శబ్దం ప్రతిధ్వనిస్తోంది. అంతలోనే కుర్చీశబ్దం.. అంటే తనభార్య కుర్చీని తలుపుదగ్గరగా లాగుతోంది బోల్టు తీయడానికి.. ఆయనకు చెమటలు పట్టేస్తున్నాయి.. పిచ్చిపట్టినట్లు మరింత వేగంగా వెతుకుతున్నాడు నేలమీద!

బోల్ట్‌ను వెనుక్కు లాగుతున్న శబ్దం... అయిపోయింది.. ఆయన గుండెల్లో మరింత గుబులు..

ముక్కలు ముక్కలుగా తెగిపోయిన శరీరంతో భయంకరాకారం ఇంట్లోకి వస్తే- ముసల్దానికి గుండె ఆగిపోదూ? తనూ తట్టుకోలేడు! ఇప్పుడెలా?

ఆ క్షణంలోనే అతడి చేతికి చిక్కింది కోతి పంజా. అంతే! దానిని పైకెత్తి పట్టుకొని చివరిదీ, మూడోదీ అయిన కోరికను కోరాడాయన..

తలుపు శబ్దం ఆగిపోయింది. అయినా ప్రతిధ్వని వినవస్తూనే వుంది.

కుర్చీ వెనక్కు జరిపి, తలుపు తెరిచిన శబ్దాలు వినిపించాయి ఆయనకు.

తలుపు తెరిచేసరికి వణుకు పుట్టించే చల్లని గాలి విసురుగా వీచింది!

భార్య నిరాశతో రోదిస్తున్న శబ్దం విన్పించడంతో ఆయనలో భయం మాయమైంది.. కిందికి పరిగెత్తాడు.

కింద ఏడుస్తున్న భార్య ఓ వైపు.. నిశ్శబ్దంగా, నిర్మానుష్యంగా వున్న రోడ్ ఓ వైపు కన్పించాయి.

వీధి దీపం మాత్రం గప్‌గప్‌మని వెలుగుతూ ఆరుతోంది, జరిగిన విచిత్ర సంఘటనకు సాక్షిగా!

(108 ఏళ్లనాటి కథ) V

ముషాయరి

వెలుగు నడక



సంఘం
అగ్నిసరస్సు నుంచీ
సౌమ్య శతపత్రంలా
విచ్చుకుంటుంది
సమస్యల కత్తులబోను
నుంచీ
సాహసచర్యలా దూక్కుంటూ వస్తుంది
వంచన కడలి నుంచీ
కర్తవ్య సూర్యుడిలా ఉదయిస్తూ లేస్తుంది
ఉద్రేకాల పొలిమేరల కంచె మధ్య
ఆచరణల విత్తుగా మొలకెత్తుకొస్తుంది
సుప్తసంబంధాల తిమిరాంతరాల నుంచీ
మమతాంతఃకరణల దివ్వెగా వెలుగిస్తూ
నిలుస్తుంది
ఆవేదనల కొలిమి నుంచీ
ఆత్మీయంగా అమ్మ చీరెకొంగులా
నమ్మకాన్నిస్తుంది!

అది చిరంజీవి ఆశ
అది దీక్షాదక్షతలమీది
విశ్వాసాల శ్వాస!

అది రేపటి వెలుగుకేసి - మనిషి
దిటవుగా సాగించే పురోగమనం!
అది మనిషి మరో కల కోసం
కల సాకారం కోసం
నిట్టనిలువుగా సాగించే అధిరోహణం!!

– విహారి

చలిమంట

ఒక విధ్వంసం చలిచలిగా వ్యాపిస్తోంది
చలి నా చర్మాన్ని వలిచి తన మీద
కప్పుకుంటోంది
ఏ మోహం లేని చలిదేహం మీద
ఊగుతూ ఒక రాకాసి తల
అది నెమరేస్తున్నదేమిటో తెలియదు
చలివెంట ఎండ, ఎండవెంట వాన
విడివిడిగా ఉంటే ఇంతేనేమో?
ఎందుకిలా?
చలికాలంలో ఎండను
ఎండాకాలంలో వానను కోరుకుంటాం మనం?
మూడు కాలాలు ఉన్నప్పుడు
మూడు లోకాలు కూడా ఉండే ఉంటాయి
(మూడేనంటావా? మనమెందరమో
అన్ని లోకాలు వుండే వుంటయ్)
అన్ని కాలాలు, అన్ని స్థలాలు కలిసేచోటు
ఎక్కడో ఒకచోట వుండే వుంటుంది
ఎంత బాగా బ్రూ చేసిన కాఫీ అయినా
కొన్ని కప్పుల్లోనో కెటిల్స్‌లోనో వుండాలి
లేకుంటే మనుషులం పాత్రల్లేని
నటులమైపోమూ?
అంతే అనుకుంటా
అందరం ఒకానొక స్థలకాలం యొక్క
శకలాలమే ననుకుంటా
ఒకే ఒక్క తాను చిరిగి, మిగిలిన
గుడ్డపేలికలమేననుకుంటా
ఇన్నిన్ని పేచీలూ, ఈర్ష్యలూ, ద్వేషాలు
ఏమయ్యేంటయ్?
తప్పకుండా అవి మన కలయిక కోరికలే
అయ్యేంటయ్
కలుద్దామా?
ఒకరి చర్మం ఒకరం ఒలవకుండానే
కప్పుకుందామా?
ఒకరినొకరం నెమరేస్తూ
ఎవరికి వారుగా వున్నప్పుడు కూడా
కలిసుందామా?
ఒక చలిమంట మీద చేతులు చాచి
కూర్చుందామా?
మంటలో కాసిని వేరుశనక్కాయలు వేసి
వేగిన శనక్కాయలు బూడిదలోంచి
తీసితింటూ
మాట్లాడుకుందామా?

– హెచ్చార్కె

పుస్తక సమీక్ష

కథా వ్యాకరణం



విమర్శకుడిగా గుడిపాటి నిర్మొహమాటి. ఏ అంశాన్నయినా విస్తృతంగా అధ్యయనం చేసి, నిష్కర్షగా వింగడించి, చెప్పడం ఆయన నైజం. ఈనాటి కథాసాహిత్యాన్ని వివిధ కోణాల్లో పరిశీలించి 'మంచి కథ' ఎలా ఉండాలో విశదం చేసిన ఈ 'సంవిధానం' లోని 27 వ్యాసాలు ఇందుకు నిదర్శనం. కథా నిర్మాణం లోని సాంకేతికత, నేటి కథల స్వరూప చిత్రణ, కొన్ని కథాసంకలనాల విమర్శ, కొందరు కథకుల రచనల సమీక్ష, రచయితల ముందు మాటలు వీటిలో చేర్చారు. తెలంగాణ కథాసాహిత్య విహంగవీక్షణం కనిపిస్తుంది. చాలా వ్యాసాల్లో ప్రపంచీకరణ ప్రస్తావన చోటుచేసుకుంది. వ్యాసాల్లోని పునరుక్తులు కథకులకు హెచ్చరికల్లా వర్తిస్తాయి. ఈ సంపుటి కథావ్యాకరణంలా రూపుదిద్దుకుంది. **(సంవిధానం –గుడిపాటి,** వెల: రూ. 50/- ప్రతులకు: పాలపిట్టబుక్స్, 16-11-20/6/1/1, 403, విజయశ్రీ రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036)

–గోరాకృ

హాస్య భువనం



హాస్య రచనలు సాహిత్యానికీ ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాయి. హాస్యరసాన్ని మినహాయిస్తే మిగిలిన ఏ రసమూ అన్నిరకాల పాఠకుల్ని ఆకర్షించలేదు. ఆ ఆకర్షణ ఒక్క హాస్యరసానిదే. హాస్యాన్ని పండించడం చాలా కష్టం. అందులోనూ కథలో హాస్యం మరీ కష్టం. నవ్వించే కథల్లో వర్తమాన సమస్యల్ని పరిష్కరించే దిశగా వ్యంగ్యాస్త్రాలను సంధించడం మరీ మరీ కష్టం. ఇంతటి కష్టాన్ని ఈ లోకమంతటా వెదజల్లడానికి కంకణం కట్టుకొన్న భువన్ కథలు నిజంగా మేజిక్కులే. వ్యక్తిత్వం విచ్చుకోని రోగగ్రస్తుల పాలిట దివ్యమైన టానిక్కులే. ప్రతి కథలోనూ హాస్యాన్ని నింపుకున్నా సమాజం పట్ల, వ్యక్తుల బాధ్యతల పట్ల నిబద్ధత వీరి కథలకు అదనపు ప్రయోజనాన్ని సమకూర్చింది. కితకితలు పెట్టడంలో భువన్‌కి రంగు రుచి వాసనా బాగా అబ్బినట్టుంది. ఆరోగ్యకరమైన హాస్యాన్ని 35 కథల్లో పొదివిపట్టుకొని 'నవ్వులాట'ను సాహితీలోకానికి అందించారు. చిట్టి చిట్టి కథలు. ఆ చిట్టి కథల్లో చిటుక్కుమనే వ్యంగ్యం పాఠకుణ్ణి ఆలోచింపచేస్తుంది. ఆ ఆలోచనే ఈ కథల్ని నిలబెడతాయని ఆకాంక్షించవచ్చు.

(నవ్వులాట – భువన్, వెల: రూ. 40/- ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక విక్రయశాలలు)

– అద్దంకి శ్రీనివాస్

కుటుంబ కథలు



"చిన్న నిప్పురవ్వ శరీరం మీద పడితే 'అమ్మో!' అంటాం. అలాంటిది శరీరమంతా అలా కాలిపోతుంటే ఎంత నిర్మలంగా పడుకున్నావు. ఆ మంటలు చూస్తుంటే నా శరీరం మండిపోతోంది"... భార్య చితికి నిప్పంటిస్తూ శంకర్రావు విలవిల్లాడతాడు.. 'బంధం- అనుబంధం' కథలో. పార్వతీ పరమేశ్వరుల వంటి దంపతుల్ని విడదీయలేని కాలం కూడా వారి ముందు తలొగ్గింది" అంటారు రచయిత్రి కందుకూరి వెంకట మహాలక్ష్మి ఈ కథను ముగిస్తూ. సుప్రసిద్ధ రచయిత మునిపల్లె రాజు ముందుమాటతో ఈ సంపుటికి తెరతీశారు. ఇందులో ఇరవై ఏడు కథలున్నాయి. అవన్నీ ఇంతకుముందు పత్రికల్లో ప్రచురితమైనవే. జీవితంలో ఎదురయ్యే అనేక అంశాలను కథలుగా మలిచారు రచయిత్రి. భార్యల నగల పిచ్చితో సతమతమయ్యే భర్తలు (గట్టెక్కించిన చిట్కా), అనుమానస్తులు (ముసలి మొగుడు-పడుచుప పెళ్లాం), తల్లిదండ్రుల కష్టనష్టాలను పట్టించుకోని పిల్లలు (ఆ తరంతో ఈ తరం) మనకు ఇందులో కనిపిస్తారు. దాంపత్య జీవితంలో అన్ని పార్శ్వాలను రచయిత్రి తడిమారు. కొన్ని కథలు వ్యాసరూపంలో సాగుతాయి.

(నాణానికి మరోవైపు (కథల సంపుటి)**– కందుకూరి వెంకట మహాలక్ష్మి,** వెల: రూ. 80/- ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక విక్రయశాలలు)

– చిరువోలు

ఇట్లు

★ జనవరి సంచికలోని 'ఇప్పుడిలాగే వుంది మరి' కథ మమ్మల్ని ఆనందింపచేసింది. కథలో రాసినట్లు 'జగడాల జోగమ్మ'లు ఇక్కడ చాలాచోట్ల కన్పిస్తుంటారు. వాస్తవికత చాటిన రచయిత కాశీ విశ్వనాథ్0గారికి అభినందనలు.

– ***వానపల్లి గంగరాజు,*** విశాఖపట్నం

★ ఆరు తెలుగు కథలతో నిండిన కొత్త సంవత్సర ప్రారంభ సంచిక మాకు 'అరిటాకు వేసి వడ్డించిన విందు'లా ఉంది. 'వందేళ్ల తెలుగు కథ'లో ప్రపంచీకరణ ప్రభావాన్ని బాగా వివరించారు. విశేష వ్యాసం అందించిన మధురాంతకం నరేంద్రగారు అభినందనీయులు. విశ్వకథా ముత్యంలో భాగంగా 'మజిలీ గుమాస్తా'ను నాగభూషణాచార్యులు గారు చక్కగా ఆవిష్కరించారు. ముక్తవరం పార్థసారథిగారి అనువాద కథ 'ఖరీదైన ఖైదీ' కూడా చాలా బావుంది.

–***పి.సూర్యనారాయణరాజు,*** హైదరాబాద్

★ గరిమెళ్ల నరసింహశర్మగారి తెలుగు కథ 'ఎండమావులు' ఈ కాలపు పెద్దల, బిడ్డల సంబంధాలకు అద్దం పట్టేలా ఉంది. దాంపత్య బంధం, తల్లిదండ్రుల ఉదాత్తతను రచయిత చాటిచెప్పినట్లయింది.

–***నల్లమోతు సుబ్బారావు,*** గుంటూరు

★ 'నేను మళ్లీ జీవిస్తాను' హిందీ అనువాద కథ బాగా నచ్చింది. స్త్రీ తనను తాను ఉద్ధరించుకోగలదని చక్కగా తెలియజేసిన కథ ఇది. శైలజ పాత్రతో భావాల్ని వ్యక్తపరచిన తీరు అద్భుతంగా ఉంది. అలాగే 'పాతివ్రత్యం' కథ అర్థవంతంగా ఉంది.

– ***ఎస్. శేషగిరి,*** సికిందరాబాద్

★ ఇలియానా ముఖచిత్రంతో వెలువడిన విపుల సంచిక కనువిందు చేసింది. 'వందేళ్ల తెలుగుకథ' విశ్లేషణాత్మకంగా సాగుతోంది. గాంధీజీ సూక్తులు ఎంతో నచ్చాయి. కథల్లో సువర్ణగారి 'వెంటాడిన నీడ'కు మంచి మార్కులు పడతాయి. శ్రీధర్‌గారితో పాటు రవి, సముద్రాల, శ్రీచంద్ర, శ్రీనివాస్ బొమ్మలు బాగున్నాయి.

– ***సుభాష్ చంద్రబోస్,*** శ్రీకాకుళం

★ కార్డు కథలతో పాటు సినారె 'ముషాయిరా', 'మిస్టర్ మిరియం' రమ్యంగా ఉండి ఇంటిల్లిపాదినీ అలరించాయి. 'వందేళ్ల తెలుగు కథ'లో ఐతా చంద్రయ్యగారి 'ఆప్తవాక్యం' సరికొత్త ఆలోచనలు రేకెత్తించింది. తెలుగు కథల్లో 'బలగం', 'బంద్', 'ఇప్పుడిలాగే వుంది మరి' ఎంతగానో చదివించాయి. భారతీయ భాషల కథలు మూడూ (బొంత, నేను మళ్లీ జీవిస్తాను, పతిదేవుడు) ఆసక్తికరంగా సాగాయి. 'తెలుగు కథలు వేటికీ తీసిపోవు' అని యండమూరి అనడం అక్షర సత్యం. 'మాండలిక కథలు ఇంకా రావాల్సి ఉంద'న్న పాయసం సుబ్రహ్మణ్య మహర్షి మాటలు స్మరణీయాలు.

–***లక్ష్మీ విశ్వనాథ్,*** ఖమ్మం

★ కథలతో పాటు కార్డు కథలూ చాలా బాగున్నాయి.

– ***వేణుగోపాలరావు,*** హైదరాబాద్

★ ఎప్పటిమాదిరే ఈసారి కూడా 'మిస్టర్ మిరియం' మనసారా నవ్వించింది. మిరియంతో పాటు ధనియం, మరువం, లవంగం, అప్పడం పాత్రలతో మల్లాదిగారు చక్కటి హాస్యాన్ని పండిస్తున్నారు.

– ***పి. అనసూయ,*** చెన్నై

★ 'బలగం' తెలుగు కథ ముగింపు చక్కగా ఉంది. బంద్ వల్ల కలిగే అనర్థాల్ని తన కథలో రచయిత ప్రసాద్‌గారు హృద్యంగా తెలియజేశారు. మరో తెలుగు కథ 'వెంటాడిన నీడ' సమాజంలోని కొంతమంది ఆలోచనాధోరణిని ప్రతిబింబించింది.

–***వందన,*** హన్మకొండ

★ కథలన్నీ బాగున్నాయి. ముఖ్యంగా 'ఇప్పుడిలాగే వుంది మరి', 'వెంటాడిన నీడ' కథల్ని ప్రత్యేకించి చెప్పుకోవాలి. నేటి సమాజంలోని వృద్ధుల స్థితికి 'ఎండమావులు' కథ అద్దంపట్టింది. పుష్కిన్ 'మజిలీ గుమాస్తా' మాకు ఎంతగానో నచ్చింది. అనువాద కథల్లో 'బొంత' మా హృదయాన్ని కదిలించింది. హిందీ కథ 'నేను మళ్లీ జీవిస్తాను' వాస్తవికతకు చాలా దగ్గరగా ఉంది.

– ***విజయలక్ష్మి,*** కాకినాడ

మీ అభిప్రాయాల్ని e-mail : vipula.chatura@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

విపుల వినోదిని

ఫిబ్రవరి - 2010

ఫిబ్రవరి 'విపుల' చదివారా? అయితే ఈ ప్రశ్నలకు జవాబు రాయగలరేమో ప్రయత్నించండి. అందిన సరైన సమాధానాల నుంచి డ్రా ద్వారా అయిదుగురిని విజేతలుగా ఎంపిక చేసి బహుమతులందిస్తాం. సంపాదకులదే తుది నిర్ణయం.

1. రాజగోపాలరావును తనిఖీ చేసిన కస్టమ్స్ అధికారి?	
2.దెయ్యంతో స్కూల్‌బ్యాగ్ మోయించానని కోతలు కోసిందెవరు?	
3. సివంగిది ఏ ఊరు?	
4. చక్రధర్ కాళ్లూ చేతుల్ని తాడుతో కట్టేసిన వ్యక్తి?	
5. అజీజ్ విషం కలిపిన డ్రింకుని ఎవరికిచ్చాడు?	
6. పిల్లవాడి కిడ్నాప్‌ను లీడ్‌స్టోరీగా చేసుకున్న ఛానెల్?	
7. పామును రామ్‌లాల్ ఎంతకు కొన్నాడు?	
8. 'చీకటి' కథారచయిత?	
9. టూ టౌన్ స్టేషన్‌కి హెడ్ కానిస్టేబుల్ ఎవరు?	
10. రవళి కాకినాడలో ఏం చదువుతోంది?	

పంపినవారి పేరు: ------------------------------ వయసు (   )

చిరునామా: --

పిన్‌కోడ్:   ఫోన్ నెం:

వినోదిని పంపాల్సిన చిరునామా : సంపాదకుడు, విపుల,
ఈనాడు కాంపౌండ్, సోమాజిగూడ, హైదరాబాద్–500 082

ఈ కూపన్‌లోనే సమాధానాలు రాసి పంపాలి.

చివరి తేదీ ఈనెల 16

నోట్ : విపుల వినోదిని, చతుర ప్రవేశిక ఒకే కవరులో పంపవచ్చు.

Printed, Published, Edited and Owned by Ramoji Rao, D.No. 6-3-569/3, Vasundhara Publications, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082 and Printed at Eenadu Press, D. No.7-134/1&2, Moosapet Village, Balanagar Mandal, Kukatpally-500 072, Ranga Reddy District. Office Address: VIPULA, Telugu Monthly, D.No. 6-3-569/3, Eenadu Complex, Somajiguda, Hyderabad-500 082, Tel: 23318181, Visakhapatnam: 2552211; Vijayawada: 2494900; Tirupati: 2275757; Anantapur: 273444; Karimnagar: 2223216; Rajahmundry: 2468991; Suryapet: 221146; Guntur: 2512142; Nellore: 2338734; Srikakulam: 240101; Kurnool: 252813; Cuddapah: 270011; Tadepalligudem: 228881; Warangal: 2559901; Khammam: 255661; Nizamabad: 245661; Mahabubnagar: 276376; Ongole: 256777; New Delhi: 23753440; Mumbai: 24982498; Chennai: 28232390; Bangalore:25583804. & www.eenadu.net.

అమెరికన్ కథ

-ఎడ్వర్డ్ డి. హోచ్



మరణ దండన

అనువాదం: మల్లాది వెంకట కృష్ణమూర్తి

ఉదయం నిద్రలేచాక పేపర్‌ని అందుకుని ఓ వార్త కోసం వెదికాను. అది నాలుగో పేజీలో నా కంటపడింది.

ఉదయం సముద్రానికి చేపలవేటకి బయలుదేరిన కొందరు జాలరులు, సముద్రంలోంచి బీచ్‌కి కొట్టుకు వచ్చిన శవాన్ని చూశారు. వాళ్లు ఆ సంగతి పోలీసులకి చెప్పిన కొన్ని గంటలకే, మరణించిన వ్యక్తి పేరు సేమ్ జోడియా అని, అవివాహితుడైన అతను సెకండ్ హేండ్ కార్లని అమ్మే వ్యాపారస్థుడని వారు కనుక్కున్నారు.

నేనా వార్తని అంత ఆసక్తిగా చదవడానికి ముఖ్యకారణం.. సేమ్ జోడియాక్ బహుశా ఒకప్పుడు నా ప్రియ మిత్రుడు. నాకతనితో పరిచయమైనప్పుడు తను సైన్యంలో సార్జెంట్‌గా పనిచేస్తున్నాడు. అది పదిహేను ఏళ్ళకిందటి మాట. నేను సైన్యంలో చేరిన కొత్తల్లో కొరియాకి వెళ్లినప్పుడు, సేమ్ జోడియాక్ కింద కార్పొరల్‌గా పనిచేశాను.

నాకు ఆ రోజుల్లో ఎంతో భయంగా ఉండేది. నాకు తెలీని కొత్త ప్రదేశం, నాకర్థం కాని భాష మాట్లాడే కొత్తరకం ప్రజలు. వాళ్ళ చర్మం రంగు, ముఖాకృతి నా దేశ ప్రజల్లా ఉండేవి కావు.

ఇంటికి దూరమై ఒంటరిగా ఫీలవుతూ నేను రాత్రుళ్ళు సియోల్ నగరంలో కాలక్షేపం కోసం తిరిగేప్పుడు.. సేమ్ నాకు కంపెనీగా ఉండేవాడు. ఇతరుల్లా అతను కొరియన్ అమ్మాయిల కోసం వేటాడేవాడు కాదు, తప్ప తాగేవాడు కూడా కాదు.

“శత్రువులే అయినా సాటిమనుషులని చంపడం బాధాకరంగా ఉంటుంది” చెప్పాను.

“ప్రపంచంలోని ఏ భాషలో అయినా ఉండే రెండు ముఖ్య పదాలేమిటో తెలుసా? యుద్ధం, న్యాయం. నిజానికి అవి ఒకదానికొకటి విరుద్ధమైన విషయాలు కావు. నన్నడిగితే, ఆ రెండూ కలిసే వుంటాయి. చొరబాటుదారులని చంపేయాలి. మనం న్యాయం చేయడానికే ఇక్కడికి పంపబడ్డాం. అది తప్పక చేసి తీరాలి.” ఓ రోజు బార్‌లో నా ఎదురుగా కంపెనీకి కూర్చుని కోక్ తాగుతూ చెప్పాడు సేమ్.

చాలాకాలంగా సైన్యంలో ఉన్న సేమ్ జోడియాక్‌కి సైనికుడిగా చాలా అనుభవం వుంది. అతను ఓ మనిషిని చంపడానికి నాలా వెరవడు.

“ఈ యుద్ధం చాలాకాలం కొనసాగుతుందని చాలామంది అంటున్నారు” చెప్పాను.

“ఎప్పుడైనా సరే, ఎంతకాలం న్యాయం జరగాలో, అంతకాలం యుద్ధం తప్పదు”

“అప్పుడు మనం కూడా ఇక్కడ ఎక్కువ కాలం ఉండక తప్పదు” నిరుత్సాహంగా చెప్పాను.

“నాకు ఎక్కడైనా ఒక్కటే. ఇంటికెళ్ళి మాత్రం ఏం చేస్తాను? అక్కడా యుద్ధం,

న్యాయం తప్పవు" చెప్పాడు సేమ్.

"అదెలా సాధ్యం? అమెరికా నేలమీదకి ఇంతదాకా ఎవరూ దండెత్తలేదు, దండెత్తలేరు కూడా"

సిగరెట్ ఆఖరి దమ్ము లాగి, దాని వంక చూసి నర్మగర్భంగా నవ్వి, దాన్ని ఏష్‌ట్రేలో నలిపేసి చెప్పాడు.

"యుద్ధం, న్యాయం.. వెదికితే అది ఉండని చోటుండదు"

రెండువారాల తర్వాత మేం ఇద్దరం పెట్రోల్ డ్యూటీలో ఉండగా అతని మాటల వెనక అర్థం ఏమిటో నాకు తెలిసింది.

'థర్టీ ఎయిట్ పేరలల్' అని మా మేప్‌లో సైన్యం పేరుపెట్టిన ఓ కొండ పక్కనే ఉన్న పొలంలోకి వెళ్ళాం. అప్పటికే అది అమెరికన్, కొరియా సైన్యం చేతులు రెండుసార్లు మారింది. అమెరికన్ యుద్ధ విమానాలు అక్కడ కురిపించిన బాంబుల వర్షం వల్ల ఇప్పుడు అక్కడ ప్రజలెవరూ నివసించడం లేదు. అంతా ఇళ్ళువదిలి పారిపోయారు. పదిళ్ళు మించి లేవక్కడ.

రైఫిల్స్‌ని సిద్ధంగా పట్టుకుని మేం పెట్రోలింగ్‌లో ఉండగా, దూరంగా కొరియన్ సైనిక దళం ఆ పొలంలోని ఓ ఇంట్లో మా కంటపడింది. వైర్‌లెస్‌లో ఆ విషయం మేం తెలియచేయగానే, ఓ మోర్టారు దళం ఆఘమేఘాల మీద వచ్చి ఆ చిన్న దళాన్ని ఎదుర్కొంది. గంట తర్వాత మేం ఆ ఇంటిని స్వాధీనం చేసుకోగలిగాం.

ఆ ప్రదేశాన్నంతా సేమ్‌తో కలిసి నేను గాలిస్తుండగా, ఓ గోతిలో దాక్కుని ఉన్న కొరియన్ మాకంట పడ్డాడు. మేం అతన్ని స్వాధీనంలోకి తీసుకున్నాం. సివిల్ దుస్తుల్లోని అతను గూఢచారి అనే అనుమానం మాకు కలిగింది. నిజానికి ఎవర్ని చూసినా మాకదే అనుమానం కలుగుతుండేది.

అతనికి కాపలాగా ఉన్న ఓ సైనికుడు తన రైఫిల్‌ని కింద పెట్టి సిగరెట్‌ని వెలిగించుకుంటుంటే, అతను అకస్మాత్తుగా ఆ రైఫిల్‌ని లాక్కుని ఆ సైనికుడి మీద రెండుసార్లు కాల్పులు జరిపి చంపేశాడు.

సేమ్ అతని మీదకి దూకి, తన రైఫిల్‌తో అతని చేతిమీద కొట్టి, మా కళ్ళ ముందే మరణించిన ఆ సైనికుడి రైఫిల్ కిందపడేలా చేశాడు. అతనిలో ఎలాంటి భయం కనపడలేదు.

"ఇతను కొరియన్ ఆర్మీ ఆఫీసర్. సివిల్ దుస్తుల్లో వున్న గూఢచారి. మామూలు పౌరుడైతే రైఫిల్‌ని ఎలా ఉపయోగించాలో తెలియదు" చెప్పాడు సేమ్ నాతో.

అతని వంక చూశాను. రైఫిల్ తగిలిన చోట.. చేతిమీద కారే రక్తాన్ని తుడుచుకుంటున్నాడతను.

"ఇతన్ని మన దళ కమాండర్ దగ్గరికి తీసుకెళదాం" సేమ్‌కి సూచించాను.

గూఢచారి అయినా, పౌరుడైనా అతను మా వాళ్ళని చంపాడు కాబట్టి మేం చేయాల్సిందదే.

"యుద్ధఖైదీ అవుతాడు అప్పుడు. అందువల్ల తక్షణ న్యాయం జరగదు" చెప్పాడు సేమ్.

"కానీ, మనం చేయాల్సిన పని అదే కదా? "

"మరణశిక్షే ఇతనికి తగిన శిక్ష" చెప్పాడు సేమ్.

"కావచ్చు. కానీ న్యాయవిచారణ అనంతరం కదా ఆ సంగతి? "

నా వాక్యం పూర్తి కాకుండానే, సేమ్ చేతిలోని రైఫిల్ రెండుసార్లు పేలింది. ఆ రెండు గుళ్ళ తాకిడికి ఆ కొరియన్ నేలకూలాడు. సేమ్ చర్యకి ఆశ్చర్యపోయాను.

"నిరాయుధుడైన అతన్ని ఎందుకలా చంపావు? " ప్రశ్నించాను నేను. "యూనిఫాంలో లేడు. కాబట్టి వీడు ఖచ్చితంగా గూఢచారే. అంతేకాక హంతకుడు కూడా. వాడికి పడాల్సిన శిక్ష మరణదండనే" చెప్పాడు సేమ్.

అతని శరీరాన్ని పూడ్చకుండా అలాగే



వదిలి, మేం పెట్రోలింగ్ డ్యూటీని నిర్వహిస్తూ ముందుకు సాగాం. ఆ సంఘటన నా మనసులో నిలిచిపోయింది.

రెండు వారాల తర్వాత యుద్ధం ముగిసింది. శాంతిపత్రం మీద ఇరుపక్షాల వాళ్ళు సంతకాలు చేశారు. అంతా తిరిగి అమెరికాకి వెళ్ళిపోయాం.

శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆర్మీ హెడ్‌క్వార్టర్స్‌లో, నేను సైన్యంనుంచి డిశ్చార్జ్ అయ్యే సమయంలో.. సేమ్ జోడియాక్ నాకు మళ్ళీ తారసపడ్డాడు. అదేరోజు అతను కూడా సైన్యంనుంచి డిశ్చార్జి అయ్యాడు.

నేను తూర్పుకి వెళ్ళి, ఒహాయ్‌లో మధ్యలో వదిలిన నా చదువుని పూర్తి చేశాను. సేమ్ జోడియాక్‌కి తరచూ ఉత్తరాలు రాస్తూ, అతనితో స్నేహ సంబంధాన్ని వదలకుండా కొనసాగించాను.

ఓసారి పడమరకెళ్ళినప్పుడు నేను సేమ్‌ని కలిశాను. శాన్‌ఫ్రాన్సిస్కోలో సెకండ్ హేండ్ కార్లని కొని అమ్మే వ్యాపారం చేస్తూ, అతను ఆర్థికంగా బాగానే ఉన్నాడని తెలుసుకున్నాను.

"న్యాయం, నిజాయితీ..ఇవి సెకండ్ హేండ్ కార్ల డీలర్ల దగ్గర ఉండవు. నాకు ఆ రెండూ పుష్కలంగా ఉండబట్టే కస్టమర్స్ పెరిగారు. కస్టమర్ అంటే ఆదాయం" తన విజయరహస్యం చెప్పాడు సేమ్.

కాలేజీలో పరిచయమైన ఓ అమ్మాయితో, ఆరునెలల తర్వాత నాకు వివాహమైంది. సేమ్ జోడియాక్ దానికి హాజరవడమేకాక 'బెస్ట్‌మేన్'గా వ్యవహరించాడు. మా పెళ్ళయ్యాక కూడా మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఎప్పటిలా కొనసాగుతూనే ఉన్నాయి.

సంవత్సరం తర్వాత ఓ రోజు సేమ్ నుంచి నాకు ఫోన్‌కాల్ వచ్చింది.

"చాలా సంతోషకరమైన వార్త ఇది. నేను పెళ్ళి చేసుకోబోతున్నాను" అనందంగా చెప్పాడు.

"వచ్చేనెల పదహారో తారీకున ఆ శుభకార్యం జరుగుతుంది. నువ్వు నీ భార్యతో కలిసి తప్పక రా" ఆహ్వానించాడు.

"నీతో ఆ సంతోషాన్ని పంచుకోడానికి రాకుండా ఉంటానా? వస్తాను" ఆనందంగా చెప్పాను.

వారి పెళ్ళికి నాలుగు రోజుల ముందు మళ్ళీ సేమ్‌నుంచి నాకో ఫోన్‌కాల్ వచ్చింది.

"విమానం టిక్కెట్లు కూడా రిజర్వ్ చేయించాను. మీ పెళ్ళికి మేమిద్దరం హాజరవుతున్నాం" చెప్పానతనితో.

"మా పెళ్ళి రద్దయింది" బాధగా చెప్పాడు సేమ్.

"అదేం? " ఆశ్చర్యంగా అడిగాను.

"ఏన్ చనిపోయింది"

"అరెరె! ఎలా?

"బ్యాంక్ దొంగతనానికి పాల్పడ్డ ఒకడు, ఆ బ్యాంక్‌ని పోలీసులు చుట్టుముట్టడంతో బెదిరింపుగా.. తుపాకీతో బ్యాంక్‌లోని ఒకర్ని కాల్చిచంపాడు. ఆమే ఏన్"

"అయ్యయ్యో!"

మా ఆవిడ సలహా ప్రకారం, నేను ఒక్కడ్నే వెంటనే శాన్‌ఫ్రాన్సిస్కోకి చేరాను. అతని విచారంలో భాగం పంచుకోడానికి వెళ్ళి సేమ్‌ని కలిశాను.

సేమ్ నన్ను చూసి చాలా సంతోషించాడు. నేను వస్తాననుకోలేదతను. నా భుజాల్ని గట్టిగా వత్తి చెప్పాడు "పెళ్ళి జరిగేప్పటి కన్నా ఇప్పుడే నాకు నీ అవసరం వుంది."

రెండు రోజులు అతనితో ఉన్నాను. ఓదార్చడం నాకు చేతకాదు. అంచేత మేం కలిసి, కొరియాలో పనిచేసిన రోజుల్లో తమాషా సంఘటనల గురించి మాట్లాడాం. అతను వాటికి నవ్వినా, ఆ నవ్వులో జీవం లేదు.

"ఏన్‌ని చంపిన బేంక్ దొంగ పేరు గార్డన్. అతను కొద్ది సంవత్సరాల తర్వాత మళ్ళీ స్వేచ్ఛగా జైల్లోంచి బయటకి వచ్చేస్తాడు. ఈ రాష్ట్రంలో మరణ దండన లేదు" చెప్పాడు సేమ్ ఓ సాయంత్రం.

మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగుతూనే ఉన్నాయి. ఓ ఉత్తరంలో రాశాడు సేమ్.."నే చెప్పినట్లే జరిగింది చూశావా? నా కాబోయే భార్యని చంపిన జార్జ్ గార్డన్ జైలునుంచి పూర్తి శిక్ష అనుభవించకుండానే విడుదలయ్యాడు. సత్ ప్రవర్తనట. జైల్లో కాదు, జైలు బయట మనుషులు సత్‌ప్రవర్తనతో ఉండాలి"

ఆ ఉత్తరానికి ఓ దినపత్రికలోని కటింగ్ జత చేసి ఉంది. అందులో జార్జ్ గార్డన్‌ని ఎవరో గుర్తు తెలియని వ్యక్తి కాల్చి చంపాడన్న వార్త ఉంది.

ఆ వార్త కింద సేమ్ చేతి రాతతో ఇలా ఉంది. 'దీన్నే నేను న్యాయం అనేది. పగ కాదు.. న్యాయం.'

కొద్ది నెలల తర్వాత నేను ఉద్యోగం మారాను. నా కొత్త కంపెనీ మందుల కంపెనీ. ముడి సరుకు కొనే నిమిత్తం నేను రెండు, మూడు నెలలకోసారి శాన్‌ఫ్రాన్సిస్కోకి వెళ్ళాల్సివచ్చేది. ప్రతిసారీ సేమ్‌ని కలిసే వాడిని.

ఓ రోజు సాయంత్రం బీర్ల మధ్య అడిగాను.

"నువ్వు పెళ్ళి చేసుకోదగ్గ అమ్మాయి నీకు మళ్ళీ తారసపడలేదా సేమ్? "

ఆ ప్రశ్నకి జవాబు చెప్పే ముందు అతను చూసిన చూపులో.. నా హృదయం ద్రవించే బాధ కనిపించింది.

"లేదు. ఏన్ ఇక తిరిగి బతికిరాదు"

"నేను నిన్నో ప్రశ్న చాలాకాలంగా అడగాలనుకుంటున్నాను"

"అడుగు"

"ఏన్‌ని చంపినతని మరణం గురించిన వార్త గల పేపర్ కటింగ్‌ని నువ్వు నాకు పంపావు. గుర్తుందా? "

"గుర్తుంది, ఏం? "

నేను నా మనసులోని విషయాన్ని మాటల్లోకి, ప్రశ్న రూపంలో అనువాదం చేయడానికి.. పడే అవస్థని, నా మొహమాటాన్ని కూడా గమనించి, నవ్వి చెప్పాడు.

"నువ్వు అడగని ప్రశ్నకి నేను జవాబు చెప్తాను విను. ఇదేం రహస్యం కాదు. బైబిల్‌లో దీని గురించి ఉంది. కంటికి కన్ను. ఈ రాష్ట్రంలో మరణదండన లేదు"

అతని సమాధానానికి నా మొహంలోకి రక్తం తన్నుకు వచ్చింది. చిన్నగా పాలమారి దగ్గాను.

"నాకు తెలుసు..నువ్వేం ఆలోచిస్తున్నావో! ఆ రోజు కొరియాలో జరిగిన సంఘటన, తర్వాత నేను చెప్పిన మాటలు కదా? " నవ్వాడు.

నేనేం మాట్లాడలేదు.

"కొరియాలో ఆ రోజు నేను చేసింది సరైన పనే. ఇక్కడి అమెరికాలో నేను చేసిందీ సరైన పనే. ఏన్‌ని చంపినందుకు అతన్ని బైబిల్‌లో చెప్పినట్లుగా ఎవరూ శిక్షించలేదు. మరి నేనేం చెయ్యాలి? "

నేనా ప్రశ్నకి జవాబు చెప్పలేదు. చెప్ప లేను కూడా. సాధ్యమైనంత త్వరగా సేమ్ నుంచి దూరంగా వెళ్లాలనిపించింది. ఆ తర్వాత నేను సేమ్‌ని కలవడం చాలా తగ్గించేశాను. అతని సెకండ్‌హేండ్ కార్ల అమ్మకం వ్యాపారం బాగా అభివృద్ధి చెందిన గుర్తుగా.. శాన్‌ఫ్రాన్సిస్కోలో చాలా చోట్ల కనిపించే ప్రకటన బోర్డులు నాకతన్ని గుర్తుకు తెచ్చేవి.

ఏడాది తర్వాత నేను శాన్‌ఫ్రాన్సిస్కోకి నా ఉద్యోగ రీత్యా వచ్చినపుడు, ఓ ఉదయం హోటల్‌గదిలో వేసిన లోకల్ పేపర్‌ని తిరగేస్తూ ఓ వార్తని చదివాను.

పద్నాలుగేళ్ల అమ్మాయిని ఎవరో పాశవికంగా బలాత్కారం చేశారు. ఆమె శరీరం ఓ కారు ట్రంక్‌లో దొరికింది. గంటలో పోలీసులు ఆ కారు యజమాని పేరు, చిరునామాల్ని కనుగొన్నారు. అతన్ని పోలీసులు నెవేడా రాష్ట్రంలో అరెస్టు చేసి, క్రితం రోజు శాన్‌ఫ్రాన్సిస్కోకి తీసుకొచ్చారు. అతన్ని రైల్వేస్టేషన్‌నుంచి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి.. ప్రశ్నించడానికి తరలిస్తుండగా.. ఫోటోలు తీయడానికి పత్రికా విలేకరులు, చూడడానికి ప్రజలు హెడ్‌క్వార్టర్స్ బయట గుమిగూడారు. అతన్ని లోపలికి తీసుకెళ్తుండగా, ఆ గుంపులోంచి పేలిన తుపాకినుంచి వెలువడిన ఒకే ఒక గుండు.. తల వెనుక భాగంలో దిగి ఆ నిందితుడు తక్షణం మరణించాడు. గుమిగూడిన వందలమంది ఆ హత్యకి బెదిరి పారిపోయారు. వాళ్లతో పాటు హంతకుడు కూడా ఆయుధంతో సహా పారిపోయాడు.

అది చదివాక నాకు సేమ్ గుర్తుకు వచ్చాడు. అతన్ని చూసి ఏడాది దాటుతోంది. ఓ సారి చూడాలనుకుని అతనికి వెంటనే ఫోన్ చేశాను. నా కంఠం విని చాలా ఆనందపడ్డాడు.

"సాయంత్రం ఏం చేస్తున్నావు? కలుద్దాం" చెప్పాడు ఉత్సాహంగా. ఆ సాయంత్రం చీకటి పడుతుండగా నేను సేమ్‌ని కలిశాను.

"ఎలా ఉన్నావు ఎక్స్ కార్పొరల్? మీ ఆవిడ ఎలా ఉంది? తండ్రివయ్యావా? " అడిగాడు.

ఏన్‌తో పరిచయం కాకముందటి సేమ్‌లానే కనిపించాడు. అతనిలో పూర్వపు విషాదం లేదు. మా భోజనానంతరం అతనితో నేను మాట్లాడాలనుకున్న టాపిక్‌లోకి సంభాషణ తీసుకెళ్లాను.

"ఇవాళ పేపర్లో.. పోలీస్ హెడ్‌క్వార్టర్స్ ముందు ఆస్కర్ అనే రేపిస్ట్‌ని ఎవరో కాల్చి చంపారని చదివాను. ఘోరం కదా? " అని అడిగాను.

"ఘోరం? ఆస్కర్ చేసింది ఘోరం కాదా? ఓ మైనర్ అమ్మాయిని చంపడం ఇంకా ఘోరం"

"కానీ ఆస్కర్ నేరం.. విచారణ ద్వారా రుజువుకాలేదు కదా? "

"విచారణ వల్ల కలిగే లాభమేమిటి? ఈ రాష్ట్రంలో మరణదండన లేదు"

"అందువల్ల ఆ హత్య న్యాయసమ్మతమనే అంటావా? " అడిగాను సిగరెట్ వెలిగిస్తూ.

"అవును"

"జార్జ్ గార్డన్ హత్యలానా? "

"అవును. జార్జ్‌గార్డన్ హత్యలా ఇదీ న్యాయమే"

"సేమ్.. నీకేమైంది? " ప్రశ్నించాను.

"నాకేం కాలేదు. ఆధునిక మొరాలిటీలోనే ఏదో అయింది. నన్ను చూసిన వారంతా సెకండ్‌హేండ్ కార్ల వ్యాపారి అనుకుంటారు. నా లాంటి వాడికి న్యాయం ఉండదనుకుంటారు. కానీ వాళ్లని చూడు. హంతకులకి మరణదండన వేయరు. జైల్లో కూర్చో



బెట్టి మేపి బయటకి పంపుతారు. హంతకులంటే సానుభూతి వాళ్లకుంది. బాల్యంలో విషాదం, తక్కువ మేధాశక్తి, మానసిక అనారోగ్యం, దరిద్రం.. ఇలా ఏదో ఓ కారణంగా ప్రతీ హంతకుడి మీద సానుభూతిని వర్షిస్తున్నారు. హంతకులకి మరణదండన విధించే బదులు వాళ్లని పిచ్చాసుపత్రులకో, జైళ్లకో పంపుతున్నారు. బయటకి పంపి మళ్లీ వాళ్లు హంతకులవడానికి కారణమవుతున్నారు"

నాకు అతని మాటలకి గాలాడలేదు. దీర్ఘంగా ఉచ్ఛ్వాస నిశ్వాసాలు తీసుకుని వదిలాను. సేమ్.. బిల్లు పే చేసి, నా భుజంమీద చేతిని వేసి నడుస్తూ చెప్పాడు "నేను న్యాయం జరిపించే విషయంలో వీరుడ్ని, యుద్ధ వీరుడ్ని"

"నీకు పిచ్చెక్కింది. ఇలా ఎంతకాలం? " ప్రశ్నించాను.

చీకట్లో అతని వంకర నవ్వుని క్షణకాలం కనబడ్డ పళ్ళద్వారా అర్థంచేసుకున్నాను.

"నువ్వు నా ప్రియమిత్రుడివి కాబట్టి నీకో రహస్యం చెప్తున్నాను విను. దీన్ని పోలీసుల ముందు నువ్వు రుజువు చేయలేవు కూడా. అందువల్ల నీకు చెప్పడంతో నాకెలాంటి హానీ కలగదు. సంవత్సరంగా అయిదుగురి హంతకుల హత్యల గురించి వార్తల్లో వచ్చింది. మిగిలిన వాళ్ళ గురించి ఎందుకో దినపత్రికలు ఉత్సాహం చూపించలేదు"

"అంతమందా? " అదిరిపడ్డాను.

"అవును. అంతా నేరస్థులే. ఆ పన్నెండు మందీ హంతకులే. మన చట్టాల వల్ల వాళ్ళు మరణదండనని తప్పించుకోగలిగారు.. నా నుంచి తప్ప"

నాకు మళ్ళీ ఊపిరాడలేదు. మాట్లాడాలని ప్రయత్నించినా, నా నోట్లోంచి చాలాసేపటికి కానీ మాటలు రాలేదు.

"నీకు మరణదండన విధించే హక్కు ఉందనుకుంటున్నావా సేమ్? " అడిగాను.

ఆ చీకట్లో సేమ్ జోడియాక్ మొహంలో ఎలాంటి భావాలు చోటుచేసుకున్నాయో గోచరించలేదు. అతని మాటలు మాత్రం నా చెవులకి మామూలుగానే వినిపించాయి.

"నా జాబితాలో ఇప్పటికీ ఇంకా ముగ్గురున్నారు. సరైన అవకాశాల కోసం చూస్తున్నాను"

"ముగ్గురు".. అదిరిపడ్డాను.

"ప్రస్తుతానికి" సన్నగా సేమ్ నవ్వు వినిపించింది నాకు.

అప్పుడు నేను సేమ్‌ని తోశాను. నా బలాన్నంతా ఉపయోగించి రైలింగ్ మీద కూర్చున్న అతని ఛాతీమీద.. రెండుచేతులూ ఉంచి బలంగా వెనక్కి తోశాను. వెనక్కి పడుతూ అతను పెద్దగా అరిచాడు. కానీ, కొద్ది క్షణాల్లోనే అతను మూడు డిగ్రీల సెల్సియస్ మహా పసిఫిక్ సముద్రపు నీళ్లల్లో పడడంతో, ఆ అరుపు ఆగిపోయింది!

నేను శాన్‌ఫ్రాన్సిస్కోలో ఉండగానే, మర్నాడు అతని శరీరాన్ని జాలరులు కనుక్కున్నారు. ఆ వార్తలో అనుమానితుల గురించి ఎక్కడా లేదు. సేమ్‌కి శత్రువులెవరూ లేరని, సెకండ్ హేండ్ కార్ల వ్యాపారంలోని వారిలా కాక చాలా నిజాయితీపరుడని పోలీసులు పేర్కొన్నారు. అతను పొరపాటున పసిఫిక్ మహా సముద్రంలో పడ్డాడని పోలీసులు భావించారు.

ఆ తర్వాత నేను శాన్‌ఫ్రాన్సిస్కో దినపత్రికలకి చందాకట్టి, వాటిని నిత్యం చదువుతున్నాను. జైలునించి విడుదలైన హంతకులెవర్నీ ఆ తర్వాత ఎవరూ చంపిన వార్తలు రాలేదు. V

తెలుగు కథ



- కలిగినీడి దుర్గాదేవి



భాగస్వామ్యం

శ్రీరామా కోకోనట్ కంపెనీ, అల్లవరం.

ప్లాస్టరింగ్ లేకుండా ఉన్న నాలుగు ఇటుకల గోడలు. పైన కొబ్బరాకుల పైకప్పు. అదే కంపెనీ భవనం. లోపలా, బయటా ఎటుచూసినా ఎక్కడ చూసినా కొబ్బరికాయలే. పైడొక్కలు వలిచేసి పీచుతో ఉన్న కాయలు కొన్ని, మామూలుగా ఉన్నవి కొన్ని, రాశులు రాశులుగా ఉన్నాయి.

అక్కడే ఒక మూలకి ఒక టేబుల్, దాని లోపలివైపు పెద్ద కుర్చీ, దానిమీద పరచి ఉన్న బొచ్చుతువ్వాలు. బయట అరడజను నీల్‌కమల్ ప్లాస్టిక్ కుర్చీలు...

చుట్టుపక్కల కొబ్బరి తోటల యజమానుల నుంచీ, సైకిలు మీద తిరుగుతూ కొబ్బరి కాయలు కొనేవాళ్ల దగ్గర్నుంచీ కొబ్బరి కాయలు కొని, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకీ, ఇతర రాష్ట్రాలకీ ఎగుమతి చేసే వ్యాపారం అది.

డబ్బు రొటేషన్‌కి ఇబ్బందిలేని కొంత మంది వ్యాపారులు, సమయాన్ని బట్టి కొబ్బరికాయల్ని కొని నిలవచేస్తూ, మంచి ధర పలికినప్పుడు అమ్ముతుంటారు. అదృష్టవశాత్తూ అంచనాలు నిజమై ఆశించిన ధర వస్తే... పండగే. ఎన్ని కాయలు నిల్వ వుంటే అన్నీ రూపాయిలే. సాధారణంగా కొబ్బరికాయ తొమ్మిది నెలలు నిలవుంటుంది. తర్వాత కురిడీగా మారుతుంది.

శ్రీరామా కోకోనట్ కంపెనీకి సుబ్బరాజు, చక్రధర్‌లు భాగస్వాములు. మొదటగా ఆ వ్యాపారం పెట్టిన సుబ్బరాజు, ఆ తర్వాత స్నేహితుడు చక్రధర్‌కి వాటా ఇచ్చాడు. వ్యాపారం అనూహ్యంగా పుంజుకోవడంతో ఇద్దరి భాగస్వామ్యంలో మరిన్ని వ్యాపారాలు మొదలుపెట్టారు వాళ్లు. ఎటు చూసినా లాభాలే లాభాలు.

ఏటా లెక్కలు వేసుకుని సమానంగా పంచుకుంటున్నారు లాభాల్ని. భారీగానే వస్తోంది ఒక్కొక్కరి వాటాకి.

ఒకవేళ ఒకడు లేకపోతే...

★ ★ ★

'ట్రింగ్... ట్రింగ్...' ఫోను మోగుతోన్న శబ్దం రిసీవర్ తీసిన చిన్న చప్పుడుతో ఆగింది.

"హలో..."

"హలో చక్రం నేనూ..."

"చెప్పు"

"గుండె చేత్తో పట్టుకుని విను... కొబ్బరి రేటు హఠాత్తుగా మూడు రూపాయలు పెరిగింది..."

"నిజంగానా... ఎంత శుభవార్త చెప్పావ్... పెరిగిన రేటు ప్రకారం మనకో పది లక్షలు ఎక్స్‌ట్రా లాభం.. దాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి మనం..."

"తప్పకుండా..."

ఫోన్ పెట్టేసి ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు చక్రధర్. అధిక ధనలాభం ఎప్పుడూ సంతోషదాయకమే. ఒక్కోసారి నేరాలకి ప్రేరకం కూడా. చాలా నేరాలకి డబ్బే ముఖ్య కారణం అవుతుంది.

★ ★ ★

అల్లవరం నుంచి అమలాపురం మీదుగా ఏకధాటిగా ప్రయాణించిన కారు ఎదుర్లంక నుంచి గోదావరి మీది బాలయోగి వారధిని దాటి యానాం బైపాస్ రోడ్డులోని బార్ అండ్ రెస్టారెంట్ దగ్గర ఆగింది.

మందు తాగే అలవాటున్న అందరికీ యానాం పేరు చెప్తేనే చాలా హుషారొస్తుంది. కారణం, అక్కడ మద్యం తక్కువ ధరకి లభించడమే. కేంద్రపాలిత ప్రాంతమైన యానాంలో యింకా చాలా వాటి ధరలు తక్కువ.

ఆ తక్కువ ధరల వల్లే మామూలుగా బయట హాఫ్‌బాటిల్ మందు తాగేవాడు కాస్తా అక్కడికెళ్తే ఫుల్లు తాగుతాడు.

వ్యాపార విజయం తాలూకు ఆనందాన్ని ఆస్వాదిస్తూ వేయించిన జీడిపప్పుని నంజుకుంటూ పీకల్దాకా తాగిన సుబ్బరాజు, చక్రధర్‌లు కాలాన్ని కోల్పోయారు.

వాళ్లకి తిరిగి సమయం చిక్కేసరికి...

"షాలా మంషి పాటీ ఇచావు షుబ్బరాజ్జూ. థాంక్స్... ఇల్లాంటి పాటీలు ఎన్నో షేసుకోవాలి మనం" ముద్దముద్దగా అంటున్నాడు చక్రధర్.

"అహహ... పార్టీ యిక్కడితో అయిపోలేదు. యింకా ఉంది."

"ఇంకానా..."

"అవును. మన పార్టీలో సగం గోదావరొడ్డున జరిగింది. మిగతాది కొండల్లో... మేఘాల మధ్యలో... కార్లో లాంగ్ డ్రైవ్‌కి వెళ్తూ..." ఊరించాడు సుబ్బరాజు.

"వా...వ్... ఇల్లాంటివి ప్లాన్ షెయ్యాలంటే న్నీ తర్వాతే షుబ్బరాజూ... సెబాస్..." అంటూ విజిలేశాడు చక్రధర్.

మందు బాటిల్స్, వాటర్ బాటిల్స్, జీడిపప్పు ప్యాకెట్లు, సిగరెట్ పెట్టెలు కొని కార్లోపడేసి, చక్రధర్‌ని ఎక్కించుకుని బయలుదేరాడు సుబ్బరాజు.

★ ★ ★

కాకినాడ మీదుగా కార్‌ని పోనిచ్చి కత్తిపూడిలో హైవే పక్కన దాబా దగ్గర ఆపాడు సుబ్బరాజు.

అక్కడ ఇద్దరూ మళ్లీ తాగీ, తిన్నాక బయలుదేరారు.

కారు అన్నవరం, తలుపులమ్మలోవ దాటాక తునికి ముందు నుంచి ఎడం పక్కకి తిరిగింది. అప్పటిదాకా వెనకసీట్లో కూర్చుని తాగుతూ ఏకధాటిగా అదీ యిదీ వాగుతోన్న చక్రధర్ అప్పటికి మత్తులోంచి నిద్రలోకి జారిపోయాడు.

నర్సీపట్నం దాటాక మొదలైన ఘాట్‌రోడ్డులో వెళ్తోంది కారు. ఒక్కో కొండా ఎక్కుతూ అర్ధరాత్రి దాటాక నరసంచారం అస్సలుండని దట్టమైన అడవిలో ఆగింది.

పచ్చా పచ్చటి ఆ కొండలన్నీ కాటుకని పులుముకున్నట్టు చీకట్లో నల్లగా... నలుపు రంగు ముద్దలా కనిపిస్తున్నాయి. ఆకాశంలో భయం భయంగా మెరుస్తున్నాయి నక్షత్రాలు. చంద్రుడు భయంతో ముందే చీకటి దుప్పటి కప్పేసుకున్నట్టున్నాడు. నలుపురంగు తప్ప కన్ను పొడుచుకున్నా మరొకటి కనిపించని ఆ కారుచీకట్లో అంతా బాగా తెలిసిన, అలవాటైన మనిషిలా ఇంజన్ ఆఫ్‌చేసి కిందకి దిగాడు సుబ్బరాజు. నిషాతో మత్తుగా పడిపోయి ఉన్న చక్రధర్‌ని బయటకి లాగి భుజాన వేసుకుని నడవడం మొదలుపెట్టాడు.

దెయ్యాలు సైతం భయంతో హడలి చచ్చేటంత దట్టమైన అడవి. పైగా చీకటి. కాళ్లకింద నలుగుతోన్న ఎండుటాకుల



చప్పుడే డి.టి.ఎస్.లా వినిపిస్తోన్నంత నిశ్శబ్దం. దారి చూపించమంటూ పత్రికల్లో వచ్చే పజిల్స్‌లోని గీతల్లా వంకర టింక రగా పెరిగిన చెట్లు. వాటి మధ్య నుంచి తాపీగా నడచిపోతూన్న సుబ్బరాజు, భేతా ళుడ్ని భుజాన మోస్తున్న పట్టువదలని విక్రమార్కుడిలా ఉన్నాడా క్షణం.

అడవిని ఆనుకుని ఉన్న పెద్ద కొండమీ దకి ఎక్కుతున్నప్పుడు మాత్రం ఆయా సంతో గసపోసుకుంటూ చాలా శ్రమప డ్డాడు సుబ్బరాజు. అయినా పట్టువద ల్లేదు. చక్రధర్‌ని కిందకి దించలేదు. అను కున్నది సాధించేదాకా నిద్రపోని చాలా మందిలో ఉండే లక్షణమే అది. ఆ మొండితనం, బండతనం వాళ్లకి ఆ ఆశ యసాధన మీది ఆశే కల్పిస్తుంది మరి... అవన్నీ సుబ్బరాజు నిండా నిండి ఉన్నాయా సమయంలో.

ఎలాగైతేనేం కొండమీదకి చేరాక చక్రధ ర్‌ని కిందికి దింపాడు సుబ్బరాజు. మరో భుజానికి వేలాడుతున్న సంచిలోంచి ప్లాస్టిక్ తాడు తీశాడు. చక్రధర్ ఒంటిమీద బట్టలన్నీ తొలగించాడు. కాళ్లూ చేతులూ కట్టేశాడు. మరో తాడుని అతడి ఒళ్లంతా చుట్టేశాడు. నోరుతెరచి గుడ్డలు కుక్కి ప్లాస్టర్ వేశాడు. నాలుగు పెద్ద పెద్ద రాళ్లు తెచ్చి అతనికి నాలుగువైపులా పెట్టాడు, లోయలోకి జారిపోకుండా ఉండటానికి.

మత్తులో స్పృహ కోల్పోయినట్టున్న చక్ర ధర్, సుబ్బరాజు ఎలా జరిపితే అలా జరు గుతూ శవానికిమల్లే పడి ఉన్నాడు.

కాళ్ల దగ్గరున్న బండరాయి వెనకాల చిన్న గొయ్యి తవ్వి ఒక కర్రపాతాడు. దానికి ఒక నలుచదరపు అట్టముక్కని వేలాడదీశాడు. దాని మీది అక్షరాలు చీకట్లో కనిపించడం లేదుగానీ వెలుగులో అయితే యిలా ఉంటాయి.

'చక్రధర్... నీకు వ్యాపారంలో మాత్రమే భాగస్వామ్యం యిచ్చాను. నా జీవిత భాగస్వామిలో కాదు. అత్యంత రహస్యంగా నువ్వు నాకు ద్రోహం చేయడం ద్వారా నేరం చేశావు. మూడో కంటికి తెలియకుండా దానికి నేన్నీకు శిక్ష వేసి న్యాయం చేశాను.

మీ ఇద్దరి సంగతి తెలిసి... నువ్వు మా బెడ్‌రూమ్‌లో ఉన్నప్పుడు కూడా మా యింటి డాబామీద వెల్లకిలా పడుకుని పగతో రగిలిపోతూ, నాలో నేను కుమిలి పోతూ.... ఆకాశంలోని నక్షత్రాల్ని చూస్తూ ఎన్నో రాత్రులు గడిపాను నేను. ప్రతిసారీ నిన్నెలా శిక్షించాలా అని ఆలో చించీ ఆలోచించీ ఈ పథకం వేశాను. ఇప్పుడు నాలాగే నువ్వు కూడా బతికి వున్నన్నాళ్లూ రాత్రిళ్లు ఆకాశంలో నక్షత్రాల్ని లెక్కపెడుతూ గడపాలి కదా... ఎలా ఉంది శిక్ష? ... బాగుంది కదూ.

మైడియర్ పార్టనర్... ఈ ద్రోహంలోని నీ పార్టనర్‌ని కూడా త్వరలోనే నీ దగ్గరికి పంపిస్తాను. ఉంటాను మరి'

★ ★ ★

డబ్బు తర్వాత, డబ్బంతగా నేరాల్ని ప్రేరేపించేది అక్రమ సంబంధాలేనట. ఎక్కడో చదివింది తన జీవితంలో అనుభ వంగా ఎదురైనందుకు బాధగానే ఉంది సుబ్బరాజుకి.

చట్టం చేతులు చాలా పొడవన్నది మాత్రం ఎదురు కాకూడదని నిత్యం అప రాధ భావంతో వేయి దేవుళ్ళకు మొక్కు కుంటున్నాడు సుబ్బరాజు. V

బ్రిటన్ కథ



-జెఫ్రీ ఆర్చర్

ప్రయాణం

అనువాదం : కె.వరలక్ష్మి

మే 1986..

భార్యతో ఎయిర్‌పోర్ట్‌కి వెళుతుంటే.. హమీద్‌కి నవ్వొచ్చింది. అయిదు సంవత్సరాల క్రితం అది సాధ్యంకాలేదు.. వాళ్లు అమెరికాకు రాజకీయ బహిష్కృతులుగా వచ్చినప్పుడు. అప్పట్నించి అతను న్యూయార్క్‌లో కొత్త జీవితాన్ని ప్రారంభించాడు. జీవితంలో ఏదైనా సాధ్యమే అనుకుంటున్నాడిపుడు..

"తిరిగి ఎప్పుడొస్తావ్ నాన్నా?" కొడుకు నదీమ్ అడిగాడు. కారు వెనకాల సీట్లో నడుంకి బెల్టుకట్టుకొని వున్నాడా కుర్రాడు. పక్కనే చెల్లి 'మే' వుంది. తండ్రి వూరు వెళుతున్నాడన్న విషయం కూడా తెలీని చిన్నపిల్ల ఆమె.

"పదిహేను రోజులు మాత్రమే.. ఒట్టు. తర్వాత మనందరం సెలవుకి టూర్ వెళదాం" తండ్రి చెప్పాడు.

"పధ్నాలుగు రోజులు ఎక్కువ డాడీ" కొడుకు అన్నాడు.

"పధ్నాలుగు రాత్రిళ్లు కూడా".. కారుని టర్కీష్ ఎయిర్‌వేస్ అనేచోట ఆపుతూ అంది భార్య. డాష్ బోర్డులో బటన్ నొక్కితే తలుపు తెరుచుకుంది. హమీద్ సామాను తీసుకొని దిగాడు. కూతుర్నీ కొడుకునీ కౌగలించుకున్నాడు. కూతురు ఏడుస్తోంది.. తండ్రి వెళుతున్నందుకు కాదు! కారు ఆగినందుకు ఆ పిల్ల ఏడుస్తోంది. అంతకుముందు తండ్రి మీసాలు సాగదీస్తూ ఆనందపడింది.

"పధ్నాలుగు రోజులా?" కొడుకు ఇంకా అంటూనే వున్నాడు. హమీద్ భార్యని కౌగలించుకున్నాడు. 'మూడో బిడ్డ.. ఇదిగో నేనున్నాన'ంటూ ఆమె ఉబ్బెత్తుగా వున్న పొట్ట అతడ్ని స్పృశించింది.

"మేం మళ్లీ ఇక్కడే ఎదురుచూస్తూ వుంటాం.. మరి మీరొచ్చే రోజునాటికి" అంది భార్య.

సామానుని చెక్ చేశాక, ఎయిర్‌పోర్ట్ అధికారులు అతణ్ణి టర్మినల్‌లోకి పంపించారు. టర్కిష్ ఎయిర్‌లైన్ డెస్క్ వైపు వెళ్లాడు. అదే ఫ్లైట్‌లో సంవత్సరానికి రెండుసార్లు ప్రయాణం చేస్తాడు కాబట్టి.. అతడికి అన్ని విషయాలూ తెల్సు.

అతణ్ణి పూర్తిగ చెక్ చేశాక బోర్డింగ్ పాస్ యిచ్చారు. ఇంకా గంటసేపు వెయిట్ చెయ్యాలి.. ఫ్లైట్ కోసం. గేట్ బి వైపు వెళ్లాడు. పామ్ ఆమ్ చెక్ డెస్క్ గుండా వెళ్లినవాళ్లు అతడికంటే గంట ముందు వెళతారు.. వాళ్లు దానికోసం అరవైమూడు డాలర్లు లంచం యిచ్చారు.

చెక్ ఇన్ ఏరియాలోకి అడుగుపెట్టాక టర్కిష్ ఎయిర్‌లైన్స్ స్టీవార్ట్స్ వచ్చి ఫ్లెయిట్ 014కి గుర్తుపెట్టాడు. న్యూయార్క్- లండన్ - ఇస్తాంబుల్ అని బోర్డుమీద రాసి వుంది. తర్వాత 10.10కి విమానం బయలుదేరుతుంది.

విమానం సీట్లు.. కాస్మోపాలిటన్ ప్రయాణికులతో వరుసగా నిండిపోతాయి. అక్కడున్న టర్క్స్ అంతా తమ కుటుంబా

లను చూడటానికి వాళ్ల దేశం వెళుతున్నారు.

హమీద్ రెస్టారెంట్- బార్ వైపు వెళ్లాడు. కాఫీ ఆర్డర్ చేశాడు.. రెండు ఉడక బెట్టిన గుడ్లు కూడా. అవి తింటూన్నప్పుడు అమెరికాలో తాను ఎంత స్వేచ్ఛగా వున్నాడో గుర్తుకు వస్తుంది.

'ఇస్తాంబుల్ వైపు వెళ్లే ప్రయాణికులు, చిన్న పిల్లలు వున్నవాళ్లు వచ్చి విమానంలో కూర్చోండి' అని స్టీవార్ట్స్ స్పీకర్‌లో చెప్పాడు.

ఆఖరి గుక్క కాఫీ తాగి హమీద్ విమానంవైపు బయలుదేరాడు. 'ఆఖరి క్షణంలో బయలుదేరటం' అనే అమెరికా అలవాటు అతడికి ఇంకా అబ్బలేదు. బిల్ చెల్లించి.. డాలర్‌ను టిప్‌గా వదిలాడు.

'సీట్ల సంఖ్య 35 నుండి 41 వరకు వున్న వారు సీట్లలో కూర్చోండి' ఎనౌన్స్ చేశారు మళ్లీ.

హమీద్ బ్రీఫ్‌కేస్ తీసుకొని పాసేజ్ వే వైపు వెళ్లాడు. టర్కీష్ ఆఫీస్ వర్కర్ అతడి బోర్డింగ్ పాస్‌ని తనఖీ చేసి విమానంలోకి అనుమతించాడు.

అతడికి కిటికీ పక్క సీటు దొరికింది.. ఎకానమీ క్లాస్ వెనుక వైపు. 'పది నెలలు దాటితే బిజినెస్ క్లాస్‌లో ప్రయాణం చేస్తాను' అనుకున్నాడు. అప్పటికి అతడి జీతం పెరుగుతుంది.

ఫ్లైట్ చక్రాలు గాల్లోకి లేచాయి. అమెరికా భూమి తన కంటినుండి దూరం అవుతోంది.. అతడి ఆలోచనలు గతంవైపు దూసుకు వెళ్లాయ్.

★ ★ ★

హమీద్‌ను.. సద్దాం హుస్సేన్.. ఇరాక్ కేబినెట్ నుంచి తప్పించి అప్పటికి అయిదు సంవత్సరాలు గడిచాయి. అతను గవర్నమెంట్‌లో రెండు సంవత్సరాలు వ్యవసాయ శాఖ మంత్రిగా పనిచేశాడు. ఆ టైమ్‌లో రెండు తడవలూ గోధుమ పంటలు దెబ్బతిన్నాయి. ప్రజా సైన్యం తినగా, దళారులు దోచుకోగా, ఇరాకీ ప్రజలకు మిగిలింది చాలా తక్కువ. ఎవరో ఒకరు నింద భరించాలి కదా.. అందరూ కల్సి హమీద్‌ని బలిపశువు చేశారు. హమీద్ తండ్రి 'ఈ రాజకీయాలెందుకురా? చక్కగా కార్పెట్ల వ్యాపారం చేసుకో' మని సూచించాడు. ఆ మాట వినకపోవడం వల్లనే ఈ దుష్పరిమాణాలన్నీ! అంతక్రితం వ్యవసాయ శాఖ తీసుకున్న మంత్రులిద్దరూ మాయమయ్యారు.. ఇరాక్‌లో మాయమయ్యారూ అంటే హత్యకు గురయ్యారన్నమాటే! కానీ హమీద్ ఛాలెంజ్‌గా వ్యవసాయశాఖ తీసుకున్నాడు. ఎప్పటికైనా వ్యవసాయమే దేశాభివృద్ధికి తొలిమెట్టు అని నమ్మాడతను.

సద్దాం హుస్సేన్ కూడా 'నా మిత్రుడు' అని గర్వంగా అందరిముందూ ప్రకటించేవాడు. కానీ పరిస్థితులు తారుమారయ్యాక, హమీద్ దేశాన్ని వదిలి పారిపోవటానికి సహకరించిన ఒకే మిత్రుడిని సద్దాం అనుచరులు హతమార్చారు. ఆ తర్వాత అతడి మిత్రులందరూ హత్యకు గురయ్యారు.. ఒ..క..రి..తర్వాత.. ఒ..క..రు.

అతడు తీసుకున్న ఒకే ముందు జాగ్రత్త.. ప్రతివారం బ్యాంక్ నుండి కేష్ డ్రా చెయ్యడం. ఆ డబ్బుని అమెరికన్ డాలర్స్‌గా మార్చడం.. కొద్దిగా. మరీ ఎక్కువగా మార్చితే అనుమానం వస్తుంది. ఇరాక్‌లో ప్రతి ఒక్కడూ.. గూ..ఢ..చా..రే.

అతడిమీద ఆరోపణలు, విచారణలు ప్రారంభమయ్యాక.. పరుపుకింద ఎంత సొమ్ముందో చూశాడు. దాదాపు పదకొండు వేల డాలర్లు వున్నాయి.

ఆ రోజు గురువారం. బాగ్దాద్‌లో సెలవుదినం. అతడు, గర్భిణీ భార్య .. ఎర్బిల్ వెళ్ళే బస్ ఎక్కారు, ఎవరి కంటా పడకుండా. అతడి మెర్సిడస్ కారుని ఒక పెద్ద యింటిముందు పార్క్ చేసినట్టు వదిలే



శాడు. వాళ్లు సామానేం తీసుకు వెళ్లలేదు తమ వెంట. పాస్‌పోర్ట్స్ మాత్రం వున్నాయి. భార్య గర్భిణీ పొట్టకింద.. డాలర్లు దాచారు.

బస్‌లో అదృష్టవశాత్తూ ఎవరూ గమనించలేదు. ఎర్బిల్ చేరాక ఇద్దరూ కల్సి టాక్సీలో సులేమానియా చేరుకున్నారు. మిగిలిన దీనార్లు డ్రైవర్‌కిచ్చారు. చిన్న హోటల్‌లో ఆ రాత్రి గడిపారు. మరుసటిరోజు బస్‌లో కుర్దిస్తాన్ కొండల్లోకి వెళ్లారు. ఆ సాయంత్రం జాకో చేరుకున్నారు.

ఆఖరి ప్రయాణం చాలా స్లోగా గడిచింది. కొండల్లో గాడిదలమీద ప్రయాణించారు. బోర్డర్ చేరుకున్నారు. ఒక కుర్దిష్ స్మగ్లర్ సహాయం చేశాడు. బోర్డర్ వద్దకు చేరుకున్నాక, నడకతో టర్కీ దేశంలోని ఒక చిన్న గ్రామానికి చేరుకున్నారు. నిద్రలేని రాత్రి గడిపాక, ఇస్తాంబుల్ వెళ్లే మొదటి రైలు ఎక్కారు.

టర్కీ రాజధాని వెళ్లేవరకు ట్రైన్‌లో గాఢ నిద్రపోయారు. దిగిన వెంటనే బ్యాంక్‌లో పదివేల డాలర్లు డిపాజిట్ చేశాడు. తర్వాత అమెరికన్ ఎంబసీకెళ్లి తన డిప్లొమేటిక్ పాస్‌పోర్టు సమర్పించి.. రాజకీయ ఆశ్రయం కల్పించమని కోరాడు. అతడి తండ్రి ఎప్పుడూ చెప్తూ వుండేవాడు.. అమెరికన్స్ ఇరాక్ మంత్రుల పట్ల సదభిప్రాయం కలిగివున్నారని.

ఎంబసీ వారు ఆ పూట మంచి గెస్ట్‌హౌస్ ఇచ్చారు. వాషింగ్టన్‌కి ఓ విషయం ఫోన్‌లో చెప్పారు వాళ్లు.. ఇరాక్‌లో చిన్న కూప్ జరిగిందని. అమెరికన్ అధికారులు హమీద్‌కి ప్రామిస్ చేశారు.. అమెరికన్ వీసా ఏర్పాటు చేస్తామని, ఆశ్రయం కల్పిస్తామనీ..

ఆ తర్వాత టర్కీ బజార్లలో తిరిగి విలువైన కార్పెట్లు కొనుగోలు చేశాడు.

అమెరికన్ వీసా వచ్చాక ఆ కార్పెట్లతో సహా న్యూయార్క్‌లో అడుగుపెట్టాడు. సి.ఐ.ఏ. వాళ్లు ఓ పట్టాన వదిలిపెట్టలేదు. అయిదురోజులు తీవ్రంగా ప్రశ్నించారు. హమీద్ ఇచ్చిన సమాచారం అమెరికాకు బాగా ఉపయోగకరం. అందుకే అతణ్ణి ఫ్రీగా వదిలారు. అతడు, భార్య.. కార్పెట్లతో సహా ట్రైన్ ఎక్కి మరో నగరం చేరారు.

అది ఆరంభం. ఆ కార్పెట్లు అమ్మి సొమ్ము చేసుకొని, మళ్లీ అదే కార్పెట్ల వ్యాపారం చేసి కోట్లు గడించాడు. పెద్ద అపార్ట్‌మెంట్ కొనుక్కున్నాడు. 'ఏదైనా సరే అమెరికాలో సాధ్యం' అంటూ వుంటాడు భార్యతో. అతడు.. సంపూర్ణ అమెరికన్ సిటిజన్. కేవలం ప్రవాస దేశీయులకిచ్చే నీలిరంగు పాస్‌పోర్టు మాత్రమే కాదు.. అతడు చాలా ధనవంతుడు కూడా. సద్దాం హుస్సేన్ బతికుండగా (ఈ కథ 1986లో జరిగింది) మళ్లీ ఇరాక్‌లో అడుగుపెట్టనని ప్రతిజ్ఞ చేశాడు. అతడి స్టేటస్‌ని, ఆశ్రయాన్నీ.. ఇరాక్ సవాల్ చేసింది. చివరకు డెత్ సెంటెన్స్ పాస్ చేశారు కూడా. అతను బాగ్దాద్‌లో మళ్లీ అడుగుపెట్టలేడు. పెడితే.. మ..ర..ణ.. శి..క్షే.

ఆలోచనల నుంచి తేరుకున్నాడతను.. లండన్‌లో ఆగాక.. విమానం ఇస్తాంబుల్ ఎయిర్‌పోర్టులో ఆగింది. అతను దిగి మార్కెట్‌కెళ్లి చాలా కార్పెట్లు కొనుగోలు చేశాడు. అక్కడే పదిహేను రోజులు గడిపాడు.

తిరుగు ప్రయాణం ఆరంభమయ్యింది. ఎప్పుడు అమెరికా వెళ్లి పిల్లల్ని చూద్దామా? అని తహతహలాడుతున్నాడు. హమీద్ పరిస్థితి చూసి ఫ్లైట్ అటెండెంట్ "తొందరపడకండి సార్... మీ ఫ్యామిలీని కొద్ది గంటల్లో కల్సుకోవచ్చు" అంది అమెరికన్ యాసలో. లంచ్ సర్వ్ అయింది. హమీద్ ఫ్లైట్‌లో వేసే సిన్మా పట్ల ఆసక్తి ప్రదర్శించలేదు. మత్తు ఆవహించిందతడ్ని. భవిష్యత్ గురించి బంగారు కలలు కంటూ గాఢనిద్రలోకి జారుకున్నాడు.

అప్పుడే.. సరిగ్గా అప్పుడే.. "లేడీస్ అండ్ జెంటిల్‌మెన్! దయచేసి జాగ్రత్తగా వినండి" అంటూ కెప్టెన్ గొంతు ఇంటర్‌కమ్‌లో వినపడింది.

"మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు విచారిస్తున్నాను. మన ఫ్లైట్ ఇంజన్‌లో చిన్న ప్రాబ్లమ్ వచ్చింది. భయపడాల్సిన పనేమీ లేదు. ఏవియేషన్ అధికార్లు దగ్గరలోని విమానాశ్రయంలో దిగిపొమ్మని ఆర్డర్ వేశారు. ఆ సమస్య తీరాక మళ్లీ బయలుదేరదాం"

హమీద్ అకస్మాత్తుగా నిద్రలేచాడు.

మళ్లీ కెప్టెన్ గొంతు వినబడింది "మనం విమానం నుండి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగాల్సిన (డిస్ ఎంబార్కింగ్) పని లేదు. ఎందుకంటే ఇది మన షెడ్యూల్ స్టాప్ కాదుగా. ఏమైనప్పటికీ మనం బాగ్దాద్ ఎయిర్‌పోర్ట్‌ని కూడా ప్రయాణంలో చూశామని కథలుగా చెప్పుకోవచ్చు"

వింటున్న హమీద్ మొత్తం శరీరం చెమటతో తడిసి ముద్దయింది. వణికిపోయాడు. తల ముందుకు తూలిపోయింది.

వెంటనే అటెండెంట్ వచ్చింది. "ఫర్వాలేదుగా సార్? " అంది నమ్రతగా, అతడి ఆందోళనను గమనించి.

అతడు బేలగా ఆమె కళ్లలోకి చూస్తూ అన్నాడు "నేను అర్జెంటుగా కెప్టెన్‌ని కలవాలి! అ..ర్జెం..టు..గా.

ఫ్లైట్ అటెండెంట్ అతడి పరిస్థితిని బాగానే అర్థం చేసుకుంది. వెంటనే అతణ్ణి ఫస్ట్‌క్లాస్ లాంజ్ గుండా ఫ్లైట్ డెక్‌లోకి తీసుకెళ్లారు.

ఆమె కాక్‌పిట్ డోర్‌ని తట్టి, తెరచి.. "కెప్టెన్! ఒక ప్రయాణికుడు మీతో అర్జెంటుగా మాట్లాడాలనుకుంటున్నాడు" అంది.

"రమ్మను" అన్నాడతను.

హమీద్‌ని కెప్టెన్ చూశాడు. హమీద్ వణికిపోతున్నాడు.

"నేను మీకు ఏవిధంగా సాయపడగలను సార్? " అన్నాడు కెప్టెన్.

"నా పేరు హమీద్.. నేను అమెరికన్ సిటిజన్ని. నేను బాగ్దాద్‌లో దిగితే.. నన్ను అరెస్ట్ చేస్తారు, హింసిస్తారు, చివరకు ఉరితీస్తారు.." అతడి మాటలు తడబడుతున్నాయ్. "నేనొక రాజకీయ బహిష్కృతుడ్ని.. వాళ్లు నన్ను చూసిన వెంటనే కాల్చేస్తారు కూడా.."

కెప్టెన్.. హమీద్ పరిస్థితిని వెంటనే అర్థం చేసుకున్నాడు. కో పైలెట్‌కి తన పని కూడా అప్పగించాడు. "నేను ఇతడితో మాట్లాడుతూ ఉంటా.. కిందనుంచి క్లియరెన్స్ వచ్చాక నన్ను పిలువు" అన్నాడు కెప్టెన్.. కో పైలెట్‌తో.

జరిగిన విషయమంతా పూసగుచ్చినట్లు వివరించాడు హమీద్.. కెప్టెన్‌కి. అంతా విన్నాక కెప్టెన్ నవ్వి "భయపడాల్సిన అవసరం లేదు సర్. విమానాన్ని ప్రయాణికులెవ్వరూ ఎట్టి పరిస్థితుల్లోనూ వదలరు. పాస్‌పోర్ట్ చెక్ చేయడం ఉండదు. ఇంజను ఒకసారి బాగయ్యాక తిరిగి వెళ్లిపోవడమే.." అన్నాడు.

బాగ్దాద్ ఎయిర్‌పోర్ట్ క్లియరెన్స్ ఇచ్చింది.. ఇరవై నిముషాలలో ఇరాక్ భూమి మీద లాండ్ అయింది విమానం.

హమీద్ వణుకు ఇంకా ఎక్కువైంది. విమానం చక్రాలు ఇరాక్ భూమిని తాక

గానే అతడు దాదాపు స్పృహతప్పాడు. కిటికీలోంచి చూశాడు.. ఆయుధాలు ధరించిన సైనికులు పహారా కాస్తున్నారు.. అతడు అల్లాని ప్రార్థించాడు.. జీసస్‌నీ ప్రార్థించాడు.. అమెరికా అధ్యక్షుడుగా ఉండిన రొనాల్డ్ రీగన్‌ని కూడా ప్రార్థించాడు.

పదిహేను నిమిషాల తర్వాత నిశ్శబ్దాన్ని చీలుస్తూ ఓ వ్యాన్ వచ్చి ఆగింది.

అందులోంచి ఇద్దరు ఇంజినీర్లు సామాన్ల సంచి మోసుకుంటూ దిగటం హమీద్ కంటపడింది. చిన్న క్రేన్ ఎక్కి విమానం రెక్కలోని ఇంజన్ బాగుచేయడం ప్రారంభించారు. కొన్ని ప్లేట్లు ఊడదీశాక, పని ఆపి మళ్లీ టెర్మినల్ వైపు వెళ్లారు.

హమీద్ రిలాక్స్‌గా ఫీలయ్యాడు. సీటు బెల్టుని సర్దుకుని కూర్చున్నాడు. అతడి గుండె కొట్టుకునే వేగం తగ్గింది. కొన్ని నిమిషాల వరకూ ఏం జరగలేదు. హమీద్ మళ్లీ టెన్షన్ పడ్డాడు. అప్పుడే కాక్‌పిట్ డోర్ తెరుచుకుంది. కెప్టెన్ తనవైపు నడుచుకుంటూ వచ్చాడు. అతడి ముఖంలో ఏదో సంశయం చోటు చేసుకుంది.

"మీరు మా ఫ్లైట్ స్టాఫ్‌తో కలవడం మంచిది" అని అతడి చెవిలో గొణిగాడు. హమీద్ భయంతో లేచి కెప్టెన్‌ని అనుసరించాడు. కాక్‌పిట్ తలుపు మళ్లీ మూసుకుంది.

కెప్టెన్ ఇలా అన్నాడు "ఇంజనీర్లు ప్రాబ్లమ్ ఎక్కడుందో కనుక్కోలేకపోయారు. గంట తర్వాత చీఫ్ ఇంజనీర్ వస్తాడు.. అందుకే విమానం అంతా ఖాళీ చేయాలని ఆదేశాలు వచ్చాయి"

'ప్లేన్ కూలిపోయి నేను చనిపోయినా బావుండేది' బరెస్ట్ అవుతూ అన్నాడు హమీద్.

"బాధ పడకండి మిస్టర్ హమీద్! మేం ఉపాయం కనుక్కున్నాం. మా ఫ్లైట్ స్టాఫ్ యూనిఫామ్ వేసుకోండి. తర్వాత మీరు మాతోపాటే ఉండొచ్చు. ఎవరూ మిమ్మల్ని పాస్‌పోర్ట్ అడగరు".

"ఎవరైనా నన్ను గుర్తుపడితే? " హమీద్ అన్నాడు భయంగా.

"మీరు మీసాన్ని తీసేయండి. తర్వాత ఫ్లైట్ ఆఫీసర్ యూనిఫామ్ ధరిస్తారు, నల్ల కళ్ళజోడు, పెద్ద టోపీ పెట్టుకుంటారు.. ఎవరూ గుర్తుపట్టరిక"

మీసాన్ని తీసేయడం, మేకప్ వేసుకోవడం క్షణాల్లో జరిగాయి. ప్రయాణికులు ముందు విమానం దిగారు. ఎయిర్‌పోర్టు బస్ వచ్చి వాళ్లని తీసుకెళ్ళింది.. ఇంకో వ్యాన్ వచ్చి స్టాఫ్‌ని ఎక్కించుకుంది. అందులో హమీద్.. వాళ్ల సంరక్షణలో ఒదిగి కూర్చున్నాడు. వ్యాన్ టర్మినల్ వైపు వెళ్లే కొద్దీ మరణానికి దగ్గరవుతున్నట్లు ఊహించుకోసాగాడు.

సెక్యూరిటీ గార్డ్ విమానపు సిబ్బందిని పట్టించుకోలేదు. ఓ పెద్ద హాలులో సిబ్బందిని అంతా కూర్చోబెట్టారు. అక్కడే హాలుకున్న గోడపై 'సద్దాం హుస్సేన్' యూనిఫామ్ ధరించి.. చేతిలో కలాషినికోవ్ తుపాకీతో వున్న నిలువెత్తు ఫొటో వేలాడుతోంది. హమీద్ ఆ ఫొటోవంక భయంగా చూశాడు.

ఇంకో విమానం సిబ్బంది కూడా అక్కడే కూర్చుని వున్నారు. హమీద్ వాళ్లతో మాటలు కలపలేదు.

"వాళ్లు ఫ్రెంచ్ విమానపు సిబ్బంది" అన్నాడు పైలెట్. ఫ్లైట్ అటెండెంట్.. ఫ్రెంచ్ కెప్టెన్‌తో మాట్లాడటానికి ప్రయత్నించింది. వాళ్లు న్యూఢిల్లీ మీదుగా సింగపూర్ వెళ్ళబోతున్నారట.

అప్పుడే సాద్-అల్-టక్రిటీ రావడం హమీద్ చూశాడు. అతడి గుండెల్లో రాయి పడింది. టక్రిటీ.. సద్దాం హుస్సేన్ వ్యక్తిగత సంరక్షకుడు. ఇప్పుడు ఎయిర్‌పోర్ట్ సిబ్బందికి లీడర్ అతనే!

"చీఫ్ ఇంజనీర్ విమానాన్ని తనిఖీ చేస్తున్నాడు. మనమిక్కడ ఎక్కువసేపు ఉండం" ధైర్యం చెపుతూ అన్నాడు పైలెట్.

అప్పుడే వెళుతున్నవాడల్లా టక్రిటీ వెనక్కి తిరిగొచ్చి హమీద్ వంక తేరిపార చూశాడు. మళ్లీ వెంటనే పక్కగదిలోకి వెళ్ళిపోయాడు.

"వాడు నన్ను గుర్తుపట్టాడు" అన్నాడు హమీద్ కెప్టెన్‌తో.

అతడి మేకప్ కరిగిపోయి పెదాలపై కారసాగింది.

మళ్లీ టక్రిటీ తిరిగొచ్చి.. "విమానపు బృందమంతా పాస్‌పోర్ట్సు చూపించండి" అన్నాడు. హమీద్‌కి..స్పృహ తప్పుతోందా? .. అనిపిస్తోంది.

"నేను పాస్‌పోర్ట్స్ తనిఖీ చేసేవరకు ఎవరూ బయటికెళ్లవద్దు" ఆదేశించాడు. పధ్నాలుగు పాస్‌పోర్ట్స్ టేబుల్‌పైకి చేరాయి. అతడు ఒక్కోదాన్ని తీరిగ్గా పరీక్షిస్తున్నాడు..అంతా చూశాక "నేను పదిహేను మందిని లెక్కపెట్టాను.. ఇంకో పాస్‌పోర్ట్ ఏదీ? " .. గయ్‌మన్నాడు.

"మీరు పొరబడ్డారు. మేం పధ్నాలుగు మందే" అన్నాడు కెప్టెన్.

"అయితే ఎవరి పాస్‌పోర్ట్ వారు తీసుకోండి.. ఒక్కొక్కళ్లనీ చెక్ చేస్తాను"

"సార్.. ఇది అంతర్జాతీయ విమాన ప్రయాణ నియమాలకు విరుద్ధం" అన్నాడు కెప్టెన్.

"ఇరాక్‌లో నియమాలేవీ వుండవు"

ఇంతలో సిబ్బంది అంతా లేచి హాలులో అటూ ఇటూ తిరగసాగారు. గట్టిగా మాట్లాడుతూ శబ్దం చేయసాగారు.

అతడు విసుగ్గా "అందర్నీ కూర్చోమని చెప్పండి.. నేను లెక్కపెట్టాలి " అన్నాడు. ఇంతలో ఫ్రెంచ్ విమాన సిబ్బంది విమానానికి క్లియరెన్స్ వచ్చింది. వాళ్లు హడావుడిగా లేచి వెళ్ళసాగారు.. మళ్లీ గజిబిజి..

టక్రిటీ తికమకపడ్డాడు.

ఫ్రెంచ్ విమాన సిబ్బంది వెళ్ళాక లెక్కబెడితే, పధ్నాలుగు మందే వున్నారు.. "ఓ.. షిట్! ఇక్కడో వ్యక్తిని చూశాను. మీసం లేదు. మేకప్..పెదాలపై కారిపోతూ వుంది.. వాడేడీ? " అరిచాడతడు.

"అంటే.. మా కో పైలెట్టా" అన్నాడు కెప్టెన్.

"కాదు.. అరబ్‌లా వున్నాడు"

"మా విమానంలో అరబ్‌లు ఎవరూ లేరు"

అతడు వెంటనే ఫ్లైట్ అటెండెంట్ వైపు తిరిగి అన్నాడు "నీ పక్కన భయపడుతూ కూర్చున్నాడే..ఏడీ.. వాడు..? "

"నా పక్కన.. ఫ్రెంచ్ విమాన కెప్టెన్ వున్నాడు" అనేసి నాలిక కరుచుకుంది ఆమె. జరిగిన పొరపాటు అప్పుడు గ్రహించాడు. వెంటనే పరుగున మెట్లు దిగి.. అక్కడే వున్న జీప్ ఎక్కి "బయలుదేరబోతున్న ఫ్రెంచ్ విమానంవైపు పోనీయ" మన్నాడు. జీప్ ఆఘమేఘాలపై బయలుదేరింది. అప్పటికే విమానం కదిలింది. జీప్.. విమానానికి సమాంతరంగా ప్రయాణిస్తోంది. ఫ్లైట్‌ని ఆపమని చేతుల్తో ఆదేశించాడు టక్రిటీ. ఫ్రెంచ్ విమానపు పైలెట్ శాల్యూట్ చేశాడు.. విమానం గాల్లోకి ఎగిరింది..

క్షేమంగా మళ్లీ అమెరికా భూమిపై అడుగుపెట్టాడు హమీద్. పునర్జన్మ..

"ఇంత లేటయ్యిందేమిటీ డాడీ? " అన్నాడు కొడుకు.

పిల్ల మళ్లీ ఏడవటం ప్రారంభించింది..మీసంలేని తండ్రిని చూసి.. ఎవరో ఆగంతకుడనుకొని.

V

భారతీయ ఆంగ్ల కథ



ఆ దొంగ కథ

-రస్కిన్‌బాండ్

అనువాదం : ఎ.వి.రెడ్డిశాస్త్రి

నేను అనిల్‌ని కలిసిన్నాటికి యింకా దొంగనే. అప్పటికి నా వయస్సు పదిహేనేళ్లే. అయినప్పటికీ దొంగతనం చెయ్యడంలో బాగా ఆరితేరిపోయాను. నేను దగ్గరికి వచ్చేటప్పటికి అనిల్ కుస్తీ పోటీ చూస్తున్నాడు. అతనికి యిరవై అయిదు సంవత్సరాల వయస్సు వుండవచ్చు. సన్నగా, పొడవుగా వుండి సరదాగా కాలం గడిపే రకంలా కనపడ్డాడు. జాలి గుండె మనిషి అనిపించింది. అంచేత నేను వేసుకున్న పథకం నెరవేరే అవకాశం వుంది. ఈ మధ్యని అదృష్టం బొత్తిగా కలిసిరావడంలేదు. ముందు యితగాడి నమ్మకాన్ని సంపాదించగలిగితే- ఆ తర్వాత మిగిలిన కార్యక్రమం. "మీరు కూడా కుస్తీలు పట్టే వస్తాదులా అనిపిస్తున్నారు" అన్నాను. సంభాషణ ప్రారంభించడానికి.. పొగడ్తకి మించిన ఉపాయం మరొకటి లేదు.

"నువ్వు కూడా వస్తాదులాగే కనిపిస్తున్నావు" అని సమాధానం చెప్పేడు అనిల్. ఈ జవాబు విని క్షణంపాటు విస్తుపోయాను. ఏంచేతనంటే- ఆ సమయంలో నేను ఎముకలు కూడా కనిపిస్తున్నంత సన్నగా వున్నాను. "మీరన్నదీ నిజమే సార్! నేనూ అప్పుడప్పుడు కుస్తీలు పడుతూ వుంటాను" అన్నాను చాలా అణకువగా.

"నీ పేరేమిటి? "

"హరిసింగ్" అబద్ధం చెప్పేను. నెలనెలకీ నాకో కొత్తపేరు- నేను పోలీసులకీ, పాత యాజమానులకీ దొరక్కుండా తప్పించుకోడానికి.

మా సంభాషణ ముగిసింది. అనిల్ కుస్తీపడుతున్న వస్తాదుల్ని చూస్తూ ఏవో వ్యాఖ్యలు జేస్తున్నాడు. వొంటికి బాగా నూనె పట్టించిన ఆ వస్తాదులు ఆయాసంతో రొప్పుతూ, మూలుగుతున్నప్పడల్లా అనిల్ వ్యాఖ్యలు కొనసాగుతున్నాయి. నాకు మాట్లాడ్డానికి పెద్దగా ఏదీ కనబడ్లేదు. అనిల్ అక్కడ్నుంచి వెళ్లిపోతున్నాడు. నేనతన్ని అనుసరించేను. నన్ను చూసి "ఏవిటి మళ్లీ? " అన్నాడు అనిల్.

ప్రయత్నపూర్వకంగా ఓ మంచి నవ్వు నవ్వి "మీ దగ్గర పనిచెయ్యాలని వుంది" అన్నాను.

"కానీ నేను డబ్బు యివ్వలేనే!"

ఒక్కక్షణం ఆలోచన్లో పడ్డాను- సరైన మనిషిని ఎంచుకోలేదేమోనని.

"పోనీ నాకు భోజనం పెట్టగలరా? "

"నువ్వు వంట చెయ్యగలవా? "

"ఓ.. చెయ్యగలను".. మళ్లీ మరో అబద్ధం.

నన్ను తన గదికి తీసుకువెళ్లేడు. జమునా మిఠాయి షాపుపైన మేడమీద వుంది ఆ గది. నేను వరండాలో పడుకోవచ్చునని చెప్పేడు.

ఆవేళ రాత్రి నేను చేసిన వంట పరమ అధ్వానంగా వుండివుండాలి. ఎందుకంటే, మొత్తం భోజనాన్నంతటినీ వీధికుక్కకి పడేశాడు అనిల్. ఆ తరువాత నన్ను పొమ్మన్నాడు. అయినా నేను అక్కడే తచ్చాడుతూ వుండిపోయేను.. ఎంతో వినయంగా చిరునవ్వు లొలికిస్తూ. దాంతో అతను కూడా నవ్వకుండా వుండలేకపోయాడు. తర్వాత నా తలని తాకుతూ- "ఫర్వాలేదులే- వంట ఎలా చెయ్యాలో నేను నేర్పుతాను" అన్నాడు.

అనిల్ దగ్గర పనిచెయ్యడం చాలా సరదాగా వుండేది. పొద్దున టీ చేసేవాడ్ని. ఆ తరువాత రోజుకి అవసరమయ్యే సరుకుల్ని తీరిగ్గా తిరిగి కొనేవాడ్ని. సరుకుల్ని కొనడంలో నాకో రూపాయి లాభం వచ్చేది. నేను ఈ రకంగా డబ్బులు తస్కరిస్తున్నానని అనిల్ గ్రహించే వుంటాడు. కానీ యిలాంటి చిన్న విషయాలు పట్టించుకునే రకం కాదు అతగాడు.

అనిల్‌కి వున్నట్టుండి వూడిపడుతూ వుంటుంది డబ్బు. ఈ వారం అప్పులు చేస్తాడు- పైవారం అడిగిన వాళ్లకి బదుళ్లు యిస్తూ వుంటాడు- అలా వుంటుంది అతని రాబడి. 'మళ్లీ ఎప్పుడు చెక్కు వస్తుందా'అని ఆత్రంగా నిరీక్షిస్తూ వుంటాడు. చెక్కు వచ్చీరాగానే బయటికి వెళ్లి ఆనందంగా ఖర్చు పెట్టేస్తాడు. ఆ డబ్బునంతట్నీ అతగాడు పత్రికలకి రాసి సంపాదిస్తూ వుంటాడట. తమాషాగా అనిపించింది.. ఈ రకంగా కూడా డబ్బు సంపాదించగలగడం.

ఓ రోజు సాయంత్రం నోట్ల బొత్తిని పట్టుకొని ఇంటికొచ్చేడు అనిల్. తను రాసిన పుస్తకాన్ని ఎవరో పబ్లిషర్‌కి అమ్మేనని చెప్పేడు. ఆ డబ్బంతట్నీ పరుపుకింద దాస్తూ ఉండడం నా కళ్లపడింది.

ఇంచుమించు ఆరునెలలబట్టి అనిల్ దగ్గర పనిచేస్తున్నానా.. రోజువారీ సరుకులు కొనడంలో మిగుల్చుకుంటున్న కాస్తో కూస్తో తప్పిస్తే, నా వృత్తిపరమైన దొంగతనం ఏదీ యింతవరకూ చెయ్యలేకపోయాను. దర్జాగా దొంగతనం చెయ్యడానికి అన్ని అవకాశాలూ వున్నాయి. ఇష్టమొచ్చిన దగ్గరికి వెళ్ళి యిష్టమొచ్చినప్పుడు తిరిగి రావడానికి నాకు పూర్తి స్వేచ్ఛ యిచ్చేడు అనిల్. అతనిలా మనుషుల్ని నమ్మే వ్యక్తుల్ని నేనింతవరకూ చూడలేదు. అంచేత అతనిలాంటి వాడిదగ్గర దొంగతనం చెయ్యడం అంటే ఎందుకో చాలా కష్టం అనిపిస్తోంది. పిసినారి మనుషుల దగ్గర దొంగతనం చెయ్యడం బహు సులువు. అలాంటివాడి దగ్గర దొంగతనం చేసినా వాడికేం పెద్దగా నష్టం కలగదు. అనిల్‌లాంటి పట్టించుకోని వ్యక్తి దగ్గర దొంగతనం చెయ్యడం యిబ్బందిగా వుంటుంది. తన డబ్బు చోరీ అయినట్టు అతను గమనించను కూడా గమనించడు. అలాంటివాడి దగ్గర దొంగతనం చేస్తే ఏం థ్రిల్ వుంటుంది?

కానీ ఏదో ఒక దొంగతనం చెయ్యాలి- తప్పదు. లేకుంటే అలవాటు తప్పిపోయేటట్టు కనిపిస్తోంది. నేనుగానీ అనిల్ డబ్బుని దొంగిలించకపోతే, ఏమవుతుంది? అనిల్ దాన్ని తిన్నగా తీసుకెళ్ళి స్నేహితులతో గడిపి ఖర్చు పెట్టేస్తాడు. ఇంతకీ, తన దగ్గర పనిచేస్తున్నందుకు- నాకు అతగాడేమీ జీతం యివ్వడంలేదు కదా!

అనిల్ నిద్రపోతున్నాడు. వెన్నెల.. బాల్కనీని దాటుకొని, గదిలోకి ప్రవేశించి, అతనిమీద పడుతోంది. నేను లేచి కూర్చుని పరిస్థితుల్ని మదింపు వేస్తున్నాను. డబ్బుని దొంగలించగలిగేనా.. రాత్రి పదిన్నరకి బయలుదేరే లక్నో ఎక్స్

ప్రెస్‌ని అందుకోగల్ను. కప్పుకున్న దుప్పటిని తీసిపారేసి మెల్లగా పాకుకుంటూ అతగాడి మంచం దగ్గరకి చేరుకున్నాను. అనిల్ ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ముఖం నిర్మలంగా, ఏ బాధలూ లేనట్టుగా కనిపిస్తోంది. ఆ మాటకొస్తే నా ముఖంనిండా బోలెడు గీతలున్నాయి. అనిల్ మాత్రం ప్రశాంతంగా నిద్రపోతున్నాడు.

నా చేతిని లాఘవంగా పరుపు కిందకి దొనిపి, నోట్లకోసం తడిమేను. అవి నాకు దొరగ్గానే- చడీచప్పుడు కాకుండా వాటిని బయటికి లాగేను. నిద్రపోతున్న అనిల్.. ఎందుకో ఓ నిట్టూర్పు విడిచి- నా వైపుకి తిరిగి పడుకున్నాడు. నేను తుళ్ళిపడ్డాను. త్వరత్వరగా పాకుకుంటూ గది నుండి బయటపడ్డాను.

రోడ్డుమీదికి వచ్చాక పరుగు ప్రారంభించాను. నా నడుం దగ్గర నోట్లని వుంచి, నా పైజామా బొందుతో గట్టిగా బిగించేను. పరుగు ఆపి, నడుస్తూ, వేళ్లని కదిపి నోట్లని లెక్కపెట్టేను. ఏభై రూపాయల నోట్లు ఆరువందలు వున్నాయి. బలే దోపిడీ! ఒకటి రెండు వారాలపాటు అనిల్ డబ్బుతో నేను పులిసిఉన్న అరబ్బులా గడపొచ్చు.

స్టేషన్ చేరాక, టిక్కెట్టు తీసుకోవడానికి బుకింగ్ ఆఫీస్ దగ్గరికి వెళ్ళలేదు. జీవితంలో ఏనాడూ నేను టిక్కెట్టు కొనలేదు. తిన్నగా ప్లాట్‌ఫాం మీదికి పరుగెత్తాను. లక్నో ఎక్స్‌ప్రెస్ అప్పుడే కదుల్తోంది. రైలు ఇంకా వేగాన్ని అందుకోలేదు. నేను సులువుగా బండిలోకి ఎక్కేసి వుండగలిగేవాడ్ని. ఎందుకనో తటపటాయించేను- కారణం తెలీకుండానే. పారిపోడానికి అవకాశం చెయ్యిజారిపోయింది. రైలు వెళ్ళిపోయింది. మనుష్య సంచారంలేని ప్లాట్‌ఫాం మీద నిలబడి వున్నాను. రాత్రి ఎక్కడ గడపాలో తెలీలేదు. నాకు స్నేహితులెవ్వరూ లేరు. స్నేహితులుంటే చికాకులు వస్తాయని.. ఎవరితోనూ స్నేహం చెయ్యలేదు. స్టేషన్‌కి దగ్గరగా వున్న ఏదైనా చిన్న హోటల్లో రాత్రికి బస చేస్తే? అనవసరపు అనుమానాలు కలగొచ్చు. నాకు బాగా తెలిసిన ఒకే ఒక వ్యక్తి.. నేను కొద్దిసేపటి కిందటే దోచుకున్న అనిల్!



బజార్లోంచి మెల్లిగా నడుస్తున్నాడు. దొంగతనం చెయ్యడం నేర్చుకున్నాను కదా.. మనుషులు తమ తమ వస్తువుల్ని పోగొట్టుకున్నప్పుడు కనపరిచే హావభావాల్ని గమనించడం అలవాటయిపోయింది. పిసినారివాళ్ళు భయంతో గడగడ వణికిపోతుండడం గమనించేను. డబ్బున్న వాళ్ళయితే గొప్ప కోపాన్ని ప్రదర్శిస్తారు. అదే పేదవాళ్లయితే- 'పోయింది- మరేం చేస్తాం' అన్నట్టు నిరాసక్తిగా ముఖం పెడతారు. కానీ దొంగతనం జరిగినట్టు గమనించేక అనిల్ ముఖం ఎలా వుంటుందో నేను వూహించగలిగేను. అతని ముఖంలో విచారం కనిపిస్తోంది, డబ్బు పోయినందుకు కాదు- తన నమ్మకం వమ్మయిపోయినందుకు.

మైదానంలోకి వచ్చాను. అక్కడొక బెంచీ మీద కూర్చున్నాను. రాత్రి బాగా చలిగా వుంది- ఇంకా నవంబరు నెల మొదటి రోజులే అయినా, చిన్న జల్లు కూడా కురుస్తోండడంతో మరింత ఇబ్బం

దిగా వుంది. ఇంతలో వాన పెరిగింది. నా చొక్కా పైజామా వంటికి అతుక్కుపోయినట్టు కనిపిస్తున్నాయి. చలిగాలి వర్షాన్ని నా ముఖంమీదకి కొడుతోంది.

మళ్లీ బజార్లోకి వచ్చేను. గంట స్తంభం దగ్గర వున్న షెడ్డులో కూర్చున్నాను. బిచ్చగాళ్లు. యిల్లూ వాకిలీ లేనివాళ్లు ఆ షెడ్డులో నిద్రపోతున్నారు..దుప్పట్లకింద ముణుచుకొని. వాచీ అర్థరాత్రిని చూపిస్తోంది. నోట్లని తడిమి చూసుకున్నాను. వర్షానికి తడిసి ముద్దయిపోయాయి.

ఆ డబ్బంతా అనిల్‌ది. తెల్లవారింత ర్వాత అతగాడే బహుశా నాక్కొంచెం డబ్బిచ్చి, 'సినిమాకి వెళ్లమ'ని అని వుండేవాడేమో! కానీ యిప్పుడు మొత్తం డబ్బంతా నా దగ్గరే వుంది. ఇంక వంట చెయ్యడాలు, బజారుకెళ్ళి సరుకులు తేవడాలు, పెద్ద పెద్ద వాక్యాలు రాయడాలు- యిలాంటివేవి వుండవు.

వాక్యాలు రాయడం సంగతే మరచిపోయాను..యీ దొంగతనం హడావిడిలో. వాక్యాలు రాయగలగడం నేర్చుకుంటే- వందలకొద్దీ రూపాయిలు సంపాదించవచ్చు. దొంగతనాలు చెయ్యగలగడం చాలా చిన్న విషయం. ఒక్కొక్కప్పుడు దొరికిపోతుండడం జరుగుతూ వుంటుంది.

కానీ నిజంగా గొప్పవాడు కాగలగడం- అందరూ గుర్తించడం- గౌరవించడం- అది చాలా కష్టమయిన విషయం.

అనిల్ దగ్గరకి తిరిగి వెళ్ళిపోవాలి. కనీసం.. రాయడం, చదవడం, నేర్చుకోడానికేనా అనిల్ దగ్గరకి వెళ్లిపోవాలి.

త్వరత్వరగా గదికి పరుగెత్తేను- బాగా భయపడిపోతూనే. దొంగిలించడం చాలా సుళువే- కానీ దొంగిలించిన వస్తువుని ఎవరికీ తెలియకుండా మళ్లీ యధాస్థానంలో వుంచేయగలగడం చాలా కష్టం.

మెల్లగా తలుపు తెరచి ద్వారం దగ్గర నిలబడ్డాను. మేఘాలవల్ల వెన్నెల మసక బారిపోయింది. అనిల్ యింకా నిద్రపోతూనే వున్నాడు. మంచం దగ్గరికి పాకుకుంటూ వెళ్లేను.

నా చేతిలోని నోట్లని అతని పరుపుకింద తిరిగిపెడ్తున్నప్పుడు ..అతని వూపిరి నా చేతికి తగిలింది. ఒక్కక్షణం నిశ్చలంగా వుండిపోయాను. తరువాత మెల్లగా నోట్లని పరుపుకింద పెట్టేశాను.

మర్నాడు బాగా పొద్దెక్కింది నేను లేచే టప్పటికి. అనిల్ అప్పటికే టీ తయారు చేశాడు. అతను చెయ్యి చాపేడు నా ముందుకి. అతని వేళ్లమధ్య ఓ యాభైరూపాయిల నోటు వుంది. నా మనస్సు ఒక్కసారి కుంగిపోయింది.. నేను దొరికిపోయాననిపించి.

"నిన్న కొంచెం డబ్బు సంపాదించేను" అన్నాడు అనిల్. "ఇక నుంచీ నీకు జీతం యిస్తుంటాను" అన్నాడు.

నాకు ఉత్సాహం తిరిగి వచ్చింది. నోటు తీసుకుంటూ గమనించేను- అది తడిగానే వుంది, రాత్రి వానకి తడియడం వల్ల. "ఇవాళ నుంచి వాక్యాలు రాయడం మొదలుపెడదాం" అన్నాడు అతగాడు.

అతనికి తెలిసిపోయింది. కానీ అతని కళ్లు గానీ పెదవులు గానీ.. దేన్నీ బయటకి తెలియనివ్వటం లేదు.

అనిల్‌ని చూస్తూ నవ్వేను. ఈసారి నా నవ్వు ప్రయత్నపూర్వకంగా వచ్చింది కాదు. దానంతటి అదే వచ్చింది, నా ప్రయత్నం లేకుండా.

తెలుగు కథ



గుమ్మా ప్రసాదరావు



వజ్రాలు

"అది గాంభీర్యం అని ఎందుకనుకోవాలి? గర్వం అని ఎందుకు అనుకోకూడదు? ఆరునెల్లు విదేశాల్లో ఉండి తిరిగి వచ్చిన గర్వంగా మీ సిబ్బందికి కనిపించి ఉంటుంది. దాన్నివారు గాంభీర్యం అని పొరపడి ఉంటారు" అన్నాడు ఆ ఆసామి.

"మీతో వాదన నాకనవసరం. అది గాంభీర్యమో, గర్వమో కొద్దిక్షణాల్లో తేలిపోతుంది. ముందుగా మిమ్మల్ని, మీ బ్రీఫ్‌కేసును తనిఖీ చేయనివ్వండి" అన్నాడు సౌమ్యంగా కస్టమ్స్ అధికారి విమానాశ్రయంలో గేటువద్ద అతనితో.

"నేను చాలా పెద్దమనిషిని. నా పేరు రాజగోపాలరావు. ఈ చుట్టుపట్ల నాలుగు జిలాల్లో నా వ్యాపారాలున్నాయి. కలెక్టర్లు కూడా నాకు సలాములు చేస్తారు"

"సారీ, మీరేమైనా, మీరెవరైనా నా కర్తవ్యం నాది. అందుకు మీ పేరుప్రఖ్యాతులతో నాకెలాంటి సంబంధం లేదు. ఈ విమానంలో వజ్రాలతో ఒకరు ఎక్కారని మాకందిన సమాచారం. అనుమానం మీ మీద ఉంది" కస్టమ్స్ అధికారి అన్నాడు.

"చూడండి, మీకు అధికారాలు ఉన్నాయని అంగీకరిస్తున్నాను. అయితే పెద్దా చిన్నా అంతరం లేకుండా సోదాచేస్తే మా పరువేం కావాలి? " అంటూ రాజగోపాలరావు సిగరెట్టు కేసు తీశాడు. అది నిండుగా ఉంది. ఒకటి తీసుకొని ఆ కేసు కస్టమ్స్ అధికారి వేపు అందించాడు. "ప్లీజ్ తీసుకోండి" అన్నాడు.

"నో, థాంక్స్"

రాజగోపాలరావు సిగరెట్టు కేసుని జేబులో పెట్టుకుని, లైటరుతో సిగరెట్టు అంటించి "ఆశ్చర్యంగా ఉందే! మీకు సిగరెట్టు అలవాటు లేదా? ఇవి విదేశీ సరుకు. చాలా ఖరీదైనవి. మన కరెన్సీలో ఒక్కోటి పాతిక రూపాయలుంటుంది"


"నేను సిగరెట్లు కాల్చనలేదు. అయితే డ్యూటీలో ఉండగా కాల్చను".

"అలాంటి నిగ్రహం అందరికీ ఉండదు. స్మగ్లింగు జరుగుతోందని నాకు తెలుసు. ఈ విమానంలో నాతోపాటు అరవైమంది ఉన్నారు. చాలామంది ఇక్కడే దిగారు. నన్నే ఎందుకు అనుమానిస్తున్నారు? "

"మేం అందర్నీ అనుమానిస్తాం. అయితే ఈ వజ్రాల స్మగ్లింగు చేస్తున్నది మీరేనని మాకు అనుమానం ఉంది".

"కారణం? " రాజగోపాలరావు ఆ సిగరెట్టు పూర్తిగా కాలిపోతే దాన్ని డస్ట్‌బిన్‌లో పారేసి మరొకటి అంటించాడు. యధాలాపంగా అతని వేపు చెయ్యి చాపి వెంటనే వెనక్కు తీసుకుంటూ "సారీ, మీరు డ్యూటీలో కాల్చనన్నారుగా? " అన్నాడు.

"కారణాలు మీకు చెప్పవలసిన అవసరం లేదు రాజగోపాలరావుగారూ! రైలులో టిక్కెట్టు లేకుండా ప్రయాణం చేసేవాడు అల్లంత దూరాన టిక్కెట్టు కలక్టర్ని చూసి గతుక్కుమంటాడు. ఆ చర్య అసంకల్పితం,



టిక్కెట్టు ఉన్నవాడు భయపడడు. దొంగతనం చేసేవారే గిల్టీగా ఫీలవుతారు".

"అదిగో! మళ్లీ నన్ను దొంగనంటున్నారు. నా ముఖం మీద దొంగ అని రాసి ఉందా? ఈ వేషభాషల్లో నేను మీ కంటికి దొంగగా కనిపిస్తున్నానా? "

★ ★ ★

"నన్ను దొంగననడానికి మీ వద్ద ఆధారాలు ఏమున్నాయి? ".. అప్పుడతను మూడో సిగరెట్టు ముట్టించాడు. "నా ఎదుటి వ్యక్తి సిగిరెట్టు తాగకుండా నేను తాగడం నాకు బాధగా ఉంది. డ్యూటీలో తాగకూడదని మీ నియమం. మిమ్మల్ని అభినందిస్తున్నాను. నా దగ్గర ఇంకా ఏభై పెట్టెలు ఉన్నాయి. రేపు మీ ఆఫీసుకి ఇరవై పంపుతాను మా డ్రైవరు చేత. మీ పేరు చెప్పండి"

"నా పేరు స్వామినాథన్, ఐ.పి.ఎస్. నాకు మీరేం పంపనక్కరలేదు. ముందు ఆ పెట్టి తాళం తీయండి"

"స్వామినాథన్‌గారూ! మళ్ళీ మొదటికే వచ్చారు. దాని తాళంచెవి నా పొరపాటు వల్ల పోయింది. ఆమాట మీ వాళ్లకూ, మీకూ చెప్పాను. నన్ను నమ్మరేం? "

"నమ్ముతాను. అయినా ఆ బ్రీఫ్‌ను సోదా చెయ్యడం మా కర్తవ్యం. మీరు స్వయంగా తాళం తియ్యకపోతే పెట్టెను బద్దలుకొట్టవలసి వస్తుంది"

"ఏమన్నారు? ఈ బ్రీఫ్ కేసు ఈ ఊరి సంతలోని సరుకు కాదు, ఇంపోర్టెడ్. చాలా ఖరీదైనది. ఇది నా ప్రాణం. దీన్ని బద్దలు కొడితే నేను సహించలేను"

★ ★ ★

"ఈ బ్రీఫ్‌కేసు మన మెట్రోలలోనూ దొరకదు. అయిదువేలు చేస్తుంది. ఇంత ఖరీదైన బ్రీఫ్‌ను మీరు బద్దలు కొట్టాలని ఎందుకనుకుంటున్నారు? నేను దొంగను కానంటే నమ్మరేం? ".. రాజగోపాలరావు ఏడో సిగరెట్టు అంటించాడు.

"పట్టుబడేవరకు దొంగలూ దొరలే! రాజగోపాలరావుగారూ, ఉత్తరాంధ్రలో మీ వ్యాపారాలు జోరుగా సాగుతున్నాయని మాకు తెలుసు. కలెక్టర్లు కూడా మీకు సలాములు చేస్తారని తెలుసు. కోటీశ్వరులైన మీరు అయిదువేల ఖరీదు చేసే బ్రీఫ్ కేస్ బద్దలు చేస్తామంటే భయపడుతున్నారెందుకు? ఆ డబ్బు మీకు లక్ష్యం కాదు. ఏదో దాచి తెస్తున్నారు. అది మాకంటబడితే మీరు కటకటాల వెనుక ఉంటారు".

రాజగోపాలరావు నిరుత్తరుడయ్యాడు. సిగరెట్టు కాల్చాలన్న ధ్యాస పోయింది. స్వామినాథన్ అతని ముఖ కవళికలు గమనిస్తున్నాడు. చేరువలో ఇద్దరు, ముగ్గురు కస్టమ్స్ అధికారులు మఫ్టీలో ఉన్నారు. వారివంక చూస్తున్నాడు.

"స్వామినాథన్‌గారూ! మీరే గెలిచారు. ఈ బ్రీఫ్‌లో వజ్రాలున్న మాట నిజం. ఆరు వజ్రాలున్నాయి. మీకు రెండు ఇస్తాను. కొన్ని కోట్ల విలువ చేస్తాయి. మీరు నిజాయితీగా ఎంతకాలం పనిచేసినా కోటీశ్వరుడు కాలేరు. ఇది మీకు సమ్మతమేనా? " అన్నాడు రాజగోపాలరావు.

"శభాష్! మా దారికి వచ్చారు. వజ్రాలు స్మగుల్ చేసినట్లు ఒప్పుకున్నారు. నేను లంచగొండిని కాను. నిజాయితీ నా జీవిత లక్ష్యం. ఆ వజ్రాలు ఇచ్చి నాతో స్టేషనుకు పదండి" అన్నాడు స్వామినాథన్.

రాజగోపాలరావు భళ్లున నవ్వాడు.

అతడలా ఎందుకు నవ్వాడో స్వామినాథన్‌కు అర్థం కాలేదు.

"నా మాట నిజమేనని నమ్మేశారా? మీ నిజాయితీని పరీక్షించాలని ఆరు వజ్రాలున్నాయని అన్నాను"

"అంటే మీ దగ్గర లేవనా? "

"ఊ! ఈ బ్రీఫ్‌కేసే కదా అనుమానానికి హేతువు. ఒక పని చెయ్యండి. నేను మీతోపాటు స్టేషనుకి వస్తాను. అక్కడ దీనికి మనం ఇద్దరం సీలు వేద్దాం. ఇది మీ కస్టడీలో ఉంటుంది. వారం పదిరోజుల్లో మారుతాళం తెప్పిస్తాను. మీ సమక్షంలో తెరుద్దాం. అప్పుడు మీ అనుమానం పటాపంచలవుతుంది."

"శభాష్! నాటకం రక్తికట్టేలా ఆడేరు. ఆ బ్రీఫ్‌లో వజ్రాలు లేవని నాకు తెలుసు".

"తెలిసి.. ఇంతసేపు నన్నెందుకు దోషిలా నిలబెట్టారు? నాకు ఒక్కొక్క నిముషం ఎంతో విలువైనది. పోనీలెండి మీలాంటి నిజాయితీగల అధికారితో మాట్లాడేనన్న సంతృప్తి ఉంది. ఇంక నేను వెళ్ళనా? "

"రాజగోపాలరావుగారు, అప్పుడేనా? ఆ సిగరెట్టు కేసు ఇలాగివ్వండి"

"ఏం సిగరెట్టు కాల్చాలని వుందా? తాగుడికి, సిగరెట్లకు అలవాటుపడినవారు ఎంతోసేపు నిబ్బరంగా వుండలేరు. మీరు నిగ్రహస్తులు. సిగరెట్టు కేసు కావాలా? తీసుకోండి. నా దగ్గర ఇంకా ఉన్నాయి" రాజగోపాలరావు సిగరెట్లు లాగి ఖాళీ కేసు స్వామినాథన్‌కు ఇవ్వబోయాడు.

"ఊహు, ఒట్టి కేసుకాదు, ఆ సిగరెట్లతో సహా. మా దృష్టి బ్రీఫ్ కేసు మీద లగ్నం కావాలని భలే నాటకం ఆడేరు. ఏడు సిగరెట్లు తాగినవారు ఆ తరువాత మరి కాల్చలేదు. అంటే ఆ మూడింట్లో వజ్రాలున్నాయి. పెట్టెను బద్దలుకొట్టినా అందులో వజ్రాలు దొరకవని మీకు తెలుసు. అయినా మా దృష్టి దానిమీదే వుండాలని అతి తెలివిని ప్రదర్శించారు."

స్వామినాథన్ కనుసైగ చేయగానే ఇతర అధికారులొచ్చారు.

"రాజగోపాలరావుగారూ! మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం. ఇదిగో.. సిగరెట్టులో రెండు వజ్రాలున్నాయి" అన్నాడు స్వామినాథన్, ఐ.పి.ఎస్. V

ఆంగ్ల కథ



-ఫ్రెడరిక్ ఫోర్సిత్

ఐర్లండులో పాములుండవు

అనువాదం : ఎలనాగర

మెక్‌క్వీన్ తన ఎదురుగా ఉన్న యువకుడికేసి చూస్తూ "చాలా కష్టమైన పని. నీకు తెలుసు కదా? " అన్నాడు.

"తెలుసు" అన్నాడా యువకుడు

"ఐతే నీవు రాయల్ విక్టోరియాలో ఫైనలియర్ వైద్య విద్యార్థివన్నమాట? ఇప్పుడు సమ్మర్ వెకేషన్‌లో ఉన్నావన్నమాట? "

"ఔను"

చదువు కొనసాగించడానికి డబ్బు అవసరమున్న ఎందరో విద్యార్థులలో ఆ యువకుడొకడు. మెక్‌క్వీన్ పాత కట్టడాల్ని కూల్చివేసే కాంట్రాక్టర్. అతని దగ్గర ఒక పాత ట్రక్కు, టన్నులకొద్దీ పనిముట్లు ఉన్నాయి.

"సరే! మేమిక్కడ ఉదయం ఏడు నుండి సాయంత్రం సూర్యాస్తమయం వరకూ పని చేస్తాం. కానీ జీతం తక్కువగానే దొరుకుతుంది."

"సరే సర్! మరి పనిలోకి ఎప్పుడు రమ్మంటారు? "

"స్టేషన్‌యార్డ్ వద్ద ప్రొద్దున్నే ఆరున్నరకు ఒక ట్రక్ వచ్చి గ్యాంగును తీసికెళుతుంది. గ్యాంగ్ ఫోర్‌మెన్ బిగ్‌బెల్లీ కెమరాన్. సోమవారం ఉదయం నువ్వు అక్కడ ఉండు. నేనతనికి నీ విషయం తెలియజేస్తాను. ఇంతకీ నీ పేరు? "

"హరికిషన్ రామ్‌లాల్"

"ఓకే! 'రామ్'అని పిలుస్తాం నిన్ను"

ఆ సాయంత్రం రామ్‌లాల్‌కు ఒక చౌకగది అద్దెకు దొరికింది. కిటికీనుండి చూస్తే, బెల్‌ఫాస్ట్ నుండి బంగోర్‌కు వచ్చిపోయే రైళ్ళు కనబడతాయి. ఆదివారం ఉదయం రామ్‌లాల్ బెల్‌ఫాస్ట్ నుండి తన సామాను, పుస్తకాలు తెచ్చుకున్నాడు. మధ్యాహ్నం మంచంమీద పడుకొని, పంజాబులోని తన ఊరి కొండల్లో ప్రతిఫలించే చిక్కని వెలుగును తలుచుకొన్నాడు.

ఒక ఏడాదిలో తన చదువు పూర్తవుతుంది. ఇంకొక ఏడాది తరువాత తన ఊరిలో ప్రాక్టీసు ప్రారంభిస్తాడు. ఈ ఎండాకాలం సంపాదించిన సొమ్ము ఫైనల్ ఇయర్ వరకూ పనికొస్తుంది. ఇంటర్న్‌షిప్‌లో ఎలాగూ జీతం వస్తుంది.


ఇది అతడు కంటున్న కల. రామ్‌లాల్ మరునాడు పావుతక్కువ ఆరుగంటలకు లేచి, మొహం కడుక్కొని కేఫ్‌లో రెండు కప్పుల టీ తాగి స్టేషన్ యార్డ్‌కు చేరాడు. సరిగ్గా ఆరుంపావుకు ఒక పాత ట్రక్కు అక్కడికి వచ్చింది. ఒక పదీ పన్నెండు మంది అక్కడ గుమిగూడారు. ఆరుగంటల ఇరవైఐదు నిముషాలకు ఫోర్‌మెన్ తన కారులో అక్కడికి వచ్చి, రోడ్డు పక్కన కారు పార్కుచేసి, ట్రక్కు దగ్గరకు వచ్చాడు.

తన జేబులో నుండి ఒక కాగితం తీసి అందరి పేర్లూ చదవసాగాడు.

'హరికిషన్ రామ్‌లాల్'

"యస్"

బిగ్‌బెల్లీ కెమరాన్ ఆరడుగుల మూడంగుళాల ఎత్తు, చింత మొద్దులాంటి చేతులు. తన చిన్న కళ్ళను సన్నగా, నల్లగా ఉన్న ఇండియన్ వైపు తిప్పాడు. ఆ కళ్ళలో ఏదో అయిష్టత గోచరించింది. నేలమీద తుపుక్కున ఉమ్మి, "అందరూ



ట్రక్కులోకి ఎక్కండి" అని ఆజ్ఞాపించాడు. అందరూ లారీ వెనక భాగంలో చెక్కబల్లలపై కూర్చున్నారు.

పొట్టిగా ఉన్న, నీలి కళ్ళున్న టామీ బర్న్స్.. రామ్‌లాల్‌ను ప్రశ్నించాడు. "మీదే ఊరు? "

"ఇండియా. పంజాబు"

"ప్రొటెస్టెంటువా? కాథలిక్కువా"

"రెండూ కాదు. హిందువుని"

"హే! ఇతను క్రిష్టియన్ కాదట" అతను మిగతావారితో అన్నాడు. అతని కళ్ళలో హేళనకంటె ఆశ్చర్యం ఉంది. తనే రామ్‌లాల్‌ను అందరికీ పరిచయం చేశాడు.

"నీవు లంచ్‌బాక్సు తెచ్చుకోలేదా? " పాటర్సన్ అడిగాడు.

"లేదు. రేపటినుండి తెచ్చుకొంటాను"

"ఇలాంటి పని నువ్వు ఇంతకుముందు చేసినట్టు లేదు? "

రామ్‌లాల్ తలాడించాడు.

"నీ అసలు ఉద్యోగం ఏమిటి? "

"నేనొక మెడికల్ స్టూడెంటును. వచ్చే ఏడాదికి నా చదువు పూర్తవుతుంది"

టామీబర్న్స్‌కు సంతోషం కలిగింది. "హే! బిగ్‌బెల్లీ! మనకేమైనా జరిగితే రామ్ చూసుకుంటాడు"

బిగ్‌బెల్లీ గుర్రుగా చూస్తూ "అతను నామీద మాత్రం చేయి వేయడానికి వీల్లేదు" అన్నాడు.

కొద్దిసేపట్లో వారి ట్రక్కు చెట్ల మధ్యనున్న ఒక పాత భవనం ముందు ఆగింది. అది ఒక పాత విస్కీ డిస్టిల్లరీ. అది పనిచేయడం మానేసి చాలారోజులైంది.

ట్రక్ దిగి బిగ్‌బెల్లీ అందర్నీ పురమాయించాడు. "ఓకే! పని ప్రారంభిద్దాం, పైకప్పు నుండి మొదలెడదాం"

పెద్ద పెద్ద గునపాలు, సమ్మెటలు పట్టుకొని వర్కర్స్ బయలుదేరారు. అందులో ఒకతను తలుపుచెక్కను విరిచి మంటవేసి, టీ కాచి తయారుచేశాడు. అందరూ టీ తాగారు. మొదట పెంకులన్నీ ఊడబెరికి కింద పచ్చికలోకి విసిరేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు అందరూ తమ తమ లంచ్ బాక్సులతో ఒకచోట చేరారు. టామ్ బర్న్స్ రామ్‌లాల్‌కు ఒక సాండ్‌విచ్ ముక్క ఇవ్వబోయాడు.

"ఏమిటి ఇక్కడ నువ్వు చేస్తున్న పని? " చితుకుల మంట వద్ద కూర్చున్న బిగ్‌బెల్లీ అడిగాడు.

"కొద్దిగా సాండ్‌విచ్ ఇస్తున్నాను" నసిగాడు టామ్‌బర్న్స్.

"అతని సాండ్‌విచెస్ అతన్నే తెచ్చుకోనియ్. నీ సంగతి నువ్వు చూసుకో."

అందరూ మౌనం వహించారు. అతనికి ఎదురుతిరగడం అంటే ఎంత తెలివితక్కువ పనో అక్కడున్న అందరికీ తెలుసు.

"థాంక్యూ! నాకాకలిగా లేదు" అని రామ్‌లాల్ నది ఒడ్డుకు వెళ్ళి మండుతున్న తన చేతుల్ని నీటిలో ముంచాడు. సాయంత్రం మళ్ళీ ట్రక్కు వచ్చి వారిని తీసికెళ్ళింది. ఇలా వారం రోజులు గడిచాయి. ఇప్పుడు బంగళాకి గోడలు, కిటికీలు మాత్రమే మిగిలాయి.

రామ్‌లాల్‌కు ఇలాంటి పని అలవాటు లేదు. చేతులు బొబ్బలెక్కాయి. ఐనా డబ్బు చాలా అవసరం కాబట్టి కష్టపడుతున్నాడు. అతను లంచ్‌బాక్సు, మగ్, గట్టి బూట్లు, గ్లోవ్స్ కొన్నాడు. వారం అంతా బిగ్‌బెల్లీ రామ్‌లాల్‌కు కష్టమైన పని ఇస్తూ ఎత్తులో పని చేయిస్తూ తిప్పలు పెట్టాడు.

లంచ్ అవర్ తర్వాత కెమెరాన్ బంగళా చుట్టు రెండు చక్కర్లు కొట్టి, మూడవ అంతస్తులోని గోడల్ని ఎలా పడగొట్టాలో అందరికీ వివరించాడు. రామ్‌లాల్‌వైపు తిరిగి "నువ్వు ఆ పైకెక్కి గోడను కూల్చివేయ్" అని ఆజ్ఞాపించాడు. రామ్‌లాల్ గోడవైపు చూశాడు. అది బీటలువారి పడిపోవడానికి సిద్ధంగా ఉంది.

"అలా చేస్తే ప్రమాదం" అన్నాడు రామ్‌లాల్.

"యూ స్టుపిడ్! నువ్వు నాకు చెబుతున్నావా? చెప్పినట్టు చెయ్"

బిగ్‌బెల్లీ అరిచాడు.

రామ్‌లాల్ లేచాడు. తీవ్రమైన స్వరంతో "మిస్టర్ కెమెరాన్!.."

అందరూ నోళ్ళు తెరిచారు.

"నేను పంజాబ్ నుండి వచ్చాను. క్షత్రియుణ్ణి. నేను బీదవాడినే కావచ్చు. కానీ మా తాతలు, తండ్రులు గొప్ప సైనికులు, రాజులు. దయచేసి నన్ను అవమానపరచవద్దు"

బిగ్‌బెల్లీ కళ్ళు ఎరుపెక్కాయి. "అలాగా! ఐతే ఏం చేస్తావో చూద్దాం!" అంటూ తన కుడిచేతిని విసిరాడు. రామ్‌లాల్ కొన్ని అడుగుల దూరంలో వెళ్ళి పడ్డాడు. ఇంతలో టామ్‌బర్న్స్ గొంతు వినబడింది. "రామ్‌లాల్! లేవద్దు! లేస్తే నిన్ను బిగ్‌బెల్లీ చంపేస్తాడు"

రామ్‌లాల్ ఆకాశంలోకి చూశాడు. కెమెరాన్ పిడికిళ్ళు బిగించి రాక్షసుడిలా కనిపించాడు. 'వాడిని గెలవడం అసాధ్యం' అని తెలుసుకుని గట్టిగా కళ్ళు మూసుకున్నాడు రామ్‌లాల్. కొన్ని నిముషాల తరువాత బిగ్‌బెల్లీ దూరం జరిగాడు. రామ్‌లాల్‌కు అవమానంతో కన్నీళ్లు వచ్చాయి. పూర్వీకులు కనులముందు మెదిలారు. వారంతా ఒకే కంఠంతో ఇలా అనడం వినిపించింది. 'ప్రతీకారం! ప్రతీకారం!'

ఆ రోజంతా రామ్‌లాల్ ఎవరితోనూ మాట్లాడలేదు. రాత్రికి తన గదిలో దేవీ మాత ఫోటో ఉంచి అగరువత్తులు వెలిగించి పూజించాడు. అప్పుడే వర్షం ప్రారంభమైంది. "ఓ దేవీ! శక్తి స్వరూపిణీ! తప్పు చేసినవాడిని శిక్షించు తల్లీ"

కొద్దిసేపటి తరువాత గదిమూలలో అతనికి తన డ్రెస్సింగ్ గౌను నాడా ఒకటి కనిపించింది. అది అచ్చం చుట్టచుట్టుకొని పడుకున్న పాములా కనిపించింది. రామ్‌లాల్‌కు అర్థమైంది తనేం చేయాలో. మరునాడు బెల్‌ఫాస్ట్‌కు వెళ్లే రైలును పట్టుకొని తన స్నేహితుడు రంజీత్‌సింగ్‌ను కలిశాడు. అతను ధనవంతుడు. అతనికి తల్లిదండ్రులు బాగా డబ్బు పంపిస్తారు.

"నా తండ్రి చావుబతుకుల్లో ఉన్నాడు. ఇండియా వెళ్ళడానికి కొంచెం డబ్బు కావాలి. తరువాత నీ బాకీ తీరుస్తాను."

"ప్చ్! అలాగా! పాపం!" అంటూ రంజీత్‌సింగ్ డబ్బు ఇచ్చాడు. ఇరవైనాలుగు గంటల తరువాత రామ్‌లాల్ బొంబాయిలో అడుగుపెట్టాడు. మరునాడు గ్రాంట్‌రోడ్డు బ్రిడ్జి వద్ద గల 'సరీసృపాల



ఎంపోరియమ్‌కు వెళ్ళాడు. అది ఒక ముసలి బెంగాలీ వ్యాపారిది. రామ్‌లాల్ తనకు సాస్కేల్డ్ వైపర్ ఒకటి కావాలని అడిగాడు.

"నా దగ్గర ఆ పాము ఒకటే ఉంది. నిన్ననే రాజస్థాన్ నుండి తెప్పించాను"

సాస్కేల్డ్ వైపర్ అతి ప్రమాదకరమైన చిన్నని పాము. తొమ్మిది నుండి పదమూడు అంగుళాల మధ్య పొడవుంటుంది. మెరుపువేగంతో కాటేస్తుంది. అసలు నొప్పి తెలియదు. మనిషి కొన్ని గంటల్లో మరణిస్తాడు సెరెబ్రల్ హెమరేజ్‌తో.

అక్కడున్న గాజుజాడీలోని ఆకుల మధ్య ఏదో కదిలినట్టయింది. నల్లని నాలుకలు చాస్తూ చిన్న తల ఒకటి బయటకి కనిపించింది.

రామ్‌లాల్ మూడువందల యాభై రూపాయలకు బేరంచేసి ఆ పామును కొన్నాడు. శుక్రవారం ఉదయం లండన్ హీత్రో విమానాశ్రయంలో దిగాడు. బస్‌లో బెల్‌ఫాస్ట్‌కు చేరుకున్నాడు. అక్కడినుండి టీ సమయానికి బంగోర్ చేరాడు.

చీకటి పడ్డాక ఒక కాఫీ డబ్బాను కొని ఖాళీచేసి, గ్లోవ్స్ తొడుక్కుని , పాముని అందులోకి మార్చాడు. దానిని తన లంచ్ బాక్సుతో పాటు ఉంచాడు. తరువాత తను పనిచేసే స్థలానికి వెళ్ళాడు మామూలుగా.

బిగ్‌బెల్లీకి ఒక అలవాటుంది. అతడు తన కోటును ఒక చెట్టుకొమ్మకు తగిలిస్తాడు. లంచ్ తర్వాత తన కోటుజేబులో నున్న పైప్ తీసికొని పొగతాగుతాడు రోజూ. తను మెల్లగా పామును కోటుజేబులో వదులుతాడు. అప్పుడు బిగ్‌బెల్లీ యథాలాపంగా కోటుజేబులో చేయిపెడతాడు పైప్‌కోసం. పాము అతడిని కరుస్తుంది. తను ముందుకు దూకి పామును బిగ్‌బెల్లీ వేలి నుండి వేరు చేసి నేలమీద పడేసి, దాని తలను బూటుకాలితో నొక్కి చంపేస్తాడు. అందరూ చూస్తుండగా దానిని నదిలోకి విసిరేస్తాడు. ఇదీ రామ్‌లాల్ వేసుకున్న పథకం. లంచ్ అవర్‌కు ముందు రామ్‌లాల్ వేరే సమ్మెట తెచ్చే మిషమీద వెళ్ళి, ఎవరూ చూడకుండా కాఫీ డబ్బాను కోటు కుడి జేబులోకి ఖాళీచేశాడు.



లంచ్ టైమ్‌లో అందరూ ఎప్పటిలాగే మాట్లాడుతూ, నవ్వుతూ సాండ్‌విచెస్ తింటున్నారు. రామ్‌లాల్‌కు బ్రెడ్ మింగుడు పడడంలేదు. అతని గుండె వేగంగా కొట్టుకుంటోంది. చివరికి బిగ్‌బెల్లీ లంచ్ పూర్తిచేసి తన కోటు వద్దకెళ్ళి జేబులో చేయిపెట్టాడు. కాసేపు వెతికి పైపుతీసి వెలిగించాడు.

"ఏమిటలా చూస్తున్నావు? " బిగ్‌బెల్లీ రామ్‌లాల్‌ను ప్రశ్నించాడు గుర్రుగా.

"ఏమీలేదు".. రామ్‌లాల్ ముఖం అటువేపు తిప్పుకున్నాడు. అతను నమ్మలేకపోతున్నాడు.

'పొరపాటు ఎక్కడ జరిగింది? ఆ దేవీమాత ఎందుకిలా చేసింది? '

కోటుజేబుకు ఒక చిన్న రంధ్రం కనిపించింది. అదీ సంగతి! తిరుగు ప్రయాణంలో బిగ్‌బెల్లీ ఎప్పటిలాగే కోటును తన కాళ్ళ మీద వేసుకొని ముందు కూర్చున్నాడు.

రామ్‌లాల్ టామ్‌బర్న్సను అడిగాడు "బిగ్‌బెల్లీ ఉండేది ఎక్కడ?"

"ఆపైన గల హిల్‌కూలీ ఎస్టేట్‌లో".

"అతనికి ఫ్యామిలీ ఉందా?"

"యస్. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు"

రామ్‌లాల్ తన గదిలో దేవి పటం ముందు మోకరిల్లి 'మాతా! అతని భార్యా పిల్లలకు ప్రమాదం రానీకు. నా ఉద్దేశ్యం వారిని చంపడం కాదు' అంటూ ప్రార్థించాడు. ఆ వీకెండ్ టెన్షన్‌తో గడిపాడు రామ్‌లాల్. సాయంత్రం హిల్‌కూలీ ఎస్టేట్‌కూ వెళ్ళి బిగ్‌బెల్లీ ఇంటిని గుర్తించాడు.

బూత్‌లో ఫోను చేస్తున్నట్టు నటిస్తూ ఒక గంట గడిపాడు. ఇంతలో బిగ్‌బెల్లీ భార్య చేతిలో సంచీతో బయటికి వచ్చి, దగ్గరలో నున్న సూపర్‌మార్కెట్‌కు వెళ్ళింది. వెంటనే ఆమెను కలిసి అసలు సంగతి చెప్పేసి, కోటుజేబులో పాముందని చెప్దామనుకున్నాడు రామ్‌లాల్.

కానీ ధైర్యం చాలలేదు. పిచ్చివాడనుకుంటుందో ఏమో! తన గదికి తిరిగి వచ్చాడు. రాత్రి కలలో పామే కనిపించింది అతనికి.

సోమవారం ఉదయం బిగ్‌బెల్లీ ఫ్యామిలీ బ్రేక్‌ఫాస్ట్‌కోసం డైనింగ్ టేబుల్ చుట్టూ చేరింది. "జెన్నీ! నా కోటు ఇలా తీసుకురా" అంటూ కూతురును కేకేశాడు.. బిగ్‌బెల్లీ బ్రేక్‌ఫాస్ట్ ముగిస్తూ.

జెన్నీ.. కోటును కాలరు దగ్గర పట్టుకొని తీసుకొని వస్తూండగా, దాని మడతల్లోంచి ఏదో ఒక సన్నని నల్లని వస్తువు జారిపడి, శబ్దంచేస్తూ గది మూలకు వెళ్ళడం గమనించింది. "డాడీ! నీ జాకెట్‌లో నుండి ఏదో పడింది"

పద్నాలుగేళ్ళ బాబీ టోస్టును తినడం ఆపేసి అటు చూశాడు. ఏదో ఒక నల్లని పురుగు గదిమూలలో చుట్టుకొని ఉంది. దాని నోటినుండి నాలుకలు వేగంగా కదులుతున్నాయి. "ఓరి దేవుడా! పాము!" అంటూ అరిచింది మిసెస్ కెమెరాన్.

"నీకేమైనా పిచ్చా! ఐర్లండ్‌లో పాములు లేవని నీకు తెలియదా?" కెమెరాన్ అన్నాడు. స్పూను.. ప్లేట్లో పెడుతూ అడిగాడు "ఏమిటది బాబీ?"

"ఏదో పురుగు డాడీ!" అంటూ బాబీ చెప్పుతో దానిని చంపడానికి దగ్గరికి వెళుతున్నాడు.

"ఉండు బాబీ, ఉండు. నాదొక చిన్న ఐడియా. ఏదైనా ఒక జార్‌ను తీసుకు రండి" అని అరిచాడు బిగ్‌బెల్లీ.

"ఏం చేద్దామనుకుంటున్నావు డాడీ దానితో?" బాబీ అడిగాడు.

"నా దగ్గర రామ్ అని ఒక ఇండియన్ ఉన్నాడు. అతనిని ఒక ఆటపట్టిస్తాను దీనితో. గ్లోవ్ ఒకటి తీసుకుండి"

బిగ్‌బెల్లీ గ్లోవ్‌ను చేతికి తొడుక్కొని జాగ్రత్తగా పామును పట్టేశాడు. కానీ అది మెరుపు వేగంతో కాటేసింది. దాని కోరలు గ్లోవ్‌కు ఉన్న ప్యాడింగ్‌లో దిగాయి.

తన చేతులే అడ్డుగా ఉండడంవల్ల కెమెరాన్‌కు ఇదంతా కనబడలేదు. దానిని ఒక జామ్ సీసాలోకి మార్చి, లంచ్ బాక్సున్న తన బ్యాగులో వేసుకున్నాడు.

ఆ రోజు ఉదయం బిగ్‌బెల్లీ తను రామ్‌లాల్ మీద వేయబోయే ప్రాక్టికల్ జోక్ గురించి ముందే అందరికీ చెప్పాడు రహస్యంగా. "అంతా తమాషాలే' అనుకున్నారు అందరూ. రామ్‌లాల్‌కు ఇదంతా తెలియదు.

మధ్యాహ్నం లంచ్ అవర్లో చాలా యథాలాపంగా బాక్సు మూతను తెరిచాడు రామ్‌లాల్.

సాండ్‌విచెస్ మధ్యన చుట్టుకొని, కరవడానికి సిద్ధంగా ఉన్న పాము అతనికి కనిపించింది.

రామ్‌లాల్ కేక పనివాళ్ళ నవ్వుల హోరులో కలిసిపోయింది. లంచ్‌బాక్సు విసురుగా గాలిలోకి లేచింది. సాండ్‌విచ్‌లన్నీ చెల్లాచెదురుగా అక్కడి పచ్చికలో పడిపోయాయి.

రామ్‌లాల్ చటుక్కున లేచి నిలబడి, "అది పాము! చాలా ప్రమాదకరమైన విషపాము. అందరూ దూరం జరగండి" అంటూ అరవడం మొదలుపెట్టాడు. గ్యాంగ్‌మెన్ పొట్టచెక్కలయ్యేట్టు నవ్వుతూ కిందపడి దొర్లసాగారు. అందరి కంటే ఎక్కువగా నవ్వింది బిగ్‌బెల్లీయే. ఈ మధ్య అంతగా ఎప్పుడూ నవ్వలేదు అతను. కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ అన్నాడు "ఓ పిచ్చివాడా! ఐర్లాండులో పాములు లేవని నీకు తెలియదా?" నవ్వీ నవ్వీ అతని పక్కటెముకలు నొప్పిపుట్టాయి.

పచ్చికలో చేతులు వెనక్కి పెట్టుకొని కూర్చున్న బిగ్‌బెల్లీ, తన కుడిచేతి మణికట్టు మీద రెండు చిన్న ముళ్లు గుచ్చుకున్నట్టు గమనించలేదు.

తమాషా అయిపోయాక అందరూ తమ లంచ్‌బాక్సులు సర్దుకుని మళ్ళీ పనిలో పడ్డారు. ఆ పాత బంగళా పని పూర్తి కావస్తోంది. మూడు గంటల ప్రాంతంలో బిగ్‌బెల్లీ తన నుదుటిపై చేతిని ఉంచి "నాకు ఒంట్లో ఏదోలా ఉంది" అని పాటర్సన్‌తో చెప్పాడు. ఆ వెంటనే చెట్టునీడన కూర్చున్నాడు.. తలను రెండు చేతులతో పట్టుకొని. ఒక గంట తర్వాత బిగ్‌బెల్లీకి ఫిట్స్ వచ్చి పచ్చికలో ఒరిగిపోయాడు. ఒక అరగంటలో అంబులెన్స్ వచ్చి అతడిని జనరల్ హాస్పిటల్‌కు చేరవేసింది. అక్కడ డాక్టర్లు 'డెడ్ ఆన్ అరైవల్' అని చెప్పారు. కొద్దిసేపట్లో అక్కడికి మెక్‌క్వీన్ ఉరుకులు పరుగులతో చేరుకున్నాడు.

అటాప్సీ రిపోర్టు తయారైంది. 'చనిపోయిన వ్యక్తికి సుమారు నలభై ఏళ్ళు. చాలా దృఢమైన శరీరం. చేతులమీద చిన్నచిన్న గాయాలున్నాయి. అతను చేసే పనిలో అవి మామూలే. తీవ్రమైన ఎండలో, చాలాసేపు ఉండడం వల్ల సెరెబ్రల్ హేమరేజ్ జరిగి ఉండవచ్చు'.

విచారణ ప్రారంభమైంది. పాటర్సన్ ఆ రోజు లంచ్ అవర్లో జరిగిన తమాషా గురించి చెప్పాడు. 'అతిగా నవ్వడం, తరువాత ఎండలో పనిచేయడం వల్ల మెదలోని రక్తనాళం చిట్లి బిగ్‌బెల్లీ ప్రమాదవశాత్తూ మరణించాడ'ని కరోనర్ తన రిపోర్టులో పేర్కొన్నాడు.

రామ్‌లాల్ బిగ్‌బెల్లీ అంత్యక్రియలకు హాజరుకాలేదు. నేరుగా టాక్సీలో తను పనిచేసే స్థలానికి వెళ్ళి, చితుకుల మంట వేసేచోట నిలబడ్డాడు.

చుట్టూ ఎత్తుగా పెరిగిన గడ్డివైపు చూస్తూ ఇలా అన్నాడు. "ఓ విషసర్పమా! వింటున్నావా? నేను అనుకున్న పనిని నువ్వు పూర్తిచేశావు. కానీ నువ్వు నా చేతిలో చచ్చి ఉండాల్సింది.. ప్లాను అనుకొన్నట్టు జరిగి ఉంటే. నువ్వు కొన్నాళ్ళు జీవించవచ్చు. కానీ చివరకు నువ్వు ఒంటరిగా చావాల్సి ఉంటుంది. ఎందుకంటే ఇక్కడ ఐర్లండులో పాములసలే ఉండవు కాబట్టి."

పాము రామ్‌లాల్ మాటలు విన్నట్టు లేదు. ఇసుక అడుగున బొరియలో అది తన ప్రకృతిసిద్ధమైన పనిని నిర్వర్తించడంలో బిజీగా ఉంది.

తన తోక అడుగునుండి ఒక అంగుళం పొడవున్న అతి ప్రమాదకరమైన ఓ డజను పిల్లల్ని అది ఈ భూమ్మీదకి తీసుకు వస్తోంది!

తెలుగు కథ



యడవల్లి



ది ఎండ్

"మీరు ఎప్పుడు చచ్చిపోవాలనుకుంటున్నారు? "

"జూన్ 24వ తేదీన"

"ఆ రోజుకి ఏమయినా ప్రత్యేకత ఉందా? అరె! ఇవాళే 24 తేదీ!"

"ఉంది"

"ఏమిటి? "

"ఆ రోజు నా పుట్టిన రోజు."

"వాట్.. పుట్టిన రోజునే చచ్చిపోవాలనుకుంటున్నారా? వింతగా ఉంది"

"ఇంకో ప్రత్యేకతా ఉంది ఆ రోజుకి"

"ఇంకోటా? అదేమిటి? "

"ఆ రోజు నా పెళ్ళిరోజు కూడా"

"పెళ్ళిరోజు! వావ్! పెళ్ళిరోజు, పుట్టిన రోజు, ఒకేసారి, అదీ ఒకే తారీఖున రావడం చాలా అరుదుగా జరుగుతుంది."

"ఆ రెండూ కలిసిన అరుదయిన రోజునే చనిపోవాలనుకోడం కూడా అరుదుగానే జరుగుతుంది."

"యస్.. యస్.. అవునూ.. ఇంతకీ ఎందుకు చచ్చిపోవాలనుకుంటున్నారు? "

"చాలా ఆలస్యమయింది ఇప్పటికే!"

"అలస్యమా? దేనికి? "

"మీరు ఈ ప్రశ్న అడగడానికి. ఎప్పుడు చచ్చిపోవాలనుకుంటున్నారు? అని అడిగారు కానీ; ఎందుకు చచ్చిపోవాలనుకుంటున్నారు? అని ఈ క్షణం వరకు అడగలేదు. అందుకే ఆలస్యమన్నాను"

"నిజమే.. ఆలస్యం అయింది. కారణం చెప్పండి ఇప్పుడైనా"

"బతకడం ఇష్టంలేక"

"మీరు చెప్పేది నమ్మడం కష్టంగా ఉంది. మీకు దాదాపు 10 కోట్ల ఆస్తి ఉంది అంటారు అంతా"

"అబద్ధం"

"అంటే? "

"10 కోట్లు కాదు. 20 కోట్ల రూపాయల ఆస్తి ఉంది"

"గాడ్!"

"యస్.. ఆ ఇరవైకోట్లు నేను న్యాయంగా సంపాదించిందే. అయితే.."

"ఏం జరిగింది? "

"నా భార్య, కొడుకు ఆస్తినంతా వాళ్ళ పేర రాయించుకున్నారు"

"ఇష్టం లేకపోతే ఎలా ఒప్పుకున్నారు? "

"బలవంతాన ఒప్పించారు"

"మీరు చిన్నపిల్లలు కాదు.."

"హు! మెడమీద కత్తి పెట్టినప్పుడు, రివాల్వరు గుండెకి గురిపెట్టినపుడు, ఎంతటి వారయినా లొంగాల్సిందే!"

"అబ్బ.. మీరు చెబుతుంటేనే నాకు వళ్ళు గగుర్పొడొస్తోంది"

"మరి అదంతా అనుభవించిన వాడిని, నేను ఎంత భయపడితే వాళ్ళకి లొంగి ఆస్తి రాసిచ్చానో అర్థం అయిందిగా"

"అర్థమైంది. కానీ ఒక సందేహం. మీరు



ఈ విషయం పోలీసులకు ఎందుకు రిపోర్టు చేయలేదు? ”

“ఏమని చేయమంటారు? వాళ్ళు బెదిరించారు అని చెప్పడానికి ఆధారాలు లేవు. నా యిష్టపూర్తిగానే ఆస్తినంతా వాళ్ళకి రాసిచ్చినట్టుగా ఉంది డాక్యుమెంటులో”

“కష్టమే! ఇప్పుడర్థమయింది, మీరెందుకు కంప్లయింట్ చేయలేదో!”

“చేసినా ఫలితం ఉండదని తెలుసు”

“ఎలా? ”

“నా భార్య తమ్ముడు హోం మినిస్టరుకు బాగా దగ్గర మనిషి”

“అర్థమయింది. మీరు ఏ పోలీస్ స్టేషన్‌లో రిపోర్టు చేసినా ఫలితం ఉండదు”

“అలా అని వాళ్ళని వదలదలుచుకోలేదు”

“అవునా? ఎలా? ”

“నేను చచ్చిపోవడమే!”

“అర్థం కాలేదు”

“కొంత టైము పడుతుంది”

“తెలుసు.. మీరు చావడానికి ఇంకో 24 గంటలు టైముంది అని”

“నేను చావడానికి కాదు, మీకు అర్థం కావడానికి”

“చచ్చి ఏం సాధిస్తారు? ”

“బతికుండి సాధించలేనిది”

“అదే.. ఏమిటని? ”

“నా ఆస్తి నాకు కాకుండా చేసిన వాళ్ళకి.. దాన్ని అనుభవించే యోగం ఉండకూడదు”

“వాళ్ళు ఇప్పుడు హాయిగా ఉన్నారా.. మీ ఆస్తి అనుభవిస్తూ? ”

“లేరు. ఇంకా ఆస్తి వాళ్ళ స్వాధీనం కాలేదు. బాంకు లాకర్లలో చాలా కాష్ ఉంది, బంగారంతో పాటు అదింకా వాళ్ళకి అందలేదు”

“ఎందుకని? ”

“నేను సంతకం చేసి 24 గంటలు కాలేదు. ఆ తరువాత నేను వాళ్ళకి దూరంగా వచ్చేశాను”

“అర్థమైంది. ఏ బాంకులో ఎంతెంత, ఏమేమి ఉన్నదీ వాళ్ళకి తెలుసుకునే అవకాశం ఇవ్వకుండా, అందనంత దూరం వచ్చేశారన్నమాట!”

“అవును. వాళ్ళకి నా జాడ తెలిసేలోగా, నేను ఎప్పటికీ వాళ్ళకి అందని లోకాలకి వెళ్ళిపోవాలి”

“కానీ..”

“ఆ కూల్‌డ్రింక్ బాటిల్ ఇవ్వండిలా”

“చల్లగా లేదు. ఫ్రిజ్‌లోది ఇవ్వనా? ”

“వద్దు. నా కోపం, కసి, నన్ను చల్లదనాన్ని కోరుకోనివ్వడంలేదు. ఫరవాలేదు. ఇలాగే తాగేస్తాను.. మరి మీకు..”

“నాకు కూల్‌డ్రింక్స్ అలవాటులేదు. యూ కారీ ఆన్!”

“అదృష్టవంతులు”

“థాంక్స్”

“కానీ, మీ దురదృష్టం నా రూపంలో వచ్చింది మీకు”

“మీ..రు.. ఏమంటున్నారో? ”

“కొంచెం సేపట్లో అర్థమవుతుంది”

“చూడండి. నేను మీ ఫ్యామిలీ శ్రేయోభిలాషిని. మీరు నాకు ఏ విషయం దాచకుండా చెబితే మంచిది”

“ఎవరికి మంచిది? ”

“మీకు, మీ వాళ్ళకి కూడా..”

“వాళ్ళకి మంచి జరగకూడదనేగా.. నేను చావాలనుకుంటున్నది!”

“మీ ఆలోచన, ఈ ప్రయత్నం మరిచిపోయి..”

“వీల్లేదు”

“ఒక్క అయిదు నిముషాలు అన్నీ మర్చిపోయి, కూల్‌గా ఆలోచించండి. మీరు పగ సాధించాలి అనుకున్నది పరాయి వాళ్ళమీద కాదు”

“పరాయి వాళ్ళయితే నా చేతకానితనానికి, తెలివితక్కువతనానికి పెనాల్టీ కట్టానని ఊరుకుని ఉండేవాడిని. కానీ నా అనుకున్నవాళ్ళే.. నేను నమ్మినవాళ్ళే..”

“ఆవేశపడకండి. వాళ్ళు అలా ఎందుకు చేయవలసి వచ్చిందో తెలుసుకుంటే..”

“అదీ తెలుసుకున్నాను. నాకు వేరే ఆడ మనిషితో సంబంధం ఉందన్నారు”

“నిజం కాదా? ”

“ఉంది. కాని వాళ్ళు అనుకునే ‘ఆ’ రకమయిన సంబంధం కాదు”

“మీరు చెప్పలేదా? వివరంగా చెబితే వాళ్ళు అర్థం చేసుకునేవాళ్ళు కదా!”

“పచ్చకామెర్ల వాళ్ళకి.. లోకం అంతా పచ్చగానే కనిపిస్తుంది”

“అంటే? ”

“మీకు అర్థం అయ్యేట్టు చెప్పాలంటే.. పచ్చి నిజాలని, అందంగా చెప్పాల్సి వస్తుంది. ఇప్పుడవన్నీ అనవసరం. నేను చాలావరకు అవన్నీ మర్చిపోవాలని ప్రయత్నం చేశాను. కానీ ముల్లులా ప్రతిక్షణం అవి పొడుస్తూనే ఉన్నాయి? ”

“మీరు ఈ నిర్ణయం తీసుకునే ముందు.. ఒక్కసారి నన్ను..”

“అంటే నేను చచ్చిపోవడానికి మీ పర్మిషన్ కావాలంటారా? ”

“నా ఉద్దేశ్యం..”

“చూడండి! పుట్టేటప్పుడు ఎప్పుడు పుడతామో తెలియదు. చచ్చేటప్పుడయినా, ఎవరి ఇష్టప్రకారం వాళ్ళు చస్తే, ఓ తృప్తిగా ఉంటుంది. ఆ సంతృప్తి అయినా ఉండకూడదంటారా, శాశ్వతంగా ఈ లోకం విడిచి వెళ్ళే వాళ్ళకి? ”

“నేను చదువుకున్న బీఎల్ ఇలాగయినా ఉపయోగపడుతున్నందుకు సంతోషంగా ఉంది”

“మీ నిర్ణయం బయటపెట్టకుండా.. మీ వాళ్ళతో మీటింగ్ ఏర్పాటు చేస్తా”

“దేనికి? మనసు మార్చుకుంటాననా.. మీ భ్రమ!”

“పోనీ అలాగే అనుకోండి. కానీ నా కోరిక..”

“ చచ్చిపోయే వాళ్ళ కోరిక తీర్చాలి గానీ, బతికున్నవాళ్ళది కాదండీ!”

“మాటలతో చంపుతున్నారు!”

“వాళ్ళ విషయం వదిలేసి, ముందు మీ విషయం ఆలోచించుకోండి”

“నా విషయమా? ”

“అవును! ఎలా? వాళ్ళతో బాటు, మీరూ ఇబ్బందుల్లో పడతారు! పడాలి.”

“వాట్.. ఇబ్బందుల్లో పడటమా? నేనా? ఏం మాట్లాడుతున్నారు మీరు? ”

“నేను సంతకాలు చేసిన డాక్యుమెంట్లు తయారుచేసింది మీరు! అసలు ఆ సలహా ఇచ్చిందే మీరు? ”

“అబద్ధం”

“జరిగినదంతా అబద్ధం అయితే ఎంతో

బాగుండును. కానీ అదంతా చేదు నిజం!"

"మీ వాళ్ళు రాయమన్నారు. ఒక లాయర్‌గా.."

"మీరు లాయరే కాదు. ఆవిడకి లవర్ కూడా అని నాకు తెలుసు"

"... ... ..."

"నాకు ఎలా తెలుసని షాక్ అయ్యారా? .. లేక ఆ విషయం తెలిసినా మిమ్మల్ని ఈ హోటల్ గదికి పిలిపించానని షాక్ అయ్యారా? "

"మీరు ఏం అనుకున్నా నేను కేర్ చెయ్యను. నేను ఏ రకంగానూ ఇబ్బందుల్లో పడను. ఒక క్రిమినల్ లాయర్‌గా.. నేను నా జాగ్రత్తలో ఉంటాను."

"మీరు క్రిమినల్ లాయరని ఎలా మర్చిపోతాను? ముల్లుని ముల్లుతోనే తియ్యాలి"

"ఏమిటి మీరనేది? "

"డెత్ స్టేట్‌మెంట్ తయారుచేశాను. అది జూన్ 24వ తారీఖున అందవలసినవాళ్ళకే అందుతుంది. అది ఈ రోజే!"

"సో వాట్"?

"డియర్ లాయర్! ఎప్పుడయినా, ఎక్కడయినా, డెత్ స్టేట్‌మెంటుకి విలువ ఉంటుంది"

"... ... ..."

"నాకు మీరు విషం ఇచ్చి చంపారని, అందుకు నా భార్య, కొడుకు ప్రోద్బలం ఉందని.. ఆ డెత్ స్టేట్‌మెంటులో రాశాను"

"కుట్ర! మోసం!"

"నాదా? మీదా? మా చక్కటి సంసారంలో విషపుబొట్టు నువ్వు"

"నేనా? ఓ.కే. కానీ తప్పంతా నాదేనన్నట్లు మాట్లాడటం.."

"తప్పే! కానీ నేను నిన్ను ఎంత నమ్మాను? అందుకే నిన్ను ఇంట్లోకి రానిచ్చాను. నా మంచితనాన్ని, నీమీద ఉన్న నమ్మకాన్ని నువ్వూ, నా భార్య కలసి..".





"ఎస్. నేను అవకాశవాదిని. అవకాశాలను నేనే సృష్టిస్తాను. నీ భార్య మానసికంగా చాలా బలహీనురాలు. ఆ సంగతి తొందరగానే గ్రహించాను. అవకాశం కోసం ఎదురుచూశాను. వచ్చిన అవకాశాన్ని తెలివిగా వాడుకున్నాను. ఎప్పుడూ తెలివయిన వాళ్ళదే గెలుపు"

"న్యాయమైన గెలుపుకి, మోసమైన గెలుపుకి చాలా తేడా ఉంటుంది"

"ఈ వాదన కోర్టులో వాదించడానికి కూడా పనికిరాదు. అయినా చచ్చే నీతో వాదిస్తూ, టైం వేస్ట్ చేసుకుంటే, నేను తెలివైనవాడిని ఎలా అవుతాను? "

"ఒక్క క్షణం ఆగు. ఇందాక నేను చెప్పింది మరిచిపోయి, నాకేదో వీడ్కోలు చెప్పి వెళ్ళిపోతున్నావు. ఆ వీడ్కోలు నీకు. చెప్పవలసింది నేనే!"

"రబ్బిష్"

"నన్ను మీరలా జమకట్టారని, మీ దృష్టిలో నేను అంతేననీ నాకు తెలుసు. కానీ.. కానీ.."

"ఛస్తున్నావా? నువ్వలా దగ్గుతూ, గుండె పట్టుకుని, గిల గిలలాడుతుంటే, నాకు చూడటానికి చాలా సంతోషంగా ఉంది. కానీ ఒక్కటే విచారం"

"వి..చా..ర..మా! దే..ని..కి? "

"ఈ దృశ్యాన్ని నీ భార్య, కొడుకు చూడలేకపోతున్నారని"

"నా..కూ..వి..చా..రం..గా..నే.. ఉం..ది"

"ఇలా అర్థాంతరంగా చస్తున్నందుకా? నీకో విషయం చెప్పాలి. ఒక మనిషి చావును నేను కళ్ళారా చూడటం ఇదే మొదటిసారి. ఏమిటి నవ్వుతున్నావా? "

"నాకూ విచారంగానే ఉంది.. ఇదే నీకు ఆఖరిసారి అవుతున్నందుకు. దేనికో తెలుసా? నా భార్యా, కొడుకు పడే

బాధలు నువ్వు చూడలేనందుకు.. అబ్బ.. గుండెల్లో.. మంటగా..”

“సంధి ప్రేలాపనంటారు.. నువ్వు ఇప్పుడు వాగింది. నిన్ను చూస్తే జాలే స్తోంది. కాసేపు ఈ బాధ ఓర్చుకో. సరే, నువ్వు ఏదో డెత్ స్టేట్‌మెంటు ఇవ్వాలి అని ఫోన్ చేశావు నాకు. ఏదీ అది? ”

“కొ..రియర్‌లో.. అబ్బా.. మంట”

“ఓ! కొరియర్‌లో ఎవరికి పంపించావు? ఎప్పుడు పంపించావు? ”

“నిన్ను ఇక్కడికి రమ్మని.. ఫోన్.. చేసే.. ముందు. పోలీస్‌కి ఒక కాపీ.. నీకు.. ఒక కాపీ..”

“ఎంత పని చేశావురా రాస్కెల్! ఇంత సేపూ నువ్వు చస్తావన్న ఆనందంలో ఉన్నాను. ఇప్పుడు మమ్మల్నందరినీ ఇరి కించి చస్తున్నావు కదరా!”

“దీన్నే. చచ్చి.. సాధించడం.. అంటారు.. అమ్మా.. నొప్పి..”

“నిన్ను.. నిన్ను ఏం చేస్తే పాపం..”

“చస్తున్న వాడిని.. ఇంకా.. ఏం చేయగ లవు? ముందు నీ సంగతి చూసుకో. నీ చేత్తో.. ఇచ్చిన కూల్‌డ్రింకులో.. ముందే విషం కలిపాను..”

“ఒరే! నువ్వు ఇంకాసేపటి తరువాత కాదు. ఇప్పుడే చావాలి. అబ్బ! నీ గొంతు ఇంత బలంగా ఉందేమిట్రా. చేతులు నొప్పె డుతున్నాయి నులమలేక.. ఆ! చచ్చావా! అబ్బ! ఎంత శ్రమ పెట్టావురా! నన్నే ఇరి కించాలని చూస్తావా? ”

“సార్.. కొరియర్!”

“వస్తున్నా! జస్ట్ ఎ మినిట్”


“ఇదుగో సార్! కవరు. సైన్ చేయండి క్కడ. మీరేగా ఆనందరావు. అడ్వకేటు? ”

“యస్! యస్!”

“వస్తా సార్”

“ఆశ్చర్యంగా ఉందే! నా పేరుమీద ఇక్క డికి కొరియర్‌లో కవరు పంపించే ఏర్పాటు ముందే చేసి, నాకు ఫోన్ చేసి కరెక్టుగా ఈ టైముకి నేను ఇక్కడుండేలా చేశాడు. చస్తే చచ్చాడు గానీ, బ్రెయిన్ ఉన్న వెధవ! ఈ కవరు ఇంత బరువుగా ఉందేమిటి? లోపల డెత్‌స్టేట్‌మెంటు కాపీ కాకుండా, ఇంకా ఏవయినా రాసి చచ్చాడా! సరే! టెన్షన్ దేనికి? ఓపెన్ చేస్తే సరి! వాడి మరణవాఙ్మూలం ఏం రాశాడో తెలు స్తుంది. ఆ.. కరెక్ట్‌గా చిరిగింది కవరు”

ఢాం..!



ఆంగ్ల కథ

-కాథరిన్ మాన్స్ ఫీల్డ్

దెయ్యం వచ్చిన రాత్రి

అనువాదం : డా॥ ఎ. హరిప్రసన్న

ఆ రాత్రి నేను ఆ అడుగుల చప్పుడు విననట్టయితే అంత గొడవయ్యేది కాదు. ఒకవేళ ఆ అడుగుల చప్పుడు విన్నా, దాన్ని పట్టించుకోనట్లయితే ఎవరితో ఏ ఇబ్బందీ వుండేది కాదు. దాని మూలంగానే మా అమ్మ చెప్పు విసిరి పక్కింటి కిటికీ పగలగొట్టింది. మా తాతయ్య తుపాకీతో పోలీసును కాల్చాడు. ఈ గొడవంతా చూశాక నాకనిపించింది- ఆ అడుగుల శబ్దం గురించి అనవసరంగా పట్టించుకున్నానేమోనని.

సరిగ్గా రాత్రి ఒంటిగంటకు మొదలయ్యాయి ఆ చప్పుళ్లు. గతి తప్పని, క్రమబద్ధమైన అడుగుల శబ్దాలవి. డైనింగ్ టేబుల్ చుట్టూ ఎవరో నడుస్తున్న చప్పుడది. పైన ఓ గదిలో అమ్మ నిద్రపోయింది. తమ్ముడు ఇంకో గదిలో పడుకున్నాడు. తాతయ్య యథాప్రకారం అటకమీద పక్కేసుకుని పడుకున్నాడు. నేనప్పుడే స్నానం చేసి ఒళ్లు తుడుచుకుంటున్నాను. ఇంతలో ఆ అడుగుల సవ్వడి. ఎవరో ఖచ్చితంగా డైనింగ్ టేబుల్ చుట్టూ తిరుగుతున్నారు. చప్పుడు వినిపిస్తోంది. కానీ మనిషి కనబడటం లేదు. స్నానాలగది దీపం వెలుతురు హాలుమెట్ల మీద పడుతోంది. ఆ మెట్లు నేరుగా భోజనాల గదిలోకి వెళ్తాయి. దీపం వెలుతురు భోజనాలగది అలమారు మీద పడుతోంది. ఆ వెలుతురుకి పళ్ళాలు మెరుస్తున్నాయి, కానీ డైనింగ్ టేబుల్ కనబడటం లేదు. అడుగుల శబ్దం మాత్రం వినవస్తోంది. చెక్క నేల కావటంతో, వదులుగా వున్న చెక్కమీద అడుగు పడినప్పుడు కిర్రుమని చప్పుడు చేస్తోంది. నేను కూడా మొదట ఆ అడుగుల శబ్దం వినగానే మా నాన్న కానీ, అన్నయ్యకానీ అయి వుంటారనుకున్నాను. ఎందుకంటే వాళ్లు వూళ్లకి వెళ్లారు. ఈ పాటికి ఇంటికి రావాల్సిందే. నా తర్వాతి వూహ.. అది దొంగ అయ్యుండవచ్చని. చాలాసేపటి తర్వాత కానీ నా మట్టి బుర్రకి తట్టలేదు, అది ఖచ్చితంగా దెయ్యమేనని.

ఆ అడుగుల చప్పుడు విన్నాక, మా తమ్ముడు హెర్మన్ గదిలోకి వెళ్లాను పిల్లిలాగా చప్పుడు చేయకుండా. లేపగానే.. వాడు మాట్లాడబోతుంటే.. నిశ్శబ్దంగా వుండమని గడియ వేశాను. ఏ అపరాత్రివేళో వచ్చి తనకేదో చేసేస్తుందని భయపడుతూ వుంటాడు వాడు.

"ష్! నేనేరా. కింద గదిలో ఏదో వుంది. చప్పుడవుతోంది- చూద్దాం రా" అన్నాను. ఇద్దరం మెటదగ్గర నిలబడి వున్నాం. ఎక్కడా ఏ చప్పుడూ లేదు. అడుగుల శబ్దం ఆగిపోయింది. హెర్మన్ భయం భ

యంగా నావైపు చూశాడు. నా నడుం చుట్టూ ఒక్క టవల్ తప్ప ఏ ఆచ్ఛాదనా లేదు. వెళ్లి పడుకుందామన్నాడు వాడు. కానీ నేను వినలేదు. వెళ్లకుండా వాడి చెయ్యి గట్టిగా పట్టుకున్నాను. "ఖచ్చితంగా కింద గదిలో ఏదో వుంది" అన్నాను.

నేనలా అంటూండగానే ఆ అడుగుల చప్పుడు మొదలైంది మళ్లీ. డైనింగ్ టేబుల్ చుట్టూ పరిగెత్తిన అడుగులు, వున్నట్టుండి మేమున్న మెట్ల వైపుకి మళ్లాయి. అడుగుల శబ్దం మా వైపుకే వస్తున్నా, మెట్లమీద ఎవరూ కనపడలేదు మాకు. అడుగుల చప్పుడు మాత్రం వినపడుతోంది. మా తమ్ముడు ఒక్క గెంతులో తన గదిలోకెళ్లి తలుపు బిగించేసుకున్నాడు. నేను దఢేల్‌న మెట్లపైనున్న తలుపు మూసేసి మోకాలు అడ్డుపెట్టి నుంచున్నాను. ఒక్క నిమిషం గడిచాక తలుపు తీసి చూస్తే ఏమీ లేదక్కడ. ఏ శబ్దమూ లేదు. మళ్లీ ఆ దెయ్యం అడుగుల చప్పుడు వినపడలేదు.

దభాలున తలుపులు మూసిన చప్పుడుకి మా అమ్మకి మెలకువ వచ్చింది. తన గదిలోంచి తొంగి చూసి "ఏం చేస్తున్నారు మీరిద్దరూ అక్కడ? " అని అడిగింది.

"ఏం లేదు" హెర్మన్ గొణిగాడు.

"ఏంటా పరుగులు కింద గదిలో? " అడిగింది అమ్మ.

అయితే ఆ అడుగుల చప్పుడు మా అమ్మ కూడా విందన్నమాట. నేనూ, తమ్ముడూ సమాధానం చెప్పకపోయేసరికి ఆవిడకి అనుమానం వచ్చింది. నిస్సందేహంగా దొంగలే అయ్యుంటారు వాళ్లు అనుకొని "దొంగలు- దొంగలు పడ్డారు" అని గట్టిగా కేకలు పెట్టిందావిడ.

ఆవిణ్ణి సమాధానపరచడానికి మెట్లు దిగి చూపిద్దామని "రారా హెర్మన్" అని తమ్ముణ్ణి పిలిచాను. వాడసలే ఎస్కేపిస్ట్ కావడంతో మెట్లు దిగటం తప్పించుకోవడానికి "అమ్మ చాలా కంగారుపడుతోంది.. కావాలంటే నువ్వెళ్లు" అని తోశాడు.

నేను మెట్ల వేపుగా నడుస్తుంటే అమ్మ గట్టిగా వారించింది, "ఒక్క అడుగు కూడా ముందుకెయ్యద్దు, పోలీసుల్ని పిలుద్దామ"ని. వచ్చిన చిక్కల్లా అదే. పోలీసుల్ని పిలవడం ఎలా? అన్నది సమస్య అయింది. ఎందుకంటే మా టెలిఫోన్ కింద గదిలో వుంటుంది. అంతే కాకుండా, అసలు పోలీసులతో పెట్టుకోవడం నాకిష్టం లేదు. అయితే మా అమ్మ వూరుకోలేదు. తన పడకగది కిటికీ తెరచి, పక్కింటి వాళ్లని పిలిచింది. ఆ పిలవటం ఎలా పిలిచిందనుకున్నారూ? తన బూటు తీసి ఆ ఇంటి కిటికీ మీదకి విసిరింది. అద్దం భళ్లున పగిలిన చప్పుడు.

మా పక్కింటాయన పేరు బాడ్వెల్. ఆయన, భార్య మాత్రమే వుంటారు. వాళ్ల పిల్లలందరూ వేరే వూళ్లో సెటిల్ అయ్యారు. ఎప్పుడూ తనమీద ఎవరో యుద్ధానికి వస్తున్నారనుకుంటూంటాడు ఆయన. ఆయనదొక వింత మనస్తత్వం. వారందరూ కూడా తిక్క మనుషులే. ఎవరూ ఎవరికీ తీసిపోరు ఎందులోనూ.


అర్ధరాత్రి రెండైందప్పుడు. చంద్రుడు కూడా కనబడటం లేదు. ఆకాశం మబ్బులతో నిండి వుంది. ఆ వేళప్పుడు ఎవరో కిటికీ అద్దం పగలగొట్టారని బాడ్వెల్‌కి వీరావేశం వచ్చింది. ఒక్క గెంతులో కిటికీ దగ్గరకొచ్చి అరవడం మొదలెట్టాడు.

"వీళ్లతో మనం వేగలేం గానీ ఇల్లమ్మేసి మన వూరు వెళ్దాం" అని ఆయన భార్య చెప్పటం స్పష్టంగా వినపడింది మాకు.

ఆగ్రహంలో వున్న ఆయనకి చాలా సేపటిగ్గానీ మా అమ్మ అంటున్నదేమిటో అర్థంకాలేదు.

"దొంగలు, దొంగలు" గొంతు పగిలేలా అరిచింది మా అమ్మ. మా ఇంట్లో దొంగలు పడ్డారు అంటూ...

నేనూ తమ్ముడూ 'దొంగలు కాదు- అది



దెయ్యం' అని నోరు తెరచి చెప్పలేకపోయాం. ఎందుకంటే మా అమ్మకి దొంగలకన్నా దెయ్యాలంటేనే భయమెక్కువ.

పోలీసులకి ఫోన్ చేయడానికని మా పక్కింటాయన లోపలికి వెళ్లాడు. ఈ లోపల మా అమ్మతో పెద్ద చిక్కొచ్చిపడింది. కిటికీలోకి బూటు విసరటం ఆవిడకి మహ బాగా నచ్చిందట. తన సరదా తీర్చుకోవడానికి రెండో బూటు కూడా విసుర్తానని పట్టుపట్టి కూర్చొంది.

ఇంతలో పోలీసులు అట్టహాసంగా రంగప్రవేశం చేశారు. రెండు వ్యాన్ల నిండా, రెండు మోటార్ సైకిళ్ల మీద.. కొంతమంది విలేఖరులతో సహా..

వీధి తలుపులు బాదుతున్నారు వాళ్లు, "తలుపులు తెరవండి, పోలీసులం వచ్చాం"

కిందికెళ్లి తలుపు తీద్దామనే వుంది నాకు.

కానీ అమ్మ ససేమిరా అంది. "ఒంటిమీద నూలుపోగు కూడా లేకుండా ఎలా వెళ్తావ్? చలికి బిగుసుకుపోతావ్" అంది.

అమ్మ ఆ మాట అనగానే నేను హడావుడిగా కిందికి జారిపోయిన టవల్ సరిచేసుకున్నాను. ఈలోపల పోలీసులు తలుపులు బద్దలుకొట్టి లోపలికొచ్చారు. తలుపులు విరిగి పడిన చప్పుడు, అద్దం బద్దలైన శబ్దం వినపడుతూనే వున్నాయి నాకు. వెనువెంటనే ఇల్లంతా ఫ్లాష్‌లైట్ల వెలుతురు పరుచుకుంది. ఎక్కడ చూసినా ఆ వెలుతురే.. భోజనాల గదిలో, ముందుగదిలో, హాల్లో గోడలమీద, ముందు మెట్లమీద, చివరగా మేమున్న వెనకమెట్ల మీదా.

ముందుగా నేనే వాళ్ల కంట్లో పడ్డాను. పైమెట్టు మీద, టవల్ తప్ప మరే ఆచ్ఛాదనా లేకుండా నించున్న నన్ను చూసి "ఎవర్నువ్వు? " అని గద్దించారు ఆ పోలీసులు.

"ఇది మా యిల్లే" అన్నాను.

"అయితే? ఒంటిమీద ఆ టవల్ ఏంటి? ఆ అవతారమేంటి? బాగా వుక్కపోస్తోందా? " అని వెటకారం చేశాడతను.

నిజానికి అప్పుడు బాగా చలేస్తోంది. వెంటనే నా గదికి వెళ్లి బట్టలు మార్చుకున్నాను. బైటికి వస్తుంటే ఇంకో పోలీసు ఎదురుపడ్డాడు. తుపాకీ నాకు గురిపెట్టి "ఎవరయ్యా? " అని గద్దించాడు.

"ఇది మా యిల్లే" అనేశాను.

"ఇక్కడెవరూ లేరమ్మా, దాటేసినట్లున్నారు. అసలా దొంగ ఎలా వున్నాడో చెప్పగలరా .. రూపురేఖలు? " అని పోలీసాఫీసర్ మా అమ్మను అడిగాడు.

"ఇద్దరో ముగ్గురో వున్నారు వాళ్లు. ఒకటే మూటలో కట్టి మోసుకెళ్లడం, తలుపులు విరిగిపడేలా దఢేల్ దఢేల్‌మని తెరవటం, మూయటం" అంది మా అమ్మ.

"ఆశ్చర్యంగా వుందే. వేసిన తలుపులు వేసినట్టే వున్నాయి. కిటికీ తలుపులన్నీ గట్టిగా బిగించి వున్నాయి" అన్నాడతను.

కింద గదిలో పోలీసులు చేస్తున్న హడావుడి మాకు వినిపిస్తూనే వుంది. ఇంటినిండా ఎక్కడ చూసినా పోలీసువాళ్లే. వాళ్ల హడావుడి ఇంతా అంతా కాదు. తలుపులు విరక్కొట్టారు, కిటికీలు బార్లా తెరిచేశారు. అలమారాలన్నీ తీసేశారు, ఇంట్లోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా కిందపడేశారు. ఇంట్లో వున్న సోఫాలు, కుర్చీలు అన్నీ లాగిపడేశారు. పడకలన్నీ చిందరవందర చేసి, బీరువాలో గుడ్డలన్నీ తీసి కిందపడేశారు. సూట్‌కేసులు, పెట్టెలు అన్నీ అలమారాలనుంచి లాగిపడేశారు.

సితారలాంటి వాద్యం ఒకటి అలమారాలో కనపడగానే దాన్ని చూపిస్తూ "ఏమిటిది? " అడిగాడు ఒకతను.

"అది మా అన్నయ్యది. మా పెంపుడు గిన్నీ పిగ్ దానిమీద నిద్రపోయేది.."

ఆ మాట అనగానే గతుక్కుమన్నాడతను. పైనుంచి కిందకి నన్ను అదోలా చూశాడు. అది చూశాక నేను నాలిక్కరచుకున్నాను. 'నిజం చెప్పకుండా వుండాల్సింది' అనుకున్నాను నాలో నేను.

"ఎక్కడా ఎవరూ ఉన్న జాడే లేదు" తన తోటివారితో చెప్పాడా పోలీస్ ఆఫీసర్. "వీడు చూస్తేనేమో ఒంటిమీద నూలుపోగైనా లేకుండా తిరుగుతున్నాడు ఇంట్లో. అటు చూస్తేనేమో మెంటల్ కేసులా ఉంది" అన్నాడు మా అమ్మను పట్టుకొని.

దానికి మిగతావాళ్లంతా ఏం బదులు చెప్పలేదు గానీ అటు వింతగా చూస్తూనుంచున్నారు..

ఆ నిశ్శబ్దంలో వున్నట్టుండి ఒక కిర్రు చప్పుడు వినపడింది అటక మీదనుండి. మా తాతయ్య ఒక పక్కనుంచి ఇంకో పక్కకి ఒత్తిగిల్లాడేమో.

"ఏమిటది? " అడిగాడా పోలీసాఫీసర్.

నేను వారించే లోపలే ఇద్దరు పోలీసులు ఒక్క గెంతులో అటకవైపు పరిగెత్తారు.

తాతయ్య ఈ వేళలో లేవటం వల్ల ఎవరికీ ఏమీ ప్రయోజనం ఉండదు. ఆయన వూరికినే కంగారుపడతాడు. అసలే శత్రు సైనికులు తననేదో చేస్తారనే భ్రమలో ఉంటాడాయన అస్తమానం.

నేను పైకి వెళ్ళేసరికి అనుకున్నదంతా అయ్యింది. అంతా గందరగోళంగా వుంద

క్కడ. నిద్రమత్తులో శత్రు సైనికులు తన మీద కొచ్చారనుకుని ఎదురుగా ఉన్న పోలీసు దగ్గర్నుంచి తుపాకీ లాక్కొని గురి పెట్టాడు .. పోలీసుల మీదకి తాతయ్య.

ఆయన ప్రవర్తన, వేషభాషలు చూసీ చూడగానే ఆయన ఆ ఇంటి మనిషేనని అర్థమైంది వాళ్లకి. అయితే వాళ్లు పొరబడ్డా రన్న సంగతి ఆయనకెలా అర్థమయ్యేట్టు చెప్పాలి?

ఒక పోలీసు దవడను వాయగొట్టాడు. ఇంకొకతని భుజంమీద తుపాకీ పేల్చాడు. ఇది చూసి మిగిలిన పోలీసులు ఎక్కడివార క్కడే చెదిరిపోయారు. ఎలాగో ఒకలాగా అందరం బయటపడి గదికి గొళ్లెం పెట్టేశాం. కాస్త సద్దుమణగగానే ఆయన నిద్రలోకి జారుకున్నాడు.

"మా తాతయ్య మతిమరుపు మనిషి. సైన్యంలో పనిచేశాడు. మీరు సైన్యం నుంచి పారిపోయి వచ్చిన సైనికులు అను కుంటున్నాడు" వివరించాను నేను.

"ఓహో అదా సంగతి? " అన్నాడా పోలీసాఫీసర్. ఆయన కంఠంలో వినపడిన రిలీఫ్‌ను నేను పసిగట్టాను.

అయితే పోలీసులు వెనుదిరిగి వెళ్లి పోవడానికి అంత ఉత్సాహం చూపలేదు. వాళ్లపరంగా చూస్తే ఆ రాత్రి వాళ్లు సాధిం చేదేమీ లేదు. 'మీరేం భరోసా చెప్పి వచ్చార'ని పై అధికారులు అడిగితే వాళ్ల దగ్గర సమాధానం లేదు మరి, అందరూ 'ఫూల్స్' అవడం తప్ప. పైగా ఎక్కడో ఏదో సరిగా శోధించటంలేదని, సంథింగ్ రాంగ్ అనీ వాళ్ల అనుమానం. ఆ బాధ నేనర్థం చేసుకోగలను. నిజమే కదా మరి.

అక్కడే తచ్చాడటం మొదలుపెట్టారు. సన్నగా ఉన్న ఒకతను.. పత్రికా విలేఖరి అనుకుంటా.. నా దగ్గరకొచ్చాడు. మా అమ్మ బ్లౌజ్ తొడుక్కుని వున్నప్పుడు, నా పట్ల అనుమానం, ఆసక్తి రెండూ నిండి వున్నాయతని చూపుల్లో. "ఏంటి సార్ అసలు కథ? " అడిగాడు.

అతనితో నిజం చెప్పేద్దామని నిశ్చయిం చుకొని "దెయ్యాలు కనపడ్డాయి ఇక్కడే" అని చెప్పేశాను.

దాంతో అతను నావైపు కన్నార్పకుండా, సుదీర్ఘంగా చూసి అక్కణ్నుంచి కదిలాడు. పోలీసులు కూడా అతన్నే అనుసరించారు.

తాతయ్య చేతిలో దెబ్బతిన్నతను మాత్రం వెనక్కు తచ్చాడుతున్నాడు.

"ఆ ముసలాయన దగ్గర్నుంచి నా తుపాకీ తప్పనిసరిగా వెనక్కి తెచ్చుకుం టాను" అని పక్కతనితో చెప్తున్నాడు.

"వెళ్లు. కానీ ఎలా తెచ్చుకుంటావు? మేమేదీ చేయలేం" అన్నాడు ఇంకొకతను.

అసహాయంగా నిల్చున్న అతన్ని చూసి జాలేసి "మరుసటిరోజు నేనే పోలీస్‌స్టేషన్‌కి తెచ్చిస్తాన"ని చెప్పాను.

"ఏమైందతనికి? " మా అమ్మ అడిగింది.

"తాతయ్య.. అతన్ని తుపాకీతో కాల్చా డమ్మా" చెప్పాను. అప్పటికి పోలీసులు వె ళ్లిపోయారు.

"ఎందుకు"? అని అడిగింది అమ్మ.

"సైన్యం నుంచి తప్పించుకు పారిపో యిన సైనికుడు అనుకున్నట్టున్నాడు తాతయ్య" చెప్పాను.

"అంత మంచి కుర్రాడైతేనూ పాపం!" అంది అమ్మ.

మరుసటిరోజు పొద్దున్న టిఫిన్‌తినే టైమ్‌కి.. తాతయ్య రాత్రి జరిగిందంతా మర్చిపోయాడు. యథాప్రకారం హాస్యాలు మొదలెట్టాడు. 'రాత్రి జరిగిందంతా మరిచి పోయాడేమో, నమ్మలేదేమో' అనుకున్నాం అందరం మొదట.

అస్సలు మర్చిపోలేదాయన. ముచ్చటగా మూడోసారి కాఫీ తాగుతూ తమ్ముణ్ని, నన్నూ ఉరిమిచూశాడు.

"మధ్యలో ఆ పోలీసులు, హంగామా ఏమిటి నిన్నరాత్రి? " అని గద్దించాడు.


ఏం చెప్తాం ఆయనకి? V



- హోతా పద్మినీదేవి



దెయ్యం



రాత్రి పదిన్నరయింది. అరగంట కిందటే నేను, రాజేష్ భోజనం ముగించి టెర్రస్ మీదకొచ్చాం. మా ఇల్లు సిటీ అవుట్ స్కర్ట్స్‌లో వుంది. వాహనాల రణగొణ ధ్వనులు, వాయుకాలుష్యం లేకుండా పల్లెటూరిని తలపించే పరిసరాలు, చుట్టూ కొండలు, పచ్చనిచెట్లు, పచ్చికబయళ్లు, దూరంగా బొమ్మరిళ్లలా కనిపిస్తున్న గుడిసెలు, అద్భుతమైన ప్రకృతి చిత్రంలా వుంటుంది అక్కడ.

ఆరోజు అమావాస్య కావడంవల్ల ఆకాశం నల్లటి దుప్పటి కప్పుకుంది. నిశ్శబ్దం రాత్రికి కాపలా కాస్తున్నట్టుంది.

నేను రాజేష్, సిగరెట్లు వెలిగించి రిలాక్స్‌డ్‌గా చెరో కుర్చీలో కూర్చున్నాం.

“ఇంకేమిటి? చెప్పురా” అన్నాను.

"ఏముంది? ఇంజనీరింగ్ పూర్తయి, డిగ్రీ చేతికొచ్చింది. సాఫ్ట్‌వేర్ బూమ్‌తగ్గి ప్రపంచదేశాలన్నీ ఆర్థిక సంక్షోభంతో విలవిల్లాడుతున్న నేపథ్యంలో నాకు ఉద్యోగం వస్తుందనే ఆశలేదు. అందుకే చదువు కొనసాగించాలనుకుంటున్నా"

"ఎమ్. ఎస్. చేస్తావా? "

"అమెరికా వెళ్లి సెకండ్ సిటిజన్‌గా బతకడం నా అభిమతం కాదు. కొడితే ఏనుగు కుంభస్థలాన్ని కొట్టాలన్నారు పెద్దలు. అందుకే సివిల్స్‌కి ప్రిపేరవబోతున్నాను. నాలుగురోజుల్లో ఢిల్లీ ప్రయాణం. అక్కడ కోచింగ్ తీసుకుంటాను.

"వెరీగుడ్!" అభినందనగా అన్నాను.

"మరి నీ సంగతేవిట్రా"

"నేను నీ జూనియర్‌నిరా!" నవ్వేను.

"అదేంట్రా? " ఆశ్చర్యంగా అడిగేడు.

"ఆరోగ్యం బాగాలేక ఎమ్‌సెట్ సరిగ్గా రాయలేకపోయాను. అందుకే లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుని, మళ్లీ ఎమ్‌సెట్ రాశాను. మంచి ర్యాంకు వచ్చి సిటీలోని నెంబర్‌వన్ కాలేజీలో సీటొచ్చింది. నాన్నగారు చాలా ఏళ్ల కిందట ఈ ఇంటిస్థలం కొన్నారు. పల్లెటూళ్లంటే ఆయనకి ఇష్టం. మేము పల్లెటూరిలో స్థిరపడే అవకాశం ఎలాగూ లేదు కనుక పల్లెని తలపించే ఈ వాతావరణంలో ఈ ఇల్లు కట్టారు. ఆయన ఎందుకీ ఇల్లు కట్టినాగాని, నాకు హాస్టల్‌లో వుండే బాధ తప్పింది. సొంత ఇంట్లో, స్వయంపాకం చేసుకుంటూ హాయిగా చదువుకుంటున్నాను. అప్పుడప్పుడు మా అమ్మనాన్నలు వస్తుంటారిక్కడికి. నేనూ వాళ్ల దగ్గరకి వెళ్తుంటాను"

దగ్గరలో నక్క ఊళ వినిపించింది.

"ఇక్కడ నక్కలు వున్నాయేమిట్రా? " రాజేష్ అడిగాడు.

"పక్కనే శ్మశానం వుంది" అందుకని నక్కలు వస్తుంటాయి.

"శ్మశానమా!"

వాడు ఉలిక్కిపడడం ఆ మసక వెలుతురులో నాకు స్పష్టంగా కనిపించింది.

"అవును" అన్నాను, చివరంటా కాలిన సిగరెట్‌ని దూరంగా విసిరేస్తూ.

"శ్మశానం దగ్గర స్థలంలో ఇల్లు కట్టాలని మీనాన్నగారికెందుకనిపించింది? "

"శ్మశానం పక్కన మా ఇల్లు వుండడం కాదు. ఇదంతా ఒకప్పుడు శ్మశానమే. ఎవరో శ్మశానాన్ని కబ్జాచేసి ప్లాట్లుగా అమ్మేసి వుంటాడు. అలా.. అలా.. చేతులు మారి మాకొచ్చిందీస్థలం. ఇల్లు కట్టడానికి పునాదులు తవ్వుతుంటే మనిషి తాలూకు అస్థిపంజరం బయటపడింది. మరొకళ్లయితే భయపడి ఇల్లుకట్టేవారు కాదేమో! కాని మా నాన్నగారు పెద్ద పెద్ద సిద్ధాంతులని పిలిపించి హోమాలు, పూజలతో శాంతి చేయించి ఇల్లు కట్టారు"

రాజేష్ ఇబ్బందిగా కదిలాడు. "అదేం సరదారా బాబూ? "

"చెప్పానుగా ఆయనకీ వాతావరణం అంతగా నచ్చిందని"

"ఏడ్చినట్టుంది" అని రాజేష్ గొణగడం స్పష్టంగా వినిపించింది.

కరెంటు పోయింది. చీకటి ఇంకా చిక్కబడింది. ఠప్‌మని ఏదో పేలిన చప్పుడు. నిప్పుల కుంపటిలో పచ్చి వెలక్కాయని కాల్చినప్పుడు పేలిన శబ్దంలా.

ఉలిక్కిపడినట్టడిగాడు రాజేష్.

"ఏవిట్రా ఆ చప్పుడు? "

"కపాలమోక్షం అయివుంటుంది. నువ్విక్కడకి వచ్చేముందు ఎవరిదో శవం ఊరేగింపుగా మా ఇంటిముందు నుంచి వెళ్లింది" గుండెలనిండా గాలిపీల్చుకుని అన్నాను.

"అవును.. శవదహనమే. కమురు కంపు కూడా వస్తోంది"

వెంటనే రాజేష్ ముక్కు మూసుకోడం ఆ చీకట్లో కూడా కనిపించింది.

"ఒంటరిగా ఎలా వుంటున్నావురా బాబూ ఈ ఇంట్లో? "

"అలవాటయిపోయిందిరా! ఏమీ తోచనప్పుడు డాబామీద నిలబడి శవదహనాన్ని చూస్తుంటాను"

"అదేం దిక్కుమాలిన హాబీరాబాబూ? "

"నాకు శ్మశానం జీవితసత్యాలని తెలియజేస్తోందిరా! మనం ఎంత సంపాదించినా, ఎన్ని కీర్తిశిఖరాలని అధిరోహించినా మనకి మిగిలేది ఆరడుగుల నేలేనని. చనిపోయాక పిడికెడు బూడిదయ్యే ఈ శరీరం కోసం బతికి వున్నన్నాళ్లూ ఎంత స్వార్థంగా ప్రవర్తిస్తాం? "

"అపర సిద్దార్థుడిలా ఏమిటో పాపం ఇంత వైరాగ్యం? " రాజేష్ స్వరంలో వ్యంగ్యం.

"వైరాగ్యం కాదురా జ్ఞానోదయం" అన్నాను. దూరంగా చావుమేళం వినిపించింది. అది దగ్గరవుతున్న సూచనగా మేళాలు గట్టిగా వినిపించసాగాయి.

"ఎవరిదో శవయాత్ర. చూద్దాంరా" అన్నాను కుర్చీలోంచి లేస్తూ.

"వద్దులే!" అన్నాడు రాజేష్.

"ఏం భయమా? "

"నాకేం భయం? "

"మరి రా!" అన్నాను. వాడు నన్ను అనుసరించాడు. ఇద్దరం పిట్టగోడ దగ్గరకెళ్లి నిలబడ్డాం. మా ఇంటి ముందు నుంచి శవయాత్ర సాగిపోయింది.

"అదుగో శ్మశానం. శవం కాలుతోంది చూడు" అన్నాను దక్షిణం వైపు చూపిస్తూ.


కరెంటొచ్చింది. వీధిలైట్ల వెలుతురులో రాజేష్ కళ్లలో భయాన్ని స్పష్టంగా చూశాను.

★ ★ ★

మరుసటి రోజు రాత్రి... అలవాటు ప్రకారం టెర్రస్ మీద కుర్చీలో నేను, నా చేతిలో వెలుగుతున్న సిగరెట్టు. నాలుగు రోజులు నా దగ్గర వుండి వెళ్తానన్న నా బాల్యమిత్రుడు రాజేష్ ఒక్కరాత్రి వుండి ఈ రోజు ఉదయమే ఎందుకు వెళ్లిపోయాడో నాకు తెలుసు. వెళ్లే ముందు నాకు చెప్పకపోయినా, వెళ్లడం తెలుసు.

నాకెదురుగా టీపాయ్ మీదున్న సెల్‌ఫోన్ రింగయింది. వెంటనే గ్రీన్‌బటన్ నొక్కి చెవికానించుకున్నాను.





"హలో!"

"నేను రాజేష్‌నిరా!"

"అదేమిట్రా? నేను కాలేజీకి వెళ్లి వచ్చేలోగా వెళ్లిపోయావ్!"నిష్ఠూరంగా అన్నాను.

"ఇలా చెబుతున్నానని ఏమీ అనుకోకు. మీ ఇంట్లో..."

"ఆc! మీ ఇంట్లో..."

"దెయ్యం వుందిరా!"

"దెయ్యమా? "నవ్వాపుకుంటూ అన్నాను.

"అవునురా! దెయ్యమే! రాత్రి నువ్వు నీ బెడ్‌రూమ్‌లో పడుకోమని చెప్పినా, ఎ.సి. రూమ్‌లో పడుకుంటే జలుబు చేస్తుందని హాల్‌లో దివాన్‌మీద పడుకున్నానా? అర్ధరాత్రి గాజుల గలగలలు. గజ్జెలచప్పుడు వినిపించి మెలకువ వచ్చింది. ముందు భ్రమ పడుతున్నాననుకున్నాను. మళ్లీ అదే చప్పుడు. మీ ఇల్లంతటికీ నువ్వు, నేను తప్ప ఎవరూ లేరు కదా! పక్క పోర్షన్‌లో ఆడవాళ్లున్నారేమో అనుకుందామంటే మీ ఇంటిని ఎవరికీ అద్దెకివ్వలేదు. నాకు చాలా భయం వేసింది. ఆ గాజుల చప్పుడు ఎవరిదా? అని ఆలోచిస్తుంటే కిటికీ బయట తెల్లని చీరకట్టుకుని జుట్టు విరబోసుకున్న స్త్రీ... కాదు దెయ్యం! దాని కళ్లు నన్ను సూటిగా భయంకరంగా చూస్తున్నాయి"

"అరె! పోరా! ఆరోక్లాసు చదివేప్పుడే నీ స్కూల్‌బ్యాగ్‌ని దెయ్యంచేత మోయించిన ధైర్యవంతుడివి. నీకు దెయ్యమంటే భయమేమిటి? "

"మీరంతా నన్నో హీరోలా చూడాలని అప్పుడలా కథ చెప్పానురా! ఒట్టు! నేను మొదటిసారిగా దెయ్యాన్ని నిన్న మీ ఇంట్లోనే చూశాను. ఆ దెయ్యం కిటికీలోంచి నన్ను అలా చూస్తూనే వుంది. ఒకసారి నన్ను చూసి నవ్వింది. మరోసారి కన్ను గీటింది. ఇంకోసారి చెయ్యి వూపి రమ్మని సైగ చేసింది. కొన్ని నిముషాలకు దెయ్యం మాయమయినా గాజుల చప్పుడు, గజ్జెల చప్పుడు వినిపిస్తూనే వుంది. బాత్ రూమ్‌కి పోవాలన్నా భయం. కళ్లు గట్టిగా మూసేసుకుని ఆంజనేయ దండకం చదువుతూ కూర్చున్నాను. కదిలినా మెదలినా దెయ్యం నా మీద పడి పీక పిసికేస్తుందని భయం. ఒరేయ్! వెంటనే ఆఇల్లు ఖాళీ చేసెయ్యి"

"థ్యాంక్స్! ఫర్ యువర్ కైండ్ ఎడ్వయిజ్! దెయ్యం నన్నేమీ చెయ్యదు" అన్నాను, గాంభీర్యాన్ని అరువు తెచ్చుకుంటూ.

"అది కాదురా! నేను చెప్పేది విను"

"గుడ్ నైట్!" అని ఫోన్ కట్ చేశాను.

అప్పటి వరకు ఉగ్గబట్టుకున్న నవ్వు వరద గోదావరిలా ఉధృతంగా పొంగి వచ్చింది. పకపక నవ్వేశాను. ఆ నిశ్శబ్దంలో నా నవ్వు ప్రతిధ్వనించింది.

చల్లని గాలితోబాటు శవం కాలుతున్న కవురు కంపు నా నాసికాపుటాలకి సోకింది. దూరంగా నక్క ఊళలు వినిపిస్తున్నాయి.

నాకు ఆ క్షణంలో రాజేష్ గుర్తుకొచ్చాడు. వాడు నిన్నరాత్రి ఈ వాతావరణంలో ఎంత హడలిచచ్చాడో తలచుకుని మళ్లీ మళ్లీ నవ్వేను.

"మీరంతా నన్ను హీరోలా చూడాలని కథలు చెప్పానురా! నాకు దెయ్యమంటే భయం!" రాజేష్ ఫోన్‌లో చెప్పింది విని మరీ నవ్వొచ్చింది.

నవ్వి నవ్వి ఆయాసపడుతూ కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్నాను. నా మనసు బాల్యంలోకి విహంగంలా ఎగిరింది.

రాజేష్ నేను సిక్స్త్ క్లాస్ నుంచి క్లాస్ మేట్స్‌మే కాదు, మంచి ఫ్రెండ్స్‌ం కూడా. మా నాన్న బ్యాంకు మేనేజర్. రాజేష్ వాళ్ల నాన్నగారు వీడీఓ. మా నాన్నగారు గూటాల అనే చిన్న గ్రామంలో బ్యాంక్ మేనేజర్‌గా పనిచేస్తున్న రోజులవి. రాజేష్ వాళ్ల కుటుంబం మా పక్కవీధిలో వుండేది.

రాజేష్‌కి నాకు ట్యూషన్ కూడా ఒకే టీచర్ దగ్గర. దాశరథిగారని లెక్కల మేస్టారుండేవారు. సాయంకాలం ఆరుగంటల నుంచి రాత్రి ఎనిమిదింటి వరకు ట్యూషన్. ఊరి శివార్లలో వుండేది ఆయన ఇల్లు. మేమిద్దరమే కాకుండా మరో నలుగురు పిల్లలు కూడా ఆయన దగ్గర ట్యూషన్‌కొచ్చేవారు.

ఒకరోజు మేము ట్యూషన్‌లో వుండగా రాజేష్‌కి కడుపునొప్పి వచ్చింది. ఇంటికెళ్లిపోతానని మాస్టారినడిగాడు.

"ఒక్కడివీ చీకట్లో వెళ్లగలవా?" అని అడిగేరాయన.

"నాకేమీ భయం లేదండి" అని ఒక్కడూ ఇంటికి బయలుదేరాడు.

మరునాడు స్కూల్‌లో లంచ్ అవర్లో వాడు చెప్పిన కథకి కథనం ఇది.

రాత్రి వాడు ఒంటరిగా చీకట్లో నడుస్తుంటే వెనకాల మరో మనిషి నడుస్తూ వీడిని దాటి ఆగి పలకరించాడు.

"ఈ వేళప్పుడు ఎక్కడ నుంచి వస్తున్నావ్ బాబూ?"

"ట్యూషన్ నుంచండి" అన్నాడు రాజేష్.

"చీకట్లో ఒంటరిగానా? ఎంత దూరం మేస్టారి ఇల్లు?"

రాజేష్ చెప్పాడు.

"ఒక్కడివీ ఎందుకొస్తున్నావ్?"

"నాకు కడుపునొప్పిగా వుందండి"

"అయ్యో! కడుపునొప్పా? ఆ బ్యాగ్ ఇటివ్వు నేను పట్టుకుంటాను"

రాజేష్ ఫర్వాలేదు వద్దంటున్నా.. ఆ వ్యక్తి పుస్తకాల బ్యాగ్ తీసుకున్నాడు.

"మీ పేరేమిటండీ?"

"పెద్దిరాజు. అరటిపళ్ల వ్యాపారం చేసే పెద్దిరాజంటే గూటాలలో ఎవరైనా చెబుతారు"

ఆంజనేయస్వామి గుడి అల్లంత దూరంలో వుండగా బ్యాగ్ రాజేష్‌కిచ్చి "జాగ్రత్తగా వెళ్లమ్మా!" అన్నాడు పెద్దిరాజు.

రాజేష్ ఇంటి దారిపట్టాడు. చీకట్లో ఒంటరిగా అంతదూరం నడిచి వచ్చినందుకు కంగారు పడిందతని తల్లి.

"ఒక్కడినీ రాలేదు. ఆంజనేయస్వామి గుడిదాకా పెద్దిరాజు సాయమొచ్చాడు" అన్నాడు రాజేష్.

"ఎవరు? ఏ పెద్దిరాజు?" అడిగాడు రాజేష్ తండ్రి.

"అరటిపళ్ల వ్యాపారం చేస్తాడట"

రాజేష్ తండ్రి నిటారుగా అయ్యాడు. భయాశ్చర్యాలతో కళ్లు పెద్దవయ్యాయి. ఆ రాత్రి వాడు నిద్రపోతున్నాడనుకుని తల్లి, తండ్రి మాట్లాడుకుంటున్నారు.

"రెండునెలల కిందట పెద్దిరాజు అరటిపళ్ల గెలలు సైకిల్‌కి కట్టుకుని రాజమండ్రి వెళ్తుండగా కొవ్వూరు బ్రిడ్జిమీద లారీ గుద్దేసింది. అక్కడికక్కడే చనిపోయాడు. అంటే రాజేష్‌కి సాయంగా వచ్చింది, వాడి పుస్తకాల బ్యేగ్ మోసింది పెద్దిరాజు కాదు. అతని ఆత్మ!" అంటున్నాడు తండ్రి.

"బాబోయ్! నిజమా? దెయ్యం పసివెధవని ఏమీ చెయ్యకుండా వదిలేసింది! భగవంతుడు రక్షించాడు" తల్లిస్వరంలో వణుకు.

"పసివెధవ! వాడితో ఆమాట అనకు; జడిసిపోయి జ్వరం తెచ్చుకుంటాడు. వాడిని చీకటిపడ్డాక ఒంటరిగా ఎక్కడకీ వెళ్లనివ్వకు" అంటున్నాడు తండ్రి.

"చందమామ కథల్లో చదివినట్టు పెద్దిరాజు దెయ్యంగా మారి ఉపకారం చేస్తున్నాడన్నమాట" అనుకున్నాడు. వాళ్ల సంభాషణను విన్న రాజేష్.

రాజేష్ చెప్పింది విన్న నా ఒంటిమీద రోమాలు నిక్కబొడుచుకున్నాయి. లాగు తడిసిందని అనుమానం కూడా వచ్చింది. మిగతావాళ్ల పరిస్థితి కూడా మెరుగ్గాలేదు. దెయ్యానికి దడిసి వాళ్లు ట్యూషన్ మానుకున్నారు. ఆ దెబ్బతో రాజేష్ సహవిద్యార్థులలో హీరో అయ్యాడు. దెయ్యంతో మాట్లాడి, దెయ్యంచేత తన స్కూల్‌బ్యేగ్ మోయించిన ధైర్యశాలి మరి.

గతంలోంచి వర్తమానంలోకి వచ్చి మనసారా నవ్వుకున్నాను. రాజేష్‌లో అప్పటి ధైర్యం వుందో? లేదో? తెలుసుకోడానికి కస్తూరిని దెయ్యంలా నటించమన్నాను. మా కాలనీలోనే కస్తూరి తల్లితో కలిసి వుంటుంది. ఆమె టి.వి. సీరియల్స్‌లో చిన్నచితక వేషాలు వేస్తుంటుంది. నేనిస్తానన్న డబ్బుకి ఆశపడి దెయ్యంలా రాజేష్‌ని భయపెట్టింది. లేకపోతే ఇవాళ వాడు నాకీ నిజాన్ని చెప్పేవాడేకాదు.

నేను నవ్వుకుంటూ మరో సిగరెట్టు తియ్యబోయాను. సరిగ్గా నాకు పదడుగుల దూరంలో నాకెదురుగా తెల్లనిచీర, జాకెట్టు ధరించి జుట్టు విరబోసుకున్న స్త్రీ ఆకారం వెనుదిరిగి నిలబడి వుంది.

కస్తూరి ఇప్పుడు ఇక్కడకెందుకొచ్చింది? డబ్బు కోసమా? తన దెబ్బకి రాజేష్ భయపడి వెళ్లిపోయాడని ఆమెకి తెలుసేమో.. అనుకుంటూ 'కస్తూరీ! రాత్రి వేళ ఇక్కడకెందుకొచ్చావ్? డబ్బు కోసమే అయితే రేపు నేను మీ ఇంటికొచ్చి ఇస్తాను. ఎవరైనా నిన్నిక్కడ చూస్తే బాగుండదు. ఇంటికి వెళ్లు" అన్నాను.


ఆమె నావైపు తిరిగింది. ఆమె కస్తూరి కాదు. ఆమె కళ్లు ఎర్రగా కొలిమిలో కాలుతున్న ఉక్కు కడ్డీల్లా వున్నాయి. కనుగుడ్లని గుండ్రంగా తిప్పుతోంది.

చలిజ్వరం వచ్చినవాడిలా వణికిపోతూ కెవ్వున అరిచాను.

'దె.. దెయ్యం!'

తరువాత ఏమయిందో స్పృహ తప్పిన నాకు తెలియదు.

తెలుగు కథ



తిరుమలశ్రీ



క్రాస్ టాక్

ఆ పాత లెదర్ సూట్‌కేస్‌వంక సాలోచనగా చూశాడు అజీజ్. అందులో యాభైకోట్ల రూపాయలు విలువచేసే అమెరికన్ డాలర్స్- వున్నాయని ఎవరూ ఊహించలేరు. హోటల్ రూమ్‌లో ఫోమ్ బెడ్‌మీద పడుకుని మీద మెరిసే కళ్లతో ఆ సూట్‌కేస్ వంకే దీక్షగా చూస్తూన్న అజీజ్ మెదడులో గతం సినిమా రీలులా గిర్రున తిరిగింది...

పదేళ్ల క్రితం ఇరవై ఏళ్ల వయసులో దొంగ పాస్‌పోర్టు, వీసాలతో దుబాయ్‌లో ప్రవేశించాడు అజీజ్. అక్కడే పరిచయమైందతనికి సలీం, బెనర్జీ, పిళ్ళైలతో. సలీంకి నలభయ్యేళ్లుంటాయి. ఎత్తుగా, దృఢంగా వుంటాడు. హైదరాబాద్ పాతబస్తీకి చెందినవాడు. బెనర్జీ పిళ్ళైలు నలభయ్ లోపువారే. బెనర్జీది ఖరగ్‌పూర్, పిళ్లైది ముంబై. దుబాయ్‌లో ఓ స్మగ్లర్ దగ్గర కొరియర్స్‌గా పనిచేసేవారు నలుగురూ. ఆ వృత్తిలో ఆదాయంకంటె అపాయమే ఎక్కువ కావడంతో ఏదో ఒక పెద్ద చేపకు గేలంవేసి జీవితంలో స్థిరపడిపోవాలని ఆలోచించేవారు.

సలీం గర్ల్‌ఫ్రెండ్ జుబేదా. దుబాయ్‌లోని ఓ అమెరికన్ బ్యాంక్‌లో పనిచేస్తోంది. ఆమె ద్వారా ఆ బ్యాంక్ గుట్టుమట్లన్నీ సేకరించాడతను. తర్వాత దాన్ని దోచుకునేందుకు మిత్రులతో పథకం రూపొందించాడు. వరుసగా మూడు రోజులు బ్యాంక్‌కి సెలవులు వచ్చే సమయంలో ముహూర్తం పెట్టాడు. అక్కడ శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలన్నిటికీ సెలవు. ఆ తర్వాత రెండురోజులు ఎందుకో సెలవులు వచ్చాయి. దోపిడి విషయం బైటపడేలోపునే సొమ్ముతో స్విట్జర్లాండ్‌కు పారిపోవాలని నిశ్చయించుకున్నారు. అక్కడ బ్యాంక్స్‌లో ఎంత సొమ్ము డిపాజిట్ చేసినా సోర్స్ గురించి అడగరు.

దోపిడికి ముందురోజు రాత్రి అనుకోకుండా వచ్చిన జుబేదాను చూసి ఆశ్చర్యపోయాడు అజీజ్... పాతికేళ్లుంటాయి ఆమెకు. స్లిమ్‌గా, పొడవుగా, తెల్లగా అందంగా వుంటుంది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు సమ్మోహితం చేస్తుంది. సలీంతో అప్పుడప్పుడు చూడడమే తప్ప అతడామెను ఒంటరిగా ఎప్పుడూ కలవలేదు.

అందమైన తన రూపం నుంచి చూపులు మరల్చుకోలేకపోతూన్న అతని బలహీనతను గుర్తించినట్టు సమ్మోహనంగా నవ్వింది జుబేదా. చేరువగా వచ్చి చొరవగా అతని ముఖాన్ని తన వక్షానికి హత్తుకుంది. అతనికి ఊపిరి ఆగిపోయినట్టయింది. సలీమ్‌తో ఆమెకు 'లివ్ ఇన్' బాంధవ్యం వుందని అతనికి తెలుసు. ఆమెతో తాను సన్నిహితంగా వున్నట్టు తెలిస్తే సలీం సహించడు. స్నేహితుడని కూడా ఆలోచించకుండా చంపేస్తాడు.

తన ఒళ్లో పడుకుని జుబేదా చెప్పిన విషయం అజీజ్‌ని అయోమయానికి గురిచేసింది... తమ గ్యాంగ్‌లో అందరికంటె



హ్యాండ్సమ్‌గా వుంటాడు అజీజ్. ఆమె అతన్ని ప్రేమించిందట. ఆ సంగతి చెప్పడానికి సమయం కోసం ఎదురు చూస్తోందట. బ్యాంక్ దోపిడి చేయగానే సలీం తదితరుల్ని డబుల్ క్రాస్‌చేసి దోపిడి సొమ్ముతో మనిద్దరం అమెరికా పారిపోదామంది. పెళ్లి చేసుకుని భార్యాభర్తలుగా జీవించుదామంది.

అజీజ్‌కి భయం వేసింది. ఇది నిజమేనా? లేక తనను పరీక్షించేందుకు సలీమే ఆమెను తన మీద ప్రయోగించాడో బోధపడలేదు. అతని భయాలను గ్రహించిన జుబేదా అతన్ని నమ్మించడానికి కొంచెం కష్టపడవలసివచ్చింది. కోట్లతోపాటు ఆ బ్యూటీ సొంతమవుతుందంటే కాదనడానికి అతనేమీ మూర్ఖుడు కాడు.

నమ్మినవారినే సులభంగా మోసగించగలరు ఎవరైనా! జుబేదా సలీంకి ప్రాణం. ఆమెను నమ్మినట్టు ఇంకెవరినీ నమ్మడతను. దోపిడి సొమ్మును ముందుగా జుబేదా ద్వారా దేశం దాటించడానికి ముందుగానే నిర్ణయమయింది. ప్రమాదవశాత్తూ తాము పట్టుబడ్డా సొమ్ము చేజారిపోకూడదనే ఆ ఏర్పాటు. దాన్ని క్యాష్ చేసుకుందామంది జుబేదా. ప్లానంతా ఆమెదే. ఆమె చెప్పినట్టు చేయడమే అజీజ్ వంతు.

గురువారం రాత్రి పథకం ప్రకారం బ్యాంక్ దోపిడి జరిగింది. జుబేదా సాయంతో అంతకు ముందే బ్యాంక్ అలారం అవుటాఫ్ ఆర్డర్ చేశారు... సొమ్ము జుబేదాకి అందింది. మిత్రులు నలుగురూ తలో దిక్కుకీ తప్పుకున్నారు. సోమవారం ఉదయం బ్యాంక్ తెరిచాకగాని దోపిడి విషయం బైటపడదు. ఆ లోపునే తామంతా దుబాయ్ విడిచేయాలన్నది ప్లాన్. ఆదివారం రాత్రి అంతా ఏర్‌పోర్ట్‌కి విడివిడిగా చేరుకోవాలి. విడివిడిగానే స్విట్జర్లాండ్‌కి ప్రయాణం చేయాలి. జుబేదా అప్పటికి సొమ్ముతోపాటు అక్కడ తమ కోసం ఎదురుచూస్తూంటుంది... అదీ ప్లాన్.

ఐతే జుబేదా ప్రతిపాదనతో అజీజ్ ఆలోచనలు కొత్త పుంతలు తొక్కాయి. ఆ రాత్రి జుబేదా సొమ్ముతో అతని వద్దకు వచ్చింది. తాము డబుల్ క్రాస్ చేసినట్లు మిగతావారు గ్రహించేలోపే అక్కణ్ణుంచి ఎగిరిపోయేందుకు ఏర్పాటు చేసిందామె.

"దుబాయ్‌కి వీడ్కోలు డ్రింక్ ఇది!" అంటూ ఇద్దరూ హాట్ డ్రింక్స్ తీసుకున్నారు. తరువాత తమకంతో రతికేళి.. ఆ తర్వాత మరోసారి డ్రింక్స్ తీసుకున్నారు.

అయితే ఈసారి ఆమెకిచ్చిన డ్రింక్‌లో విషం కలిపాడు అజీజ్. ఆ విషయం గ్రహించేలోపునే జుబేదా అసువులు బాసింది. శవాన్ని హోటల్ బాత్‌టబ్‌లో పడేసి టబ్‌ని నీటితో నింపేశాడు.

నమ్మిన సలీంనే మోసగించిన జుబేదా ఏదో ఒకరోజున తననూ మోసగించదన్న గ్యారంటీలేదు. చేతికి వచ్చిన సొమ్మును ఆమెతో పంచుకోవడానికి దురాశ అడ్డువచ్చింది. అందుకే ఆమె అడ్డు తొలగించుకున్నాడు. జుబేదా కనిపించకపోవడంతో ఆమె సొమ్ముతో పరారయింది అనుకుంటారు. తనని ఎవరూ అనుమానించరు. అదీ అజీజ్ ఆలోచన.

సొమ్మును ఓ పాత సూట్‌కేస్‌లోకి మార్చి పెట్టెను సీల్ చేసాడు అజీజ్. ఓ ఏజెంట్ ద్వారా దాన్ని ఇండియాకి వెళ్లే నెక్ట్స్‌షిప్‌లో స్క్రాప్ కింద బుక్ చేశాడు. కన్సైన్‌మెంట్ ఇండియా చేరడానికి నాలుగైదు నెలలు పడుతుంది. ఆ లోపున విషయం పాతబడిపోతుంది.

హాంకాంగ్ వెళ్లే ప్లేన్‌కి అంతకుముందే మారుపేరుతో సీట్ బుక్ చేసుకున్నాడు. మర్నాడు ఏర్‌పోర్ట్‌కి వెళ్తూ దారిలో ఆగి పోలీస్‌లకు ఫోన్ చేశాడు. అమెరికన్ బ్యాంక్ దోపిడి విషయం చెప్పి, అందుకు కారకులైన గ్యాంగ్ సలీం, బెనర్జీ, పిళ్లైలు ఏయే హోటళ్ళలో దాక్కున్నదీ సమాచారం అందించాడు.

ఓ గంట తరువాత ఏర్‌పోర్ట్‌లోని టీవీలో కనిపించిన దృశ్యం చూసి నవ్వుకున్నాడు. బ్యాంక్ దోపిడి నేరంకింద అతని మిత్రత్రయం అరెస్టయి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కి తరలింపబడుతున్న దృశ్యమది!

హాంకాంగ్‌లో రెండునెలలు గడిపి అక్కణ్ణుంచి మాల్‌దీవ్స్‌కి వెళ్లాడు అజీజ్. కన్సయిన్‌మెంట్ చేరుకునే సమయానికి ఇండియాకి వచ్చాడు. ముంబై పోర్ట్‌లో కస్టమ్స్ సిబ్బంది చేతులు తడిపి సూట్‌కేస్‌తో హైద్రాబాద్ చేరుకున్నాడు. ఎవరికీ అనుమానం కలగకుండా ఓల్డ్‌సిటీలోని ఓ చిన్న హోటల్లో బసచేసాడు.

స్మగ్లింగ్ డీల్స్‌చేసే వ్యక్తులతో కొంత పరిచయముంది అజీజ్‌కి. వారిని వెతికి పట్టుకోవడానికి కొద్ది రోజులు పట్టింది. తన వద్దనున్న డాలర్స్‌ని కొద్ది కొద్దిగా మార్చడానికి పూనుకున్నాడు.

ఆ రోజు సాయంత్రం హోటల్ రూమ్‌లో కూర్చుని తన కాంటాక్ట్ నుంచి కాల్ కోసం ఎదురుచూస్తున్న అజీజ్, ల్యాండ్‌లైన్ మోగడంతో లేచివెళ్లి రిసీవర్ అందుకున్నాడు. 'హలో', హలో' అంటే అటువైపు నుంచి జవాబు లేదు. డిస్కనెక్ట్ అయింది. రిసీవర్ పెట్టేసి వచ్చి కూర్చున్నాడు. రెండు నిముషాల తరువాత మళ్లీ మోగింది ఫోన్. వెళ్లి రిసీవర్ తీసాడు. కొద్ది సెకన్ల నిశ్శబ్దం అటువైపు. అనంతరం ఏదో క్రాస్ టాక్ వినవచ్చింది. ఎవరో ఇద్దరు వ్యక్తుల సంభాషణ అది-

'రహీం! జాగ్రత్తగా విను. ఈ రోజు రాత్రి అమీర్‌పేటలోని 'దిల్‌షుక్' బార్‌కి వెళ్లు. కౌంటర్లో ఓ ఆంగ్లో- ఇండియన్ యువతి ఉంటుంది. ఆమె వద్దకు వెళ్లి వేయి రూపాయలకు చిల్లర అడిగి వంద రూపాయల నోటు ఇయ్యి. ఆమె పది వంద నోట్లతో బాటు ఓ సీల్డ్ కవరూ, ఓ మూవీ టికెటూ ఇస్తుంది నీకు. సికింద్రాబాద్ మంజు థియేటర్‌లో ఆడుతూన్న ఓ ఇంగ్లీష్ పిక్చర్ నైట్‌షోకి చెందిన టికెట్

అది. ఆ థియేటర్‌కి వెళ్లి షో మొదలయ్యాక లోనికి వెళ్లు. టికెట్‌లో వున్న సీటు నంబర్‌లో కూర్చో. ఆ సీటుకి ఇరువైపులా సీట్లు ఖాళీగా ఉంటాయి. షో సగంలో ఓ యువతి వచ్చి నీ పక్క సీట్లో కూర్చుంటుంది. ఆమె నిన్ను వంద రూపాయలకు చిల్లర అడిగి వేయి రూపాయల నోటు ఇస్తుంది. పది రూపాయల నోట్లు పది ఇవ్వు. చిల్లరతో పాటే నీ దగ్గరున్న కవర్ని కూడా ఆమె చేతిలో పెట్టు. తరువాత చీకట్లోనే నిష్క్రమిస్తుందామె. నువ్వు మాత్రం షో ముగిసేంతవరకు థియేటర్‌లోంచి కదలొద్దు..." గబగబా చెప్పుకుపోయాడు ఓ వ్యక్తి.

"ఎవరా యువతి భాయ్? అందంగా ఉంటుందా? " కుతూహలంగా అడిగాడు రహీం. "పిచ్చివేషాలేయకు చిక్కుల్లో పడతావ్!" హెచ్చరించాడు మొదటి వ్యక్తి.

రహీం కుతూహలం చావనట్టుంది. "ఆ కవర్లో ఏముంది? " అడిగాడు మళ్లీ.

"అరె, బేవకూఫ్! అనవసరపు ఆరాలకు పోయి ప్రాణాలు పోగొట్టుకోకు' కటువుగా అన్నాడు మొదటి వ్యక్తి. "చెప్పినట్టు చేయడమే నీ పని. ఏ మాత్రం పొరపాటు జరిగినా పర్యవసానం ఎలా వుంటుందో నీకు తెలియనిది కాదు"

"సరే, సరే ఆ కవర్లో ఏముంటే నాకెందుకు? నా కష్టానికి తగ్గ ఫలం ముడితే చాలు" అన్నాడు రహీం.

"భేష్! షో అయ్యాక నా దగ్గరకు రా. నీ ఫీజు తీసుకుపోదువుగాని" అనేసి మొదటి వ్యక్తి ఫోన్ కట్ చేసేశాడు.

టెలిఫోన్ సైలెంట్ అయిపోయాకగాని అజీజ్ తేరుకోలేదు. అనుకోకుండా చెవిన పడ్డ ఆ సమాచారం అతన్ని నిలువనీయలేదు. ఆ కవర్లో అతి ముఖ్యమైనదీ ఏదో వుందని అర్థమైపోయింది. ఆపరేషన్ కోడ్ తెలిసిపోయింది కనుక రహీం కంటే ముందుగా తానే వెళ్లి ఆ కవర్ని కైవసం చేసుకోవాలనుకున్నాడు. టైమ్ చూసుకున్నాడు. 'దిల్‌షుక్' బార్‌కి వెళ్లడానికి రెండు గంటల టైముంది... సొమ్ములున్న సూట్‌కేస్‌ని బెడ్ క్రిందకు తోసేసి బెడ్ షీట్ కప్పేశాడు.

ఫేడెడ్ జీన్స్‌లో వైట్ ఎల్లో కలర్ టీషర్టు టక్ చేశాడు. కళ్లద్దాలు ఫెల్ట్ హ్యాట్ పెట్టుకున్నాడు.

అంతలోనే సందేహం కలిగింది అతనికి- తాను రహీమ్‌లా నటించగలడా అని! అయితే అది క్షణికం మాత్రమే.

ఓ గంట తరువాత రూమ్‌కి తాళం వేసి బైటకు నడిచి ఆటో ఎక్కాడు. అమీర్‌పేటలోని మైత్రీవన్ దగ్గర ఆటో దిగి టైమ్ చూసుకున్నాడు. ఎనిమిది గంటలకు పది నిముషాలు వుంది... మైత్రీవన్‌కీ, ఎస్సార్ నగర్‌కీ మధ్య ఓ గల్లీలో వుంది 'దిల్‌షుక్' బార్. ఆకర్షణీయమైన నియోన్‌లైట్లతో ఆహ్వానం పలుకుతోంది బార్.

బార్ ముందు ఆగి వాచ్ చూసుకున్నాడు అజీజ్. ఎనిమిది గంటలు కావస్తోంది. గుమ్మం దగ్గర నిలుచుని గ్లాస్ డోర్‌లోంచి లోపలికి చూశాడు. కౌంటర్లో ఆంగ్లో ఇండియన్ యువతి కూర్చుని కస్టమర్స్‌ని స్వీట్ స్మైల్‌తో పలుకరిస్తోంది.

ఆమె వద్దకు నడుస్తూంటే "వెల్‌కమ్, సర్!" అంటూ మృదుస్వరంతో, మధురహాసంతో విష్ చేసిందామె.

"వేయి రూపాయలకు చిల్లర కావాలి" అంటూ వంద రూపాయలనోటు ఆమె ముందుంచాడు అతను.

హఠాత్తుగా ఆమె వదనంలో రంగు కొద్దిగా మారింది. అంతలోనే ఆమె పెదవులపైన మందహాసం! "ష్యూర్ సర్!" అంటూ ఆ నోటు తీసుకుని వంద రూపాయల నోట్లు పది ఆమె లెక్కిస్తుంటే ఓరకంట పరిసరాలను సర్వే చేశాడు అజీజ్. అసలు వ్యక్తి రహీం- ఏ క్షణంలోనైనా అక్కడికి రావచ్చునన్న భయంతో.



నోట్లతోపాటు ఓ మూవీ టికెట్‌ని టేబుల్ మీద పెట్టిందామె. వాటిని తీసుకుని బ్యాక్ పాకెట్‌లో పెట్టుకున్నాడు. తరువాత తొడుక్కున్న టాప్‌లోంచి తెల్లటి పొడవాటి కవర్ ఒకటి బైటకు తీసి అతని చేతిలో పెట్టింది. దాన్ని షర్ట్ లోపలికి తోసేసుకున్నాడు.

అజీజ్ డోర్ తెరుచుకుని బైటకు వస్తూంటే, ముప్పై ఏళ్ల వ్యక్తి ఒకడు వాచ్ చూసుకుంటూ హడావుడిగా లోపలికి వస్తూ అతన్ని గుద్దుకున్నాడు. 'సారీ' చెప్పి లోపల ప్రవేశించాడు.

బైటనుంచి గ్లాస్ డోర్ ద్వారా లోపలికి చూశాడు అజీజ్. అతడే రహీం అయి వుండవచ్చుననిపించింది.

అంతే! గబగబా బైటకు నడిచాడు. తన గుట్టు రట్టవకముందే వీలయినంత దూరంగా అక్కణ్ణుంచి జారుకోవాలని బార్ పక్కనున్న సందులో ప్రవేశించాడు. ఫెల్ట్ హ్యాట్‌ని మురికికుంటలోకి విసిరేశాడు. కళ్లద్దాలను దూరంగా పారేశాడు. జుత్తంతా చిందరవందరగా చేసేసుకున్నాడు. మరో సందులో నుంచి మెయిన్ రోడ్ చేరుకున్నాడు. అటువైపు వస్తున్న ఆటోని ఆపి ఎక్కేశాడు. బాలానగర్ పోనివ్వమన్నాడు. తననెవరైనా వెంబడిస్తున్నారేమోనన్న అనుమానంతో మధ్య మధ్య వెనక్కి చూస్తూనే వున్నాడు. బాలానగర్‌లో ఆటో దిగి, రోడ్డు క్రాస్‌చేసి సిటీబస్ ఎక్కాడు. బేగంపేటలో దిగి పరిసరాలను జాగ్రత్తగా గమనిస్తూ రైల్వేస్టేషన్ వైపు నడిచాడు. ఫలక్‌నుమాకి టికెట్ తీసుకుని, పది నిముషాలలో వచ్చిన లోకల్ ట్రెయిన్ ఎక్కాడు.

షర్ట్ లోపల గుండెల్ని తడుముతూన్న కవర్ అతనిలో కుతూహలాన్ని పెంచుతోంది. త్వరగా దాన్ని తెరిచి అందులో ఉన్న రహస్య పెన్నిధి ఏమిటో తెలుసుకోవాలని ఆత్రుతగా వుంది. కాని, బార్ నుంచి తిన్నగా తన హోటల్‌కి వెళ్లడం రిస్క్‌తో కూడుకున్న పని. తన ఊహే నిజమైతే, బార్‌లో తనకు డ్యాష్ ఇచ్చిన వ్యక్తి రహీమే అవ్వాలి. అంతేకాదు, రహీంని కనిపెట్టి వుండేందుకు అతనికి తెలీకుండా బార్‌బైట అతని బాస్ మనుషులు కూడా వుండొచ్చును. కవర్ రాంగ్ హ్యాండ్స్‌లో పడినట్లు తెలిసిన మరుక్షణం ఏం జరుగుతుందో అజీజ్‌కి తెలుసు. ఆల్ ద హెల్ విల్ బ్రేక్. ఆ యువతి ద్వారా తన ఆనవాళ్లు తెలుసుకున్న ఆ వ్యక్తులు తక్షణమే తన కోసం గాలింపు మొదలుపెడతారు. అందుకే బసను చేరుకునేందుకు అన్ని మార్గాలను, సాధనాలను వాడుకున్నాడు.

అజీజ్ ఫలక్‌నుమాలో దిగి ఓ రెస్టారెంట్‌కి వెళ్లాడు. అక్కడ బిర్యానీ తిని చాయ్ తాగాడు. బైటకు వచ్చి ఆటో ఎక్కి చార్మినార్ దగ్గర దిగాడు. అక్కణ్ణుంచి షాలీబండ వరకు నడచి వెళ్లాడు. ఎయిమ్‌లెస్‌గా రెండు మూడు వీధులు తిరిగి తన హోటల్ చేరుకున్నాడు. అప్పటికి రాత్రి పదకొండు దాటింది.

సెకండ్ ఫ్లోర్‌లో వున్న తన రూమ్ బైట నిల్చుని టీషర్ట్ లోపల వున్న కవర్ని చేత్తో తడిమి చూసుకున్నాడు. జేబులోంచి 'కీ' తీసి రూమ్ తాళం తెరిచాడు. లోపల ప్రవేశించి తలుపు మూస్తూంటే, తలుపు క్రింది సందులోంచి హోటల్‌బాయ్ వేసిన ఉర్దూ ఈవెనింగ్ న్యూస్‌పేపర్ 'ఖబర్' కనిపించింది. దాన్ని టీపాయ్ మీద వేస్తూంటే- తాటికాయంతటి అక్షరాలతో ఫ్రంట్‌పేజ్‌లో బాక్స్ కట్టి ప్రచురించిన వార్త మీద పడింది దృష్టి. 'బివేర్ ఆఫ్ హైటెక్ తీవ్స్!' పతాక శీర్షికతో ప్రచురించిన ఐటెమ్ అది. కుతూహలంగా చదివాడు అజీజ్. చదువుతున్నంతసేపూ ముఖంలో రంగులు మారాయి.

దాని సారాంశం ఇది- 'ఆ మధ్య ట్విన్ సిటీస్‌లో కొత్తరకం ఇళ్ల దోపిడీలు జరుగుతున్నాయి. దొంగలు ముందుగా అనుకూలంగా ఇంటిని ఎంచుకుంటారు. తరువాత టెక్నాలజీ ఉపయోగించి విక్టిమ్ టెలిఫోన్‌లో 'క్రాస్‌టాక్' వినియోగించేలా చేస్తారు. కోడ్‌లో మాట్లాడుకుంటున్నట్లు నటిస్తూ ఏదో రహస్యపు పెన్నిధి వున్న 'కవర్' గురించి మాట్లాడుకుంటారు. విక్టిమ్స్‌లో కుతూహలాన్నీ, ఆశనూ రేపుతారు. వారి సంభాషణను ఆలకించిన విక్టిమ్ దురాశతో ఆ కవర్ని సంగ్రహించేందుకు నిర్ణీత వేళకు బైటకు వెళ్లగానే ఫ్రాడ్‌స్టర్స్ ఆ ఇంట్లో ప్రవేశించి దోచుకుంటారు. చివరికి ఆ కవర్లో తాము ఆశించినట్టు ఏమీ లేదనీ, అదంతా పెద్ద హోక్స్ అనీ విక్టిమ్స్ గ్రహించేసరికి ఆలస్యమైపోతుంది. ఆ మధ్య నగరంలో జరిగిన ఇటువంటి కేసులు కొన్ని తమ దృష్టిలోకి రావడంతో, ప్రజల్ని అప్రమత్తంగా వుండాలనీ, మోసపోవద్దనీ పోలీసులు హెచ్చరిక చేశారు. ఎవరి ఫోన్‌లోనైనా అటువంటి క్రాస్‌టాక్

వినవచ్చినట్టయితే తక్షణమే పోలీసు కంట్రోల్ రూమ్‌కి తెలియపరచవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు...!

ఆ రిపోర్ట్ పూర్తిగా చదివిన అజీజ్ తెల్ల బోయాడు. వెంటనే షర్ట్ లోపలి నుంచి కవర్ బైటకు తీసి ఆత్రుతగా చింపాడు. లోపల ఓ ఎరుపురంగు కాగితంపై 'దురాశ దుఃఖానికి చేటు!' అని ఉంది.

అదిరిపడి కంగారుగా బెడ్‌కింద చూశాడు. లెదర్‌కేస్ కనిపించలేదు.

గుండె గుభేల్‌మంది. యాభై కోట్లు! అదృశ్యమైపోయాయి. జుత్తు పీక్కున్నాడు. ఆ సొమ్ము విషయం ఎవరికి తెలుసు? ఎలా తెలుసు? ?...నిస్సత్తువతో తల పట్టుకుని మంచంమీద కూలిపోయాడు.

ఎంతసేపు వుండిపోయాడో తెలీదు. డోర్‌బెల్ మోగడంతో ఉలిక్కిపడి హోటల్ బాయ్ అయి వుంటాడని తలుపు తెరిచిన అజీజ్ గుమ్మంలో ప్రత్యక్షమైన మనుషుల్ని చూసి గతుక్కుమన్నాడు.

అతన్ని తోసుకుంటూ లోపలికి వచ్చి తలుపు మూసేసారు ఆ ముగ్గురూ- సలీం, బెనర్జీ, పిళ్ళైలు! వారి చేతుల్లో పిస్టల్స్!

నిముషాల తేడాలో అజీజ్‌కి రెండో షాక్ అది. నోట మాట రాలేదు.

"మిత్రద్రోహి! మమ్మల్ని డబుల్‌క్రాస్ చేసి సొమ్మంతా కాజేయాలనుకున్నావ్ కదూ? " తీక్షణంగా అన్నాడు సలీం.

"జుబేదాని చంపేసి సొమ్ము లాక్కుని పారిపోతే కనిపెట్టలేం అనుకున్నావ్ కదూ? " ఉరిమాడు బెనర్జీ.

"మా గురించి పోలీస్‌కి ఇన్‌ఫాం చేసి పట్టించావు. మేమిక జైలునుంచి బయటపడలేమనుకున్నావ్ ఔనా? " అన్నాడు పిళ్ళై.

గజగజ వణికిపోయాడు అజీజ్. ఏదో చెప్పబోయాడు. గొంతు పెగల్లేదు.

"జుబేదా మనల్నందర్నీ డబుల్ క్రాస్ చేసి సొమ్ముతో పారిపోయిందనుకున్నాం మొదట. నువ్వు అరెస్ట్ కాకపోవడంతో తికమకపడ్డాం. జుబేదా శవం బైటపడటం నీ జాడ తెలీకపోవడంతో విషయం అర్థమైపోయింది మాకు" కఠిన స్వరంతో చెప్పుకుపోయాడు సలీం. "ఎలాగో జైలు నుండి బైటపడ్డాం. నిన్ను ట్రేస్ చేయడానికి ఇన్నాళ్లు పట్టింది".

"బోలో, సొమ్ము ఎక్కడ? " బెనర్జీ, పిళ్ళైలు ఒకేసారి అడిగారు.

"అది... అది ఏదో చెప్పాలనుకున్నాడు అజీజ్. గొంతు సహకరించలేదు.

"ఎక్కడ దాచావ్? " గర్జించాడు సలీం.

"ముఝే మాఫ్‌కరో భాయ్!" కష్టం మీద గొంతు పెగుల్చుకున్నాడు అజీజ్. "సొమ్ము... దొంగలు ఎత్తుకుపోయారు"

అజీజ్ ముఖం మీద కోపంతో బలంగా గుద్దాడు సలీం. వెనక్కి తూలిపోయాడు అజీజ్. ముక్కునుంచి, నోటి నుంచి రక్తం చిప్పిల్లింది. పన్నొకటి ఊడిపోయింది. "సచ్‌భాయ్! నిజమే చెబుతున్నా" అతని మాటలు నూతిలోంచి వచ్చాయి. "తప్పు చేశాను. కారణం జుబెదాయే.. కానీ ఇంతకు ముందే ఈ గదిలో దొంగలుపడి సొమ్మెత్తుకుపోయారు."

అప్పటికే గదంతా గాలించిన బెనర్జీ, పిళ్ళైలు నిరాశతో సలీం దగ్గరకు తిరిగి వచ్చారు. "సలీం భాయ్! వీడు సొమ్మును దాచేసి నాటకమాడుతున్నాడు" అన్నాడు బెనర్జీ ఆగ్రహంగా.

"నై నై మై సచ్ బోల్ రహా హూఁ" అరిచాననుకున్నాడు అజీజ్. తన మాటలు తనకే వినిపించలేదు.

"ఈ సలీంతో ఆట ప్రాణాలతో చెలగాటం అని తెలీదుబే, బేవకూఫ్? " మళ్లీ దవడ పగలగొట్టాడు సలీం.

"ప్లీజ్, సలీం భాయ్! నన్ను నమ్ము... జరిగిందేమిటో చెబుతాను విను" ప్రాధేయపడ్డాడు అజీజ్.

సమాధానంగా... పిస్టల్స్ మూడూ నెమ్మదిగా పైకి లేచాయి... V

అమెరికన్ కథ

-డబ్ల్యు డబ్ల్యు జాకోబ్స్



మూడుకోరికలు

అనువాదం : రాణి

చలి, తేమ పెద్దగాలేని ఆ రాత్రి లాబర్మ్ బంగళా కిటికీలకు తెరలు వేసేసి ఉన్నాయి. ఫైర్‌ప్లేస్‌లో మంట మండుతోంది ఎర్రగా. జుత్తునెరిసిన వృద్ధురాలు మిసెస్ వైట్ మంటకు దగ్గరగా కూర్చుని అల్లికపనిలో ఉంది.

మిస్టర్ వైట్.. ఆయన కొడుకు హర్బర్ట్‌వైట్‌లు చదరంగం ఆడుతున్నారు. తను వేసిన తప్పుడు ఎత్తును కొడుకు గమనించకుండా దృష్టి మళ్లించేందుకు- "గాలిహోరు విన్నావా? ఎంత గట్టిగా విన్పిస్తోందో?" అన్నాడు మిస్టర్ వైట్.

"ఊc" అన్నాడు హర్‌బర్ట్ ఆటను పరిశీలిస్తూ. అతడి కళ్లు మెరిశాయి. తండ్రి పొరపాటు తెలిసిపోయింది.. ఒక్క ఉదుటన 'చెక్' పెట్టేసి ఆట ముగించేశాడు.

"అతను ఈ రాత్రి రాకుండా ఉంటే బాగుణ్ను" గొణిగాడు మిస్టర్ వైట్.

“స్నేహితుడా? ” అడిగాడు కొడుకు.

“మన ఖర్మకొద్దీ ఇలాంటి ప్రాంతాలలో ఉండాల్సి వస్తోంది.. రోడ్డేమో బురదతో అడుగేస్తే దిగబడుతుంది. ఇంకోపక్క రోడ్డంతా వరద..” అన్నాడు మిస్టర్‌వైట్.

“ఎందుకా చిరాకు? ఈసారి గేమ్ నువ్వే గెలుస్తావులే” భర్తను ఊరడించింది మిసెస్ వైట్.

ఆయన తలెత్తేసరికి తల్లీకొడుకులు ఒకరినొకరు చూసుకుని ముసిముసిగా నవ్వుకోవడం కంటపడింది.

అంతలో బంగ్లా గేటు తెరిచిన శబ్దం..

“అతనొచ్చినట్లున్నాడు”అన్నాడు కొడుకు.

పెద్దాయన గభాల్నలేచి తలుపుతెరిచాడు. వచ్చిన వ్యక్తి పొడవుగా, దృఢంగా ఉన్నాడు. పెద్దకళ్లు.. ఎర్రని రంగు.

“సార్జెంట్ మేజర్ మోరిస్” తన భార్యా బిడ్డలకు పరిచయం చేశాడు మిస్టర్ వైట్.

అతను ఫైర్‌ప్లేస్‌కు పక్కనున్న కుర్చీలో కూర్చున్నాడు. విస్కీసీసా, గ్లాసులు తెస్తున్న మిత్రుడ్ని తృప్తిగా చూశాడతను.

మూడోగ్లాసు పూర్తిచేసేసరికి అతడి కళ్లలో వెలుగొచ్చింది. యుద్ధాలు, సాహస కృత్యాల గురించి భుజాలెగరేస్తూ అతను చెబుతుంటే వాళ్లు ఆసక్తిగా విన్నారు.

“ఇరవయ్యొక్కేళ్లయింది మోరిస్ వెళ్లి..” కుటుంబసభ్యులకు చెప్పాడు వైట్.

“..అతని మాటలు వింటుంటే నాకూ ఇండియా వెళ్లాలని ఉంది.. వింతలూ విడ్డూరాలను చూడ్డానికి” అన్నాడు మళ్లీ.

ఖాళీగ్లాసు కిందపెడుతూ నిట్టూర్చాడు మోరిస్.

“అక్కడి పురాతన గుళ్లని, సాధువుల్ని, గారడీవాళ్లని చూడాలని ఉంది..” అన్నాడు మిస్టర్ వైట్. తిరిగి ఏదో గుర్తొచ్చినట్టు అడిగాడతను, “మోరిస్ ఆరోజు నువ్వేదో కోతిపంజా అన్నావే.. ఏంటది? ”

మోరిస్ ముఖంలో ఉలికిపాటు.

“కోతిపంజానా? ” కుతూహలంగా అడిగింది మిసెస్ వైట్.

“అబ్బే! అదో గారడీ! అంతే” అనాసక్తిగా అన్నాడు మోరిస్.

శ్రోతలు ముగ్గురూ అతనింకేం చెబుతాడోనని వినడానికి ముందుకు జరిగారు.

మిస్టర్ వైట్ మోరిస్ గ్లాసును మళ్లీ విస్కీతో నింపాడు.

మోరిస్ తన జేబులో చెయ్యిపెట్టి “చూడటానికి ఇదొక చిన్న పంజా. ఎండబెట్టినట్టున్నారు” అంటూ జేబులోనుంచి బయటకు తీశాడు.. దాన్ని చూడగానే మిసెస్ వైట్ ముఖం వికారంగా పెట్టింది. కొడుకు మాత్రం దాన్ని పరీక్షగా చూశాడు.

“దీనిలో విశేషం ఏముంది” అంటూ కొడుకు చేతిలోంచి దాన్ని అందుకొని అటూ ఇటూ తిప్పి చూసి బల్లపై పెట్టాడు మిస్టర్ వైట్.

“ఓ ముసలి సాధువు ఇచ్చాడిది. ముగ్గురు వ్యక్తులు దీంతో మూడేసి కోరికలు కోరుకోవచ్చు” చెప్పాడతను.

“బాగుంది. మీరు కోరారా సార్? ” అడిగేడతన్ని హర్‌బర్ట్.

అతడి ముఖం పాలిపోయింది. మెల్లగా “నేను కోరినవి పొందాను” అన్నాడు.

“నిజంగా మీ కోరికలు నెరవేరాయా? ” మిసెస్ వైట్ కుతూహలంగా అడిగింది.

“అవును” చెప్పాడు మోరిస్. ఎందుకో అతడి చేయి వణికింది.

“ఇంకెవరైనా కోరుకున్నారా? ” మళ్లీ అడిగింది మిసెస్ వైట్.

“మొదటివ్యక్తి మూడు కోరికలూ కోరాడు. మొదటి రెండూ ఏం కోరాడో తెలియదుగానీ మూడోది మాత్రం చావును కోరుకున్నాడు. అందువల్లే అది నా చేతికి వచ్చింది” చెప్పాడు మోరిస్.

“మోరిస్, నువ్వు మూడు కోరికలూ కోరితే దాన్ని ఇంకా దగ్గరెందుకు ఉంచుకున్నట్లు? ” అడిగేడు మిస్టర్ వైట్.

“అమ్మేయాలని వుందికానీ ఎవరు

కొంటారు? నేచెప్పేది ఏదో కాకమ్మకథ అనుకుంటారు. లేదంటే దాని మహిమను పరీక్షించాక డబ్బిస్తామంటారు” అంటూనే దాన్ని చటుక్కున ఫైర్‌ప్లేస్‌లో మండుతున్న మంటల్లోకి విసిరాడు మోరిస్.

మిస్టర్‌వైట్ చటుక్కున దాన్ని మంటల్లోంచి బయటకు లాగాడు.

“నీకు అక్కర్లేకపోతే నాకిచ్చేయరాదా? ”

“ఇవ్వను. నేను కాల్చేయాలనుకుంటే నువ్వే తీశావు. తర్వాత ఏం జరిగినా నాపూచీ లేదు. ఇప్పటికైనా దాన్ని ఆ మంటల్లో పారెయ్” అన్నాడు మోరిస్.

మిస్టర్ వైట్ తల అడ్డంగా వూపాడు. చేతిలోని పంజాను పరిశీలనగా చూస్తూ “ఎలా కోరుకోవాలి? ” అడిగేడు మోరిస్‌ను.

“కుడిచేత్తో పట్టుకొని, నీ కోరికను గట్టిగా కోరుకో” స్నేహితుడి ముఖంలోకి చూస్తూ మళ్ళీ అన్నాడు మోరిస్ “ఫలితాల గురించి మళ్లీ నిన్ను హెచ్చరిస్తున్నా”

“ఇదేదో కథలా ఉంది” అంటూ భోజనాలు ఏర్పాటు చేయటానికి లేచింది మిసెస్ వైట్. తర్వాత భర్తతో “నాకు నాలుగు జతల చేతులిమ్మని కోరాలనిపిస్తోందా? ” అంది నవ్వుతూ.

మిస్టర్‌వైట్ కోతిపంజాను జేబులోంచి పైకి తీశాడు. మోరిస్ కంగారుగా వారిస్తూ “నువ్వేమైనా కోరాలనుకుంటే కాస్తంత తెలివిగా కోరుకో” అన్నాడు.

అప్పటికి దానిని తిరిగి జేబులో పెట్టుకుని స్నేహితుడిని డైనింగ్ టేబుల్ దగ్గరకు తీసుకువెళ్ళాడు మిష్టర్ వైట్. భోజనాలయ్యాక మోరిస్ వెళ్ళిపోయాడు.

“ఆ కోతిపంజా గురించి చెప్పిందంతా కట్టుకథ అనుకుంటా” అన్నాడు హర్‌బర్ట్.

“అతనికేమైనా ముట్టచెప్పావా? ” మిసెస్ వైట్ భర్తను అడిగింది.

“ఆ.. ఏదో కొద్దిగా. అతడసలు ఇష్టపడలేదు. వెళ్తూ కూడా దానిని అవతల పారేయమని చెప్పాడు”

“..మనం ధనవంతులం, గొప్పవాళ్ళం అయిపోతాం ముందు నువ్వో చక్రవర్తివి కావాలని కోరుకో నాన్నా! అప్పుడు అమ్మక్కూడా నువ్వు భయపడక్కర్లేదు” ఆటపట్టించాడు కొడుకు.

“నీ పని చెప్తానుండు” అంటూ తల్లి వెంటపడేసరికి అతను టేబిల్ చుట్టూ పరిగెత్తసాగాడు.

జేబులో వున్న పంజాను చేతిలోకి తీస్కొని, దానివైపు సంశయంగా చూశాడు మిష్టర్ వైట్.

“ఏం కోరాలి? మనకన్నీ వున్నాయి..”

“ప్రస్తుతం ఓ రెండొందల పౌండ్లు కోరుకో.. తర్వాత చూద్దాం”

కొడుకు వ్యంగ్యానికి మనసులో కొద్దిగా నొచ్చుకున్నాడాయన.

భార్య.. కొడుకుల ముఖంలో మిష్టర్ వైట్ నమ్మకం పట్ల అపహాస్యం!

“సరే.. నేను రెండు వందల పౌండ్లు కోరుకుంటున్నాను” అన్నాడు మిస్టర్ వైట్ ఓ నిశ్చయానికి వచ్చినట్లు.

అంతే! పియానో నుంచి సన్నని శబ్దం వెలువడింది. తర్వాత పెద్దాయన కీచుమని కేక పెట్టాడు భయంతో. భార్య, కొడుకు అతడి దగ్గరకు పరిగెత్తారు.

“అది కదిలింది” నేలమీద పడిన పంజాను చూపిస్తూ భయంగా అన్నాడు మిష్టర్ వైట్. “కోరిక కోరగానే అది నా చేతిలో పాములా మెలికలు తిరిగింది” భయంగా అన్నాడాయన.

"ఏది? ఇంతకీ డబ్బు?" హాస్యంగా అంటూ హార్‌బర్ట్ పంజాను నేలమీద నుంచి తీసి టేబిల్‌పై పెట్టాడు.

"అది కదలడం మీభ్రమే" అంది భార్య.

కాదన్నట్టు తల అడ్డంగా తిప్పాడు వైట్.

మళ్లీ ముగ్గురూ ఫైర్ దగ్గర కూర్చున్నారు, తండ్రీ కొడుకులిద్దరూ పైప్‌లు పీల్చటం పూర్తయ్యేవరకూ.

బయట గాలి వేగంగా వీస్తోంది. బంగాళా పైభాగంలో గాలికి కొట్టుకుంటున్న తలుపును వేయటానికి లేచాడు మిష్టర్ వైట్. అసాధారణమైన నిశ్శబ్దం ఇంట్లో చోటు చేసుకుంది.

వృద్ధ దంపతులిద్దరూ నిద్రించడానికి గదికి వెళ్తుంటే, హార్‌బర్ట్ పరిహాసంగా అన్నాడు. "డబ్బు ఒక పెద్ద సంచీలో కట్టి మీ మంచం మీద పెట్టి ఉందేమో చూడండి. మీరా సొమ్మును మూట్టకట్టుకోవటం, భయంకరమైన శక్తేదో చూస్తూనే ఉంటుంది"

వాళ్లు వెళ్లాక హార్‌బర్ట్ ఆరిపోతున్న మంటలవైపు చూస్తూ ఒక్కడూ కూర్చుండిపోయాడు చాలాసేపు.

ఆ మంటల్లో ఏవో అస్పష్ట ఆకారాలు కనిపిస్తున్నాయి. ఒక ఆకారం భయంకరంగా కనిపించడంతో హార్‌బర్ట్ నిలువుగుడ్లేసుకుని చూశాడు. నిప్పుల్ని ఆర్పేయడానికి నీళ్లగ్లాసు కోసం బల్లమీదికి చాపిన అతని చేతికి అనుకోకుండా పంజా దొరికింది. ఉలిక్కిపడి దాన్ని వదిలేసి, వణుకుతున్న చేతిని కోటుకు తుడుచుకొన్నాడు. తర్వాత నెమ్మదిగా నిద్రలోకి జారాడతను.

★ ★ ★

మరుసటిరోజు ఉదయం టిఫిన్ తింటూ గతరాత్రి తన భయాలను తలచుకొని నవ్వుకొన్నాడు హార్‌బర్ట్. ముడుచుకుపోయి వున్న కోతిపంజా అల్మరాపై పడుంది.

మిసెస్ వైట్ అంది."అతని పిచ్చిమాటల్ని నమ్మటమే తప్పు. అయినా రెండొందల పౌండ్లు ఎక్కడ్నుంచి వస్తాయి?"

"ఆకాశం నుంచి వూడిపడతాయేమో! సర్లే.. నేనొచ్చేవరకు దాన్ని ఖర్చు పెట్టకండేం?" టేబిల్ దగ్గర్నుంచి లేస్తూ నవ్వాడు హార్‌బర్ట్.

ఆ మాటలకు నవ్వుతూ, ఫ్యాక్టరీకి బయల్దేరిన అతనికి వీడ్కోలు చెప్పింది మిసెస్ వైట్. ఆ సొమ్ము ఎవరైనా తెచ్చిస్తారేమోనన్న ఆశ కూడా వుందామెకు. పోస్ట్‌లో వస్తుందనుకుంది. డబ్బురాలేదు కానీ దర్జీ బిల్లు మాత్రం వచ్చింది.

★ ★ ★

"అబ్బాయి తిరిగొచ్చాక మరింత ఎగతాళి చేస్తాడు" భోజనానికి కూర్చుంటూ అంది మిసెస్ వైట్.

"ఒట్టేసి చెప్తున్నా ఆ పంజా మాత్రం నా చేతిలో కదిలింది.. " గ్లాసులో బీరు పోసుకొంటూ అన్నాడు భర్త.

"అలా అనిపించిందేమో!"

"అది ముమ్మాటికీ నిజం!"

మిసెస్ వైట్ మాట్లాడలేదు. ఆమె చూపు బయట గేటుదగ్గర తచ్చాడుతున్న వ్యక్తిపై ఉంది. ఆ అపరిచితుడు నీట్‌గా డ్రెస్ చేసుకుని, సిల్క్ హ్యాట్ పెట్టుకున్నాడు. గేటుదగ్గర మూడుసార్లు ఆగి, ఆఖరుకు నాలుగోసారి గేటు తెరుచుకుని లోనికొచ్చాడు.

అతడు ఏదో చెప్పడానికి ఇబ్బంది పడుతున్నట్లు కనిపిస్తున్నాడు.

"మా అండ్ మాగిన్స్ సంస్థ నుండి వస్తున్నాను" అన్నాడతను మాటల్ని కూడదీసుకుంటూ.

"హార్‌బర్ట్‌కి ఏమైనా అయిందా? ఏమైంది? ఏమైంది?' ఆ వృద్ధురాలు ఆత్రుతగా అడిగింది.

అంతలో మిస్టర్ వైట్ వచ్చాడు.

"..నువ్వు గమ్మునుండు.. కీడు శంకించకు" అంటూ ఆమెను వారించి అపరిచిత



వ్యక్తిని అడిగేడాయన "బాబూ నువ్వేం దుర్వార్త తేలేదు కదా? "

"క్షమించండి.." ప్రారంభించేడతను.

"వాడేమైనా గాయపడ్డాడా? " ఉద్వేగంతో అడుగుతోంది మిసెస్ వైట్.

అవునన్నట్లు తల వూపుతూ, "చాలా తీవ్రంగా గాయపడ్డాడు, అయితే అతడికి నొప్పేంలేదు.."

"థ్యాంక్ గాడ్... థ్యాంక్ గాడ్" అని పదే పదే అనుకుంటున్న ఆమెకు అతడి మాటలలో ఏదో అశుభం ధ్వనించి మళ్లీ భయం వేసింది. భర్త చేతిని గట్టిగా పట్టుకుంది.

"హర్‌బర్ట్ యంత్రాల మధ్య ఇరుక్కున్నాడు" ఆగంతకుడు నెమ్మదిగా చెప్పాడు.

"యంత్రాలలో ఇరుక్కుపోయాడా? " అరిచాడు వైట్.

"అవును"

భార్య చేతిని తన చేతులలోకి తీస్కుని కిటికీలోంచి బయటకు చూస్తూ కూర్చున్నాడు మిస్టర్ వైట్. ఎపుడో నలభైఏళ్ళ క్రితం ఆమె చేతిని అలా పట్టుకున్నాడాయన.

"వాడొక్కడే మాకుంది. చాలా బాధగా వుంది" అన్నాడతడితో మిస్టర్ వైట్. తర్వాత చిన్నగా దగ్గుతూ లేచి వెళ్ళి కిటికీ దగ్గర నిలబడ్డాడు.

"మీకు వచ్చిన కష్టానికి సానుభూతి తెలియచేయాల్సిందిగా యాజమాన్యం నన్ను పంపింది" అన్నాడతడు.

భార్యాభర్తలిద్దరూ నిశ్శబ్దంగా వుండిపోయేరు. వృద్ధురాలి ముఖం తెల్లగా పాలిపోయింది. కళ్ళు గాజుకళ్ళలా చూస్తున్నాయి.. శ్వాస వినిపించటంలేదు.

మిస్టర్ వైట్ ముఖంలో ఒక పశ్చాత్తాప భావం. తన స్నేహితుడు, మోరిస్ చెబుతున్నా తాను వినలేదు..

"...మా అండ్ మెగ్గిన్స్ యాజమాన్యం హర్‌బర్ట్ సంస్థకు చేసిన సేవలను దృష్టిలో వుంచుకొని, నష్టపరిహారంగా రెండొందల పౌండ్లు ఇవ్వాలని నిర్ణయించుకున్నారు"

'రెండొందల పౌండ్లు' మాట వింటూనే మిసెస్ వైట్ కీచుమని అరిచింది. మిస్టర్ వైట్ జీవంలేని ఓ నవ్వునవ్వి కుప్పకూలిపోయాడు నేలమీద.

★ ★ ★

రెండు కిలోమీటర్ల దూరంలోని శ్మశాన వాటికలో, కొడుకును ఖననంచేసి ఇంటికి చేరుకున్నారు వృద్ధ దంపతులు.

ఏం జరిగిందో అర్థమయ్యేలోగానే అంతా అయిపోయింది.

రోజులు గడిచేకొద్దీ వారాబాధను దిగమింగుకున్నారు. ఇంట్లో ఎటుచూసినా ఒక నిర్లిప్తత.. వారిద్దరూ ఒకమాటైనా మాట్లాడుకోవటం అరుదైపోయింది.. మాట్లాడేందుకు ఏం మిగిలిందని? రోజులు యాంత్రికంగా గడుస్తున్నాయి.

వారం రోజుల తర్వాత-

అర్ధరాత్రి హఠాత్తుగా మెళకువ వచ్చింది మిస్టర్ వైట్‌కు. చూస్తే భార్యలేదు పక్కన. గది చీకటిగా వుంది. కిటికీ దగ్గర్నుంచి చిన్నగా ఏడుస్తున్న శబ్దం.. గభాల్న లేచి కూర్చున్నాడు.

"ఇలారా, చలిగా వుంటుంది అక్కడ" మృదువుగా పిలిచాడు.

"నాబిడ్డకు ఇంతకంటె చలిగా వుంటుంది" అంటూ మళ్ళీ ఏడుపు మొదలుపెట్టిందామె.

కాసేపటికి ఆమె ఏడుపు ఆగింది. ఆయన మళ్లీ నిద్రలోకి జారుకున్నాడు. అంతలో అతడి భార్య వేసిన భయంకరమైన కేకకు అదిరిపడి లేచాడు..

"ఏమిటి సంగతి? "

భర్త దగ్గరకు పరుగులాంటి నడకతో వచ్చిందామె "ఆ పంజా ఎక్కడుంది? నాక్కావాలి"

"కిందగదిలో అల్మారా పైనుంది. ఎందుకు? " ఆశ్చర్యంగా అడిగాడాయన.

ఆమె సంతోషం, దుఃఖం కలిసిన ఉద్వేగంలో అతడి బుగ్గపై ముద్దు పెట్టింది.

"ఈ ఆలోచన ఇంతకుముందే నాకెందుకు రాలేదు? అసలు నువ్వెందుకలా ఆలోచించలేదు? "

"దేనిగురించి? " అడిగాడతడు.

"ఇంకా రెండు కోరికలూ ఉన్నాయిగా, మనం ఒకటేగా కోరాం"

"ఇప్పటికి జరిగింది చాలలేదా? " కోపంగా అన్నాడాయన.

"మనం మరొక్కటి కోరదాం. కిందకి వెళ్లి అది తొందరగా తీస్కువచ్చి మన కొడుకు బతికి రావాలని కోరు" ఆమె వగరుస్తూ ఆనందంగా అరిచింది.

ఆయన లేచి కూర్చున్నాడు.

"అయ్యో.. భగవంతుడా! నీకేమైనా పిచ్చి పట్టిందా? " అరిచాడు.

"ముందు దాన్ని తీసుకొచ్చి కోరు!"

మిస్టర్ వైట్ అగ్గిపుల్లగీసి కొవ్వొత్తి వెలిగించాడు. "పడుకో! నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలియడంలా"

"మనకి మొదటి కోరిక తీరింది.. రెండోది ఎందుకు కోరుకోకూడదు? వెళ్ళు... దాన్ని తెచ్చి కోరు" ఉద్వేగంగా అరిచిందామె.

ఆయన ఆమెవైపు తిరిగాడు. స్వరం కంపిస్తోంది.."వాడు పోయి పదిరోజులైంది. కేవలం వేసుకున్న బట్టల్నిబట్టే వాణ్ని గుర్తించగలిగాను. ఆ దృశ్యాన్ని నువ్వు చూడలేవు. అర్థంచేసుకో"

"..కనిపెంచిన బిడ్డను చూసి నేను భయపడతానా? " అరిచిందామె.

చీకట్లో తడుముకుంటూ కిందకి వెళ్ళి, గదిలో అల్మరా చేరుకున్నాడాయన. పంజా అక్కడే వుంది. చూడగానే భయం వేసింది. ముక్కలుగా తెగిపోయిన కొడుకు ను తెచ్చి ముందు నిలబెడితే? కంగారుగా గదిలో నుంచి బయటకు రాబోయాడు. చీకట్లో గుమ్మం కనిపించక చెమటలు పట్టాయి. చేతిలో పంజాను పట్టుకుని తడుముకుంటూ బయటకు నడిచాడు.

ఆయన వెళ్ళేసరికి భార్య ముఖంలో కూడా మార్పు కనిపించింది. ముఖం తెల్లగా వుంది పాలిపోయినట్లుంది.

"కోరు!" గట్టిగా అరిచిందామె.

"వద్దు .. ప్రమాదం.."

"కోరు!" తిరిగి అందామె ఆయన మాట పట్టించుకోకుండా.

అతడు చెయ్యి పైకెత్తి కోరాడు.

"నా కొడుకు మళ్ళీ బతకాలి"

పంజా నేలమీదకు జారిపోయింది.. అతడు దానివైపు భయంగా చూశాడు. వణుకుతూ కుర్చీలో కూలబడ్డాడు. భార్య మండుతున్న కళ్ళతో కిటికీ దగ్గరకు వెళ్ళి తెరతీసింది. కొవ్వొత్తివెలుగు గోడలపైనా, సీలింగ్‌పైనా పరుస్తున్న నీడలు గుండె వేగాన్ని పెంచుతున్నాయి. రెపరెపలాడుతున్న కొవ్వొత్తి పెద్దగా వెలిగి ఠప్పున ఆరిపోయింది. ఆ పంజా మహిమ పనిచేయలేదన్న భావనతో తేలికగా ఊపిరి పీల్చుకున్నాడాయన. కొంచెంసేపయ్యాక మిసెస్ వైట్ వచ్చి ఉదాసీనంగా కూర్చుంది ఆయన పక్కన.

ఎవ్వరూ మాట్లాడలేదు. గడియారం శబ్దం వింటూ కూర్చున్నారు. అంతలో కీచుమని శబ్దం.. చూస్తే ఒక ఎలుక గోడ మీద నుంచి పరుగు తీసింది వేగంగా.

చీకటిని భరించటం చాల కష్టంగా వుంది. కాస్త ధైర్యం తెచ్చుకొని అగ్గిపుల్ల వెలిగించి, ఆ వెలుగులో కొవ్వొత్తి కోసం

కిందకు వెళ్లాడాయన.
మెట్లు దిగేసరికి అగ్గిపుల్ల ఆరిపోయింది. రెండో అగ్గిపుల్ల గీయబోతుండగా వీధి గుమ్మం తలుపుపై ఎవరో తడుతున్నట్లు శబ్దం వచ్చింది.
అగ్గిపెట్టె ఆయన చేతిలోనుంచి జారిపోయింది. నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. ఆ చప్పుడు మళ్లీ వినేసరికి శ్వాస ఆగినట్లైంది. వేగంగా మెట్లెక్కి గదిలోకి వెళ్లిపోయాడు.
మూడోసారి తలుపు తట్టిన శబ్దం ఇల్లంతా మారుమోగింది.
"ఏమిటది? " అరుస్తూ లేచింది భార్య.
"ఎలుక" కంపిస్తూనే చెప్పాడాయన.
మిసెస్ వైట్ లేచి కూర్చుంది. తలుపు తడుతున్న శబ్దం ఇల్లంతా ప్రతిధ్వనించింది.
"ఆ వచ్చింది హర్‌బర్టే!"
